సత్యమేవ జయతే

సాక్షి

'జాతికి జల సౌభాగ్యం కల్పించిన రోజే నాకు అసలైన పండుగ రోజు'

WWW.SAKSHI.COM

పేజీలు: 16+6+32 పేజీల ఆదివారం అనుబంధం వెల: ₹ 7.00

సంపుటి: 17 సంచిక: 50

ఆదివారం 12-5-2024

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

వధువు కావలెను

యాదవ / B.Tech (సివిల్)/C.Govt ఇంజనీర్/SBI/85000/-PM/ 5'8" ఎత్తు/ 28 సం॥ల వరునికి వధువు కావలెను. కట్న ప్రసక్తి లేదు. ఫోన్: 9515755529 [HA-13770]

SC మాదిగ & క్రిస్టియన్/B.Tech, మెకానికల్ ఇంజనీర్/ NITC.Govt. AEE/ONGC/14 Lakhs PA/5'9" ఎత్తు/28 సం॥ల వరునికి వధువు కావలెను. కట్న ప్రసక్తి లేదు. ఫోన్: 6304407280, 9515755529 [HA-13770]

కాపు 55/5'8" డిగ్రీ, వ్యాపారం 12 L.PA 40 ఎకరాల వ్యవసాయ భూమి,20 Cr. బాగా స్థిరపడిన బాదరబందీ లేని వరునకు మంచి సాంప్రదాయ కుటుంబం వధువు కావలెను. 9573943211, 9849555638 [HA-13770]

దేవాంగ (CAST No bar) 40 yrs, 5'5" fair. M.Tech, MCA, IRPM, 4 కోట్లు ఆస్తి గల వరుడున కు. చదువుకున్నా, దైవ భక్తి గల వధువు కావలెను. (డైరెక్ట్) సంప్ర: 7036361292 [HA-13770]

ఆర్యవైశ్య, 46Yrs/5'.5"/ బిజినెస్, జాబ్, 30Cr. స్థిరాస్తి గల ఏకైక అబ్బాయికి అందమైన అమ్మాయి కావలెను. (నో బ్రోకర్స్). 7680872085, 9182161015. [T-2674]

వరుడు కావలెను

కమ్మ/34yr/ఫెయిర్/కుల పట్టింపు లేదు/ Govt. ఎంప్లాయ్/60K (PM)/వెల్ సెటిల్డ్ ఫ్యామిలీ/4 సొంత ఇల్లులు & బిజినెస్ కలిగిన వధువుకి వరుడు కావలెను (ఇల్లరికం OK) సంప్ర : 9640133485 [H-778774]

కాపు/49yrకుల పట్టింపు లేదు/ఫెయిర్/Govt. ఎంప్లాయ్/8 లక్షల (PM) /వెల్ సెటిల్డ్ ఫ్యామిలీ & 4 సొంత ఇల్లుల కలిగిన అందమైన వధువుకి వరుడు కావలెను. (ఇల్లరికం ok, 1st & 2nd మ్యారేజ్ OK) సంప్ర: 8374802603 [H-778774]

రెడ్డి/విడో/55y/FairHydలో సొంత ఇల్లు (రెంట్స్)/ సొంత బిజినెస్/1 పాప USAలో సెటిల్డ్. ఏ బాధరబందీలేని అందమైన ఏకైక వధువుకు FC/BC వరుడు కావలెను. Ph: 7997175138 [H-778774]

వయసు 38 years/ఎత్తు 5'5"/ గవర్నమెంట్ జాబ్/12 Lakh జీతం కలిగిన అందమైన అమ్మాయికి వరుడు కావలెను. కుల పట్టింపు లేదు పిల్లలు ఉన్నా OK. Ph: 9515970322 [H-778774]

అవినాష్ రెడ్డి మ్యారేజెస్ (D.V. కోటి రెడ్డి)

రెడ్డిలకు మాత్రమే. D.V. కోటిరెడ్డి, 690, Road No:-3, Banjara Hills (TV-9, Opp: Colony) (IOC Petrol Bunk Side Road) Hyd. +91 9848011818 / +91 9393311818 (Tuesday Holiday) Timings : 10 am - 6 pm. www.avinashreddy.com, e-mail: avinash11818@gmail.com

వధువు కావలెను

రెడ్డి Citizen, Seattle, BS, 28, 6', Microsoft, Rich Family. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Austin, BE, MS, 29, 5' 9", SWE, 190 K, H1, Handsome. Avinash Reddy Marriages, 690, Road No. 3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 27, 5' 9", Manager, Apple, 50 Crores, H1, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Dallas, BE, MS, 31, 5' 11", Sr Engineer, 160 K, 5 Crores. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

వరుడు కావలెను

రెడ్డి Dallas, BE, MS, 24, 5' 4", 100 Crores, USA, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 26, 5' 2", SWE, 130 K, H1, USA, Rich Family. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 27, 5'6", SWE, Amazon, 200 K, H1, USA, Fair. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MBA, 26, 5' 4", Engineer, 19.56 L P/A, Hyderabad. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.



రెడ్డి BE, MS, 27, 5' 10", Sr Developer, 130 K, 15 Crores, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MSIT (IIIT), MS, 30, 6' 2", Engineer, 10 Crores, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి MBBS, MD, DM, 27, 5' 11", PG Doctor, Rich Family, Hyd. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 29, 5' 11", Sr Cloud Devops, 5 Crores, H1, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, 25, 5' 4", System Engineer, Wipro, Hyderabad, Fair. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Austin, BE, MBA, 28, 5' 5", Manager, 200 K, H1, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి MBBS, 23, 5' 9", Doctor, 20 Crores, Hyderabad, Fair. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 31, 5' 7", SWE, 120 K, H1, USA, Rich Family. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

LETTER

2వ పెళ్లి, 4,00,000 PM ఆదాయం కలిగిన కులప్రసక్తి లేని వధువుకు అందమైన వరుడు కావలెను. బాగా స్థిరపడిన అమ్మాయి ఎలాంటి కుల బేధాలు లేవు. (Kids ఉన్నా Ok) 1st or 2nd Match ఇల్లరికం Ok ఫోన్: 9182213897 [HA-13770]

రజక/B.Tech/C.Govt బ్యాంక్ క్లర్క్ & క్యాషియర్/ SBI/45000/-PM / 5'4" ఎత్తు/25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. ఫోన్: 8341650195 [HA-13770]

కులపట్టింపు లేదు/23y&25y&27y&29y&30y&32y&33y&35y&36y&37y &39y &40y&42y&43y&44y&45y&47y&48y&50y&51y&53y &55y&57y&59y/" మా సేవ" (Since 1998). PH/WA: 9291503949 [HA-13770]

ఆస్తి కుల పట్టింపు లేదు/కమ్మ/30Y.B.Tech/5'3" ఎత్తు/2 కోట్ల ప్రాపర్టీ కలిగి పేరెంట్స్ లేని వధువుకు 1వ లేదా 2వ వరుడు కావలెను మీ ఫోటోస్ వాట్సాప్‌లో పంపించండి: 9885463158 [HA-13770]

బ్రాహ్మణ/24/5'3"/B.Sc "27/5'4"/ MBA "30/5'3"/B.Sc "27/5'2"/ ఇంటర్/32/5'2"/ఇంటర్ వధువులకు వరులు కావలెను. జాబ్/ బిజినెస్/ పురోహితులకు త్వరగా కుదుర్చబడును. Ph: 7842635086 [HA-13770]

రెడ్డి/60y/విడో/5'5"/V.Fair/రిటైర్డ్ Govt (HM)/ పెన్షనర్/సొంత ఇల్లు/26 ఎకరాల మాగాణి/కోట్ల ప్రాపర్టీ /వెల్ సెటిల్డ్ వధువుకు వరుడు కావలెను. కుల, ఆస్తి ప్రసక్తి లేదు Ph: 7093717220 [H-800483]

హిందూ మాల/B.Tech/C.Govt/ ISRO/ సైంటిస్ట్/ఎత్తు:5'5"/1L, PM/25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 7207233788 [H-800483]

కుల పట్టింపు లేని/విడో/45Regional Bank Manager/1L PM/ సొంత విల్లా/ 20ఎ: పొలాలు/ కోట్ల ఆస్తులు గల అందమైన ఆర్థికంగా స్థిరపడిన వధువుకు వరుడు కావలెను. Ph: 9502982557 [H-800483]

FC/విడో/60y/ 5'3"/ Rtd Govt. Employee/సొంత ఇల్లు/వెల్ సెటిల్డ్ గల వధువుకి స్నేహపూర్వకమైన వరుడు కావలెను. Ph: 9014716216 [H-800483]

వేదికలు

ఫ్రీ రిజిస్ట్రేషన్ అన్ని కులములవారికి Govt/ సాఫ్ట్‌వేర్/ గెజిటెడ్/ MBBS/ PG/ NRI/Pvt/బిజినెస్/1వ/2వ/లేట్ AP/TS 15 సం॥ Exp. Ph: 9100474440 [HA-32115]

ప్రభాకర్ రెడ్డి మ్యాట్రిమోని ద్వారా రెడ్డి వధూవరుల పరిచయ వేదిక 2/6/2024న సెంట్రల్ బ్యాంక్ కాలనీ కమిటీ హాల్, సెంట్రల్ బ్యాంక్ కాలనీ, L.B. నగర్, Hyd నందు కలదు. ఫోన్ : 9391198332, 9059430595 [HA-3875]

ఫ్రీ రిజిస్ట్రేషన్ : అన్ని కులాల వారికి తగిన పెళ్లి సంబంధాలకై నిజాయితీగా సర్వీసు చేయబడును. ఈ ప్రకటన 100% నిజం. సంప్ర: 8985503917 [H-778774]

ప్రభాకర్ రెడ్డి మ్యాట్రిమోని ద్వారా మున్నూరు కాపు పరిచయ వేదిక 2/6/2024న సెంట్రల్ బ్యాంక్ కాలనీ కమిటీ హాల్, సెంట్రల్ బ్యాంక్ కాలనీ, L.B. నగర్, Hyd నందు కలదు. ఫోన్ : 9391198332, 9059430595 [HA-3876]

Kamma, Kapu పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Shyam,, Ph: 7032712544 / Blue Trend Matrimonial (P) Ltd. [HA-13771]

Madiga - Mala పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Srinivas, Ph: 7032018248 / Blue Trend Matrimonial (P) Ltd. [HA-13771]

Reddy పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Shyam,, Ph: 7032712544/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-13771]

Brahmin, Padmashali పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Shyam,, Ph: 7032712544/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-13771]

Christian పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Srinivas, Ph: 7032018248 / Blue Trend Matrimonial (P) Ltd. [HA-13771]

మాల, మాదిగ స్పెషల్, IAS, IPS, IFS, IRS, గ్రూప్-I, II, PG, డాక్టర్స్, బ్యాంక్ PO, Govt. ఆఫీసర్స్ USA, UK. Ph: 7396915712 [HA-13770]

"శుభమస్తు" మ్యారేజ్ బ్యూరో TM Estd: 1995 గౌడ, శెట్టి, శెట్టిబలిజ, 1st/2nd, దేశ/విదేశ సంబంధాల్లో సం॥ లింగాల కాంప్లెక్స్ DSNR, HYD వ్యవస్థాపకులు : Late S.నారాయణ గౌడ్ సం॥ S.రాములు గౌడ్. 8790690309 [H-800483]

SC మాల, మాదిగ, క్రిస్టియన్స్ మాత్రమే, 1st మ్యారేజ్ పెళ్లి సంబంధాలకై సంప్రదించండి, సత్యనారాయణ. Verified All Govt Jobs Profiles కలవు. ఫ్రీ రిజిస్ట్రేషన్ వాట్సాప్ - 7989021063. [B-1251791]

★

Free Registration బ్రాహ్మణ మరియు అన్ని కులాల SWE, Govt., Doctors, MNC Matches, Late & 2nd Matches కై సంప్రదించండి. 9704656103, 9533608887 (Watsapp) [HA-759]

గమనిక

సాక్షి పెళ్ళిచూపులు ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటన దారులకు సంబంధించి ఎట్టి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యా సాధ్యాలు, వధూవరుల వివరాల ను పెండ్లి పెద్దలు స్వయముగా వెళ్ళి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.

రఘురామ, గంటాకు బ్యాంకుల షాక్

రుణాల ఎగవేత కేసులో ఆస్తులు వేలం
రఘురామకృష్ణరాజుకు చెందిన ఇండ్ భారత్‌కు చెందిన రూ.361.96 కోట్ల ఆస్తుల వేలం

- వచ్చే నెల 13న వేలం వేస్తున్నట్లు ఎన్సీఎల్టీ ప్రకటన
- గంటా శ్రీనివాసరావుకు చెందిన ప్రత్యూష కంపెనీ ఆస్తులు వేలం వేస్తున్న ఇండియన్ బ్యాంక్
- రూ.400.37 కోట్లు రుణం తీసుకొని ఎగవేసిన ప్రత్యూష కంపెనీ
- విశాఖలోని వాణిజ్య భవనాన్ని రూ.2.84 కోట్లకు వేలం వేస్తున్నట్లు ప్రకటన
- టీడీపీ అసెంబ్లీ అభ్యర్థులుగా ఎన్నికల బరిలో ఉన్న రఘురామ, గంటా



సాక్షి, అమరావతి: రుణాలు తీసుకొని ఎగవేసిన కేసుల్లో ఉండి, భీమిలి అసెంబ్లీ స్థానాల నుంచి తెలుగుదేశం పార్టీ అభ్యర్థులుగా పోటీ చేస్తున్న రఘురామకృష్ణరాజు, గంటా శ్రీనివాసరావుకు ఎన్నిలకు రెండు రోజుల ముందు బ్యాంకులు గట్టి షాక్ ఇచ్చాయి. బ్యాంకుల నుంచి భారీగా రుణాలు తీసుకొని ఎగవేసిన కేసుల్లో ఆస్తులను వేలం వేయడానికి నోటీసులు జారీ చేశాయి. ఉండి టీడీపీ అభ్యర్థి రఘురామకృష్ణరాజు ఇండ్ భారత్ థర్మల్ పవర్ లిమిటెడ్ పేరుతో పంజాబ్ నేషనల్ బ్యాంకు, దాని అనుబంధ బ్యాంకుల నుంచి సుమారు రూ.1,383 కోట్లు రుణాలు తీసుకున్నారు. ఇందులో రూ.826.17 కోట్ల రుణాన్ని కంపెనీ అవసరాలకు వాడకుండా వేరే ఖాతాల్లోకి మళ్లించి బ్యాంకుల్ని మోసగించారు. వడ్డీ కూడా చెల్లించలేదు. ఈ వ్యవహారం తెలిసి బ్యాంకులు సీబీఐని ఆశ్రయించడంతో ఆయన మోసాలు వెలుగులోకి వచ్చాయి. దీనిపై బ్యాంకులు దివాళా పిటిషన్ దాఖలు చేయడంతో రూ.361.96 కోట్ల విలువైన ఆస్తులను వేలం వేస్తూ నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్సీఎల్టీ) హైదరాబాద్ శాఖ పత్రికా ప్రకటనలు జారీ చేసింది. ఇండ్ భారత్ థర్మల్‌కు చెందిన బ్యాలెన్స్ షీట్‌లో ఉన్న ఆస్తులు రూ.180.98 కోట్లు, తమిళనాడు టూటికోరిన్‌లో ఉన్న 311.72 ఎకరాల ఫ్యాక్టరీ స్థలాలు రూ.164.73 కోట్లు, కర్ణాటకలోని కార్వార్ ప్రాంతంలో ఉన్న 129.73 ఎకరాలు రూ.11.74 కోట్లు, ఇతర సెక్యూరిటీలు, ఆర్థిక ఆస్తులకు రూ.4.51 కోట్లు రిజర్వ్ ప్రైస్‌గా నిర్ణయించింది. ఈ ఆస్తులకు సంబంధించిన జూన్ 13న మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు వేలం వేయనున్నట్లు ఎన్సీఎల్టీ ఆ ప్రకటనలోల పేర్కొంది.

రూ.400.37 కోట్లు ఎగవేసిన గంటా శ్రీనివాసరావు

మాజీ మంత్రి, భీమిలి టీడీపీ అభ్యర్థి గంటా శ్రీనివాసరావు బ్యాంకుల నుంచి భారీగా రుణాలు తీసుకొని తిరిగి చెల్లించకుండా ముప్పుతిప్పలు పెడుతున్నారు. ప్రభుత్వ బ్యాంకుల నుంచి సుమారు రూ.400.37 కోట్ల రుణాలను తిరిగి చెల్లించకపోవడంతో ఆయన ఆస్తులను స్వాధీనం చేసుకోవడానికి బ్యాంకులు ఐదేళ్లగా పోరాడుతున్నాయి. గంటాకు చెందిన ప్రత్యూష గ్రూపు కంపెనీలు ఈ రుణం తీసుకొని, ఇంతవరకు ఒక్క వాయిదా కూడా చెల్లించలేదు. దీంతో ఇండియన్ బ్యాంకు ఆస్తుల స్వాధీనానికి రంగంలోకి దిగింది. విశాఖ నగరం గంగుల వారి వీధిలోని సర్వే నెంబర్ 13లో ఉన్న వాణిజ్య భవనాన్ని వేలానికి పెట్టింది. జూన్ 7 వ తేదీ మధ్యాహ్నం 12 గంటల నుంచి 3 గంటల వరకు వేలం జరుగుతుంది. ఈ భవనం రిజర్వు ధరను రూ.2.84 కోట్లుగా బ్యాంకు నిర్ణయించింది.

కోడ్ పాటించని బీజేపీ



టీపీసీసీ ఉపాధ్యక్షుడు నిరంజన్

సాక్షి, హైదరాబాద్: బీజేపీ నాయకులు మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ పాటించడం లేదని, పీఎం మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షాలు ఎన్నికల నిబంధనలను విచ్చలవిడిగా ఉల్లంఘిస్తున్నారని టీపీసీసీ ఉపాధ్యక్షుడు నిరంజన్ ఆరోపించారు. ఆయన శనివారం గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ నిబంధనలు పాటించకపోతే కమిషన్ ఎందుకుని ప్రశ్నించారు. ఇది మోదీ కండక్ట్‌లా ఉందని, మోడల్ ఎలక్షన్ కండక్ట్‌లా లేదని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ, నాయకులను మోదీ వ్యక్తిగతంగా విమర్శిస్తున్నారని నిరంజన్ ధ్వజమెత్తారు.

జగన్ కోసం జనం సిద్ధం

ముగిసిన సార్వత్రిక ఎన్నికల ప్రచారపర్వం

- 59 నెలల్లో చేసిన సంక్షేమం, అభివృద్ధి పథకాల ద్వారా చేసిన మంచిని ప్రజలకు వివరించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్
- రాబోయే ఐదేళ్లలో మరింత మంచి చేస్తానంటూ ప్రజలకు హామీ
- మీ బిడ్డ ప్రభుత్వంవల్ల మీకు మంచి జరిగి ఉంటే ఓటేసి ఆశీర్వదించాలంటూ ప్రజలకు వినమ్రంగా సీఎం విజ్ఞప్తి
- జగన్ ప్రచారానికి బ్రహ్మరథం పట్టిన జనం
- మరోవైపు.. తన హయాంలో చేసిన మంచేమీ లేకపోవడంతో బాబు నోట తిట్లు, శాపనార్థాలు
- ఘోర పరాజయం ఖాయమవడంతో తీవ్ర నిరాశ, నిస్పృహలో చంద్రబాబు, పవన్
- నంద్యాలలో చివరి సభలోనూ జగన్‌పై నోరుపారేసుకున్న చంద్రబాబు.. అదే బాటలో పవన్
- ప్రధాని మోదీని రప్పించినా కన్పించని జనస్పందన
- టీడీపీ-జనసేన-బీజేపీ పొత్తును తిరస్కరిస్తున్నారనడానికి ఇదే తార్కాణం
- ప్రచారపర్వంలోనే పోటీ ఏక పక్షమేనని.. వైఎస్సార్‌సీపీ ఘన విజయం తథ్యమని తేల్చిన జనం

వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

మహిళల భద్రతకు 'పచ్చ'ముప్పు

వారి వ్యక్తిగత వివరాలన్నీ టీడీపీ 'వుయ్' యాప్‌లోకి.. ■ వ్యక్తిగత గోప్యత చట్టానికి విరుద్ధంగా ఎల్లో గ్యాంగ్ కుట్ర

- ప్రజాప్రాతినిధ్య చట్టం, ఐటీ చట్టాల ఉల్లంఘన.. ఓటర్ల వివరాలను అక్రమంగా సేకరించిన చంద్రబాబు ముఠా
- ఈ సమాచారం బూత్ కమిటీలకు చేర్చిన టీడీపీ
- దీంతో ఆ వివరాలు ఆకతాయిలు, వీధి రౌడీలు, మహిళలపై దాడులకు పాల్పడే వారు, ఇతర నేరచరితులకు అందుబాటులోకి..
- తద్వారా ఫోన్లుచేసి వేధించడం.. ఫొటోల మార్ఫింగ్ వంటి సైబర్ నేరాలకు ఆస్కారం
- ఈ యాప్‌ను ఎన్నికల సంఘం తొలగించాలంటున్న మేధావులు
- మహిళలను భయపెట్టండి
- వారి ఓటింగ్ శాతాన్ని తగ్గించండి.. టీడీపీ శ్రేణులకు చంద్రబాబు డైరెక్షన్



సాక్షి, అమరావతి : చంద్రబాబుకు జీవన్మరణ సమస్యగా మారిన ఈ ఎన్నికల్లో గెలుపు కోసం ఆయన మునుపెన్నడూలేని రీతిలో బరితెగిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా సోమవారం జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో అక్రమాలకు పన్నాగం పన్నుతూ యావత్ మహిళల భద్రతకు పెనుముప్పుగా మారారు. ఓటర్లను ప్రలోభాలకు గురిచేసేందుకు టీడీపీ రూపొందించిన 'వుయ్ యాప్' రాష్ట్రంలో మహిళల రక్షణకు ప్రమాదంగా పరిణమించడం ఆందోళన కలిగిస్తోంది. ప్రజాప్రతినిధ్య చట్టం, ఐటీ చట్టాలను ఉల్లంఘించి రూపొందించిన ఈ యాప్ మహిళల భద్రత పాలిట పెనుగండంగా మారింది. తీవ్ర ఆందోళన కలిగిస్తున్న టీడీపీ 'వుయ్ యాప్' బాగోతం కథాకమామిషు ఏమిటంటే..

వ్యక్తిగత సమాచారం అంతా 'పచ్చ'ముఠా గుప్పెట్లో

రాష్ట్రంలో ఓటర్ల వివరాలన్నింటినీ చంద్రబాబు ముఠా అక్రమంగా సేకరించింది. గతంలో అధికారంలో ఉండగా నిర్వహించిన ప్రజా సాధికార సర్వే ద్వారా సేకరించిన సమాచారాన్ని టీడీపీ సేవామిత్ర యాప్‌కు అనుసంధించారు. ప్రస్తుతం కూడా టీడీపీ అదే రీతిలో ఎన్నికల కమిషన్ వెబ్‌సైట్ నుంచి ఓటర్ల వివరాలను అక్రమంగా సేకరించింది. ఓటర్ల పేర్లు, చిరునామాలు, వయసు, ఆధార్ నంబర్లు, ఫోన్ నంబర్లు, బ్యాంకు ఖాతాల నంబర్లతో పాటు ఫొటోలు.. ఇలా పూర్తి వివరాలను వుయ్ యాప్‌లో పొందుపరిచారు. వాటిలో రాష్ట్రంలోని 2.10 కోట్ల మహిళా ఓటర్ల వివరాలు వారి ఫొటోలతో సహా ఉండటం గమనార్హం. అంటే.. రాష్ట్రంలో 18 ఏళ్లు దాటిన యవతులు, మహిళల పూర్తి వ్యక్తిగత సమాచారం అంతా టీడీపీ గుప్పెట్లోకి వచ్చిందన్న మాట. ఈ సమాచారాన్ని వుయ్ యాప్ ద్వారా టీడీపీ బూత్‌కమిటీలకు చేర్చింది. దీంతో ఆకతాయిలు, వీధి రౌడీలు, మహిళలపై లైంగిక దాడులకు పాల్పడేవారు, ఇతర నేరచరితులకు కూడా ఈ వివరాలన్నీ అందుబాటులోకి వచ్చినట్లే.

వేధింపులకు అవకాశం.. భద్రతకు ముప్పు

టీడీపీ పాల్పడుతున్న ఈ అక్రమాలు రాష్ట్రంలోని మహిళల భద్రతకు పెనుముప్పుగా పరిణమించాయి. ఎందుకంటే ఆకతాయిలు మహిళల ఫోన్ నంబర్లుకు ఫోన్లుచేసి వేధించొచ్చు.. ఫొటోలను ఎవరైనా మార్ఫింగ్ చేసి సైబర్ నేరాలకు పాల్పడొచ్చు.. వారి బ్యాంకు ఖాతాలను హ్యాకింగ్ చేసి ఆర్థిక నేరాలకు పాల్పడొచ్చు.. ఇలా.. ఎటువంటి నేరాలకైనా పాల్పడేందుకు ఆ యాప్ అవకాశం కల్పిస్తోంది. టీడీపీ కుట్ర కచ్చితంగా రాజ్యాంగం ప్రసాదించిన వ్యక్తిగత స్వేచ్ఛ హక్కుకు భంగకరం. వ్యక్తిగత గోప్యత హక్కుకు ప్రమాదకరం. ఈ నేపథ్యంలో.. వుయ్ యాప్ పేరుతో టీడీపీ ఎన్నికల అక్రమాలకు పాల్పడటంతోపాటు రాష్ట్రంలోని మహిళల భద్రతకు పెను ప్రమాదాన్ని తీసుకొచ్చిందని మేధావులు, రాజకీయ పరిశీలకులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఎన్నికల కమిషన్ (ఈసీ)తోపాటు పోలీసు యంత్రాంగం తక్షణం స్పందించి ఈ యాప్‌ను తొలగించాలని కోరుతున్నారు. చంద్రబాబుతోపాటు వుయ్ యాప్ రూపొందించిన వారిపై కుట్ర కేసు నమోదుచేసి కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

మహిళలే లక్ష్యంగా బాబు కుట్ర..

ఇక ఎన్నికల ప్రచారం ముగియడంతో రాష్ట్రంలోని ఎన్నికల ముఖచిత్రం ఏమిన్నటన్నది చంద్రబాబుకు స్పష్టమైంది. ప్రజలంతా వైఎస్సార్‌సీపీపట్ల పూర్తి సానుకూలంగా ఉన్నారన్నది తేలిపోవడం.. మహిళా ఓటర్లు సీఎం జగన్‌కు నీరాజనాలు పడుతున్నారని అన్ని జాతీయ సర్వేలతో సహా స్పష్టంచేస్తుండటంతో ఆయన రగిలిపోతున్నారు. ఎందుకంటే.. రాష్ట్రంలో మొత్తం 4.14 కోట్ల మంది ఓటర్లుండగా.. వారిలో మహిళా ఓటర్లే 2.10 కోట్ల మంది ఉన్నారు. తన ఐదేళ్ల పాలనలో జగన్ మహిళలకు పెద్దపీట వేశారు. డీబీటీ, నాన్ డీబీటీ పథకాల ద్వారా మొత్తం రూ.2.83 లక్షల కోట్ల మేర లబ్ధి వారికి చేకూర్చి దేశంలోనే కొత్త చరిత్రను సృష్టించడంతో సీఎం జగన్‌కు మహిళలు జేజేలు పలుకుతున్నారు. దీంతో మహిళల ఓట్లపై చంద్రబాబు దాదాపుగా ఆశలు వదిలేసుకోవడం.. టీడీపీ శ్రేణులు నైరాశ్యంలో కూరుకుపోవడంతో మహిళా ఓటర్లే లక్ష్యంగా బాబు విధ్వంసానికి కుట్ర పన్నారు.

విధ్వంసాలకు బాబు స్కెచ్

మరోవైపు.. ఓటమి భయంతో అసలే బెంబేలెత్తుతున్న చంద్రబాబు మహిళా ఓటర్లు పేరెత్తితే రగిలిపోతున్నారు. వారంతా ముక్తకంఠంతో సీఎం జగన్‌కే మద్దతు ప్రకటిస్తుండడంతో బాబుకు కంటి మీద కునుకు కరువైంది. దీంతో ఆయన విధ్వంసకర కుట్రకు తెరతీశారు. పోలింగ్ సందర్భంగా రాష్ట్రంలో విచ్చలవిడిగా దాడులు, దౌర్జన్యాలకు స్కెచ్ వేశారు. మహిళల ఓట్లు ఎలాగూ సాధించలేం కాబట్టి వారి ఓటింగ్ శాతాన్ని తగ్గించడమే లక్ష్యంగా రాష్ట్రంలో పెను విధ్వంసం సృష్టించేందుకు తెగబడుతున్నారు. ఇందులో భాగంగా రాబోయే 24 గంటల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా చంద్రబాబు పన్నాగం పన్నారు.

రెచ్చగొట్టి దాడులకు తెగబడాలి..

పోలింగ్ బూత్‌లకు వెళ్లే మహిళలను ఆకతాయిలతో రెచ్చగొట్టి.. అసభ్య పదాలతో దూషించి.. వారు దానిపై ప్రశ్నించగానే టీడీపీ గుండాలు ఘర్షణలకు దిగి.. దాడులకు తెగబడేలా చేయాలన్నది చంద్రబాబు బ్లూప్రింట్. ఈ కుట్రను పక్కాగా అమలుచేసేందుకు రాష్ట్రవ్యాప్తంగా టీడీపీ అభ్యర్థులు, నేతలు తమ మందీమార్బలాన్ని, గూండాలను సమీకరించుకుని.. వారికి కర్రలు, కత్తులతోపాటు ఇతర ఆయుధాలను కూడా అందించి పోలింగ్‌ను భగ్నం చేసేందుకు తద్వారా మహిళల ఓటింగ్‌ను తగ్గించేందుకు సన్నద్ధమవుతుండటం ఆందోళన కలిగిస్తోంది.

వారి ఓటింగ్ శాతం తగ్గించడమే లక్ష్యం


సాధారణంగా ప్రతి ఎన్నికల్లోనూ మహిళలు పెద్దఎత్తున ఓటింగ్‌లో పాల్గొంటారు. పోలింగ్ ప్రశాంతంగా, సక్రమంగా సాగితే మహిళల ఓటింగ్ శాతం అమాంతంగా పెరుగుతుంది. అందుకే మహిళల ఓటింగ్ శాతాన్ని తగ్గించడమే చంద్రబాబు లక్ష్యంగా చేసుకున్నారు. ఇందుకోసం పోలింగ్ ముందు రోజు, పోలింగ్ రోజు రాష్ట్రవ్యాప్తంగా దాడులు, దౌర్జన్యాలకు పాల్పడమని చంద్రబాబు పార్టీ శ్రేణులను ఆదేశించారు. అందుకోసం స్థానికంగా ఉండే టీడీపీ రౌడీలతోపాటు ఇతర ప్రాంతాల నుంచి గూండాలు, రౌడీ మూకలను రప్పించినట్లు సమాచారం. ఎక్కడపడితే అక్కడ దాడులకు తెగించాలని.. తద్వారా ఇరువర్గాల మధ్య తీవ్రస్థాయిలో ఘర్షణలు చెలరేగి.. తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు సృష్టించాలన్నది చంద్రబాబు పన్నాగం. పోలీసుల లాఠీచార్జీ, బాష్పవాయు ప్రయోగం.. వీలైతే పోలీసు కాల్పుల వరకూ పరిస్థితి తీసుకొచ్చి శాంతిభద్రతలు అదుపుతప్పేలా చేయాలని ఆయన టీడీపీ శ్రేణులకు స్పష్టమైన సంకేతాలిచ్చారు. ఇందులో భాగమే ఇటీవల చోటుచేసుకున్న సంఘటనలు. అవి..

- తూర్పు గోదావరి జిల్లా నల్లజర్లలో సాక్షాత్తూ రాష్ట్ర హోంమంత్రి తానేటి వనితపైనే టీడీపీ గుండాల దాడి.
- మాచర్లలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే, ప్రస్తుత అభ్యర్థి పిన్నెల్లి రామకృష్ణారెడ్డి భార్య రమాదేవి, మాజీ ఎంపీపీ దాసరి చౌడేశ్వరిలపై టీడీపీ అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి తన అనుచరులతో దాడిచేయించడం..
- ఇక కర్నూలు జిల్లా బనగానపల్లె నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ అభ్యర్థి కాటసాని రామిరెడ్డి భార్య, తనయుడిపై టీడీపీ గూండాలు దాడి.

అడ్డుకట్ట వేయాల్సింది ఈసీ, పోలీసులే

ఈ నేపథ్యంలో.. పోలింగ్ ప్రశాంతంగా, సక్రమంగా నిర్వహించేందుకు ఎన్నికల కమిషన్ (ఈసీ), పోలీసు యంత్రాంగం అత్యంత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని రాజకీయ పరిశీలకులు చెబుతున్నారు. సమస్యాత్మక నియోజకవర్గాల్లో పోలింగ్ నిర్వహణ కోసం వెబ్‌కాస్టింగ్, వీడియో రికార్డింగ్ తదితర చర్యలు తీసుకుంటున్నా.. అవి పోలింగ్ బూత్‌ల వద్ద పరిస్థితిని మాత్రమే పర్యవేక్షణకు ఉద్దేశించినవి. కానీ, సామాన్య మహిళా ఓటర్లు తమ ఇళ్ల నుంచి పోలింగ్ బూత్‌లకు వచ్చే మార్గాల్లోనూ.. ఇతర ప్రాంతాల్లోనూ దాడులకు తెగబడేందుకు కుట్ర పన్నుతున్న టీడీపీ గూండాలను కట్టడి చేయాలంటే ఆ చర్యలు సరిపోవు. కాబట్టి ఈసీ, పోలీసులు మరింత అప్రమత్తంగా ఉండి.. పోలింగ్ ప్రశాంతంగా నిర్వహించేలా.. మహిళలు అత్యధికంగా ఓటింగులో పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 16+6+32 పేజీల ఆదివారం అనుబంధం   వెల: ₹ 7.00
సంపుటి: 17
సంచిక: 50
ఆదివారం   12-5-2024


'సంక్షేమ పథకాల అమలే సర్కారు పని తీరుకు కొలమానం'



బీజేపీ మళ్లీ గెలిస్తే తదుపరి ప్రధాని అమిత్ షా

- వచ్చే ఏడాది మోదీ పదవి నుంచి వైదొలగుతారు
- 2 నెలల్లో యూపీ సీఎం యోగిని మార్చేస్తారు
- ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ ఘాటు వ్యాఖ్యలు

ఐదేళ్లూ మోదీయే: అమిత్ షా 6లో

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

ప్రధాని రేసులో ఉంటా!

జాతీయ స్థాయిలో ప్రాంతీయ శక్తుల కూటమి ఏర్పాటుకు ప్రయత్నిస్తా: కేసీఆర్

- నాకున్న రాజకీయ సంబంధాలు, శక్తిని, తెలివిని రంగరిస్తా..
- జాతీయ పార్టీలు ప్రాంతీయ కూటమికి మద్దతిచ్చే పరిస్థితిని సృష్టిస్తా..
- జాతీయ రాజకీయాలు కొనసాగిస్తాం
- మహారాష్ట్ర అసెంబ్లీ బరిలో నిలుస్తాం
- తెలంగాణలో బీఆర్ఎస్ 12 నుంచి 14 స్థానాల్లో గెలిచి తీరుతుంది
- రాష్ట్రంలో రెండో స్థానంలో బీజేపీ, మూడో స్థానంలో కాంగ్రెస్ ఉంటాయి
- రేవంత్ 'ఓటుకు నోటు' దొంగ.. ఆయన అసమర్థతతో రాష్ట్రానికి కష్టాలు
- మీడియాతో బీఆర్ఎస్ అధినేత



సాక్షి, హైదరాబాద్: దేశ ప్రధానిగా పనిచేసే అవకాశం వస్తే వంద శాతం రేసులో ఉంటానని.. అవకాశం వస్తే వదులుకునేంత అమాయకుడిని కాదని బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కె.చంద్రశేఖర్‌రావు పేర్కొన్నారు. బీఆర్ఎస్ జాతీయ రాజకీయాలను కొనసాగిస్తామని చెప్పారు. పార్లమెంటు ఎన్నికల తర్వాత అందరినీ సంప్రదించి.. తనకున్న రాజకీయ సంబంధాలు, శక్తి, తెలివిని రంగరించి ప్రాంతీయ కూటమి కోసం ప్రయత్నాలు చేస్తానని చెప్పారు. ఏదో ఒక జాతీయ పార్టీ ప్రాంతీయ పార్టీల కూటమికి మద్దతు ఇవ్వాల్సిన పరిస్థితిని సృష్టిస్తామన్నారు. తెలంగాణలో బీఆర్ఎస్ 12 నుంచి 14 ఎంపీ స్థానాల్లో గెలిచితీరుతుందని చెప్పారు. కాంగ్రెస్ 9 చోట్ల మూడో స్థానంలో ఉందని.. బీజేపీ రెండో స్థానంలో ఉన్నా బీఆర్ఎస్‌కు చాలా దూరంలో ఉందని పేర్కొన్నారు. 16 రోజుల పాటు నిర్వహించిన ఎన్నికల ప్రచార బస్సుయాత్ర ముగియడంతో శనివారం బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం తెలంగాణ భవన్‌లో కేసీఆర్ మీడియాతో మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే..

''బీఆర్ఎస్ పార్లమెంటరీ నేత కె.కేశవరావు పార్టీని వీడటంతో ఆయన స్థానంలో రాజ్యసభ ఎంపీ కేఆర్. సురేశ్‌రెడ్డిని పార్లమెంటరీ పార్టీ నేతగా నియమిస్తూ రాజ్యసభ చైర్మన్‌కు లేఖ ఇస్తున్నా. జాతీయ రాజకీయాల్లో మా పార్టీ తరఫున ఆయన కీలక ప్లేయర్‌గా ఉంటారు. ఈ అక్టోబర్‌లో జరిగే మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పోటీ చేయాలని అక్కడి నేతలు కోరుతున్నారు. మహారాష్ట్రలో రాజకీయ అనిశ్చితి ఉంది. తెలంగాణలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలు అక్కడా అమలు కావాలని ప్రజలు కోరుకుంటున్నారు. బీఆర్ఎస్ పేరిట పోటీచేసి గెలుస్తాం.

హైదరాబాద్ గొంతు కోస్తే సహించరు..

కేంద్ర పాలిత ప్రాంతం పేరిట హైదరాబాద్ గొంతు కోస్తే తెలంగాణ ప్రజలు సహించరు. కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే వంటివారు కూడా దేశానికి రెండో రాజధాని కావాలని అంటున్నారు. కాంగ్రెస్, బీజేపీ వంటి పిచ్చివాళ్లకు స్థానమిస్తే హైదరాబాద్‌ను దెబ్బకొట్టే ప్రయత్నం చేస్తారు. హైదరాబాద్ తెలంగాణ సొంతం.. ఎన్నటికీ వదులుకోబోం. ఓటుకు నోటు కేసులో రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడిన రేవంత్ బీజేపీలో చేరతాడని కాంగ్రెస్ నేతలే అనుమానిస్తున్నారు. 26 నుంచి 33 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ప్రభుత్వ ఏర్పాటుకు రెడీగా ఉన్నామని మాతో అంటున్నారు. కారు షెడ్డుకు వెళ్లిందంటున్న రేవంత్‌రెడ్డి.. మా ధాటికి రేపు ఎక్కడికి పోతాడో చూద్దాం. పనులు,

మిగతా 7వ పేజీలో ▶

లక్ష మంది రేవంత్‌లు వచ్చినా బీఆర్ఎస్‌ను తుడిచిపెట్టలేరు..

➤ కేసీఆర్ అంటే తెలంగాణ చరిత్ర. నా రాజకీయ భవిష్యత్తును పణంగా పెట్టి ప్రత్యేక రాష్ట్రం తెచ్చా. కేసీఆర్ గుండెల్లో తెలంగాణ.. తెలంగాణ గుండెల్లో కేసీఆర్ ఉంటరు. గెలుపోటములు పక్కన పెడితే తెలంగాణ ఎమోషన్ కేసీఆర్. 65 లక్షల మంది సభ్యత్వం కలిగిన మహాసముద్రం లాంటి బీఆర్ఎస్‌ను తుడిచిపెట్టడం లక్ష మంది రేవంత్‌లు వచ్చినా సాధ్యం కాదు. కేసీఆర్‌ను గిల్లి పడేస్తం అనుకునే వాళ్లు పిచ్చివాళ్లు.

మోదీ దుర్మార్గాలు పెరిగాయ్..

➤ ప్రధాని మోదీ దుర్మార్గాలు పెరిగిపోయాయి. ఆయన గోబెల్స్ మాదిరిగా అవసరాన్ని బట్టి మాట్లాడుతారు. నాలుక మడతేయడం ఆయనకు వచ్చినంతగా ఎవరికీ రాదు. మత విద్వేషాలను రెచ్చగొట్టి దేవుడి పేరిట ఓట్లు కొల్లగొట్టే పార్టీ బీజేపీ. హిందువులు, ముస్లింలు అనే తేడా లేకుండా.. అసమానతకు గురైన ఎస్సీ, ఎస్టీ, ఎస్టీ, ఎంబీసీ, మైనారిటీలు అందరికీ న్యాయం జరగాలి. ఎస్సీ రిజర్వేషన్లు 15% నుంచి 19 శాతానికి పెంచాలి. అల్పాదాయం ఉన్న ముస్లింలకు కూడా రిజర్వేషన్లు ఉండాలి. ఢిల్లీ లిక్కర్ స్కామ్ మోదీ సృష్టించిన రాజకీయ కుట్ర. నేనూ, కేజ్రీవాల్ మోదీకి కంటిలో నలుసులా తయారయ్యాం. మోదీ కుడి భుజం బీఎల్ సంతోష్‌ను అరెస్టు చేసేందుకు వెళ్లినందుకునే.. నా కూతురు కవితను టార్గెట్ చేశారు. రాజకీయ కుటుంబం నుంచి వచ్చిన మేం ఈ కుట్రలను ఎదుర్కొంటాం.

బీజేపీ మాయలో పడొద్దు..

- మతపిచ్చి లేపి.. ఓట్లు దండుకోవాలని చూస్తోంది..
- కేంద్రంలో ఆ పార్టీకి అధికారమిస్తే రిజర్వేషన్లు రద్దవుతాయి
- రాజ్యాంగాన్ని మార్చేస్తారు
- పటాన్‌చెరు రోడ్‌షోలో సీఎం రేవంత్‌రెడ్డి


పటాన్‌చెరు రోడ్ షోలో ప్రసంగిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో దామోదర రాజనర్సింహ, మెదక్ అభ్యర్థి నీలం మధు ముదిరాజ్

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: దేశంలోని ప్రజల్లో మతపిచ్చి లేపి.. ప్రజలు కత్తులతో పొడుచుకుని, గొంతులు తెగి రక్తం చిందిస్తుంటే బీజేపీ అందులోంచి ఓట్లు దండుకోవాలని చూస్తోందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ధ్వజమెత్తారు. మతాలు, ప్రాంతాలు, భాషల మధ్య చిచ్చు పెట్టడం దేశానికి ఏ మాత్రం మంచిది కాదన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలు బీజేపీ మాయలో పడి అధికారాన్ని కట్టబెడితే, అంబేడ్కర్ రాసిన రాజ్యాంగాన్ని సమూలంగా మార్చేస్తుందని విమర్శించారు. ఆ పార్టీ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల రిజర్వేషన్లను రద్దు చేయాలని చూస్తోందని మండిపడ్డారు. శనివారం సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరులో జరిగిన కాంగ్రెస్ పార్టీ రోడ్‌షోలో సీఎం రేవంత్ మాట్లాడారు. రిజర్వేషన్లు రద్దయితే బడుగు, బలహీన వర్గాలు ఐపీఎస్, ఐఏఎస్‌లు, డాక్టర్లు, ఇంజనీర్లు, ఎమ్మెల్యేలుగా పదవులు పొందే అవకాశం లేకుండా పోతుందన్నారు. దేశంలో ఇప్పటి వరకు జరిగిన సార్వత్రిక ఎన్నికలు అభివృద్ధి, సంక్షేమం ప్రాతిపదికన జరిగితే.. ఈ ఎన్నికలు రిజర్వేషన్ల రద్దు, రాజ్యాంగం మార్చాలనే ప్రాతిపదికన జరుగుతున్నాయని, దీనిపై ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు ఆలోచించాలని విజ్ఞప్తి చేశారు.

మోదీ, అమిత్‌షాలు ఏం తెచ్చారు?

ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాలు రాష్ట్రానికి వస్తే తెలంగాణకు నిధులు

మిగతా 9వ పేజీలో ▶

ఇందిర, వైఎస్ హయాంలోనే అభివృద్ధి

మెదక్ జిల్లాలో బీహెచ్ఈఎల్, బీడీఎల్, ఓడీఎఫ్, ఇక్రిశాట్ వంటి సంస్థలు దివంగత ప్రధాని ఇందిరాగాంధీ హయాంలో వస్తే.. ఔటర్, శంషాబాద్ విమానాశ్రయం వంటి సంస్థలు దివంగత సీఎం వైఎస్ హయాంలో వచ్చాయని రేవంత్‌రెడ్డి గుర్తు చేశారు. ఆయా సంస్థలు, పరిశ్రమల్లో వేలాది మంది కార్మికులుగా పనిచేస్తున్నారని, ఈ ప్రాంతంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగు పడ్డాయని పేర్కొన్నారు. పటాన్‌చెరు పారిశ్రామిక ప్రాంతం వివిధ రాష్ట్రాలు, కులాలు, మతాల ప్రజలతో మినీ ఇండియాగా విలసిల్లుతోందన్నారు. ఈ ప్రాంతంలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తామన్నారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ కేసు సుప్రీం కోర్టు విచారణలో ఉందని, ఈ కేసును పర్యవేక్షిస్తున్నది మంత్రి దామోదర రాజనర్సింహ అని అన్నారు.


సాయంత్రం 4.25 గంటలకు కాకినాడ జిల్లా పిఠాపురంలో సీఎం వైఎస్ జగన్ ఎన్నికల ప్రచార సభకు హాజరైన అశేష జనసందోహంలో ఓ భాగం

ఢిల్లీ అండతో.. అడ్డుకుంటున్నారు

చిలకలూరిపేట, కైకలూరు, పిఠాపురం ఎన్నికల సభల్లో ఏపీ సీఎం జగన్

అవ్వాతాతలు, అక్కచెల్లెమ్మలు, రైతన్నలు, పిల్లల ఉసురు పోసుకుంటున్న బాబు కూటమి

హస్తిన పెద్దలకు దాసోహం అంటూ పథకాలను ఆపుతున్నారని మండిపాటు 12లో

క్లుప్తంగా...



తిరుమల శ్రీవారిని ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఏవీ రవీంద్రబాబు దర్శించుకున్నారు.

ముగిసిన ఈఏపీసెట్-2024 పరీక్షలు

- 94.4 శాతం హాజరు

సాక్షి, హైదరాబాద్: ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ యూజీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన ఈఏపీసెట్-2024 ప్రశాంతంగా ముగిసింది. ఈనెల 7న ప్రారంభమైన ఈ పరీక్షలు శనివారంతో ముగిశాయి. ఈనెల 7, 8 తేదీల్లో బైపీసీ స్ట్రీమ్ పరీక్షలు నిర్వహించిన అధికారులు, 9, 10, 11 తేదీల్లో ఇంజనీరింగ్ స్ట్రీమ్ పరీక్షలు నిర్వహించారు. ఈఏపీసెట్-2024కు తెలుగు రాష్ట్రాల నుంచి ఇంజనీరింగ్ స్ట్రీమ్‌లో 2,54,543 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో ఆంధ్రప్రదేశ్ నుంచి 49,071 మంది ఉన్నారు. అగ్రికల్చర్, ఫార్మసీ స్ట్రీమ్‌లో 1,00,260 మంది విద్యార్థులు దరఖాస్తు సమర్పించగా.. వీరిలో ఏపీ నుంచి 12,349 మంది ఉన్నారు. 5 రోజుల పాటు జరిగిన ఈఏపీసెట్ పరీక్షలకు మొత్తంగా 94.4 శాతం విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. ఈ నెలాఖరులో ఫలితాలు విడుదల చేసేలా కసరత్తు చేస్తున్నట్లు అధికార వర్గాలు వెల్లడించాయి.

ముగ్గురు పోస్టల్ ఉద్యోగులపై సీబీఐ కేసు

- తాత్కాలిక ఉద్యోగులను పర్మినెంట్ చేస్తామని రూ.25 లక్షల డిమాండ్

సాక్షి, హైదరాబాద్: పది మంది తాత్కాలిక ఉద్యో గులను పర్మినెంట్ చేసేందుకు రూ.25 లక్షల లంచం డిమాండ్ చేసిన ఆరోపణలపై పోస్టల్ విభాగం హైదరాబాద్ కేంద్ర కార్యాలయంలో సార్టింగ్ డివిజన్‌లో పనిచేస్తున్న ముగ్గురు ఉద్యోగులపై సీబీఐ కేసు నమోదు చేసింది. సార్టింగ్ విభాగంలో పనిచేస్తున్న అసిస్టెంట్ సూపరింటెండెంట్, ఇద్దరు ఎంటీఎస్ (మల్టీ టాస్కింగ్ స్టాఫ్)పై సీబీఐ అధికారులు కేసు నమోదు చేశారు. పది మంది తాత్కాలిక ఉద్యోగులను ఎంటీఎస్‌లుగా నియమించేందుకు లంచం డిమాండ్ చేసినట్లు సమాచారం అందింది. విడతల వారీగా వీరి నుంచి లంచం మొత్తాన్ని వసూలు చేసినట్లు సీబీఐ అధికారులు గుర్తించారు. కేసు దర్యాప్తులో భాగంగా సీబీఐ అధికారులు హైదరాబాద్‌లో 3 చోట్ల సోదాలు చేసి పలు కీలకపత్రాలు స్వాధీనం చేసుకున్నారు.

భూ ఆక్రమణల్లో బకాసురుడు సీఎం రమేశ్

కంచెలేసి భూ యజమానులను అడ్డగించారు.. పెన్నా నదిని, కలమల్ల వాగును ఆక్రమించారు



వాగుకు రక్షణ గోడ నిర్మించి దానిపై ఫెన్సింగ్ వేయడంతో మూసుకుపోయిన దారి



దీంతో వాగులో రైతులు ఏర్పాటు చేసుకున్న దారి



రక్షణ గోడ, ఫెన్సింగ్ తొలగించడంతో ఏర్పడిన దారి

అతడు.. భూఆక్రమణల్లో బకాసురుడు. అరాచకాల్లో రజాకార్లు కూడా ఆయన ముందు దిగదుడుపే. వ్యవస్థలను మేనేజ్ చేయడంలో తన గురువు చంద్రబాబుకు తగ్గ శిష్యుడు. చివరకు సొంత గ్రామస్తులు, బంధువులు కూడా ఆయన అంతులేని ధనదాహార్తికి చితికిపోయారు. తన ఆక్రమణలకు అడ్డూ అదుపు లేదు. నదీ, వాగు అనే అభ్యంతరాలు లేవు. దొరికినదాన్నల్లా కబ్జా చేయడమే. సారా వ్యాపారం నుంచి మొదలై చంద్రబాబు అనుంగు శిష్యుడిగా రాజకీయాల్లో అడుగుపెట్టి వాటినీ కలుషితం చేసిన ఆ చీడ పురుగు.. సీఎం రమేశ్. సొంత గ్రామస్తులు ఛీ కొడుతున్న ఆయన అక్రమాలు, అరాచకాలు తెలిస్తే కళ్లు తేలేయకమానరు.

- కాంట్రాక్టుల పేరిట రూ.వందల కోట్లను కొల్లగొట్టారు
- సాయం ముసుగులో స్థిరచరాస్తులను దోచేశారు
- టీడీపీ ప్రభుత్వ హయాంలో అన్ని రకాల బెదిరింపులకు పాల్పడ్డారు
- న్యాయస్థానాల్లో వ్యాజ్యాలున్నా లెక్కచేయరు
- సీఎం రమేశ్, ఆయన సోదరుడు సురేశ్ రజాకార్ల కన్నా దుర్మార్గులు
- వైఎస్సార్ జిల్లా పోట్లదుర్తి గ్రామస్తుల మండిపాటు

పోట్లదుర్తి నుంచి సాక్షి ప్రత్యేక ప్రతినిధి

సీఎం రమేశ్, ఆయన సోదరుడు సురేశ్ నాయుడు రజాకార్ల కన్నా దుర్మార్గులని వైఎస్సార్ జిల్లా ఎర్రగుంట్ల మండలం పోట్లదుర్తి గ్రామస్తులు ధ్వజమెత్తారు. అదే గ్రామానికి చెందిన సీఎం రమేశ్, ఆయన సోదరుడు అరాచకాలకు బలికాని వర్గమంటూ లేదని గ్రామస్తులు మండిపడుతున్నారు. వారి ఆవేదన, ఆక్రందన వింటే ఈ కాలంలోనూ ఇన్ని దురాగతాలు ఎలా చేయగలుగుతున్నారనే ఆశ్చర్యం కలుగుతుంది. అన్ని వ్యవస్థలను అంతలా ఎలా మేనేజ్ చేయగలుగుతున్నారని అవాక్కవ్వక తప్పదు. సొంత గ్రామస్తులకు వారు బతికుండగానే నరకం చూపిన సీఎం రమేశ్ ప్రస్తుత ఎన్నికల్లో బీజేపీ తరఫున అనకాపల్లి లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో అక్కడేం చేయబోతున్నారో ఊహించడానికే కష్టమవుతోంది. ఈ నేపథ్యంలో సీఎం రమేశ్ స్వగ్రామంలో ఆయన 'వ్యవహారాలు' తెలుసుకోవడానికి 'సాక్షి' పోట్లదుర్తిలో పర్యటించింది.

సారా వ్యాపారంతో మొదలెట్టి..

సీఎం రమేశ్ కుటుంబం సారా వ్యాపారంతో మొదలైంది. టీడీపీలో చేరి చంద్రబాబుతో చెలిమి చేశాక ఇక ఆయన వెనుతిరిగి చూడలేదు. బాబు సహకారంతో రెండుసార్లు రాజ్యసభ సభ్యుడు అయ్యారు. అన్నిరకాల అక్రమాలు, అడ్డగోలు వ్యవహారాల్లో ఆరితేరి రూ.వేల కోట్లకు పడగలెత్తారనే ఆరోపణలున్నాయి. బయట కాంట్రాక్టులు, కంపెనీల వ్యవహారాలను అలా ఉంచినా.. సొంత గ్రామంలో మచ్చుకు కొన్నింటిని పరిశీలిస్తే వామ్మో రమేశ్ అనకుండా ఉండలేం.

వాగులు, నదుల్ని చెరబట్టి..

ప్రొద్దుటూరు నుంచి ఎర్రగుంట్లకు వెళ్లే మార్గంలో పెన్నానది ఒడ్డున పోట్లదుర్తి ఉంది. పెన్నాకు- గ్రామానికి మధ్యలో కలమల్ల వాగు పోతోంది. సీఎం రమేశ్ అటు నదిని, ఇటు వాగును ఆక్రమించి ఫెన్సింగ్ వేశారు. ఆ భూమిని ఆక్రమించుకున్నారు. తన భూములకు చుట్టూ తీగతో ఫెన్సింగ్ వేయడం ద్వారా ఇతర రైతుల పొలాలకు రాకపోకలు లేకుండా చేశారు. పెన్నా నది, కలమల్ల వాగులకు రక్షణ గోడలు, చెక్‌డ్యామ్‌ల నిర్మాణ పనులు దక్కించుకున్న సీఎం రమేశ్ కుటుంబం వాటిపై ఎవరూ నడవకుండా అడ్డంకులు సృష్టించింది. చివరకు పశువులు, మూగజీవాలు నీరు తాగడానికి కూడా వీల్లేకుండా చేసింది. స్థానికులు నిరసనలు వ్యక్తం చేసినా సీఎం రమేశ్ రాక్షసంగానే వ్యవహరించారు.

రైతుల్నే అమ్ముకునేలా చేసి..

తమ భూములున్న చోట పరిసరాల్లో కొందరి భూములు కొనుగోలు చేసి ఫెన్సింగ్ తీయించడం, ఆ తరువాత ఇతరులకు అడ్డంకులు కల్పించడం, వాటిని సొంతం చేసుకోవడం సీఎం రమేశ్, ఆయన సోదరుడి స్టైల్. పోనీ ఆ భూములను అక్కడున్న వాస్తవ ధర ప్రకారం తీసుకుంటారా అంటే అదీలేదు. ఎకరం రూ.పది లక్షల నుంచి రూ. ఇరవై లక్షలకు పైగా విలువ చేసే భూమిని రూ.నాలుగు నుంచి ఆరేడు లక్షలకు రైతులే స్వయంగా వచ్చి అమ్ముకుపోయేలా వారిని అనేక రకాల ఇబ్బందులకు గురి చేస్తారు. భూములను తక్కువకు ఇచ్చేలా బెదిరింపులకు పాల్పడటం షరా మామూలని పలువురు సొంత బంధువులే వివరించారు. గత టీడీపీ ప్రభుత్వ హయాం పాలన ముగిసే సమయానికి పోట్లదుర్తి పరిసరాల్లో మూడు వందల ఎకరాలకు పైగా భూములను సీఎం రమేశ్ తన వశం చేసుకున్నారని గ్రామస్తులు చెబుతున్నారు. అనేక పట్టా భూములను బినామీ పేర్లతో ఉంచారని తెలుస్తోంది.

గొడ్డును బాదినట్లు బాదాడయ్యా



మా అన్నదమ్ముల మధ్య పొలం విషయంలో తేడాలు వచ్చాయి. న్యాయం చెప్పమని సురేశ్ నాయుడు వద్దకు వెళ్లాం. ఎంతకూ సమస్య పరిష్కారం కాలేదు. దీంతో మరో పెద్దమనిషి వద్దకు వెళ్లానని తెలుసుకుని ఇంటికి పిలిపించి గొడ్డును బాదినట్లు బాదాడు. ఎవరికి చెప్పుకుంటావో చెప్పుకో పో అని బెదిరించాడు. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఇప్పుడు మళ్లీ బెదిరిస్తున్నారు. మా ప్రభుత్వం రాగానే నీ అంతుచూస్తానని బెదిరిస్తున్నారు.

– కలమల్ల బాదుల్లా, పోట్లదుర్తి

బంధువులమైనా వదిలిపెట్టడం లేదు..

సీఎం రమేశ్, మేము అంతా దగ్గర బంధువులమే. మా భూములను తక్కువ ధరకు తీసేసుకోవడానికి అన్ని ప్రయత్నాలు చేశాడు. దీనిపై కోర్టుల్లో వ్యాజ్యాలు నడుస్తున్నాయి. వ్యవస్థలను మేనేజ్ చేస్తూ మమ్మల్ని చాలా ఇబ్బందులకు గురిచేస్తున్నాడు. పోలీసులకు చెప్పినా ప్రయోజనం లేదు. అయినా మా పోరాటం ఆపేది లేదు.

– సీఎం రమేశ్ బంధువులు

సీఎం రమేశ్ అక్రమాలు, అరాచకాలు

- పెన్నా నది ఒడ్డున లిక్కర్ ఫ్యాక్టరీ నెలకొల్పుతానని, గ్రామంలోని వారికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పిస్తానని నమ్మబలికి సుమారు 40 ఎకరాలను పేదవర్గాల నుంచి సేకరించారు. అందులో అధునాతన అతిథిగృహాన్ని కట్టారు.
- గ్రామంలో మోడల్ స్కూలు కట్టిస్తానని నమ్మబలికి ఎకరం రూ. కోటి విలువచేసే భూమిని కేవలం 11 లక్షలకే తీసుకుని గ్రామస్తులను మోసం చేశారు. ఆ భూముల్లో ఆకుకూరలు, కూరగాయలు పండేవని, భూయజమానులకు నిత్యం ఆదాయం ఉండేదని గ్రామస్తులు చెబుతున్నారు. భూమి ఇవ్వడానికి నిరాకరించిన వారిని పోలీసుల పేరిట బెదిరించి మరీ తీసుకున్నారని కన్నీటిపర్యంతమయ్యారు.
- చంద్రబాబు పాలన 1999–2004 మధ్య ఎన్టీఆర్ కాలనీల పేరిట 294 (ఉమ్మడి ఏపీ అసెంబ్లీ స్థానాల సంఖ్య)గృహాలను ప్రభుత్వం మంజూరు చేసింది. లబ్ధిదారులకు ఆ ఇళ్ల హక్కుపట్టాలు రానీయకుండా సీఎం రమేశ్ తన కుటుంబీకుల వద్దే ఉంచుకుని రుణాల రూపంలో లబ్ధి పొందారనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో వాటిని అమ్మడానికి, ఇతరులకు అద్దెకు ఇవ్వడానికి వీల్లేకుండా పోయిందని లబ్ధిదారులు వాపోతున్నారు.
- గత టీడీపీ ప్రభుత్వ హయాంలో స్కూల్ పిల్లలకు యూనిఫాం పేరిట కొనసాగిన పథకాన్ని సీఎం రమేశ్ తనకు అనుకూలంగా వినియోగించుకున్నారు. మహిళా టైలర్లకు తెలియకుండా వారి పేరిట బ్యాంకు అకౌంట్లు, పాన్ కార్డులు తీసుకుని టైలరింగ్ ఛార్జీలను ఆయా అకౌంట్లలో వేయించేవారు. అధికారులతో కుమ్మక్కయి బ్యాంకు లావాదేవీలు తనకు అనుకూలంగా కొనసాగించుకోవడంతో టైలర్లు తమకు తెలియకుండానే ఆదాయపన్ను పరిధిలోకి చేరారు. దీంతో వారు సంక్షేమ పథకాలకు దూరమయ్యారు.
- గ్రామస్తులు ఎవరైనా అత్యవసరాల కోసం డబ్బు తీసుకున్నా.. పెద్ద మొత్తం అయ్యేవరకు వేచిఉండి ఆ ప్రాంశరీ నోట్లను తిరిగి రాయించేవారు. ఆ తర్వాత ఆర్థికంగా వారిని పూర్తిగా కుంగదీసేవారు. ఇళ్ల స్థలాలు, ఇల్లు, భూములు ఇలా ఏవో ఒకటి లాగేసుకోవడం అన్నదమ్ములకు రివాజని స్థానికులు వివరించారు. సీఎం రమేశ్ సోదరుడు సురేశ్‌తో నిత్యం కలిసి ఉండే సోమశేఖరరెడ్డి తన అవసరాల కోసం రూ.40 వేలు తీసుకోగా కొన్నేళ్ల తర్వాత రూ. ఎనిమిది లక్షలకు పైగా తిరిగి చెల్లించాలని, లేదంటే తనకు భూమి రాసిచ్చేయాలని ఒత్తిడి చేశారు. దీంతో సోమశేఖరరెడ్డి కుటుంబం దెబ్బతింది. అదేవిధంగా జబ్బుపడిన తన బిడ్డ వైద్యం కోసం ఒక పేద దళిత వ్యక్తి రూ.2 వేలు తీసుకోగా లక్షకు పైగా చెల్లించాలని అతడిని ఒత్తిడి చేశారు. సీఎం రమేశ్ సోదరుల దౌర్జన్యాలకు చివరకు వారి సొంత చిన్నాన్న కుటుంబం కూడా ఆర్థికంగా చితికిపోయింది.
- ప్రొద్దుటూరులో ద్విచక్రవాహనాల స్కీమ్ పేరిట సీఎం రమేశ్ మోసం చేశారు. ప్రొద్దుటూరులో వ్యాపారులను, చుట్టుపక్కల గ్రామాల వారిని నిండా ముంచారు.
- గ్రామానికి అంతటికీ సోలార్ ఎనర్జీ వచ్చేలా చేస్తానని చెప్పి మోసగించారు.
- పశువులు గ్రాసం కోసం ఇబ్బందిపడకుండా వసతి ఏర్పాటుచేస్తానని చెప్పి ప్రభుత్వ సొమ్ము దిగమింగారు.
- నీరు – చెట్టు పథకంలోనూ రూ.కోట్ల రూపాయలు దిగమింగారు.
- ఆర్‌టీపీపీకి వెళ్లే ఆర్ అండ్ బీ రోడ్డును కొంతమేర ఆక్రమించుకుని సీఎం రమేశ్ అపార్ట్‌మెంట్ నిర్మాణం చేపట్టారు. తన ఇంటి కోసం రోడ్డును ఓ వైపునకు పొడిగించి భూములు కోల్పోయిన వారికి నష్టపరిహారం కూడా లేకుండా చేశారు. తమ ఇంటి ముందు ఉన్న పది అడుగుల రోడ్డును ఆక్రమించడంతో పరిసరాల్లోని తమకు దగ్గరి నడక మార్గం లేక చుట్టూ తిరిగి రావాల్సి వస్తోందని స్థానికులు వాపోయారు.

మార్కెట్ కమిటీ గోడౌన్లలో ధాన్యం: తుమ్మల

సాక్షి, హైదరాబాద్: వర్షం కారణంగా రైతులెవరూ ఇబ్బందులు పడొద్దని, ధాన్యాన్ని మార్కెట్ కమిటీ గోడౌన్లలో నిల్వ చేసుకోవాలని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కోరారు. రైతుల దగ్గర సేకరించిన ధాన్యాన్ని మిల్లర్లు కూడా గోడౌన్లలో భద్రపరచుకోవాలని సూచించారు. దీంతో ధాన్యం అమ్ముకోని రైతులకు కొంత ఉపశమనం కలుగుతుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. ఇటీవల కురిసిన అకాల వర్షాలతో తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని అధికారులకు మంత్రి ఆదేశాలు జారీ చేశారు.

అభ్యర్థుల ఆస్తులపై సీఎం రమేశ్ కన్ను!

ఎక్కడెక్కడ ఆస్తులున్నాయో సమాచార సేకరణ

- ఆస్తులు తాకట్టు పెట్టుకుని ఎమ్మెల్యే అభ్యర్థులకు నిధులు
- అధిక వడ్డీకి అప్పులు ఇప్పిస్తున్న వైనం
- అది కూడా తన సన్నిహితుల వద్ద నుంచే
- ఆందోళనలో కూటమి అభ్యర్థులు



సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం: అనకాపల్లిలో మైనింగ్‌పై కన్నేసి.. ఇక్కడ నుంచి బీజేపీ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న సీఎం రమేశ్ పార్లమెంటు నియోజకవర్గం పరిధిలోని ఎమ్మెల్యే అభ్యర్థుల ఆస్తులపైనా కన్నేసినట్టు తెలుస్తోంది. ఎమ్మెల్యే అభ్యర్థులకు నిధుల కొరత ఉందంటూ.. వారికి నిధుల సమీకరణ పేరుతో వారి ఆస్తులను తాకట్టు పెట్టుకునేందుకు సీఎం రమేశ్ ఆసక్తి చూపుతున్నట్టు సమాచారం. ఎమ్మెల్యే అభ్యర్థులు తమ వంతు వాటా నిధులను తన టీమ్ సభ్యులకు చూపించాకే ఆయన తన వాటా నిధులను విడుదల చేస్తున్నారు. ఒకవేళ ఎవరైనా తమ వద్ద నిధులు లేవంటే.. వారి ఆస్తి పత్రాలు తీసుకుని అప్పులిప్పిస్తున్నట్టు చెబుతున్నారు. అది కూడా అధిక వడ్డీకి తన సన్నిహితుల వద్ద నుంచే సీఎం రమేశ్ అప్పులిప్పిస్తుండటం అభ్యర్థుల్లో ఆందోళన రేకెత్తిస్తోంది. ఇప్పటికే ఫోర్జరీ వ్యవహారంలో ఆయనపై హైదరాబాద్‌లో కేసు నమోదైంది. ఈ వ్యవహారం తెలిసిన ఎమ్మెల్యే అభ్యర్థులందరూ తాజా పరిణామాలతో భయాందోళనకు గురవుతున్నారు. అధిక వడ్డీకి తీసుకున్న ఈ మొత్తాలను సకాలంలో చెల్లించలేదన్న సాకుతో తమ ఆస్తులను తీసేసుకుంటే తమ పరిస్థితి ఏమిటని కూటమి అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు.

ఆస్తుల చిట్టాతో భయపెడుతున్న సీఎం రమేశ్..


వాస్తవానికి కొందరు తెలుగుదేశం, జనసేన పార్టీల అభ్యర్థులు ఎంపీ కోటా నుంచి వచ్చిన నిధులతోనే ఎన్నికలు కానిచ్చేదామనుకున్నారు. ఒక్కో ఎమ్మెల్యే అభ్యర్థికి రూ.13 కోట్ల మేర సీఎం రమేశ్ నిధులు ఇచ్చినట్టు తెలుస్తోంది. ఎన్నికల నిర్వహణకు ఈ నిధులు సరిపోతాయని.. తమ వంతు వాటా నిధులు అవసరం లేదని ఎమ్మెల్యే అభ్యర్థులు భావించారు. అయితే, మీ వాటా నిధులు ఎక్కడున్నాయో చెప్పాలని.. తన టీమ్ పరిశీలిస్తుందని ఎమ్మెల్యే అభ్యర్థులను సీఎం రమేశ్ డిమాండ్ చేసినట్టు తెలుస్తోంది. మీ వంతుగా మీ వద్ద రూ.10 కోట్ల మేర ఉన్నాయని తన టీమ్ నిర్ధారించాకే తన కోటా రూ.13 కోట్లు విడుదల చేస్తానని ఆయన తేల్చిచెప్పినట్టు సమాచారం. ఈ క్రమంలో చోడవరం నియోజకవర్గానికి చెందిన ఎమ్మెల్యే అభ్యర్థి తన వద్ద నిధులు లేవని.. తనకు పెద్దగా ఆస్తులు కూడా లేవని చెప్పినట్టు తెలుస్తోంది. దీంతో సదరు ఎమ్మెల్యే అభ్యర్థి ఆస్తుల మొత్తం వివరాలను డాక్యుమెంట్స్‌తో సహా సీఎం రమేశ్ ఆయన ముందు ఉంచడంతో విస్తుపోవడం ఆ అభ్యర్థి వంతైందని చెబుతున్నారు. ఇందులో కొన్ని ఆస్తులను తాను అమ్మివేశానని.. ప్లాట్లుగా విభజించి విక్రయించినట్టు ఆ అభ్యర్థి చెప్పడంతో తాజా ఎన్‌కంబరెన్స్ సర్టిఫికెట్ (ఈసీ)ని కూడా సీఎం రమేశ్ ఆయనకు చూపించినట్టు తెలుస్తోంది. ఇంతగా తమ ఆస్తులు, వాటి పత్రాలను కూడా ఆయన సేకరించడం పట్ల అభ్యర్థులు ఒకింత ఆందోళనకు గురవుతున్నట్లు సమాచారం.

అధిక వడ్డీకి తాకట్టు..


అనకాపల్లి ఎంపీ స్థానం పరిధిలోని ఎమ్మెల్యే అభ్యర్థులకు చెందిన ఆస్తి పత్రాలన్నింటినీ సీఎం రమేశ్ సేకరించినట్టు చెబుతున్నారు. తమ వద్ద నిధులు లేవన్న అభ్యర్థులకు.. ఆస్తులను తాకట్టు పెట్టి అప్పులిప్పించే ఏర్పాట్లను కూడా ఆయన చూసుకుంటున్నారు. 'నీ ఆస్తి పత్రాలను తీసుకెళ్లి.. వైజాగ్‌లో ఫలానా వారిని కలిసి వడ్డీకి నిధులు తీసుకో' అని వారిని ఆదేశిస్తున్నట్టు సమాచారం. తమ ఆస్తుల చిట్టాను సేకరించి.. వాటిని ఎక్కడ తాకట్టు పెట్టాలో కూడా సీఎం రమేశ్ చెబుతుండటంతో అభ్యర్థులు అనుమాలు వ్యక్తం చేస్తున్నారు. తమ ఆస్తుల చిట్టాను ఎందుకు సేకరించారు? వాటిని తీసుకెళ్లి ఫలానా వారి వద్దనే తాకట్టు పెట్టాలని ఎందుకు ఒత్తిడి చేస్తున్నారని అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు. అంతేకాకుండా ఆస్తి పత్రాలను తాకట్టు పెట్టుకుని అధిక వడ్డీకి అప్పులు ఇస్తున్న వారంతా సీఎం రమేశ్‌కు చెందినవారే కావడంతో వీరి అనుమానాలు రెట్టింపవుతున్నాయి. ఎన్నికల తర్వాత తమ ఆస్తులు తమకు దక్కుతాయా? ఈ అప్పు పేరుతో తీసుకున్న పత్రాలను తీసుకెళ్లి సొంతం చేసుకుంటారా అనే భయాందోళనకు గురవుతున్నట్టు సమాచారం. ఏది ఏమైనప్పటికీ గతంలో ఎన్నడూ లేని విధంగా తమ ఆస్తుల చిట్టాను మొత్తం విప్పుతుండటంతో అభ్యర్థుల్లో ఆశ్చర్యంతో పాటు ఆందోళన కూడా నెలకొందని టీడీపీ వర్గాలే వ్యాఖ్యానిస్తున్నాయి. సీఎం రమేశ్ ఫోర్జరీ సంతకాలతో భారీగా నిధులను కాజేసిన వ్యవహారంలో హైదరాబాద్‌లో కేసు నమోదైన అంశం వీరి కళ్ల ముందు కదలాడుతున్నట్టు తెలుస్తోంది.

జూలైలో నగరంలో అంతర్జాతీయ పర్యాటక సదస్సు

వివిధ దేశాలకు చెందిన 500 మంది టూర్ ఆపరేటర్లు పాల్గొనే అవకాశం



సాక్షి, హైదరాబాద్: మరో అంతర్జాతీయ పర్యాటక సదస్సుకు హైదరాబాద్ వేదికవుతోంది. జూలై 29, 30 తేదీల్లో హెచ్ఐసీసీలో జరిగే ఈ సదస్సుకు మన దేశంతో పాటు, వివిధ దేశాలకు చెందిన దాదాపు 500 మంది టూర్ ఆపరేటర్లు, హోటళ్ల ప్రతి నిధు లతో పాటు అనుబంధ రంగాలకు చెందిన వారు హాజ రయ్యే అవకాశం ఉందని నిర్వాహకులు తెలి పారు. సదస్సుకు ముందు రెండు రోజులు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో పరిచయ పర్యటనలు ఏర్పా టు చేశారు. తెలంగాణ పర్యాటక శాఖతో కలిసి ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ సంయుక్తంగా 'ఎక్స్‌పీరి యన్షి యల్ టూరిజం మైస్ కాంక్లేవ్-2024' పేరుతో నిర్వహిస్తు న్నాయి. వివరాలను శనివారం ఫెడరేషన్ ఆఫ్ తెలం గాణ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ అధ్యక్షులు జయదేవ్ నగరంలోని ఓ హోటల్‌లో నిర్వహించిన సమావే శంలో వెల్లడించారు. తెలంగాణ ప్రాంత పర్యాటక రంగ సామర్థ్యాన్ని ప్రపంచానికి చాటిచెప్పేందుకు ఇదో గొప్ప అవకా శమన్నారు. ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ పర్యాటక కమిటీ సలహా దారు మోహన్‌రాజ్ మాట్లాడుతూ పర్యాటకరంగానికి పరిశ్రమ హోదా అవసరమని అభిప్రాయ పడ్డారు. త్వరలో నిర్వహించబోయే సదస్సు నేప థ్యంలో ఆటో, క్యాబ్ డ్రైవర్లకు అతిథి దేవోభవ విష యంలో ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్టు ఆ సంస్థ టూరిజం కమిటీ చైర్‌పర్సన్ రాఖీ కంకారియా పేర్కొ న్నారు. పర్యాటకులతో వ్యవహరించే తీరు, ఆంగ్లంలో సాధారణ స్థాయిలో మాట్లాడే పరిజ్ఞానం కల్పించనున్నట్టు వెల్లడించారు. ఐకోనాక్స్ డైరెక్టర్ అభిమ న్యుసింగ్, హోటల్ అండ్ రెస్టారెంట్ అసో సియేషన్ ఆఫ్ తెలంగాణ, ట్రావెల్ ఏజెంట్స్ అసో సియేషన్ ఆఫ్ ఇండియా, ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ టూర్ ఆపరేటర్స్, ది ట్రావెల్ ఏజెంట్స్ ఫెడ రేషన్ ఆఫ్ ఇండియా, టూర్ ఆపరేటర్ అసోసియేషన్ సంస్థల ప్రతినిధులు ఇందులో పాల్గొన్నారు.


'మహిళల ముఖాలు కళకళలాడుతూ ఉంటేనే కుటుంబమూ, సమాజమూ బాగుంటాయి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+6+32 పేజీల ఆదివారం అనుబంధం వెల: ₹ 7.00

సంపుటి: 17 సంచిక: 50

ఆదివారం 12-5-2024



చీల'మంట'!

చీలమండ నొప్పులకు తీసుకోవాల్సిన చికిత్సలపై కథనం. - ఫ్యామిలీలో



మా తుఝే సలామ్

నేడు మదర్స్ డే సందర్భంగా వైరలైన అంశాలపై కథనం. -ఫ్యామిలీలో

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

బీజేపీకే 'దక్షిణ'ం!

దక్షిణ భారత రాష్ట్రాల్లో అత్యధిక సీట్లు సాధిస్తాం: అమిత్ షా

- తెలంగాణలో బీజేపీకి 10కిపైగా ఎంపీ సీట్లు వస్తాయి
- కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు తెలంగాణను భ్రష్టుపట్టించాయి
- కాంగ్రెస్ సర్కారు హామీల అమల్లో పూర్తిగా విఫలమైంది
- ఇండియా కూటమి దేశాన్ని రెండుగా విభజిస్తోంది
- బీజేపీ ఉన్నంత వరకు అలా విభజన జరగనీయం
- రిజర్వేషన్లను రద్దు చేసే ఉద్దేశం మాకు లేదు..
- మాకు పూర్తి మెజారిటీ ఉన్నా వాటి జోలికి వెళ్లలేదు
- ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన ముస్లింలు, క్రిస్టియన్లకు రిజర్వేషన్ హక్కు ఉంటుంది
- మత ప్రాతిపదికన ఇస్తున్న ముస్లిం రిజర్వేషన్లు రద్దు చేస్తామని పునరుద్ఘాటన
- ఎన్నికల ప్రచారం ముగింపు సందర్భంగా మీడియాతో మాట్లాడిన కేంద్ర హోంమంత్రి

సాక్షి, హైదరాబాద్: దక్షిణాది రాష్ట్రాల్లో బీజేపీ అత్యధిక లోక్‌సభ సీట్లను సాధించి, అతిపెద్ద పార్టీగా ఆవిర్భవించబోతోందని బీజేపీ అగ్రనేత, కేంద్ర హోంమంత్రి అమిత్ షా ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణలో పది స్థానాలకుపైగా కచ్చితంగా గెలుస్తామని.. 13 సీట్లలో పార్టీ పరిస్థితి సంతృప్తికరంగా ఉందని చెప్పారు. కర్ణాటక, తెలంగాణ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, కేరళ రాష్ట్రాల్లో ఎక్కువ సీట్లను బీజేపీయే గెలవబోతోందని పేర్కొన్నారు. ఈసారి 400 సీట్లు దాటుతామని చెప్పారు. రాష్ట్రంలో ఎన్నికల ప్రచారం ముగియడానికి ముందు శనివారం సాయంత్రం కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి, ఎంపీ కె.లక్ష్మణ్, బీజేపీ మల్కాజిగిరి అభ్యర్థి ఈటల రాజేందర్‌లతో కలసి అమిత్ షా మీడియాతో మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే..

''అవినీతి, అక్రమాలు, కుటుంబ రాజకీయాలతో తెలంగాణ రాజకీయాలు భ్రష్టుపట్టాయి. దీనిని తెలంగాణ ప్రజలు అర్థం చేసుకున్నారు. అందుకే ఈసారి వీలైనన్ని ఎక్కువ సీట్లలో బీజేపీకి విజయాన్ని కట్టబెట్టేందుకు సిద్ధమయ్యారు. తెలంగాణలో 4% ముస్లిం రిజర్వేషన్లు ఇవ్వడం ఎస్సీ, ఎస్టీ, బీసీల హక్కులను కాలరాయడమే. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రాగానే వాటిని రద్దు చేస్తాం.

గ్యారంటీల అమల్లో కాంగ్రెస్ విఫలం: కాంగ్రెస్ ఆరు గ్యారంటీల అమల్లో విఫలమైంది. సోనియా పుట్టినరోజున రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామన్నారు. కానీ సోనియా ఎన్నో పుట్టినరోజున అనేది చెప్పలేదు. రైతులకు రూ.15 వేల భరోసా, ధాన్యానికి రూ.500 బోనస్, మహిళలకు నెలకు రూ.2,500 ఇవ్వలేదు. అవేవీ చేయలేదు. కానీ కాంగ్రెస్ రాష్ట్ర నేతలు హైకమాండ్‌కు ఇచ్చిన ఒక హామీని మాత్రం పూర్తిచేస్తున్నారు. దేశవ్యాప్తంగా మిగతా 2వ పేజీలో ▶



వికారాబాద్ సభలో ప్రజలకు అభివాదం చేస్తున్న అమిత్ షా

కూటమి వస్తే ప్రధాని ఎవరు?

వికారాబాద్, వనపర్తి బీజేపీ సభల్లో అమిత్ షా ప్రశ్న

- అలాంటి వారితో దేశమేం బాగుపడుతుంది?
- మోదీ సర్జికల్ స్ట్రైక్స్‌తో ఉగ్రమూకలను మట్టుబెట్టారు
- రాహుల్, రేవంత్‌రెడ్డిలు కాకులను కూడా కాల్చలేరు!
- కాంగ్రెస్ పార్టీకి తెలంగాణ ఏటీఎంలా మారింది
- ఫేక్ వీడియోలు పెట్టించిన రేవంత్ మూల్యం చెల్లించుకోక తప్పదని వ్యాఖ్య

- 2లో


తాండూరు సభలో ప్రసంగిస్తున్న ప్రియాంకా గాంధీ

మోదీ ఓటమి తెలంగాణ నుంచే మొదలుకావాలి

సంపదను తన పరివారానికే పంచాడు.. వాళ్ల అప్పులు రూ.16 లక్షల కోట్లు మాఫీ చేశాడు
కామారెడ్డి, తాండూరు సభల్లో ప్రియాంకా గాంధీ

- రైతుల అప్పులు ఒక్క రూపాయి మాఫీ చేయలేదు
- రాజ్యాంగాన్ని మారుస్తానని ప్రధాని అంటున్నారు.. దాన్ని మార్చనివ్వం.. రాహుల్ నాయకత్వానికి అండగా నిలవండి
- ట్రిపుల్ ఆర్ అంటే రేవంత్ రెడ్డి, రాహుల్ గాంధీ
- తెలంగాణ ఇచ్చిన సోనియమ్మ బిడ్డగా, మీ సోదరిగా వచ్చాను

సాక్షి, హైదరాబాద్/సాక్షి, కామారెడ్డి/తాండూరు: 'రాజ్యాంగాన్ని, దేశాన్ని కాపాడుకోవాలంటే మోదీని, బీజేపీని ఓడించడం తెలంగాణ నుంచే మొదలుకావాలి. దేశంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు రాహుల్ గాంధీ నాలుగు వేల కిలోమీటర్లు పాదయాత్ర చేశాడు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించి రాహుల్ నాయకత్వానికి అండగా నిలవండి. తెలంగాణ ఇచ్చిన సోనియాగాంధీని మీరంతా సోనియమ్మ అంటున్నారు. నన్ను మీ సోదరిగా భావించండి' అని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీ అన్నారు. 400 వందల సీట్లు ఇస్తే దేశ రాజ్యాంగాన్ని మారుస్తానని ప్రధాని మోదీ అంటున్నారని, ఈ రాజ్యాంగం దేశం లోని 140 కోట్ల మందిదని, ఎట్టి పరిస్థితుల్లోనూ మార్చనివ్వమని ఉద్ఘాటించారు. రాజ్యాంగాన్ని రద్దు చేసే ప్రయత్నాలను తెలంగాణ నుంచే అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. ఆమె శనివారం తాండూరు, కామారెడ్డిలో నిర్వహించిన రోడ్‌షోలు, కార్నర్ మీటింగుల్లో సీఎం రేవంత్‌రెడ్డితో కలిసి పాల్గొన్నారు. పదేళ్ల మోదీ పాలనలో పేద, మధ్య తరగతి ప్రజలు, కార్మికులు, రైతులు, మహిళలకు ఎలాంటి మేలు జరగలేదని, తన మిత్రులకే దేశ సంపద దోచిపెట్టారని మండిపడ్డారు. వారికి రూ.16 లక్షల కోట్ల రుణాలు మాఫీ చేసిన మోదీ, రైతులకు మాత్రం ఒక్క రూపాయి మాఫీ చేయలేదన్నారు.

కాంగ్రెస్ పథకాలకు మోదీ ఫొటో

ఎన్నికల సమయంలో ప్రజల మధ్య విభేదాలు సృష్టించి లబ్ధి పొందాలని ప్రధాని మోదీ ప్రయత్నిస్తున్నారని ప్రియాంకా గాంధీ మిగతా 9వ పేజీలో ▶

యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం పంతంగి టోల్‌ప్లాజా వద్ద శనివారం వాహనాల రద్దీ



చలో 'ఏపీ'

- ఓట్లేసేందుకు సొంతూళ్లకు తరలిన హైదరాబాద్ వాసులు
- రైళ్లు, బస్సులు, ప్రైవేటు వాహనాలన్నీ కిటకిట
- ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేసిన దక్షిణ మధ్య రైల్వే
- 28 రైళ్లలో అదనపు బోగీలు
- ఇప్పటికే పలు మార్గాల్లో నడుస్తున్న రైళ్ల పొడిగింపు
- అదనంగా 2వేల బస్సులు ఏర్పాటు చేసిన ఆర్టీసీ

- వివరాలు 11లో

కేసీఆర్ కంటే రేవంత్‌రెడ్డి డేంజర్

మీడియా సమావేశంలో కిషన్ రెడ్డి ధ్వజం

- తెలంగాణ ప్రజలకు అది అర్థమైంది
- రేవంత్ రెఫరెండం.. కాంగ్రెస్ అవినీతి పైనా లేక ఆర్ ఆర్ ట్యాక్స్ పైనా?
- మోదీ అమలు చేస్తున్నవే మళ్లీ మీ హామీలుగా చెబుతారా? అంటూ ముఖ్యమంత్రికి కిషన్ రెడ్డి లేఖ



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాజకీయాల్లో మాజీ సీఎం కేసీఆరే ప్రమాదకారి అనుకుంటే.. ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి అత్యంత ప్రమాదకారిగా తెలంగాణ ప్రజలు భావిస్తున్నారని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్ రెడ్డి వ్యాఖ్యానించారు. అధికారం కోసం కేసీఆర్, రేవంత్ ఎంతకైనా తెగిస్తారనీ, ఏ అబద్ధాలైనా ఆడుతారనే విషయాన్ని ప్రజలు పూర్తిగా అర్థం చేసుకున్నారని అన్నారు. ఈ ఎన్నికలు రెఫరెండం అంటూ రేవంత్ మాట్లాడుతున్నారనీ, అయితే కాంగ్రెస్ చేస్తున్న అవినీతిపై రెఫరెండమా.. లేక ఆర్ఆర్ ట్యాక్స్‌పై రెఫరెండమా అనేది ప్రజలే ఈ ఎన్నికల్లో తేల్చి చెబుతారని ఆయన పేర్కొన్నారు. శనివారం బీజేపీ కార్యాలయంలో కిషన్‌రెడ్డి మీడియాతో మాటా డుతూ.. అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన గ్యారెంటీలు, హామీలేవీ అమలు మిగతా 2వ పేజీలో ▶

ఇక మాటల్లేవ్!

- ముగిసిన లోక్‌సభ సాధారణ ఎన్నికల ప్రచార ఘట్టం
- రాష్ట్రమంతటా అమల్లోకి 144 సెక్షన్
- స్థానికేతరులు బయటికి వెళ్లిపోవాల్సిందే
- రేపు పోలింగ్‌కు సర్వం సిద్ధం
- ఉదయం 5.30 గంటలకే మాక్ పోలింగ్
- జూన్ 1 తర్వాతే ఎగ్జిట్ పోల్స్ ఫలితాలు
- ఇప్పటి వరకు రూ.320 కోట్లు స్వాధీనం
- మీడియాతో సీఈఓ వికాస్‌రాజ్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని 17 లోక్‌సభ స్థానాలకు సాధారణ ఎన్నికలతో పాటు కంటోన్మెంట్ అసెంబ్లీ స్థానానికి జరిగే ఉప ఎన్నిక ప్రక్రియ కీలక ఘట్టానికి చేరుకుంది. శనివారం సాయంత్రంతో ప్రచార పర్వానికి తెరపడింది. గత నెల రోజులుగా హోరెత్తిన లౌడ్ స్పీకర్లు, మైకులు ఒక్కసారిగా మూగబోయాయి. ఈ నెల 13న సోమవారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ జరగనుండగా.. శనివారం సాయంత్రం నుంచి సైలెంట్ పీరియడ్ అమల్లోకి వచ్చినట్టు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి(సీఈఓ) వికాస్‌రాజ్ ప్రకటించారు. రాష్ట్రమంతటా 144 సెక్షన్ అమల్లోకి వచ్చిందని, ఎక్కడా నలుగురుకి మించి గూమికూడి ఉండరాదని స్పష్టం మిగతా 11వ పేజీలో ▶

మండే ఎండల కంటే వాడివేడిగా..

- రాష్ట్రంలో హోరెత్తిన లోక్‌సభ ఎన్నికల ప్రచారం
- పట్టు నిలుపుకునేందుకు కాంగ్రెస్..
- పైచేయి సాధించాలని బీజేపీ..
- పునర్వైభవం కోసం బీఆర్ఎస్

11లో

తల తెగిపడ్డా.. బీజేపీకి తల వంచం

- 10–12 ఎంపీ సీట్లిస్తే కేసీఆర్ రాష్ట్ర రాజకీయాలను శాసిస్తారు.. ప్రధాని మోదీ, సీఎం రేవంత్‌రెడ్డి అబద్ధాలకు బ్రాండ్ అంబాసిడర్‌లు
- బీజేపీని ఎదుర్కొనే సత్తా కాంగ్రెస్‌కు లేదు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- హైదరాబాద్, హుజూరాబాద్, చెన్నూర్‌లో ప్రచారం



సాక్షి ప్రతినిధి, కరీంనగర్, సాక్షి ప్రతినిధి, మంచిర్యాల/కవాడిగూడ/వెంగళరావునగర్: తమ తలలు తెగిపడ్డా సరే బీజేపీకి తలవంచేదే లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిండెట్, మాజీ మంత్రి కేటీఆర్ చెప్పారు. ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించడంలో ప్రధాని మోదీ, సీఎం రేవంత్‌రెడ్డి పోటీపడుతూ అబద్ధాలకు అంబాసిడర్లుగా నిలిచారని ఎద్దేవాచేశారు. కేటీఆర్ శనివారం హైదరాబాద్‌లోని ముషీరాబాద్, కవాడిగూడలో, కరీంనగర్ జిల్లా హుజూరాబాద్‌లో, మంచిర్యాల జిల్లా చెన్నూర్‌లో నిర్వహించిన రోడ్‌షోల్లో, పలు కార్యక్రమాల్లో ప్రసంగించారు. దేశంలో బీజేపీ, మోదీని ఎదుర్కొనే సత్తా బీఆర్ఎస్‌కే ఉందన్నారు. దేశవ్యాప్తంగా ప్రాంతీయ పార్టీలు అధికారంలో ఉన్న పార్టీలు తప్ప కాంగ్రెస్ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో బీజేపీని మిగతా 7వ పేజీలో ▶



రివర్స్ గేర్‌లో కాంగ్రెస్ సర్కార్

- రాహుల్ గాంధీ సభలకు జనం రాలేదు
- ఉదయ్‌పూర్ డిక్లరేషన్ అభాసుపాలైంది
- కాంగ్రెస్ ఇచ్చిన గ్యారంటీలు అమలుకు నోచుకోలేదు
- ఆ పార్టీలకు విశ్వసనీయత లేదు
- రాష్ట్రంలో నిశ్శబ్ద విప్లవం రాబోతోంది
- సాక్షితో ఎమ్మెల్యే టి.హరీశ్‌రావు

- వివరాలు 4లో

క్లుప్తంగా...

తెలంగాణలో ఉచితాల సంస్కృతి ఇంకా ఉంది

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్



సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలో ప్రభుత్వం మారినా ఉచిత పథకాల సంస్కృతి ఇంకా ఉందని కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. మిగులు ఆదాయంలోఉన్న రాష్ట్రం అప్పులపాలైందని తెలిపారు. శనివారం ఢిల్లీలోని ఏపీ తెలంగాణ భవన్ ఆమె సందర్శించారు. అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం ఇక్కడి క్యాంటీన్‌లో భోజనం చేస్తున్న తెలుగు రాష్ట్రాలతోపాటు తమిళనాడుకు చెందిన కళాశాల విద్యార్థులు, యూపీఎస్సీ ఔత్సాహికులతో నిర్మల మాట్లాడారు. కేంద్ర పథకాలు, జీ–20, డిజిటల్ ఎకానమీ తదితర అంశాలపై విద్యార్థులు ఆమెను ప్రశ్నలు అడిగి తెలుసుకున్నారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కేంద్రం కట్టుబడి ఉందని నిర్మల చెప్పారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. తెలుగు రాష్ట్రాల్లో బీజేపీకి మంచి మెజారిటీ వస్తుందని, ప్రజల మద్దతు ఉంటుందని ఆశాభావం వ్యక్తంచేశారు.

కొండా విశ్వేశ్వర్‌రెడ్డిపై కాంగ్రెస్ తప్పుడు ప్రచారం

సీఈవో వికాస్‌రాజ్‌కు సంగీతారెడ్డి ఫిర్యాదు



వికాస్‌రాజ్‌కు వినతిపత్రం ఇస్తున్న సంగీతారెడ్డి

సాక్షి, హైదరాబాద్: చేవెళ్ల పార్లమెంటు బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని లక్ష్యంగా చేసుకుని కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేస్తోందని విశ్వేశ్వర్‌రెడ్డి సతీమణి సంగీతారెడ్డి ఆరోపించారు. సామాజిక మాధ్యమాల్లో కుట్రలు చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని సీఈవో వికాస్‌రాజ్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆ మె మీడియాతో మాట్లాడుతూ పోలింగ్ సమ యం దగ్గర పడుతుండటంతో కాంగ్రెస్ కుట్రలకు తెరలేపిందని మండిపడ్డారు. ఈవీఎంలో బీజేపీ గుర్తు రెండో స్థానంలో ఉందని, మరో పార్టీకి చెందిన వ్యక్తి పేరు విశ్వేశ్వర్‌రెడ్డి కావ డం, ఆయన నాలుగో స్థానంలో ఉండగా, బీజే పీ అభ్యర్థిది నాలుగో స్థానంలోని గుర్తు అటూ సామాజిక మాధ్యమాల్లో కుట్రపూరిత ప్రచారం చేస్తోందని సంగీతారెడ్డి ఆరోపించారు. చేవెళ్ల ప్రజలను అయోమయానికి గురిచేయడం ద్వారా కాంగ్రెస్ లబ్ధి పొందాలని చూస్తోందన్నారు. సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారాన్ని అడ్డుకోవాలని ఎన్నికల అధికారిని కోరామని తెలిపారు.

బీజేపీ బీసీల వ్యతిరేక పార్టీ: జాజుల

ఇండియా కూటమికి మద్దతుగా 130 బీసీ కుల సంఘాల తీర్మానం



గన్‌ఫౌండ్రీ: లోక్‌సభ ఎన్నికలు రెండు కూటముల మధ్య కాదని మండల్, కమండల్ వారసుల మధ్య జరుగుతున్న ఎన్నికలు అని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ పేర్కొన్నారు. ఎల్బీస్టేడియం ఫతే మైదాన్ క్లబ్‌లో శనివారం బీసీ కుల సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో 'సమగ్ర కులగణన – బీసీ రిజర్వేషన్ల పెంపు' అనే అంశంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బీజేపీ బీసీల వ్యతిరేక పార్టీ అని ఆరోపించారు. బీసీ కులగణన చేయని బీజేపీకి బీసీల ఓట్లు అడిగే నైతిక హక్కులేదని మండిపడ్డారు. రిజర్వేషన్లు రక్షించే వారికి, రిజర్వేషన్లు రద్దు చేసేవారికి మధ్య ఈ ఎన్నికలు జరుగుతున్నాయన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో బీసీలంతా ఇండియా కూటమికి ఓటువేసి గెలిపించాలని సూచించారు. అనంతరం ఇండియా కూటమికి మద్దతుగా 130 బీసీ కుల సంఘాలు తీర్మానం చేసి ఆమోదం తెలిపాయి. సమావేశంలో బీసీ కుల సంఘాల జేఏసీ రాష్ట్ర చైర్మన్ చిన్న శ్రీశైలం యాదవ్, ప్రొఫెసర్ బాగయ్యతో పాటు ఇతర కులసంఘాల నాయకులు పాల్గొన్నారు.



సార్! ఇక వాటితో పనిలేదు! వెళ్దాం పదండీ!!



శనివారం వికారాబాద్‌లో బీజేపీ నిర్వహించిన సభకు హాజరైన ప్రజలు, బీజేపీ శ్రేణులు

కూటమి వస్తే ప్రధాని ఎవరు?

- అలాంటి వారితో దేశం ఏం బాగుపడుతుంది?
- వికారాబాద్, వనపర్తి బీజేపీ సభల్లో అమిత్ షా ఫైర్
- మోదీ సర్జికల్ స్ట్రైక్స్‌తో ఉగ్రమూకలను మట్టుబెట్టారు
- రాహుల్, రేవంత్‌రెడ్డిలు కాకులను కూడా కాల్చలేరు!... కాంగ్రెస్ పార్టీకి తెలంగాణ ఏటీఎంలా మారింది
- ఫేక్ వీడియోలు పెట్టించిన రేవంత్ మూల్యం చెల్లించుకోక తప్పదు

వికారాబాద్/ సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: ''ఒకవేళ ఇండియా కూటమి అధికారంలోకి వస్తే ప్రధాని ఎవరవుతారో ఎవరైనా చెప్పగలరా? మమతా బెనర్జీయా, శరద్ పవారా? స్టాలినా? ఉద్ధవ్ ఠాక్రేనా? లేక రాహుల్ బాబా ప్రధాని అవుతారా? అది వారికే తెలియదు. అలాంటి వారితో దేశమేం బాగుపడుతుంది..''అని బీజేపీ అగ్రనేత, కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఎద్దేవా చేశారు. సర్జికల్ స్ట్రైక్‌తో మోదీ క్రూర ఉగ్రమూకలను మట్టుబెడితే.. ఈ రేవంత్‌రెడ్డి, రాహుల్ బాబాలు కాకులను కూడా కాల్చలేరని విమర్శించారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా వికారాబాద్, వనపర్తిలలో నిర్వహించిన బీజేపీ సభల్లో ఆయన ప్రసంగించారు. వివరాలు ఆయన మాటల్లోనే..

''కాంగ్రెస్ నాయకులు ప్రియాంక, రాహుల్ బాబాలకు మైనార్టీల ఓట్లు కావాలి.. అందుకే వారి భజన చేస్తున్నారు. అందుకే బీజేపీ వస్తే రిజర్వేషన్లు తీసేస్తారని అవాస్తవ ప్రచారం చేస్తున్నారు. నిజానికి ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ రిజర్వేషన్లపై దాడి చేసింది కాంగ్రెస్ పార్టీయే. ముస్లింలకు మతపరంగా నాలుగు శాతం రిజర్వేషన్లు ఇచ్చింది. బీజేపీని గెలిపిస్తే ఆ రిజర్వేషన్లను తీసేస్తాం. హైదరాబాద్ విమోచన దినాన్ని అధికారికంగా నిర్వహిస్తాం.

కాంగ్రెస్‌ది చైనీస్ గ్యారంటీ!

నరేంద్ర మోదీ గ్యారంటీ అంటే.. అది పూర్తి చేసే గ్యారంటీ.. కాంగ్రెస్ గ్యారంటీ అంటే చైనీస్ గ్యారంటీ. అది ఉత్త డొల్ల, పూర్తికాదు. సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణను కాంగ్రెస్ పార్టీ ఏటీఎంగా మార్చారు. కాంగ్రెస్ దళిత, ఆదివాసీ, ఓబీసీల సంపదను దోచుకుంటోంది. ఈ అవినీతిని అడ్డుకోవాల్సిన అవసరం ఉంది. తెలంగాణలో రైతులకు ఏటా రూ.15 వేలు, కౌలు రైతులకు రూ.12వేలు, మహిళలకు నెలకు రూ.2,500 ఇస్తామన్నారు. ఆ హామీలేవీ నెరవేర్చలేదు. రేవంత్‌రెడ్డి ఫేక్ వీడియోలతో తప్పుడు స్థలంలో చేయి పెట్టారు. దానికి తగిన మూల్యం చెల్లించుకోక తప్పదు. మిగులు బడ్జెట్ ఉన్న తెలంగాణను కేసీఆర్ కుటుంబం లూటీ చేసింది. కేంద్ర నిధులతోనే తెలంగాణ అభివృద్ధి జరుగుతోంది.

పీఓకేను స్వాధీనం చేసుకుంటాం

కశ్మీర్ భారత్ సొంతం. 70 ఏళ్ల కాంగ్రెస్ పాలనలో ఈ అంశాన్ని ఏనాడూ పట్టించుకోలేదు. మోదీ వచ్చిన పదేళ్ల పాలనలో జమ్మూకశ్మీర్‌ను భారత్ వశం చేశారు. ఈసారి అధికారమిస్తే పాక్ ఆక్రమిత కశ్మీర్‌ను స్వాధీనం చేసుకుంటాం. ఈసారి ఎన్నికల్లో బీజేపీ గెలుపు ఖాయం. రాహుల్‌గాంధీ కొంత కా లం కింద భారత్ జోడో యాత్ర చేశారు. మరికొద్ది నెలల్లో మాయమైపోయే కాంగ్రెస్ పార్టీని వెతికే యాత్ర చేయాలి..''అని అమిత్ షా వ్యాఖ్యానించారు.



వికారాబాద్ సభలో మాట్లాడుతున్న అమిత్ షా. చిత్రంలో విశ్వేశ్వర్‌రెడ్డి



వనపర్తి సభలో అభ్యర్థి భరత్‌తో అమిత్ షా

బీజేపీకే 'దక్షిణ'ం!

▶ మొదటి పేజీ తరువాయి

కాంగ్రెస్ ఎన్నికల ఖర్చు కోసం తెలంగాణ నుంచి వసూలు చేసి పంపిస్తున్నారు.

పీవోకే భారత్‌లో భాగమే..

ఓటు బ్యాంకు రాజకీయాల్లో భాగంగా.. పాకిస్తాన్ దగ్గర అణుబాంబు ఉందంటూ కాంగ్రెస్ నాయకుడు మణిశంకర్ అయ్యర్, కూటమి నాయకుడు ఫారూఖ్ అబ్దుల్లా చేసిన వ్యాఖ్యలు దేశ సమగ్రతను దెబ్బతీసేలా ఉన్నాయి. కశ్మీర్‌ను ఎట్టిపరిస్థితుల్లోనూ వదులుకోబోం. పీవోకే భారత్‌లో అంతర్భాగమే. రేవంత్‌రెడ్డి, ఇతర కాంగ్రెస్ నేతలు భారత్ జరిపిన సర్జికల్ స్ట్రైక్స్‌కు ఆధారాలు అడుగుతున్నారు. అలా స్ట్రైక్స్ చేసిన మూడో దేశం భారత్ మాత్రమే. దేశ సరిహద్దులు, అంతర్గత అంశాల్లో చొరబడేందుకు ఎవరు ప్రయత్నించినా చూస్తూ ఊరుకోబోం. వారి భూభాగంలోకి చొచ్చుకుని వెళ్లి మరీ దాడిచేస్తాం.

'కూటమి' దేశాన్ని విభజిస్తోంది..

దేశాన్ని ఉత్తర, దక్షిణాలుగా కాంగ్రెస్, ఇండియా కూటమి పార్టీలు విభజన చేస్తున్నాయి. ఇప్పటికే దేశాన్ని కాంగ్రెస్ ఒకసారి విడగొట్టింది. వారికి అంతకన్నా ఇంకేం రాదు. బీజేపీ ఉన్నంత వరకు విభజన జరగనివ్వం. అరవింద్ కేజ్రీవాల్ నిర్దోషి అని కోర్టు తీర్పు ఇవ్వలేదు. కేవలం ఎన్నికల ప్రచారం కోసమే సమయం ఇచ్చింది. బెయిల్ రావడమే క్లీన్ చిట్ అనుకుంటే.. అంతకన్నా అమాయకత్వం ఇంకోటి ఉండదు. కాంగ్రెస్ రాహుల్ గాంధీని 20సార్లు లాంచ్ చేసినా విజయవంతం కాలేదు. 21వసారి కూడా అదే విఫల ప్రయత్నం చేస్తోంది.

వారి తీరుతో ఆర్థికంగా వెనుకబాటు

2014లో తెలంగాణ రెవెన్యూ సర్‌ప్లస్ స్టేట్‌గా ఉంది. కానీ బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల కుటుంబ పాలన, అవినీతి, ఓటు బ్యాంకు రాజకీయాలతో రాష్ట్రం ఆర్థికంగా వెనుకబడింది. లక్షల కోట్లు అప్పుల ఊబిలో కూరుకుపోయింది. ఏటా రూ.80 వేల కోట్లు వడ్డీల కిందే కట్టాల్సిన దుస్థితి నెలకొంది. విభజనకు ముందు కేంద్రం నుంచి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు రూ.15వేల కోట్లు అందితే.. ఇవాళ ఒక్క తెలంగాణకే కేంద్రం నుంచి రూ.60వేల కోట్లు గ్రాంట్లుగా వస్తోంది. తెలంగాణలో మౌలిక వసతుల కోసం స్వాతంత్య్రం వచ్చినప్పటి నుంచి 2014 వరకు అందిన నిధులకంటే.. మోదీ సర్కారు గత పదేళ్లలో రెట్టింపు నిధులు ఇచ్చింది.

రిజర్వేషన్ల రద్దు ఉద్దేశమేదీ లేదు

బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే రిజర్వేషన్లు రద్దు చేస్తుందనే కాంగ్రెస్ ప్రచారాన్ని అవాస్తవం. గత పదేళ్లుగా ఎన్డీయేకు లోక్‌సభలో మూడింట రెండొంతుల మెజారిటీ ఉంది. మేం రిజర్వేషన్లు రద్దు చేయాలనుకుంటే ఎప్పుడో చేసేవాళ్లం. కానీ మాకు ఆ ఉద్దేశం లేదు. మేం మా మెజారిటీని ఆర్టికల్ 370, ట్రిపుల్ తలాక్ రద్దుకు, రామాలయ నిర్మాణానికి వాడాం. ఏవైనా మతపరమైన రిజర్వేషన్లు రాజ్యాంగ విరుద్ధం. ఆర్థికంగా, సామాజికంగా, విద్యపరంగా వెనుకబాటుదనం ప్రాతిపదికన రిజర్వేషన్లను ముస్లింలు, క్రిస్టియన్లు పొందవచ్చు. దానికి మేం వ్యతిరేకం కాదు. నేరుగా ముస్లింలకు రిజర్వేషన్లు ఇవ్వడానికి వ్యతిరేకం. ఈ అంశంపై నా మాటలను మార్ఫింగ్ చేసి ప్రచారం చేశారు. ప్రధానిగా మోదీ వచ్చే ఐదేళ్ల టర్మ్‌ను పూర్తిచేస్తారు. దానిపై బీజేపీలో ఎలాంటి అనుమానాల్లేవు. 2047 నాటికి దేశాన్ని అభివృద్ధి పథంలో నిలపాలని మోదీ ప్రయత్నిస్తున్నారు. హామీల్లో 92శాతం అమలు చేశాం. మూడు దశల ఎన్నికల్లో ప్రజలు బీజేపీకి మద్దతుగా నిలిచారు. నాలుగో దశలోనూ మద్దతివ్వాలని కోరుతున్నాం''అని అమిత్ షా పేర్కొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న అమిత్ షా. చిత్రంలో కిషన్‌రెడ్డి, లక్ష్మణ్, ఈటల

రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు అర్థ రహితం

తెలంగాణకు పెట్టుబడులు రాకుండా కేంద్రం కుట్రచేస్తోందన్న సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు అర్థరహితం. రాష్ట్రాన్ని వారు నడుపుతున్న తీరును చూసి ఎవరూ పెట్టుబడులకు ముందుకు రావడం లేదు. అయినా పెట్టుబడులు కావాలంటే ప్రధానిని కలసి, అడిగితే బాగుంటుంది. అనవసర విమర్శలు సరికాదు. ప్రాంతీయ పార్టీలు తమ వాణిని వినిపించే అధికారం ఉంటుంది. కేసీఆర్‌కు కూడా ఆ అధికారం ఉంది. అంతే తప్ప బీజేపీతో పోల్చుకోవాలనుకోవడం హాస్యాస్పదం. ఎండోమెంట్ చట్టం తొలగింపు అంశం కోర్టు ముందుంది. కోర్టు ఏం చెబితే అదే చేస్తాం.

మా ప్రగతి ఓవైపు.. వారి అవినీతి మరోవైపు..

ఓ వైపు ఇండియా కూటమి.. మరోవైపు ఎన్డీయే కూటమి బరిలో ఉన్నాయి. ఓవైపు రూ.12 లక్షల కోట్ల అవినీతి కూటమి.. మరో వైపు 23 ఏళ్లుగా సీఎంగా, ప్రధానిగా ఉన్న మోదీపై 25 పైసల అవినీతి కూడా లేని కూటమి. అధికార అహంకారం తలకెక్కిన ఇండియా కూటమి అటు.. సెలవు లేకుండా దీపావళిని కూడా సైనికుల మధ్య జరుపుకొనే మోదీ ఇటు.. నోట్లో బంగారు స్పూన్‌తో పుట్టి, కాస్త ఎండలు కాస్త పెరగగానే థాయ్‌లాండ్‌కో. మరో చోటికో వెళ్లే యువనేత అటు.. పేదింట్లో పుట్టి పెరిగి, పేదల కష్టాలు తెలిసి వాటిని దూరం చేస్తున్న మోదీ ఇటు.. గత పదేళ్లలో మేం దేశ అంతర్గత భద్రత, ఆర్థిక వ్యవస్థ, మౌలిక వసతుల అభివృద్ధి, డిజిటల్ ఇండియా వంటి వాటిలో గణనీయ ప్రగతి సాధించాం.

మోదీ 'ఉల్లంఘన'లపై వివరణ ఇవ్వండి

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డికి ఈసీ నోటీసులు
- వివిధ పార్టీల అధ్యక్షులకు మొత్తం 13 నోటీసులు జారీ

సాక్షి, హైదరాబాద్: లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రధాని నరేంద్ర మోదీ రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో నిర్వహించిన బహిరంగసభలు, రోడ్ షోల్లో చేసిన ప్రసంగాల్లో వివాదాస్పద వ్యాఖ్యలు చేశారని తెలంగాణ కాంగ్రెస్ పార్టీ చేసిన ఫిర్యాదులపై కేంద్ర ఎన్నికల సంఘం స్పందించింది. అయితే, ప్రధాని మోదీకి బదులుగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్ రెడ్డి నుంచి వివరణ కోరుతూ నోటీసులు జారీ చేసింది. ప్రధాని మోదీ ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన అంశంపై 48 గంటల్లోగా వివరణ ఇవ్వాలని కోరింది. గడువు పొడిగించాలని బీజేపీ కోరగా, ఈసీ మరింత సమయం ఇచ్చింది.

మోదీ ఏమన్నారంటే..: నారాయణపేట, ఎల్బీ స్టేడియంలో శుక్రవారం నిర్వహించిన ఎన్నికల ప్రచార సభల్లో ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొనగా, చిన్నపిల్లలతో ప్లకార్డులు ప్రదర్శింపజేశారని కాంగ్రెస్ ఈసీకి ఫిర్యాదు చేసింది. కాంగ్రెస్ పార్టీ హిందూ వ్యతిరేకి అని, ఆ పార్టీ భారత దేశ ఎన్నికల్లో గెలవాలని పాకిస్థాన్ కోరుకుంటోందని ప్రధాని నరేంద్ర మోదీ చేసిన ప్రసంగాలపై ఈసీకి ఫిర్యాదు చేసినట్టు టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు జి.నిరంజన్ 'సాక్షి'కి తెలిపారు. కాగా, రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికల ఎన్నికల ప్రవర్తన నియమావళి అమల్లోకి వచ్చిన నాటి నుంచి ఇప్పటి వరకు కోడ్ ఉల్లంఘన, విద్వేషకర ప్రసంగాల విషయంలో వివిధ రాజకీయ పార్టీల నుంచి వివరణ కోరుతూ మొత్తం 13 నోటీసులను జారీచేసినట్టు అధికారవర్గాలు తెలిపాయి. జాతీయ పార్టీలైతే ఆయా పార్టీల రాష్ట్ర అధ్యక్షులకు నోటీసులు జారీచేయగా, ప్రాంతీయ పార్టీలైతే వాటి అధ్యక్షులకు నేరుగా నోటీసులిచ్చారు.

జవాన్లను అవమానిస్తారా..!?

- ఫోన్ ట్యాపింగ్‌లో అడ్డంగా దొరికిన కేసీఆర్‌ను ఎందుకు అరెస్ట్ చేయలేదు
- నేను ఓడిపోతే కాషాయం జెండా పట్టను.. హిందుత్వం గురించి మాట్లాడను
- సిరిసిల్ల బైక్‌ర్యాలీ కార్యక్రమంలో బీజేపీ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్



సిరిసిల్ల గాంధీచౌక్‌లో మాట్లాడుతున్న బీజేపీ అభ్యర్థి బండి సంజయ్

సిరిసిల్ల/కరీంనగర్‌టౌన్: కరీంనగర్‌లో ముస్లిములంతా ఒక్కటై తనను ఓడించాలని కేసీఆర్ అన్నారని, 'నేను హిందువుల ఓటు బ్యాంకుతో బంపర్ మెజార్టీతో గెలుస్తానని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్ పేర్కొన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి ఓడిపోతే పార్టీ దుకాణం బంద్ చేస్తావా? మగాడివైతే, హిందువైతే నీ శరీరంలో మందు కాకుండా రక్తమే ప్రవహిస్తే నా సవాల్‌ను స్వీకరించాలని బండి సంజయ్ సవాల్ విసిరారు. దేశ రక్షణ కోసం సర్జికల్ స్ట్రయిక్స్ చేసిన జవాన్లను అవమానించిన కాంగ్రెస్‌కు ఓటెందుకు వేయాలని ప్రశ్నించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో శనివారం సాయంత్రం బీజేపీ శ్రేణులతో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిరిసిల్ల గాంధీచౌక్‌లో ఆయన మాట్లాడుతూ...సర్జికల్ స్ట్రయిక్స్‌ను సమర్థించే వారంతా పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి ఓటేయాలన్నారు. గాడిద గుడ్డు పెట్టదు..కాంగ్రెస్ 6 గ్యారంటీలు అమలూ చేయదని విమర్శించారు.

కాంగ్రెస్ వాళ్లు సర్వనాశనం చేసేస్తారు

మోదీ ప్రధాని కాకపోతే కాంగ్రెస్ వాళ్లు దేశాన్ని సర్వనాశనం చేస్తారని పేర్కొన్నారు. తెలంగాణలో బీజేపీ 12ఎంపీ సీట్లు గెలవబోతోందని సంజయ్ ధీమా వ్యక్తం చేశారు. కరీంనగర్ జిల్లాకేంద్రంలో సంజయ్‌కు మద్దతుగా 'మహా బైక్ ర్యాలీ'నిర్వహించగా, ఆయన పాల్గొని మాట్లాడారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ దేశ ద్రోహానికి పాల్పడ్డారని ఆరోపించారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో దొరికిపోతారనే భయంతో కేసీఆర్ సీఎంగా ఉన్న సమయంలో ఇంటెలిజెన్స్ వద్దనున్న దేశ భద్రత డేటాను ధ్వంసం చేశారని, అలాంటి కేసీఆర్‌ను ఎందుకు అరెస్ట్ చేయలేదని ప్రశ్నించారు. కార్యక్రమంలో బీజేపీ అధికార ప్రతినిధి రాణీరుద్రమారెడ్డి, మట్ట వెంకటేశ్వర్‌రెడ్డి, గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ తదితరులు పాల్గొన్నారు.

రేవంత్‌కు మతి భ్రమించింది

- సంచలనం కోసం ఏదేదో మాట్లాడుతున్నారు
- ఈటల రాజేందర్ విమర్శ



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఈటల

కంటోన్మెంట్ (హైదరాబాద్): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మతి భ్రమించిందని, సంచలనం కోసం ఏదిపడితే అదే మాట్లాడటం ఆయనకు అలవాటైపోయిందని బీజేపీ మల్కాజ్‌గిరి పార్లమెంట్ అభ్యర్థి ఈటల రాజేందర్ వ్యాఖ్యానించారు. బీజేపీ దేశానికి కేన్సర్‌లా పట్టుకుందన్న రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. ఎన్నికల ప్రచారం చివరి రోజైన శనివారం కంటోన్మెంట్ ఎమ్మెల్యే అభ్యర్థి వంశా తిలక్, బీజేపీ సీనియర్ నేత మల్క కొమురయ్యలతో కలిసి మహేంద్రాహిల్స్‌లో విలేకరులతో మాట్లాడుతూ...వాస్తవానికి కాంగ్రెస్ పార్టీయే దేశానికి కేన్సర్‌లా తయారైందన్నారు. గత రెండు పర్యాయాలుగా కనీసం ప్రతిపక్ష హోదా కూడా పొందలేకపోయిన కాంగ్రెస్‌కు ఈసారి కూడా అదే పరిస్థితి తప్పదని ఈటల రాజేందర్ జోస్యం చెప్పారు. పాలించే సత్తా మాకే ఉందంటూ రేవంత్‌రెడ్డి, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలను అవమానించారని విమర్శించారు. డీకే అరుణ గెలిస్తే, ఈటల ఆధ్వర్యంలో పనిచేయాల్సి వస్తుందనడంలో రేవంత్ ఉద్దేశం ఏంటని ప్రశ్నించారు.

ప్రజల మద్దతు నాకే ఉంది

కాంగ్రెస్ పార్టీ ఓటమి భయంతోనే కంటోన్మెంట్‌లో డబ్బు సంచులతో దిగిపోయిందని ఈటల ఆరోపించారు. అయినప్పటికీ మల్కాజ్‌గిరి ప్రజలు తనకే మద్దతు ఇస్తున్నారని అన్నారు. మోదీ సమర్థ పాలనతో దేశం ప్రపంచంలోనే 5వ ఆర్థిక వ్యవస్థగా ఎదిగిందన్నారు. కంటోన్మెంట్ విలీనానికి బీజేపీ సంపూర్ణ మద్దతు ఇస్తుందని ఈటల రాజేందర్ అన్నారు. అయితే కంటోన్మెంట్ విలీనానికి వ్యతిరేకంగా బీజేపీకే చెందిన కంటోన్మెంట్ బోర్డు సభ్యుడు రామకృష్ణ రాసిన లేఖ ఫేక్ లెటర్ అని కొట్టిపారేశారు.

బూత్ స్థాయిలో దృష్టి పెట్టండి..

మహబూబ్‌నగర్ బీజేపీ అభ్యర్థి డీకే అరుణకు ప్రధాని మోదీ లేఖ



సాక్షి, హైదరాబాద్: 'బీజేపీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో బయటకు వెళ్లి ఓటు వేసేలా ప్రజలను ప్రేరేపించడం చాలా ముఖ్యం. పోలింగ్ బూత్ స్థాయిలో పార్టీ గెలుపొందడంపై దృష్టి పెట్టండి. ప్రతి బూత్‌లో గెలుపొందడం, నియోజకవర్గంలో విజయానికి దారి తీస్తుంది'అని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు, మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి డీకే అరుణకు ప్రధాని మోదీ సూచించారు. తన సమయాన్ని ప్రతి క్షణం ప్రజల సంక్షేమానికి అంకితం చేస్తున్నాననే హామీని ప్రతి ఓటరుకు బీజేపీ అభ్యర్థిగా తెలియజేయాలని మోదీ కోరారు. 'ఈ ఎన్నికల్లో మీ విజయానికి నా శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను' అని అరుణకు రాసిన లేఖలో మోదీ పేర్కొన్నారు. 'నా తోటి కార్యకర్త డీకే అరుణా జీ. ఈ లేఖ మీకు మంచి కలిగిస్తుందని ఆశిస్తున్నాను. 35 ఏళ్లకు పైగా ప్రజాసేవలో చురుగ్గా నిమగ్నమై, తెలంగాణ ప్రజలకు మీరు కుటుంబ సభ్యురాలిగా, ఆదరించే వ్యక్తిగా అయ్యారు. బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలిగా, మీరు పార్టీని బలోపేతం చేయడంలో ముఖ్యంగా తెలంగాణలో గణనీయమైన కృషి చేశారు. మన పార్టీలోని ప్రతి కార్యకర్త సంక్షేమానికి భరోసా ఇచ్చారు. రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో మహబూబ్‌నగర్ ప్రజలు మిమ్మల్ని తమ ప్రతినిధిగా ఆశీర్వదిస్తారని నేను నమ్ముతున్నాను'అని ఆ లేఖలో తెలిపారు.

నవనీత్‌కౌర్‌పై సైదాబాద్‌లో కేసు నమోదు

15 సెకన్ల సమయమిస్తే చాలు అన్న నవనీత్ కౌర్ వ్యాఖ్యలపై పోలీసులకు ఫిర్యాదు



సైదాబాద్: మాకు 15 సెకన్లు చాలు... మీరెక్కడుంటారు... అంటూ ఒవైసీ సోదరులను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలపై మహరాష్ట్ర బీజేపీ ఎంపీ (ప్రస్తుత అమ్రావతి బీజేపీ అభ్యర్థి) నవనీత్ కౌర్‌పై ఎన్నికల అధికారులు సైదాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దాంతో సైదాబాద్ పోలీసులు ఆమెపై కేసు నమోదు చేశారు. ఈనెల 8న ఐఎస్‌సదన్ డివిజన్ లక్ష్మీనగర్ గార్డెన్స్‌లో నిర్వహించిన బీజేపీ యువమోర్చా సమ్మేళనంలో నవనీత్ కౌర్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. గతంలో అక్బరుద్దీన్ తమకు పోలీసులు 15 నిముషాలు సమయమిస్తే చాలు అంటూ చేసిన వ్యాఖ్యలనుద్దేశించి... నవనీత్‌కౌర్ అదే మాకు 15 సెకన్లు టైమిస్తే చోటేభాయ్, బడేభాయ్ ఎక్కడుంటారని వ్యాఖ్యానించారు. ఈ సమావేశాన్ని సిబ్బందితో కలిసి పరిశీలిస్తున్న యాకత్‌పురా సెగ్మెంట్ ఫ్లైయింగ్ స్క్వాడ్ అధికారి సీహెచ్.రాకేశ్‌కుమార్ ఆమె వ్యాఖ్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లగా...శుక్రవారం ఈ విషయమై సైదాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నవనీత్ కౌర్ రెండు వర్గాలను రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేశారని, అంతేకాకుండా ఎన్నికల్లో ఓటర్లను ప్రభావితం చేసేలా ఆమె వ్యాఖ్యలు ఉన్నాయని వారు ఫిర్యాదులో పేర్కొన్నారు.

కేసీఆర్ కంటే సీఎం రేవంత్ డేంజర్

▶ మొదటి పేజీ తరువాయి

చేయకుండానే, అన్నీ చేసినట్టుగా ఫ్లెక్సీలతో అబద్ధాల ప్రచారం చేసేందుకు కాంగ్రెస్ పార్టీకి సిగ్గులేదా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ అంటేనే కరప్షన్ పార్టీ. కాంగ్రెస్‌కు మారుపేరే అవినీతి అని దుయ్యబట్టారు. ఎన్నికలు దగ్గరపడుతున్న కొద్దీ రేవంత్‌లో అభద్రతాభావం, అసహనం పెరిగి అబద్ధాలు, వక్రీకరణలతో బీజేపీపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. పచ్చకామెర్ల రోగి మాదిరిగా సీఎం వ్యవహారశైలి ఉందని కిషన్ దుయ్యబట్టారు. పుల్వామా దాడులకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన సర్జికల్ స్ట్రయిక్స్, ఎయిర్ స్ట్రయిక్స్ విషయంలో వాస్తవాలేంటని సీఎం రేవంత్ రెడ్డి ప్రశ్నించడాన్ని ఆయన తప్పుబట్టారు. నీతి, నిజా యితీతో ధర్మబద్ధంగా దేశం కోసం బీజేపీ పోరాటాలు చేసిందనీ, అందుకే ప్రజలు అండగా ఉండి ఈ ఎన్నికల్లో బీజేపీకి అత్యధిక స్థానాలను ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

అవన్నీ కేంద్రం చేస్తున్నవే కదా?

'మోదీ ప్రభుత్వం అమలు చేస్తున్నవే మళ్లీ మీ హామీలుగా చెబుతారా?' అని సీఎం రేవంత్‌రెడ్డికి రాసిన లేఖలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ప్రశ్నించారు. గత పదేళ్లలో మోదీ ప్రభుత్వం దాదాపు రూ.9 లక్షల కోట్ల సహకారం అందించిన విషయం తెలిసి కూడా కాంగ్రెస్ ప్రకటనల్లో తెలంగాణకు ఏం చేయలేదంటూ ఎలా పేర్కొంటారని నిలదీశారు. కాంగ్రెస్ ఇస్తున్న హామీల్లో కేంద్రం ఇప్పటికే చాలా హామీలను అమలు చేసిందని కిషన్‌రెడ్డి వివరించారు. కేంద్ర ప్రభుత్వం పంచాయతీరాజ్ వ్యవస్థకు నేరుగా నిధులు ఇస్తున్న విషయాన్ని మరిచిపోయి... 73, 74వ రాజ్యాంగ సవరణ ద్వారా పంచాయతీలకు నేరుగా కేంద్ర ప్రభుత్వ నిధుల మంజూరు చేస్తామని హామీ ఇచ్చిందని పేర్కొన్నారు. అలాగే, గత బడ్జెట్‌లో ప్రకటించిన పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజనను పేరు మార్చి కొత్త వాగ్దానంగా కాంగ్రెస్ మేనిఫెస్టోలో పెట్టిందని ఆయన ఆ లేఖలో పేర్కొన్నారు. దక్షిణ భారత సాంస్కృతిక కేంద్రం, ఘంటసాల ఆడిటోరియం, సైన్స్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్ వంటివి హైదరాబాద్ నగరాన్ని కల్చరల్, ఎంటర్‌టైన్‌మెంట్ హబ్‌గా మారుస్తున్నాయని వివరించారు. అయితే కాంగ్రెస్ ప్రకటించిన ఇంటర్నేషనల్ కల్చరల్, ఎంటర్‌టైన్‌మెంట్ హబ్‌తో కొత్తగా కలిగే ప్రయోజనం ఏముందని కిషన్ ప్రశ్నించారు.

బ్యారేజీల ప్లానింగ్ ఏంటి.. డిజైన్లేంటి?

- కాళేశ్వరంపై విచారణ కమిషన్ చైర్మన్ జస్టిస్ పినాకి చంద్రఘోష్ ప్రశ్నలు
- తుమ్మిడిహెట్టి నుంచి మేడిగడ్డకు ఎందుకు మార్చారు?
- బ్యారేజీ పూర్తయ్యాక తొలి వరదలకే దెబ్బతింటే రిపేర్లు ఎందుకు చేయలేదు?
- లిఖిత పూర్వకంగా నివేదిక ఇవ్వాలని మాజీ ఈఎన్సీ నల్లా వెంకటేశ్వర్లుకు ఆదేశం
- కమిషన్ విచారణ కోసం స్వతంత్ర నిపుణుల కమిటీ ఏర్పాటు చేయాలని సర్కారుకు విజ్ఞప్తి



సాక్షి, హైదరాబాద్: ''కాళేశ్వరం ప్రాజెక్టులో బ్యారేజీలు ఏ విధంగా కట్టారు? ప్లానింగ్ ఏమిటి? డిజైన్లు ఎవరు తయారు చేశారు? మోడల్ స్టడీస్ చేశారా? డిజైన్లకు తగ్గట్టే నిర్మాణం జరిగిందా? తుమ్మిడిహెట్టి నుంచి మేడిగడ్డకు ఎందుకు మార్చారు? అక్కడ అదనంగా నీటి లభ్యత ఉందని ఎలా నిర్ధారించారు? బ్యారేజీలు ఆ ప్రాంతాల్లోనే కట్టాలని చెప్పిందెవరు? నిపుణుల నివేదిక ఉందా?'' అని కాళేశ్వరం ప్రాజెక్టుపై ఏర్పాటైన విచారణ కమిషన్ చైర్మన్ జస్టిస్ పినాకి చంద్రఘోష్ ప్రశ్నల వర్షం కురిపించారు. శనివారం ఆయన బీఆర్‌కేఆర్ భవన్‌లోని తమ కార్యాలయానికి నీటిపారుదల శాఖ రామగుండం మాజీ ఈఎన్సీ నల్లా వెంకటేశ్వర్లును పిలిపించి ప్రశ్నించారు. మేడిగడ్డ వద్ద నీటి లభ్యతను నిర్ధారించే హైడ్రాలజీ నివేదికలు అందించాలని కోరారు. ఇక ''నీటి లభ్యతపై కేంద్ర జల వనరుల సంఘం (సీడబ్ల్యూసీ) చెప్పిందేంటి? మీరు చేసిందేంటి? 2019లో బ్యారేజీలు పూర్తికాగా.. అదే ఏడాది వచ్చిన తొలి వరదలకే వాటికి నష్టం జరిగితే ఎందుకు మరమ్మతులు జరపలేదు?'' అని ప్రశ్నించినట్టు తెలిసింది.

లిఖిత పూర్వకంగా ఇవ్వాలని ఆదేశం

నిర్మాణం పూర్తికాక ముందే బ్యారేజీలు పూర్తయినట్టు సర్టిఫికెట్లు ఎందుకు ఇచ్చారని.. డిఫెక్ట్ లయబిలిటీ గడువు పూర్తికాకుండానే సెక్యూరిటీ డిపాజిట్లను ఎందుకు కాంట్రాక్టర్‌కు విడుదల చేశారని విచారణ కమిషన్ చైర్మన్ ప్రశ్నించారు. ''డిఫెక్ట్ లయబిలిటీ కాలంలోనే బ్యారేజీలకు నష్టాలు జరిగినా కాంట్రాక్టర్లతో మరమ్మతులు ఎందుకు చేయించలేదు? బ్యారేజీల వైఫల్యానికి కారణం నిర్మాణ లోపాలా? డిజైన్లలో లోపాలా? నిర్వహణ, పర్యవేక్షణ లోపాలా? ప్రమాణాల మేరకు.. వానాకాలానికి ముందు, తర్వాత బ్యారేజీల స్థితిగతులను పరిశీలించారా?'' అని నిలదీసినట్టు తెలిసింది. వీటన్నింటిపై అంశాల వారీగా నల్లా వెంకటేశ్వర్లు సమాధానాలు ఇవ్వగా.. వివరాలన్నీ లిఖితపూర్వకంగా సమర్పించాలని జస్టిస్ చంద్రఘోష్ ఆదేశించినట్టు సమాచారం.

విచారణ కోసం స్వతంత్ర కమిటీ

కాళేశ్వరం బ్యారేజీల నిర్మాణ, నిర్వహణ లోపాలు, కారణాలను వెలికితీయడంతోపాటు బాధ్యులను గుర్తించడంలో విచారణ కమిషన్‌కు సహకారం అందించడానికి వీలుగా నిపుణులతో స్వతంత్ర కమిటీ ఏర్పాటు చేయాలని జస్టిస్ పినాకి చంద్రఘోష్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. నీటి పారుదల శాఖతోగానీ, ఏ రాజకీయ పార్టీ లేదా ఏ సంఘంతోగానీ సంబంధం లేని నిపుణులను కమిటీలో నియమించాలని సూచించారు. కాగా.. చంద్రఘోష్ రాష్ట్ర పర్యటన ముగించుకుని ఆదివారం కోల్‌కతాకు వెళ్లనున్నారు. కాళేశ్వరం బ్యారేజీలపై కమిషన్ ఫిర్యాదుల స్వీకరణ ఈనెల 31వ తేదీతో ముగియనుంది.



మోదీ నుంచి నడ్డా వరకు

- దూకుడుగా బీజేపీ ప్రచార పర్వం
- అగ్రనేతల పర్యటనలతో జోష్...

సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో బీజేపీ హైవోల్టేజీ ప్రచారం ముగిసింది. ప్రధాని నరేంద్రమోదీ మొదలు కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాతో సహా పలువురు కేంద్రమంత్రులు, బీజేపీ పాలిత రాష్ట్రాల సీఎంల పర్యటనలతో ప్రచారపర్వాన్ని దూకుడుగా పూర్తి చేసింది. బహిరంగసభలు, వివిధ సామాజికవర్గాల వారీగా సమావేశాలు, స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌లు, ఇంటింటికి బీజేపీ వంటి కార్యక్రమాలతో హోరెత్తించింది.

ముఖ్యంగా మోదీ, అమిత్‌షా, నడ్డా వంటి అగ్రనేతలు. రాష్ట్రంలోని 17 లోక్‌సభ నియోజకవర్గాలను ఒక ప్రణాళికాబద్ధంగా చుట్టివచ్చేలా ఎన్నికల ప్రచార కార్యక్రమాల రూపకల్పన ఆ పార్టీకి కలిసొచ్చిందనే చెప్పాలి. పార్టీ కచ్చితంగా గెలిచే అవకాశమున్న సీట్లు, ఇంకా కొంచెం కష్టపడితే గెలవగలిగే స్థానాలు, పోటీలో ఉన్న స్థానాలు...ఇలా వర్గీకరించుకుని తప్పకుండా విజయం సాధిస్తామనే చోట్ల అధిక దృష్టిని కేంద్రీకరించారు. ఇందుకు అనుగుణంగానే.. ప్రచారం ప్రారంభించిన నాటి నుంచి ప్రచార గడువు ముగిసే వరకు బీజేపీ నేతలు ఉధృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రచార పర్వం పూర్తయ్యే ముందురోజు అంటే...శుక్రవారం సాయంత్రం ఎల్‌బీ స్టేడియంలో ఐదు ఎంపీ సీట్ల పరిధిలో నిర్వహించిన బహిరంగసభలో మోదీ ప్రసంగించారు. అదేరోజు మహబూబ్‌నగర్ లోక్‌సభ స్థానంలో ఎన్నికల ప్రచారంలోనూ ఆయన పాల్గొన్నారు. ఇక ప్రచారం ముగిసిన శనివారం చేవేళ్ల ఎంపీ సీటు పరిధిలోని వికారాబాద్‌లో, నాగర్‌కర్నూల్‌లోని వనపర్తిలో నిర్వహించిన సభల్లో అమిత్‌షా పాల్గొన్నారు.

ప్రచారంలో దూకుడుగానే

ప్రధానపార్టీల కంటే ముందుగా అభ్యర్థుల ప్రకటనతో పాటు ఎన్నికల షెడ్యూల్, నోటిఫికేషన్ వెలువడేలోగానే తొలివిడత ఎన్నికల ప్రచారం పూర్తి చేసిన బీజేపీ.. మొత్తంగా రాష్ట్రంలో ప్రచార విషయంలో మాత్రం బీజేపీ'అడ్వాంటేజ్ పొజిషన్'లోకి ప్రవేశించిందనే చెప్పాలి. పదేళ్లపాటు కేంద్రంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు, తెలంగాణకు వివిధ రూపాల్లో రూ.10 లక్షల కోట్ల వరకు నిధుల కేటాయింపు వెరసి మోదీ సర్కార్ సాధించిన విజయాలను ప్రధానంగా ప్రస్తావిస్తూ ప్రచారాన్ని ఉరకలెత్తేలా చేసింది. అయితే సీఎం రేవంత్‌రెడ్డి సహా కాంగ్రెస్ నేతలు ఆరోపించిన రిజర్వేషన్ల రద్దు అంశం, మళ్లీ బీజేపీ వస్తే హైదరాబాద్‌ను యూనియన్ టెరిటరీ చేస్తారన్న బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ల ప్రచారాన్ని తిప్పికొట్టేందుకు బీజేపీ నేతలు సర్వశక్తులూ ఒడ్డాల్సి వచ్చింది. ఈ రెండు విషయాలపై ఏకంగా మోదీ, అమిత్‌షా సహా రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు కిషన్‌రెడ్డి కూడా ప్రధానంగా ఫోకస్ చేయాల్సి వచ్చిందనే చెప్పాలి.



అమెరికాలో ఖమ్మం యువకుడు మృతి

- తాజాగా ఎంఎస్ పూర్తి.. విహారయాత్రకు వెళ్లగా విషాదం
- కొడుకు పట్టా స్వీకరణకు వెళ్లి అక్కడే ఉన్న తల్లిదండ్రులు



తల్లిదండ్రులతో రాకేష్ (ఫైల్)

ఖమ్మం సహకారనగర్: బీటెక్ పూర్తిచేశాక బహుళజాతి కంపెనీలో ఉద్యోగం వచ్చినా కాదనుకున్న యువకుడు ఎంఎస్ చేసేందుకు అమెరికా వెళ్లాడు. ఇటీవలే కోర్సు పూర్తికాగా, కుమారుడు పట్టా స్వీకరించడాన్ని కళ్లారా చూసేందుకు తల్లి దండ్రులూ అమెరికా వెళ్లారు. పట్టా స్వీకరించిన సంతోషంలో స్నేహితులతో కలిసి విహారయాత్ర కు వెళ్లిన ఆ యువకుడు అక్కడి జలపాతంలో మునిగి మృతి చెందగా.. కొడుకు మృతదేహంతో స్వస్థలానికి వెళ్లాలని తెలిసిన ఆ తల్లిదండ్రుల రోదనకు అంతు లేకుండా పోయింది. ఈ విషాద ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. ఖమ్మంలోని మాంటిస్సోరి పాఠశాలల డైరెక్టర్ లక్కిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి ఏకైక కుమారుడు రాకేశ్ (24) రెండేళ్ల క్రితం బీటెక్ పూర్తిచేయగా అమెజాన్‌లో ఉద్యోగం వచ్చింది. అయినా ఎంఎస్ చదవాలనే లక్ష్యంతో అమెరికా వెళ్లాడు. అక్కడ అరిజోనా యూనివర్సిటీ నుంచి ఎంఎస్ పూర్తిచేసిన ఆయన వారం క్రితం పట్టా స్వీకరించారు.

కుమారుడు పట్టా స్వీకరించడాన్ని కళ్లారా చూసేందుకు చంద్రశేఖర్‌రెడ్డి దంపతులు అమెరికా వెళ్లి ప్రస్తుతం అక్కడే ఉన్నారు. అయితే, ఎంఎస్ విజయవంతంగా పూర్తి చేసిన సందర్భంగా అమెరికాలోని ప్రసిద్ధ ఫాసిల్ క్రీక్ జలపాతం వద్దకు రాకేశ్, ఆయన స్నేహితులు ఈనెల 8వ తేదీన వెళ్లారు. జలపాతం వద్ద సరదాగా గడుపుతుండగా రాకేశ్‌తో పాటు మరో యువకుడు ప్రమాదవశాత్తు జారి నీటిలో మునిగిపోయారు. గాలింపు చర్యలు చేపట్టగా మరుసటిరోజు 25 అడుగుల లోతులో మృతదేహాలు లభించాయి. రాకేశ్‌తో పాటు మృతి చెందిన మరో యువకుడి వివరాలు తెలియాల్సి ఉంది.

మెట్రోను ముంచేసిన 'మహాలక్ష్మి'

- ఉచిత బస్సు ప్రయాణంతో నష్టాలు
- 2026 నాటికి వైదొలుగుతాం
- ఎల్ అండ్ టీ మెట్రో డైరెక్టర్ శంకర్ రామన్ వెల్లడి



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వం మహిళల కోసం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఆర్టీసీ ఉచిత బస్సు ప్రయాణం మహాలక్ష్మి పథకం వల్ల తీవ్రంగా నష్టపోతున్నామని ఎల్ అండ్ టీ అధ్యక్షుడు, శాశ్వత డైరెక్టర్ ఆర్.శంకర్ రామన్ తెలిపారు. ప్రస్తుతం హైదరాబాద్ లో రోజు సుమారు 4.80 లక్షల మంది మెట్రో ప్రయాణికులు ఉన్న ట్లు పేర్కొన్నారు. మహాలక్ష్మి పథకాన్ని ప్రవేశపెట్టిన తరువాత మహిళా ప్రయాణికులు బాగా తగ్గారని వివరించారు. ప్రయాణికులు పెరగకపోవడం వల్ల వరుసగా నష్టాలను ఎదుర్కొంటున్నట్లు ఆయన ఒక ఆంగ్ల మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో స్పష్టం చేశారు. నష్టాల వల్ల 2026 నాటికి హైదరాబాద్ మెట్రో నుంచి వైదొలగాలని భావిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. పబ్లిక్ ప్రైవేట్ భాగస్వామ్య (పీపీపీ) పద్ధతిలో ఎల్ అండ్ టీ హైదరాబాద్ మెట్రో రైల్ మొదటి దశ ప్రాజెక్ట్ ను నిర్మించడం తెలిసిందే. ఈ మేరకు ఆ సంస్థకు 64 ఏళ్ల పాటు మెట్రోలో భాగస్వామ్యం ఉంటుంది. అయినప్పటికీ మహాలక్ష్మి పథకం వల్ల వస్తున్న నష్టాలను అధిగమించేందుకు మెట్రో నుంచి తప్పుకోవాలని భావించడం తాజాగా చర్చనీయాంశంగా మారింది.

భారీగా గోవా మద్యం పట్టివేత




పట్టుబడిన మద్యాన్ని చూపుతున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు

రూ.2 కోట్లకు పైగా విలువ

బాలానగర్ (మహబూబ్‌నగర్): గోవా నుంచి అక్రమంగా రాజమహేంద్రవరానికి లారీలో తరలిస్తున్న మద్యాన్ని శనివారం తెల్లవారు జామున పోలీసులు పట్టుకున్నారు. డీఎస్పీ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాలివి. గోవా నుంచి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం రాజమహేంద్రవరానికి అనుమతుల్లేకుండా తరలిస్తున్న రూ.2,07, 36,000 విలువైన 2వేల కార్టన్ల మద్యాన్ని బాలానగర్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న మద్యాన్ని ఎక్సైజ్ శాఖకు అప్పగించి, లారీ యాజమాని, డ్రైవర్ కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరచనున్నారు. అడ్డాకుల పోలీసులు ఇచ్చిన పక్కా సమాచారంతో రెక్కీ నిర్వహించిన పోలీసులు లారీ డ్రైవర్‌ను విచారించగా మద్యం ఉన్నట్లు అంగీకరించాడు. బాలానగర్ మండల కేంద్రంలోని ముఖ్య కూడలి వద్ద లారీలోని 2 వేల మద్యం కార్టన్లను కవర్ కప్పి.. ఎలాంటి అనుమానం రాకుండా కంపోస్టు ఎరువుల బస్తాల్లో నింపి తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. మద్యం పట్టుకున్న ఎస్‌ఐ తిరుపాజీతో పాటు పోలీసు సిబ్బందికి త్వరలోనే ప్రశంసాపత్రాలతోపాటు ప్రత్యేక రివార్డులు అందజేయనున్నట్లు డీఎస్పీ వెంకటేశ్వర్లు తెలిపారు. దాడుల్లో జడ్చర్ల రూరల్ సీఐ నాగార్జునగౌడ్, ఎస్‌ఐ రవి, ఇతర సిబ్బంది ఉన్నారు.

'మల్కాజిగిరిలో గెలుపు నాదే '

ఉప్పల్: కాంగ్రెస్, బీజేపీలు ఎన్ని ఎత్తులు వేసినా మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గంలో విజయం మాత్రం తనదేనని బీఆర్‌ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి ధీమా వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ అధికారంలో లేకపోయినా ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని, ఎక్కడికి వెళ్లినా స్వాగతిస్తున్నారని అన్నారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. తనను పార్లమెంట్‌కు పంపితే జీవితాంతం సేవకుడిగా పనిచేస్తానాన్నరు





వాజ్‌పేయిని ఒప్పించి రోడ్లేశా!

హైదరాబాద్‌ను నేనే అభివృద్ధి చేశా: చంద్రబాబు

బొమ్మలసత్రం/సాక్షి, చిత్తూరు: హైదరాబాద్ అభివృద్ధికి తానే కారణమని.. అందువల్లే ఐటీ కంపెనీలు డబ్బు సంపాదిస్తున్నాయని టీడీపీ అధినేత చంద్రబాబు తెలిపారు. ప్రధాని వాజ్‌పేయిని ఒప్పించి అద్దంలాంటి రహదారులు వేయించానన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా చంద్రబాబు శనివారం నంద్యాల, చిత్తూరుల్లో బహిరంగ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ్ముళ్లు సెల్‌ఫోన్ వాడుతున్నారంటే దానికి కారణం తానేనన్నారు. తెలుగు తమ్ముళ్లు నష్టపోతారని అమరావతిని రాజధానిగా ప్లాన్ చేశానన్నారు. హైదరాబాద్ కంటే అమరావతిని బెస్ట్ సిటీగా మార్చాలని భావించానని తెలిపారు. అధికారంలోకి వచ్చిన తర్వాత అమరావతిని రాజధానిగా అభివృద్ధి చేస్తామని చెప్పారు. ఆడవాళ్లు ఉద్యోగాలకెళ్తే మగవాళ్లు వంట చేసే రోజులు వస్తాయన్నారు. పోలవరం 72 శాతం పూర్తి చేసి.. ఆ నీటిని బనకచర్లకు అనుసంధానం చేయాలని చూశానన్నారు. తన చివరి శ్వాస ఉన్నంతవరకు పేదవాళ్ల అభివృద్ధి కోసమే పనిచేస్తానని తెలిపారు. రూ.16 లక్షల కోట్లు పెట్టుబడులు రాష్ట్రానికి తీసుకొచ్చానన్నారు. 10 లక్షల మందికి ఉద్యోగాలు ఇచ్చి రెండింతలు అభివృద్ధి చేశానని వెల్లడించారు. కోవిడ్ సమయంలో కూడా వర్చువల్ సమావేశాలు పెట్టి ప్రజల కోసం పనిచేశానన్నారు.

చంద్రబాబు రోడ్‌షో అట్టర్‌ఫ్లాప్

నంద్యాలలో చంద్రబాబు ప్రజాగళం సభ అట్టర్‌ఫ్లాప్ అయ్యింది. ఆయన మాట్లాడుతున్నప్పుడే కార్యకర్తలు వెనుదిరిగారు. మంచినీటి సౌకర్యం కూడా ఏర్పాటు చేయకపోవడంతో కార్యకర్తలు దాహంతో అల్లాడిపోయారు.





రివర్స్ గేర్‌లో కాంగ్రెస్ సర్కార్

- రాహుల్ గాంధీ సభలకు జనం రాలేదు
- ఉదయ్‌పూర్ డిక్లరేషన్ అభాసుపాలైంది
- కాంగ్రెస్ ఇచ్చిన గ్యారంటీలు అమలుకు నోచుకోలేదు
- బీజేపీ, కాంగ్రెస్ విశ్వసనీయత కోల్పోయాయి

'సాక్షి'తో ఎమ్మెల్యే హరీశ్‌రావు



(గజవెల్లి షణ్ముఖరాజు)

కాంగ్రెస్ ఆరు గ్యారంటీలు అమలు చేయకపోవడం.. బీజేపీ పదేళ్లలో ఏమీ చేయకపోవడంతో ఆ పార్టీలు ప్రజల్లో విశ్వసనీయతను కోల్పోయాయని బీఆర్‌ఎస్ సీనియర్ నేత, ఎమ్మెల్యే టి.హరీశ్‌రావు చెప్పారు. కాంగ్రెస్‌పై ఓటర్లకు విరక్తి కలిగిందని, ఉదయ్‌పూర్ డిక్లరేషన్ అభాసుపాలైందని, రాష్ట్రంలో మంత్రులు అహంకారంతో మాట్లాడుతున్నారన్నారు. రాష్ట్రంలో నిశ్శబ్ద విప్లవం రాబోతోందని, అనూహ్య ఫలితాలు రానున్నాయని చెప్పారు. ఎన్నికల ప్రచారం ముగింపు సందర్భంగా హరీశ్‌రావు శనివారం సాక్షితో ముచ్చటించారు. వివరాలు ఆయన మాటల్లోనే..

రాహుల్ అవగాహన లేకుండా మాట్లాడుతున్నారు

అసెంబ్లీ ఎన్నికల్లో హామీలుగా ఇచ్చిన ఆరు గ్యారంటీలనే ఇప్పటివరకు పూర్తి స్థాయిలో అమలు చేయలేదు. అలాంటిది పార్లమెంట్ ఎన్నికల్లో కొత్త గ్యారంటీలంటూ అబద్ధపు మాటలతో ప్రజల ముందుకొస్తున్నారు. ఈ గ్యారంటీలను ప్రజలు నమ్మేపరిస్థితిలో లేరు. రాష్ట్రంలో ఏం జరుగుతుందనే అవగాహన లేకుండా సీఎం రేవంత్‌రెడ్డి ఏది రాసిస్తే దాన్ని రాహుల్‌గాంధీ చదువుతున్నాడు. కాంగ్రెస్ ప్రభుత్వం రివర్స్ గేర్‌లో నడుస్తోంది. రాహుల్ గాంధీ ఉదయ్‌పూర్‌లో చేసిన డిక్లరేషన్ అమలు చేయకపోవడంతో నాయకులు, కార్యకర్తల్లో విశ్వసనీయతను కోల్పోయారు. ప్యారాచూట్ నేతలకు టికెట్లు ఇవ్వమని చెబుతూ వచ్చి చివరకు వారికే ఎక్కువగా టికెట్ ఇచ్చి పార్టీని నమ్ముకున్నవారిని నట్టేట ముంచారు.

సర్కారు నుంచి వేధింపులు

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీపై ప్రజలకు విరక్తి కలిగింది. హైదరాబాద్‌లో రాహుల్ గాంధీ సభనే దీనికి నిదర్శనం. జనాలు రాకపోతే సుమారు 45 నిమిషాలపాటు రాహుల్ బస్సులోనే ఉండిపోయారు. సభ ప్రాంగణంలోకి వెళ్లండంటూ స్వయంగా రేవంత్‌రెడ్డి గేట్ దగ్గరుండి కోరినా.. ప్రజలు లోపలికి పోని పరిస్థితి ఉంది. కాంగ్రెస్ మంత్రులు అహంకారంతో మాట్లాడుతున్నారు. గాలిలో ఉన్న కాంగ్రెస్‌ను భూమి మీదకు దించాలంటే ఆ పార్టీ నేతలను ఓడించాలి. నిరుద్యోగులు, ఉద్యోగులను ప్రభుత్వం మోసం చేసింది. వ్యాపారులతోపాటు అన్ని వర్గాల వారికి ప్రభుత్వం నుంచి వేధింపులు మొదలయ్యాయి. అక్రమ కేసులు పెట్టి గౌడన్నలను జైలు పాలు చేశారు, చంచల్‌గూడ జైలులో ఇప్పుడు సగం మంది వారే ఉన్నారు.

బీజేపీ ఒరగబెట్టింది ఏమీలేదు

పదేళ్లలో బీజేపీ తెలంగాణకు ఒరగబెట్టింది ఏమీలేదు, అందుకే దేవుని పేరుతో ఎన్నికల్లోకి వస్తున్నారు. అయోధ్యలో రామాలయాన్ని ట్రస్ట్ నిర్మించింది. ఆలయ నిర్మాణానికి చాలామంది ప్రజలు ఇచ్చారు... నేను కూడా విరాళం ఇచ్చా. అయితే, ఆ గుడిని తాము కట్టించామని బీజేపీ చెప్పుకుంటోంది. విదేశాల నుంచి నల్లధనాన్ని తెచ్చి పేదల ఖాతాల్లో రూ.15 లక్షలు జమ చేస్తామన్న హామీని బీజేపీ ప్రభుత్వం చేయలేదు. ఏటా 2 కోట్ల ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పి ప్రజలను మోసం చేసింది. బీజేపీకి చెందిన నలుగురు ఎంపీలు రాష్ట్రానికి చేసింది గుండు సున్నా. బీజేపీ ప్రభుత్వం బీడీ కార్మికులకు పెన్షన్‌ను దూరం చేసింది. బీడీ కట్టలకు జీఎస్టీ పెట్టడంతో కార్మికులు ఇబ్బంది పడుతున్నారు.

తులం బంగారం తుస్సు

పేదింటి ఆడ బిడ్డల పెళ్లికి ప్రభుత్వం నుంచి కల్యాణలక్ష్మి కింద ఇస్తామని చెప్పిన రూ.లక్ష చెక్ బౌన్స్ అయింది. తులం బంగారం హామీ కూడా తుస్సుమంది. వడ్లకు తరుగు తీస్తున్నారని స్వయంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఒప్పుకున్నారు. వడ్లకు తరుగు తీస్తున్న కాంగ్రెస్‌కు రైతులు ఓట్లలో తరుగు పెట్టాలి. రాష్ట్రంలో అప్పులు చూపించి.. దివాళా తీసిందని ప్రభుత్వం చెబుతుండటంతో పెట్టుబడులు రాకుండా పోతున్నాయి. సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటివరకు నా సవాల్‌ను స్వీకరించలేదు. ఆగస్టు 15లోపు ఆరు గ్యారంటీలు, రూ 2లక్షల రుణ మాఫీ అమలు చేస్తే నేను రాజీనామా చేస్తానని చెప్పినా సీఎం ఇప్పటివరకు స్పందించలేదు. సవాల్‌ను స్వీకరించకపోతే బేషరతుగా క్షమాపణ చెప్పాలి. కాంగ్రెస్ బీజేపీలు బోగస్ సర్వేలు విడుదల చేస్తున్నాయి. సోషల్ మీడియాలో ఫేక్ ప్రచారాలు చేస్తున్నాయి. యువత వాటిని నమ్మొద్దు.

పోలింగ్‌కు భద్రత కట్టుదిట్టం

- బందోబస్తు విధుల్లో రాష్ట్ర పోలీస్ నుంచి 73,914 మంది
- 164 కంపెనీల కేంద్ర సాయుధ పోలీసు బలగాలు, 7 వేల మంది హోంగార్డులు
- డీజీపీ రవిగుప్తా వెల్లడి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా 17 లోకసభ నియోజకవర్గాలలో సోమవారం జరగనున్న ఎన్నికలను స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా నిర్వహించే లక్ష్యంతో విస్తృత పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్టు డీజీపీ రవిగుప్తా తెలిపారు. ఎన్నికల ప్రక్రియకు ఎలాంటి అంతరాయం కలిగించినా సహించేది లేదని డీజీపీ హెచ్చరించారు. ఎన్నికల బందోబస్తు విధుల్లో 73,414 మంది సివిల్ పోలీసులు, 500 మంది తెలంగాణ రాష్ట్ర స్పెషల్ విభాగాల పోలీసులు, 164 కంపెనీల కేంద్ర సాయుధ పోలీసు బలగాలను వినియోగిస్తున్నట్టు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. అదేవిధంగా తమిళనాడుకు చెందిన మూడు స్పెషల్ ఆర్మ్‌డ్ కంపెనీలు, ఏడువేల మంది ఇతర రాష్ట్రాలకు చెందిన హోంగార్డులను వినియోగిస్తున్నామని డీజీపీ పేర్కొన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లో భాగంగా 482 ఫిక్స్‌డ్ స్టాటిక్ టీమ్‌లు (ఎఫ్ఎస్‌టీ), 462 స్టాటిక్ సర్వైలెన్స్ టీమ్‌లు (ఎస్ఎస్‌టీ), 173 అంతర్ జిల్లా చెక్‌పోస్టులు, 89 అంతర్రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద తనిఖీలు చేస్తున్నట్టు తెలిపారు. ఎన్నికల కోడ్ ప్రకటించిన మార్చి 16 నుంచి శనివారం వరకు సోదాల్లో రూ. 186.14 కోట్ల విలువైన మద్యం, మాదక ద్రవ్యాలు, ఇతర విలువైన వస్తువులను జప్తు చేసినట్టు డీజీపీ వెల్లడించారు. అదేవిధంగా తెలంగాణ ఎక్సైజ్ చట్టం, మాదకద్రవ్యాల చట్టం, ఐపీసీ చట్టాల కింద నేరాలకు సంబంధించి మొత్తం 8,863 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసినట్టు డీజీపీ వివరించారు. రౌడీలను, గతంలో ఎన్నికల సమయంలో నేరాలకు పాల్పడ్డవారిని కలిపి మొత్తం 34,526 మందిని బైండోవర్ చేశామని తెలిపారు. డీజీపీ కార్యాలయంలో సెంట్రల్ కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశామని, ఆదివారం ఉదయం 7 గంటల నుంచి ఈ కంట్రోల్ రూం కార్యకలాపాలు ప్రారంభిస్తుందని డీజీపీ తెలిపారు. చివరి ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్ స్ట్రాంగ్ రూంకు సురక్షితంగా చేర్చే వరకు ఈ కంట్రోల్‌రూం ద్వారా ప్రతిక్షణం పర్యవేక్షిస్తామని డీజీపీ తెలిపారు.

మార్చి 16 నుంచి శనివారం వరకు రాష్ట్రవ్యాప్తంగా సోదాల్లో పట్టివేతలు ఇలా..

- నగదు: రూ.93,94,43,358
- మద్యం: రూ.10,07,49,567 విలువైంది
- నార్కోటిక్స్ డ్రగ్స్: రూ.7,86,32,020 విలువైంది
- బంగారం: 91.822 కేజీలు
- వెండి: 166.037 కేజీలు రూ.62,77,77,480 విలువైంది
- ఇతర వస్తువులు: రూ.11,48,88,459 విలువైనవి

ఆదర్శ పోలింగ్ కేంద్రాలు సిద్ధం



నల్లగొండ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోని కోదాడలో సిద్ధమైన యువ ఆదర్శ పోలింగ్ కేంద్రం


కోదాడ రూరల్: ఓటర్లను ఆకర్షించేందుకు అధికారులు ఆదర్శ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. యువ ఆదర్శ పోలింగ్ కేంద్రం, మహిళా ఆదర్శ పోలింగ్ కేంద్రం, దివ్యాంగుల కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. ఈ పోలింగ్ కేంద్రాలను అధికారులు ప్రత్యేకంగా అలంకరించారు.

ఓటేద్దాం.. రండి

ఓటరు గుర్తింపు కార్డు తప్పనిసరి కాదు

ప్రత్యామ్నాయ ఫొటో గుర్తింపు కార్డులుంటే ఓటేయవచ్చు

ఎపిక్ కార్డులో స్వల్ప తేడాలున్నా పర్వాలేదు	ఎపిక్‌తో గుర్తింపు ధ్రువీకరణ కాకుంటే.. ప్రత్యామ్నాయ గుర్తింపు తప్పనిసరి	ఓటరు ఇన్‌ఫర్మేషన్ స్లిప్పను గుర్తింపుగా పరిగణించరు	స్పష్టం చేస్తున్న ఈసీ మార్గదర్శకాలు



సాక్షి, హైదరాబాద్: ఓటరు గుర్తింపు కార్డు (ఎపిక్) లోని వివరాల్లో స్వల్ప తేడాలున్నా, ఓటరు గుర్తింపు నిర్ధారణైతే చాలని, ఓటు హక్కు కల్పించాలని కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశించింది. వేరే నియోజకవర్గానికి సంబంధించిన ఎలక్టరోల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్(ఈఆర్వో) జారీ చేసిన ఓటరు గుర్తింపు కార్డును గుర్తింపునకు ఆధారంగా చూపి, మరో నియోజకవర్గం పరిధిలోని పోలింగ్ కేంద్రంలో ఉన్న ఓటు హక్కును వినియోగించుకోవచ్చని స్పష్టం చేసింది. అయితే, ఆ పోలింగ్ కేంద్రం ఓటర్ల జాబితాలో పేరు ఉంటేనే ఈ సదుపాయం కల్పిస్తామని పేర్కొంది. ఓటరు గుర్తింపు నిర్ధారణకు ఇటీవల కొత్త మార్గదర్శకాలను జారీ చేసింది.

మీ ఓటును వేరే వాళ్లు వేసేశారా? అయితే.. టెండర్ ఓటేయవచ్చు!

ఎన్నికల్లో ఓటేసేందుకు పోలింగ్ కేంద్రానికి వెళ్లేసరికి మీ ఓటు వేరేవాళ్లు వేసేశారా? అయితే దిగులుపడాల్సిన అవసరం లేదు. మీకు టెండర్ ఓటు వేసే హక్కును ఎన్నికల సంఘం కల్పించింది. ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్(ఈవీఎం) ద్వారా కాకుండా పేపర్ బ్యాలెట్ ద్వారా ఓటేసే అవకాశం కల్పిస్తారు. టెండర్ బ్యాలెట్ ఓటర్ల వివరాలను ప్రిసైడింగ్ అధికారులు ఫారం-17బీలో రికార్డు చేస్తారు. ఈ ఫారంలోని 5వ కాలమ్‌లో ఓటరు సంతకం/వేలి ముద్ర తీసుకున్న తర్వాత వారికి బ్యాలెట్ పత్రాన్ని అందజేస్తారు. ప్రత్యేక ఓటింగ్ కంపార్ట్‌మెంట్‌లోకి ఓటరు బ్యాలెట్ పత్రాన్ని తీసుకెళ్లి తాము ఓటేయదల్చిన అభ్యర్థికి చెందిన ఎన్నికల గుర్తుపై స్వస్తిక్ ముద్రను వేయాల్సి ఉంటుంది. ఓటెవరికి వేశారో బయటికి కనబడని విధంగా బ్యాలెట్ పత్రాన్ని మడిచి కంపార్ట్‌మెంట్ బయటకి వచ్చి ప్రిసైడింగ్ అధికారికి అందజేయాలి. ఆ బ్యాలెట్ పత్రాన్ని టెండర్ ఓటుగా ప్రిసైడింగ్ అధికారి మార్క్ చేసి ప్రత్యేక ఎన్వలప్‌లో వేరుగా ఉంచుతారు.

చాలెంజ్ ఓటు అంటే?

ఓటేసేందుకు వచ్చిన వ్యక్తి గుర్తింపును అభ్యర్థుల పోలింగ్ ఏజెంట్లు రూ.2 చెల్లించి సవాలు చేయవచ్చు. ఓటరు గుర్తింపును నిర్ధారించడానికి ప్రిసైడింగ్ అధికారి విచారణ జరుపుతారు. ఓటరు గుర్తింపు నిర్ధారణ జరిగితే ఓటేసేందుకు అవకాశం కల్పిస్తారు. దొంగ ఓటరు అని నిర్ధారణ అయితే సదురు వ్యక్తిని ప్రిసైడింగ్ అధికారి పోలీసులకు అప్పగించి రాతపూర్వకంగా ఫిర్యాదు చేయాల్సి ఉంటుంది.

ఎపిక్‌లో లోపాలుంటే వేరే గుర్తింపు తప్పనిసరి..

ఓటరు గుర్తింపు కార్డులో ఫొటోలు తారుమారు కావడం, ఇతర లోపాలతో ఓటరు గుర్తింపు ధ్రువీకరణ సాధ్యం కానప్పుడు, కేంద్ర ఎన్నికల సంఘం నిర్దేశించిన జాబితాలోని ప్రత్యామ్నాయ ఫొటో గుర్తింపు పత్రాల్లో(కింద జాబితాలో చూడవచ్చు) ఏదైనా ఒకదానిని ఆధారంగా చూపాల్సి ఉంటుందని ఈసీ స్పష్టం చేసింది. ప్రవాస భారత ఓటర్లు తమ పాస్‌పోర్టును తప్పనిసరిగా చూపాల్సి ఉంటుందని తెలిపింది. అయితే పోలింగ్ ఇన్‌ఫర్మేషన్ స్లిప్పులు.. ఓటరు గుర్తింపుగా పరిగణించలేమని స్పష్టం చేసింది. ఓటరు గుర్తింపు కార్డు లేనిపక్షంలో.. ఉన్నా గుర్తింపు ధ్రువీకరణ సాధ్యం కానిపక్షంలో పోలింగ్ రోజు ఈ కింది జాబితాలోని ప్రత్యామ్నాయ ఫొటో ధ్రువీకరణ పత్రాలను తీసుకువస్తే ఓటు హక్కు కల్పించాలని ఆదేశించింది.

- ఆధార్ కార్డు
- ఉపాధి హామీ జాబ్‌కార్డు, బ్యాంకు/తపాల కార్యాలయం జారీ చేసిన ఫొటోతో కూడిన పాస్‌బుక్,
- కేంద్ర కార్మికశాఖ పథకం కింద జారీ చేసిన ఆరోగ్య బీమా స్మార్ట్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, పాన్‌కార్డు
- రిజిస్ట్రార్ జనరల్ అండ్ సెన్సెస్ కమిషనర్, ఇండియా(ఆర్జీఐ), నేషనల్ పాపులేషన్ రిజిస్టర్ (ఎన్పీఆర్) కింద జారీ చేసిన స్మార్ట్ కార్డు
- భారతీయ పాస్‌పోర్టు
- ఫొటో గల పెన్షన్ పత్రాలు
- కేంద్ర/రాష్ట్ర ప్రభుత్వాలు/పీఎస్‌యూలు/ పబ్లిక్ లిమిటెడ్ కంపెనీలు జారీ చేసిన ఉద్యోగ గుర్తింపు కార్డులు
- ఎంపీలు/ఎమ్మెల్యేలు/ఎమ్మెల్సీలకు జారీ చేసిన అధికారిక గుర్తింపు కార్డులు
- కేంద్ర సామాజిక న్యాయ, సాధికారత మంత్రిత్వ శాఖ జారీ చేసిన యూనిక్ డిజెబిలిటీ గుర్తింపు కార్డు(యూడీఐడీ)

ఓటర్ హెల్ప్ లైన్ యాప్‌తో ఎన్నో సదుపాయాలు..

ఓటర్స్ హెల్ప్ లైన్ యాప్ ద్వారా ఓటర్లకు ఎన్నో సదుపాయాలు అందుబాటులోకి వచ్చాయి. ఓటర్ల నమోదుకు దరఖాస్తు చేసుకోవడం, ఓటర్ల జాబితాలో పేరు వెతకడం, పోలింగ్ కేంద్రం వివరాలు తెలుసుకోవడం, బీఎల్‌ఓ/ఈఆర్వోతో అనుసంధానం కావడం, ఈ-ఎపిక్ కార్డును డౌన్‌లోడ్ చేసుకోవడం వంటి సేవలను పొందవచ్చు.

పోలింగ్ సమయం ముగిసినా లైన్లో ఉంటే ఓటేయవచ్చు

రాష్ట్రంలోని 13 వామపక్ష ప్రభావిత ప్రాంతాల్లోని నియోజకవర్గాల్లో ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరగనుంది. మిగిలిన 106 పోలింగ్ కేంద్రాల్లో ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ నిర్వహించనున్నారు. పోలింగ్ సమయం ముగిసిన తర్వాత కూడా పోలింగ్ కేంద్రం ముందు లైనులో నిలబడిన వారికి ఓటేసేందుకు అవకాశం కల్పించనున్నారు. పోలింగ్ సమయం ముగిసిన వెంటనే లైనులో ఉన్న వారికి పోలింగ్ అధికారులు టోకెన్లు ఇస్తారు.

పోలింగ్ కేంద్రంలో సెల్‌ఫోన్లపై నిషేధం!

పోలింగ్ కేంద్రంలో మొబైల్ ఫోన్లు, కార్డ్ లెస్ ఫోన్లు, వైర్ లెస్ సెట్లతో ప్రవేశంపై నిషేధం ఉంది. పోలింగ్ కేంద్రానికి చుట్టూ 100 మీటర్ల పరిసరాల పరిధిలోకి ఇలాంటి పరికరాలు తీసుకెళ్లకూడదు. పోలింగ్ బూత్‌లో ఓటు వేస్తూ సెల్ఫీలు తీసుకోవడానికి సైతం వీలు లేదు. కేవలం ఎన్నికల పరిశీలకులు, సూక్ష్మ పరిశీలకులు, ప్రిసైడింగ్ అధికారులు, భద్రత అధికారులు మాత్రమే ఎన్నికల కేంద్రంలో మొబైల్ ఫోన్స్ తీసుకెళ్లవచ్చు. అయితే వాటిని సైలెంట్ మోడ్‌లో ఉంచాల్సిందే.

జాబితాలో పేరు ఉందా? లేదా? ఎలా తెలుసుకోవాలి?

- ఎన్నికల సంఘం వెబ్‌సైట్ https://electoralsearch.eci. gov.in కి లాగిన్ కావాలి.
- మీ వివరాలు/ ఓటరు గుర్తింపు కార్డు(ఎపిక్)/ మొబైల్ నంబర్ ఆధారంగా జాబితాలో పేరును సెర్చ్ చేయడానికి ఈ పోర్టల్ అవకాశం కల్పిస్తోంది. మొబైల్ ఫోన్ నంబర్, ఎపిక్ కార్డు నంబర్ ఆధారంగా జాబితాలో పేరు సెర్చ్ చేయడం చాలా సులువు. గతంలో ఆన్‌లైన్ ద్వారా రిజిస్టర్ చేసుకున్న వారు మాత్రమే మొబైల్ ఫోన్ నంబర్ ఆధారంగా పేరును సెర్చ్ చేసేందుకు వీలుంటుంది. ఓటరు పేరు, తండ్రి పేరు/ వయస్సు ఇతర వివరాలను కీ వర్డ్స్‌గా వినియోగించి సెర్చ్ చేసినప్పుడు అక్షరాల్లో స్వల్ప తేడాలున్నా జాబితాలో పేరు కనిపించదు.
- ఓటర్ హెల్ప్ లైన్ 1950కి కాల్ చేసి తెలుసుకోవచ్చు.(మీ ఏరియా ఎస్టీడీ కోడ్ ముందు యాడ్ చేయాలి).
- 1950 నంబర్‌కి మీ ఎపిక్ నంబర్‌ను ఎస్ఎంఎస్ చేసి తెలుసుకోవచ్చు. (ఎస్ఎంఎస్ ఫార్మాట్: 'ECI ఎపిక్ నంబర్'. ఈసీఐ, ఎపిక్ నంబర్ మధ్య స్పేస్ ఉండాలి).

పోలింగ్ కేంద్రం ఎక్కడ ఉందో..ఎలా తెలుసుకోవాలి?

రాష్ట్రంలోని ఓటర్లందరికీ ఎన్నికల సంఘం ఫొటో ఓటర్ ఇన్‌ఫర్మేషన్ స్లిప్పులను జారీ చేసింది. ఈ ఓటర్ స్లిప్పుల వెనకభాగంలో తొలిసారిగా పోలింగ్ కేంద్రం రూటు మ్యాప్‌ను పొందుపరిచింది. ఈ రూట్ మ్యాప్‌తో సులువుగా పోలింగ్ కేంద్రానికి చేరుకోవచ్చు.

అనుచితంగా ప్రవర్తిస్తే పోలింగ్ బూత్ నుంచి గెంటివేతే

పోలింగ్ సమయంలో పోలింగ్ కేంద్రంలో అనుచితంగా ప్రవర్తించిన లేదా చట్టపర ఆజ్ఞలను పాటించడంలో విఫలమైన వ్యక్తులను ప్రిసైడింగ్ అధికారి బయటకు పంపించవచ్చని కేంద్ర ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. ప్రజాప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 132 కింద ఈ మేరకు అధికారాలు ప్రిసైడింగ్ అధికారికి ఉన్నాయని పేర్కొంది. మద్యం సేవించి పోలింగ్ కేంద్రానికి వచ్చే వ్యక్తుల ఓటు హక్కును నిరాకరించడం సాధ్యం కాదని అధికారులు అంటున్నారు. మద్యం లేదా మాదక ద్రవ్యాల మత్తులో విచక్షణ కోల్పోయి పోలింగ్ కేంద్రంలో ఓటింగ్ ప్రక్రియకు ఆటంకం కలిగించే వ్యక్తులను మాత్రం పోలీసుల సాయంతో బయటకు పంపించేందుకు నిబంధనలు అనుమతిస్తాయని అధికారవర్గాలు పేర్కొన్నాయి.

ఓటరు జాబితాలో పేరు తొలగించినా ఓటేయవచ్చు..

అన్ని పోలింగ్ కేంద్రాల వారీగా ప్రత్యేకంగా అబ్సెంటీ, షిఫ్టెడ్, డెడ్(ఏఎస్డీ) ఓటర్ల జాబితాను రూపొందించి సంబంధిత పోలింగ్ కేంద్రం ప్రిసైడింగ్ అధికారికి అందజేస్తారు. ఓటేసేందుకు పోలింగ్ కేంద్రానికి వచ్చే వ్యక్తి పేరు ఓటరు జాబితాలో లేకుంటే, ఆ వ్యక్తి పేరును ఏఎస్డీ ఓటర్ల జాబితాలో వెతకాల్సి ఉంటుంది. ఏఎస్డీ ఓటర్ల జాబితాలో ఆ వ్యక్తి పేరుంటే ఓటరు గుర్తింపు కార్డు/ లేదా ఇతర గుర్తింపు కార్డుల ఆధారంగా ఆ వ్యక్తి గుర్తింపును ప్రిసైడింగ్ అధికారి ముందుగా నిర్ధారించుకుంటారు. అనంతరం ఈ వ్యక్తి పేరును ఫారం 17ఏలో నమోదు చేసి సంతకంతో పాటు వేలిముద్ర సైతం తీసుకుంటారు. ఈ క్రమంలో తొలి పోలింగ్ అధికారి సదరు ఏఎస్డీ ఓటరు పేరును పోలింగ్ ఏజెంట్లకు గట్టిగా వినిపిస్తారు. సదరు ఓటరు నుంచి నిర్దిష్ట ఫార్మాట్‌లో డిక్లరేషన్ సైతం తీసుకోవడంతో పాటు ఫొటో, వీడియో సైతం తీసుకుంటారు. అనంతరం ఆ వ్యక్తికి ఓటు వేసే అవకాశం కల్పిస్తారు.

13న వేతనంతో కూడిన సెలవు

సెలవు ఇవ్వకుంటే కఠిన చర్యలకు ఈసీ ఆదేశం

రాష్ట్రంలోని 17లోక్‌సభ స్థానాలతో పాటు కంటోన్మెంట్ అసెంబ్లీ స్థానానికి ఈ నెల 13న పోలింగ్ జరగనుండడంతో రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, విద్యా సంస్థల ఉద్యోగులకు వేతనంతో కూడిన సెలవును రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. నెగోషియబుల్ ఇన్‌స్ట్రుమెంట్ యాక్ట్ 1881 కింద ఈ మేరకు సెలవు ప్రకటిస్తూ మార్చి 19న రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేశారు. తెలంగాణ ఫ్యాక్టరీస్ అండ్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్-1974 కింద ఫ్యాక్టరీలు, షాపులు, ఇండస్ట్రియల్ అండర్ టేకింగ్స్, ఎస్టాబ్లిష్‌మెంట్స్‌లలో పనిచేస్తున్న ఉద్యోగులకు పోలింగ్ రోజు వేతనంతో కూడిన సెలవు ప్రకటిస్తూ మార్చి 22న రాష్ట్ర కార్మిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాణికుముదిని ఉత్తర్వులు జారీ చేశారు. ప్రైవేటు సంస్థలు తమ ఉద్యోగులకు సెలవు ఇవ్వని పక్షంలో కార్మిక, ఎన్నికల చట్టాల కింద కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించినట్టు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి(సీఈఓ) వికాస్‌రాజ్ శనివారం మీడియాకు వెల్లడించారు.

ఓటు వేయండి.. మీ వాణి వినిపించండి

ఓటర్లకు డీజీపీ రవిగుప్తా, ఏసీబీ డీజీ సీవీ ఆనంద్ విజ్ఞప్తి





సాక్షి, హైదరాబాద్: ఓటు హక్కును ఓటర్లంతా వినియోగించుకోవాలని తెలంగాణ పోలీస్ శాఖ తరఫున డీజీపీ రవిగుప్తా విజ్ఞప్తి చేశారు. 'ఓటు వేయండి, మీ వాణి వినిపించండి' అని పేర్కొంటూ డీజీపీ ట్విట్టర్ అకౌంట్లో ఓ పోస్ట్ పెట్టారు. ఓటు వేయాలని, ఓటు ప్రాధాన్యత అందరికీ చెప్పాలంటూ ఏసీబీ డీజీ సీవీ ఆనంద్ తన ట్విట్టర్ ఖాతాలో పోస్టు చేశారు. ఓటు ప్రాధాన్యత వివరించేలా ఆంగ్ల అక్షరమాలలోని ప్రతి అక్షరాన్ని వినియోగిస్తూ ఓ సుదీర్ఘ పోస్ట్ పెట్టారు. అదేవిధంగా 'ఓటు..దేశ పౌరుడి అస్తిత్వానికి ప్రతీక, దేశ స్థితిగతులను మార్చే శక్తి ఓటుకు ఉంది. అత్యంత శక్తివంతమైన ఆయుధమైన నీ ఓటు హక్కును మర్చిపోవద్దు' అని తెలంగాణ అవినీతి నిరోధక శాఖ ట్విట్టర్ ఖాతాలో పోస్ట్ చేశారు.

తెలంగాణలో 3.32 కోట్ల మంది ఓటర్లు

- అత్యధికంగా మల్కాజ్‌గిరి లోక్‌సభ నియోజకవర్గంలో 37,79,596 మంది ఓటర్లు
- నాలుగో విడత లోక్‌సభ స్థానాల ఓటర్ల గణాంకాలు విడుదల చేసిన ఈసీ



సాక్షి, న్యూఢిల్లీ: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా నాలుగో విడతలో తెలంగాణలోని 17 లోక్‌సభ నియోజకవర్గాల్లో మొత్తం 3,32,16,348 మంది ఓటర్లు సోమవారం తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. అత్యధికంగా మల్కాజ్‌గిరి లోక్‌సభ నియోజకవర్గంలో 37,79,596 మంది ఓటర్లు ఉన్నారు. ఈ మేరకు కేంద్ర ఎన్నికల సంఘం శనివారం నాలుగో విడతలో ఎన్నికలు జరగనున్న 10 రాష్ట్రాల్లోని 96 లోక్‌సభ నియోజకవర్గాల్లో ఉన్న ఓటర్ల గణాంకాలను విడుదల చేసింది.

తెలంగాణలో ఓటర్ల సంఖ్య

నియోజకవర్గం	ఓటర్లు
ఆదిలాబాద్	16,50,175
భువనగిరి	18,08,585
చేవెళ్ల	29,38,370
హైదరాబాద్	22,17,094
కరీంనగర్	17,97,150
ఖమ్మం	16,31,039
మహబూబాబాద్	15,32,366
మహబూబ్‌నగర్	16,82,470
మల్కాజ్‌గిరి	37,79,596
మెదక్	18,28,210
నాగర్‌కర్నూల్	17,38,254
నల్లగొండ	17,25,465
నిజామాబాద్	17,04,867
పెద్దపల్లి	15,96,430
సికింద్రాబాద్	21,20,401
వరంగల్	18,24,466
జహీరాబాద్	16,41,410

సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో
నీట్-పీజీ మాక్ టెస్ట్!

సాక్షి, హైదరాబాద్: జనరల్ మెడిసిన్, రేడియాలజీ, పీడియాట్రిక్స్, డెర్మటాలజీ, జనరల్ సర్జరీ, గైనకాలజీ, ఆర్థోపెడిక్స్, ఆప్తాల్మాలజీ, సైకియాట్రీ, అనస్థీషియాలజీ మొదలైన స్పెషలైజేషన్లలో వారి భవిష్యత్ కెరీర్‌లకు పునాది వేయడానికి ఔత్సాహిక వైద్యులకు నీట్-పీజీ చాలా కీలకమైన పరీక్ష. పీజీ మెడికల్ స్టడీస్ ప్రాముఖ్యతను గుర్తిస్తూ, సాక్షి మీడియా గ్రూప్ జూన్ 16, 2024న.. విద్యార్థులకు చేయూతనిచ్చే లా నిపుణుల ఆధ్వర్యంలో నీట్-పీజీ మాక్ పరీక్షను నిర్వహిస్తోంది. పరీక్షకు కొద్ది రోజుల ముందు వాస్తవ పరీక్షలాంటి వాతావరణంలో జరిగే సాక్షి మాక్ టెస్టులు రాయడం ద్వారా విద్యార్థులు తమ ప్రిపరేషన్ స్థాయిని అంచనా వేసుకుని, మరింత మెరుగుపరచుకోవచ్చు. ఈ మాక్ టెస్ట్ క్లినికల్ నాలెడ్జ్, ఎగ్జామ్-టేకింగ్ స్ట్రాటజీలను పదును పెట్టడంలో సహాయపడటమే కాకుండా, నిజమైన నీట్-పీజీలో రాణించడానికి అభ్యర్థుల సన్నద్ధతను నిర్ధారిస్తుంది. ఈ మాక్ పరీక్షకు 'మై ర్యాంక్' టెక్నాలజీ పార్టనర్‌గా వ్యవహరిస్తోంది. ఆసక్తి గల అభ్యర్థులు రూ. 500 రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించి https://www.arenaone.in/mock/neetpg ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. లాగిన్ హాల్ టికెట్ నెంబర్, పాస్‌వర్డ్ పరీక్షకు రెండు రోజుల ముందు అభ్యర్థి రిజిస్టర్ చేసుకున్న ఈ-మెయిల్ ఐడీ/ఫోన్ నెంబర్‌కు మెసేజ్ వస్తుంది. మాక్ పరీక్ష ఆన్‌లైన్‌లో https://sakshimocktest.myrank.co.inలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఎప్పుడైనా లాగిన్ అయి రాసుకోవచ్చు. పరీక్ష సమయం మూడు గంటల 30 నిముషాలు. అలాగే పరీక్ష ముగిసిన వెంటనే మీ స్కోర్‌ను కూడా చూసుకోవచ్చు. పూర్తి వివరాలకు సంప్రదించాల్సిన నెంబర్లు: 99126 71555, 96660 13544, 96665 72244

క్రాప్‌లోన్ కట్టాల్సిందే..!

- ప్రభుత్వం రుణమాఫీ చేస్తానని చెప్పినా.. రైతుల నుంచి ముక్కుపిండి వసూలు చేస్తున్న బ్యాంకులు
- అప్పులు కట్టాలని అన్నదాతలను వేధిస్తున్న అధికారులు
- ఇబ్రహీంపట్నంలో ఒక మహిళా రైతు నుంచి లక్ష రూపాయలు వసూలు
- వేధింపులు తట్టుకోలేక ప్రైవేట్ అప్పులు చేసి చెల్లిస్తున్న వైనం
- చోద్యం చూస్తున్న వ్యవసాయశాఖ యంత్రాంగం



- రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నానికి చెందిన సీహెచ్ సరస్వతి గతేడాది లక్ష రూపాయల పంట రుణం తీసుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని ప్రకటించడంతో దానికోసం ఎదురుచూస్తున్నారు. కానీ బ్యాంకర్లు మాత్రం ఆమెకు ప్రతీ రోజూ ఫోన్ చేసి అప్పు చెల్లించాల్సిందేనని, ప్రభుత్వ రుణమాఫీతో తమకు సంబంధం లేదని వేధిస్తున్నారు. అంతేగాక నోటీసులు ఇచ్చారు. దీంతో శుక్రవారం మధ్యాహ్నం ఆమె స్థానిక బ్యాంక్ ఆఫ్ బరోడాకు వెళ్లి వడ్డీతో కలిపి రూ.1.10 లక్షలు చెల్లించారు.

- అతని పేరు లక్ష్మయ్య (పేరు మార్చాం)... ఖమ్మం జిల్లాకు చెందిన ఈ రైతు గత మార్చి నెలలో రూ. 95 వేల పంట రుణం తీసుకున్నారు. బ్యాంకుల నుంచి వస్తున్న ఒత్తిడితో తీసుకున్న అప్పుతో కలిపి మొత్తం రూ.1.05 లక్షలు చెల్లించాడు. ప్రభుత్వం రుణమాఫీ చేస్తుందని, అప్పటివరకు ఆగాలని వేడుకున్నా బ్యాంకులు కనికరించలేదని వాపోయాడు.

సాక్షి, హైదరాబాద్: వచ్చే ఆగస్టు 15వ తేదీ నాటికి రుణమాఫీ చేస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చినా, బ్యాంకులు మాత్రం రైతుల నుంచి అప్పులు వసూలు చేస్తూనే ఉన్నాయి. నోటీసులు ఇవ్వడంతో పాటు అధికారులు రోజూ ఫోన్లు చేస్తూ చికాకు పెడుతున్నారు. ఎన్నికల సమయంలోనూ వారి వేధింపులు ఆగడం లేదనడానికి సరస్వతి చెప్పిన సంఘటనే ఉదాహరణ. అంతేకాకుండా ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన రైతుభరోసా సొమ్మును కూడా అప్పు కింద జమ చేసుకున్నారు. ఖరీఫ్ సీజన్ జూన్ నుంచే ప్రారంభం అవుతుందని, కొత్త రుణాలు కావాలంటే పాత అప్పు చెల్లించాలని, అప్పుడే కొత్త పంట రుణం ఇస్తామని చెబుతున్నాయి. మరోవైపు సహకార బ్యాంకులు కూడా రైతుల అప్పులను ముక్కుపిండి వసూలు చేస్తూనే ఉన్నాయి. వారు తాకట్టు పెట్టిన భూములను వేలం వేసేందుకు ఇప్పటికే అనేకమందికి నోటీసులు కూడా ఇచ్చాయి.

భరోసా ఇవ్వని యంత్రాంగం...

అధికారంలోకి వస్తే రైతులకు రూ. 2 లక్షల రుణమాఫీ చేస్తామని కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రకటించిన సంగతి తెలిసిందే. ఆగస్టు 15వ తేదీ నాటికి రుణమాఫీ పూర్తి చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. అయితే రూ. 2 లక్షల వరకు రుణం మాఫీ చేయాలంటే రూ. 30 వేల కోట్లు అవసరమవుతాయని ప్రభుత్వం అంచనా వేసింది. ఎన్నికల కోడ్ కారణంగా ఇప్పటికిప్పుడు రుణమాఫీ మార్గదర్శకాలు కానీ, అందుకు సంబంధించిన ప్రక్రియ కానీ మొదలు పెట్టడం సాధ్యం కాదని వ్యవసాయశాఖ అధికారులు అంటున్నారు. అంటే జూన్ 4వ తేదీ వరకు కోడ్ అమలులో ఉన్నందున అప్పటివరకు రుణమాఫీపై ముందుకు సాగలేమని అంటున్నారు. అయితే అప్పటివరకు రైతులు బ్యాంకుల్లో కొత్త పంటరుణాలు తీసుకోవాలి. కానీ పాతవి ఉండటంతో కొత్త రుణాలు ఇచ్చే పరిస్థితి లేదు. బ్యాంకులు చెప్పిన ప్రకారమే పాత అప్పులు చెల్లించాలని, అంతకు మించి తాము ఏమీ చేయలేమని వ్యవసాయశాఖ అధికారులు అంటున్నారు. ప్రభుత్వం రుణమాఫీ విడుదల చేశాక బ్యాంకులకు రైతులు చెల్లించిన సొమ్ము అడ్జెస్ట్ చేస్తామని అధికారులు చెబుతున్నారు. దీంతో రైతులు మండి పడుతున్నారు.

పింఛన్.. పదవీ విరమణ పొందినవారి హక్కు: హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: ఉద్యోగులు పదవీ విరమణ పొందిన తర్వాత ఇచ్చే పింఛన్.. దయాదాక్షిణ్యాలతో ఇచ్చేది కాదని, అది వారి హక్కు అని తెలంగాణ హైకోర్టు స్పష్టం చేసింది. రాష్ట్ర విభజన తరువాత పదవీ విరమణ చేసిన తెలుగు అకాడమీ ఉద్యోగులకు పింఛన్‌తోపాటు పదవీ విరమణ ప్రయోజనాలను అందించాల్సిందేనని తేల్చిచెప్పింది. తెలుగు అకాడమీ విభజన 2022, మే 1న జరిగింది. అయితే పదవీ విరమణ చేసిన తమకు పూర్తిస్థాయి పింఛన్ ఇవ్వలేదని తెలంగాణ, ఏపీ రాష్ట్రాలకు చెందిన 15 మంది హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. వీరిలో 11 మందిని తెలంగాణకు, నలుగురిని ఏపీకి కేటాయించారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ సుజయ్‌పాల్, జస్టిస్ ఎస్.తుకారాంజీ ధర్మాసనం తీర్పు వెలువరించింది. ఇరు రాష్ట్రాలకు కేటాయించిన ఉద్యోగుల సర్వీసు రికార్డులను పరిశీలించాలని, అనంతరం 2 వారాల్లో వారికి చెల్లించాల్సిన పింఛన్‌ను లెక్కించాలని చెప్పింది. ఇప్పటివరకు చెల్లించిన మొత్తాన్ని తీసేసి, మిగిలినదాన్ని 6 శాతం వడ్డీతో మరో 2 వారాల్లో చెల్లించాలని స్పష్టం చేసింది. దీనిపై నివేదిక అందజేయాలని ఆదేశిస్తూ, తదుపరి విచారణను జూన్ 27వ తేదీకి వాయిదా వేసింది.



సాధారణం కంటే తక్కువగా గరిష్ట ఉష్ణోగ్రతలు

- నేడు, రేపు అక్కడక్కడా తేలికపాటి వానలు

రాష్ట్రంలోని ప్రధాన కేంద్రాల్లో నమోదైన గరిష్ట ఉష్ణోగ్రతలు (సెల్సియస్‌లలో)

కేంద్రం	గరిష్టం	కేంద్రం	గరిష్టం
నిజామాబాద్	42.4	మెదక్	39.4
ఆదిలాబాద్	41.3	భద్రాచలం	39.2
రామగుండం	41.0	హనుమకొండ	38.0
ఖమ్మం	40.0	హైదరాబాద్	36.8
మహబూబ్‌నగర్	39.5	దుండిగల్	36.5
నల్లగొండ	39.5	హకీంపేట్	36.5

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో శనివారం ఉష్ణోగ్రతలు సాధారణం కంటే తక్కువగా నమోదయ్యాయి. చాలాచోట్ల గరిష్ఠ ఉష్ణోగ్రత 2 నుంచి 4 డిగ్రీల సెల్సియస్ తక్కువగా నమోదైంది. శనివారం రాష్ట్రంలోని ప్రధాన నగరాల్లో నమోదైన గరిష్ఠ ఉష్ణోగ్రతలు పరిశీలిస్తే... నిజామాబాద్‌లో 42.4 డిగ్రీల సెల్సియస్, కనిష్ఠ ఉష్ణోగ్రత మెదక్‌లో 24 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది. ఆది, సోమవారాల్లో రాష్ట్రంలో అక్కడక్కడా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని, జీహెచ్ఎంసీ పరిధితో పాటు సమీప జిల్లాల్లో ఒకట్రెండు చోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు నమోదయ్యే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. మంగళవారం నుంచి రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతాయని సూచించింది.

నేడు ఏపీలో భారీ వర్షాలు!

- రేపటి నుంచి నాలుగు రోజులు విస్తారంగా వానలు
- గంటకు 40 నుంచి 50 కి.మీల వేగంతో ఈదురు గాలులు

సాక్షి, విశాఖపట్నం: ఏపీలో వర్షాలు కొనసాగుతున్నాయి. కొన్నిచోట్ల తేలిక పాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తున్నాయి. ఆదివారం ఉత్తర కోస్తాంధ్రలో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. సోమవారం నుంచి నాలుగు రోజుల పాటు కోస్తాంధ్ర, రాయలసీమల్లో విస్తారంగా వానలు కురుస్తాయని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) శనివారం నాటి నివేదికలో తెలిపింది. ఉపరితల ఆవర్తనం, ద్రోణి ప్రభావంతో ఆదివారం అల్లూరి సీతారామరాజు, తూర్పు గోదావరి, ఏలూరు జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురవనున్నాయి. అలాగే ఈ నెల 13 నుంచి విశాఖపట్నం, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం, అల్లూరి సీతారామ రాజు, అనకాపల్లి, కాకినాడ, తూర్పు గోదావరి, కోనసీమ, ఏలూరు, పశ్చిమ గోదావరి, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి, తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో కొన్ని చోట్ల తేలిక పాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయి. వర్షాలతో పాటు ఉరుములు, మెరుపులు, పిడుగులు పడే ప్రమాదం ఉంది. పిడుగుల బారిన పడకుండా ఆయా ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఐఎండీ సూచించింది. అదే సమయంలో గంటకు 40 నుంచి 50 కి.మీల వేగంతో ఈదురు గాలులు వీస్తాయి. మారిన వాతావరణ పరిస్థితులు, వర్షాల నేపథ్యంలో పగటి ఉష్ణోగ్రతలు క్షీణిస్తున్నాయి. శనివారం రాష్ట్రంలో పలుచోట్ల 39 డిగ్రీలు లోపు, ఒకట్రెండు చోట్ల 40 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రానున్న వారం రోజులు దాదాపు ఇవే ఉష్ణోగ్రతలు రికార్డయ్యే అవకాశాలున్నాయి.

నకిలీ ఆయుర్వేద కేంద్రం సీజ్

సాక్షి, హైదరాబాద్: అన్ని రకాల జ్వరాలను తగ్గించేందుకు ఆయుర్వేద మందులు విక్రయిస్తున్నామంటూ తప్పుడు ప్రకటనలు జారీ చేస్తున్న ఒక ఆయుర్వేద మందుల విక్రయ కేంద్రాన్ని డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ అధికారులు సీజ్ చేశారు. విశ్వసనీయ సమాచారం మేరకు శుక్రవారం వనపర్తిలో జరిపిన సోదాల్లో ఈ విషయం వెలుగులోకి వచ్చినట్టు డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ డీజీ కమలాసన్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 'మహాసుదర్శన్ కదా ప్రవాహి' పేరిట ఈ మందులు విక్రయిస్తున్నట్టు గుర్తించారు. ఇలాంటి తప్పుడు ప్రకటనలు జారీ చేసే వారిపై డ్రగ్స్, మ్యాజిక్ రెమెడీస్ యాక్ట్, 1954 కింద ఆరు నెలల పాటు జైలు శిక్ష, జరిమానా విధించనున్నట్టు కమలాసన్ రెడ్డి హెచ్చరించారు.

సతుల్.. సుతుల్.. హితుల్..

- సకుటుంబ సపరివారం
- అభ్యర్థులకు అండగా.. లోక్‌సభ ఎన్నికల ప్రచారం


ఈటలకు మద్దతుగా సతీమణి జమున..

సాక్షి, హైదరాబాద్: ఎన్నికల్లో ప్రధాన పార్టీల నుంచి టికెట్ సంపాదించడం ఒక ఎత్తయితే.. లక్షలాది మంది ఓటర్లను కలిసి తమకే ఓటు వేయాలని అభ్యర్థించడం అంతకంటే పెద్ద టాస్క్. దీంతో అభ్యర్థులు మాట పక్కన పెడితే వారి కుటుంబ సభ్యులు మాత్రం ప్రచారంలో పెద్ద సాహసమే చేశారని చెప్పాలి. ఏసీ గదుల నుంచి మండే ఎండల వైపు.. గేటెడ్ కమ్యూనిటీ నుంచి మురికి వాడల వరకు కష్టనష్టాలను లెక్క చేయకుండా ప్రచారంలో దూసుకెళ్లారనేది స్పష్టంగా కనిపిస్తోంది. గ్రేటర్ పరిధిలోని హైదరాబాద్, సికింద్రాబాద్, చేవెళ్ల, మల్కాజిగిరి నియోజకవర్గాల్లో సుడిగాలి పర్యటనలు చేశారు.

మల్కాజిగిరిలో సునీతకు.. చేవెళ్లలో కాసానికి..

మల్కాజిగిరి కాంగ్రెస్ అభ్యర్థి సునీత తరఫున ఆమె భర్త, ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి విస్తృతంగా పర్యటించారు. మహేందర్‌రెడ్డికి కుమారుడు, అల్లుడు కూడా సహకరించారు. అలాగే బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ భార్య జమున సైతం విస్తృతంగా పర్యటించారు. ప్రచారంలో తనకంటూ ప్రత్యేక స్థానం ఉందని చెప్పకనే చెప్పారు. బీఆర్ఎస్ చేవెళ్ల అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ సతీమణి చంద్రకళ, కుమారుడు కాసాని వీరేశ్ ముమ్మరంగా ప్రచారంలో పాల్గొని ఓటు వేయాలని అభ్యర్థించారు.


రంజిత్‌రెడ్డికి మద్దతుగా భార్య సీత..

లష్కర్‌లో ఫ్యామిలీలదే హవా

సికింద్రాబాద్ లోక్‌సభ బరిలో నిలిచిన బీజేపీ అభ్యర్థి, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి భార్య కావ్య సైతం ఆయనకు చేదోడుగా నిలిచారు. గతం నుంచి స్వచ్ఛంద సంస్థ నడిపిస్తుండటం ఆమెకు కలిసొచ్చిన అంశం. బీఆర్ఎస్ అభ్యర్థి పద్మారావు గౌడ్ ప్రచారంలో ఆయన కుమారుడు రామేశ్వర్‌గౌడ్, కోడలు శిల్ప కీలకంగా వ్యవహరించారు.

అటు సీత.. ఇటు సంగీత..

చేవెళ్లలో బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వరరెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం రంజిత‌రెడ్డిలు నువ్వా నేనా అన్నట్లు ప్రచారం చేశారు. కొండా విశ్వేశ్వర్‌రెడ్డి భార్య సంగీతారెడ్డి, కుమారుడు విశ్వజిత్ ప్రచారంలో దూసుకుపోయారు. కొండా కుటుంబ సభ్యులు కొందరు విదేశాల నుంచి వచ్చి మరీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్‌రెడ్డి భార్య సీత సైతం విస్తృతంగా పర్యటనలు చేశారు. పార్టీ మహిళా నాయకులతో కలసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు.


విశ్వేశ్వర్‌రెడ్డి సతీమణి సంగీతారెడ్డి..



సిగ్నేచర్ డే

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ కామర్స్ (ఐఐఎంసీ) హైదరాబాద్ విద్యార్థులు సందడి చేశారు. శనివారం ఐమాక్స్ సమీపంలోని పార్కులో 'సిగ్నేచర్ డే'ను ఫన్నీగా జరుపుకొన్నారు. ఒకరి దుస్తులపై మరొకరు సంతకాలు చేస్తూ చెరగని ముద్రలు వేసుకున్నారు.
– సాక్షి, హైదరాబాద్

- బడుగు బలహీనవర్గాలు 10 శాతం మాత్రమే అభివృద్ధి ఫలాలను అనుభవిస్తున్నారని, కులగణనతోనే సమానత్వం సాధ్యమవుతుందని కాంగ్రెస్ నేత డాక్టర్ వినయ్ అన్నారు. ఆయన శనివారం గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ బడుగు బలహీనవర్గాలు అభివృద్ధి చెందాలనే ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ కులగణన జరగాలని కోరుతున్నారని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ గొర్రెలు, బర్రెలు పంపిణీ చేస్తే.. కాంగ్రెస్ వారి పిల్లల అభ్యున్నతి కోసం ఆలోచిస్తోందని చెప్పారు. మరోవైపు బీజేపీ ప్రజలను విభజించి పాలిస్తోందని వినయ్ ఆరోపించారు.

• బీజేపీ మళ్లీ గెలిస్తే..

తదుపరి ప్రధాని అమిత్ షా!

వచ్చే ఏడాది మోదీ పదవి నుంచి వైదొలుగుతారు

- 2 నెలల్లో యోగినీ మార్చేస్తారు
- ప్రతిపక్షనేతలంతా జైలుకే
- కేజ్రీవాల్ ఘాటు వ్యాఖ్యలు



సాక్షి, న్యూఢిల్లీ: సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ మళ్లీ విజయం సాధిస్తే నరేంద్ర మోదీ.. అమిత్ షాను తదుపరి ప్రధానమంత్రిని చేస్తారని, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌ను మార్చేస్తారని ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ చెప్పారు. బీజేపీలో సీనియర్ నేతల రాజకీయ జీవితానికి ముగింపు పలికిన మోదీ 'ఒక దేశం, ఒకే నాయకుడు' పేరిట ప్రమాదకరమైన మిషన్‌ను ప్రారంభించారని ఆరోపించారు. బీజేపీ ప్రభుత్వం మళ్లీ వస్తే ప్రతిపక్ష నేతలంతా జైలుకు వెళ్లక తప్పదని అన్నారు. మమతా బెనర్జీ, ఉద్ధవ్ ఠాక్రే, తేజస్వీ యాదవ్, స్టాలిన్, పినరయి విజయన్ తదితరులను మోదీ ప్రభుత్వం కచ్చితంగా జైలుకు పంపిస్తుందని ఆరోపించారు. ప్రతిపక్ష నేతలను జైల్లో పెట్టి నియంతృత్వ పాలన తీసుకురావాలన్నదే ప్రధాని లక్ష్యమని చెప్పారు. బీజేపీలోని తన ప్రత్యర్థులను రాజకీయంగా అంతం చేయాలని మోదీ భావిస్తున్నారని పేర్కొన్నారు. మధ్యంతర బెయిల్‌పై విడుదలైన తర్వాత కేజ్రీవాల్ శనివారం ఢిల్లీలోని ఆమ్ ఆద్మీ పార్టీ ప్రధాన కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడారు. ఈ ఎన్నికల్లో బీజేపీ గెలిచే అవకాశం లేదని స్పష్టం చేశారు. జూన్ 4 తర్వాత 'ఇండియా' కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందన్నారు. జైలు నుంచి విడుదలయ్యాక నిపుణులతో, ప్రజలతో మాట్లాడానని, ఎన్నికల్లో బీజేపీకి ఓడిపోవడం ఖాయమని పేర్కొన్నారు. కేంద్రంలో ఏర్పాటయ్యే కొత్త ప్రభుత్వంలో 'ఆప్' చేరుతుందని, ఢిల్లీకి పూర్తి స్థాయి రాష్ట్ర హోదా సాధిస్తామని హామీ ఇచ్చారు. కేజ్రీవాల్ ఇంకా ఏం చెప్పారంటే..

ఎందుకు రాజీనామా చేయలేదంటే...

ముఖ్యమంత్రి పదవి నాకు ముఖ్యం కాదు. నాపై కేసు నమోదైన తర్వాత సీఎం పదవికి రాజీనామా చేయకపోవడం వెనుక కారణం ఉంది. ఢిల్లీలో భారీ మెజార్టీతో మేము గెలిచాం. అందుకే మాపై కక్షగట్టారు. తప్పుడు కేసులో ఇరికించి, నన్ను బలవంతంగా పదవి నుంచి దింపేయడానికి కుట్ర జరిగింది. కుట్రను ఛేదించి, బీజేపీపై పోరాటం కొనసాగించడానికే పదవికి రాజీనామా చేయొద్దని నిర్ణయించుకున్నా. జైలు నుంచే ప్రభుత్వాన్ని నడిపిస్తా. ప్రజాస్వామ్యాన్ని ఖైదు చేస్తే పరిపాలన ఆగదు. హేమంత్ సోరెన్ జార్ఖండ్ సీఎం పదవికి రాజీనామా చేయకుండా జైలు నుంచే పాలన నడిపిస్తే బాగుండేది. దొంగలు, దోపిడీదారులకు బీజేపీ అడ్డాగా మారింది. అవినీతిపై పోరాటం ఎలా చేయాలో ప్రధాని మోదీ నిజంగా నేర్చుకోవాలనుకుంటే నన్ను చూసి నేర్చుకోవాలి. అవినీతిపరులను మేము జైలుకు పంపించాం. ఈ విషయంలో మా మంత్రులనూ వదిలిపెట్టలేదు'' అని కేజ్రీవాల్ స్పష్టం చేశారు.

అమిత్ షా కోసం ఓట్లడుగుతున్న మోదీ

''ఇండియా కూటమికి ప్రధానమంత్రి అభ్యర్థి లేడని బీజేపీ నేతలు అంటున్నారు. ఒకవేళ బీజేపీ మళ్లీ గెలిస్తే తదుపరి ప్రధానమంత్రి ఎవరవుతారో ఆ పార్టీ నాయకులు చెప్పాలి. వచ్చే ఏడాది సెప్టెంబర్ 17న ప్రధాని నరేంద్ర మోదీకి 75 ఏళ్లు నిండుతాయి. 75 ఏళ్లు దాటిన నేతలు పదవుల నుంచి తప్పుకోవాలన్న నిబంధనను మోదీ తీసుకొచ్చారు. ఎల్‌కే అద్వానీ, మురళీ మనోహర్ జోషీ, సుమిత్రా మహాజన్ వంటి నేతలను పక్కనపెట్టారు. శివరాజ్‌సింగ్ చౌహాన్, వసుంధరరాజే సింధియా, మనోహర్ లాల్ ఖట్టర్, రమణ్ సింగ్ వంటి నాయకుల రాజకీయ జీవితానికి మోదీ ముగింపు పలికారు. ఇక తర్వాతి వంతు యోగి ఆదిత్యనాథ్‌దే. ఈ ఎన్నికల్లో బీజేపీ ఎన్నికల్లో గెలిస్తే రెండు నెలల్లోనే యోగి ఆదిత్యనాథ్ రాజకీయ జీవితానికి తెరపడుతుంది. ఉత్తరప్రదేశ్‌లో మరొకరిని ముఖ్యమంత్రిని చేస్తారు. యోగిని రాజకీయాల నుంచి శాశ్వతంగా బయటకు పంపిస్తారు. వచ్చే ఏడాది మోదీ కూడా పదవి నుంచి తప్పుకుంటారు. అమిత్ షాను ప్రధానమంత్రిని చేస్తారు. మోదీ ఇప్పుడు అమిత్ షా కోసం ఓట్లు అడుగుతున్నారు. మోదీ ఇచ్చిన గ్యారంటీలను అమిత్ షా నెరవేరుస్తారా? ఒక దేశంలో ఒకే నాయకుడు ఉండాలన్నదే మోదీ విధానం. ఇదే నియంతృత్వం. నియంత పాలనకు వ్యతిరేకంగా పోరాటం సాగించడం నా ఒక్కడితో సాధ్యం కాదు. అందుకు 140 మంది కోట్ల ప్రజల మద్దతు, ఆశీర్వాదం కావాలి''

హనుమాన్ ఆలయంలో పూజలు

అరవింద్ కేజ్రీవాల్ శనివారం సెంట్రల్ ఢిల్లీలోని కన్నాట్ ప్లేస్ హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన వెంట భార్య సునీత, పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్, ఆమ్ ఆద్మీ పార్టీ నేతలు ఉన్నారు. హనుమాన్‌జీ ఆశీస్సులు పొందడం చాలా సంతోషంగా ఉందని కేజ్రీవాల్ పేర్కొన్నారు.

ఐదేళ్లూ మోదీయే

- 75 ఏళ్లు దాటితే తప్పుకోవాలని బీజేపీ రాజ్యాంగంలో లేదు
- కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా స్పష్టీకరణ

హైదరాబాద్: లోక్‌సభ ఎన్నికల తర్వాత కూడా దేశాన్ని నరేంద్ర మోదీయే ముందుకు నడిపిస్తారని కేంద్ర హోంశాఖ మంత్రి, బీజేపీ అగ్రనేత అమిత్ షా స్పష్టంచేశారు. 75 ఏళ్ల వయసు దాటిన తర్వాత పదవి నుంచి తప్పుకోవాలంటూ వయోపరిమితి అనేది తమ పార్టీ రాజ్యాంగంలో లేదని అన్నారు. అమిత్ షా శనివారం హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ గెలిస్తే వచ్చే



ఏడాది నరేంద్ర మోదీ పదవి తప్పుకుంటారని, అమిత్ షాను తదుపరి ప్రధానమంత్రిని చేస్తారని ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ చేసిన వ్యాఖ్యలపై స్పందించారు. ''అరవింద్ కేజ్రీవాల్‌కు, ఆయన కంపెనీకి, ప్రతిపక్ష ఇండియా కూటమికి ఒక్క విషయం చెప్పదల్చుకున్నా. నరేంద్ర మోదీకి 75 ఏళ్లు నిండితే మీరు సంతోషించాల్సిన అవసరం లేదు. 75 ఏళ్లు దాటితే పదవి నుంచి తప్పుకోవాలని బీజేపీ రాజ్యాంగంలో ఎక్కడా రాసి పెట్టిలేదు. మోదీ పూర్తికాలం పదవిలో కొనసాగుతారు. దేశాన్ని ముందుకు నడిపిస్తూనే ఉంటారు. ఈ విషయంలో మా పార్టీలో ఎలాంటి గందరగోళం లేదు'' అని అమిత్ షా తేల్చిచెప్పారు.



ఎన్నికల విచిత్రం

ఈమె జార్ఖండ్‌లోని రాంచీ లోక్‌సభ నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థిని యశస్వినీ సహాయ్. శనివారం రాంచీలో ఎన్నికల ప్రచారం సందర్భంగా ఓ చిన్నారిని ఎత్తుకుని నిద్రపుచ్చారు. మొదటిసారిగా ఎన్నికల బరిలోకి దిగిన యశస్విని కేంద్ర మాజీ మంత్రి సుబోధ్ కాంత్ సహాయ్ కుమార్తె.

కేజ్రీవాల్ రోడ్ షో

న్యూఢిల్లీ: ఆమ్ ఆద్మీ పార్టీ అగ్రనేత, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ లోక్‌సభ ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టారు. శనివారం దక్షిణ ఢిల్లీ, తూర్పు ఢిల్లీ నియోజకవర్గాల్లో రోడ్ షో నిర్వహించారు. మధ్యంతర బెయిల్‌పై జైలు నుంచి విడుదలైన తర్వాత కేజ్రీవాల్ మొట్టమొదటి రోడ్ షో ఇదే కావడం విశేషం. జూన్ 4 తర్వాత దేశ భవిష్యత్తు, దశ దిశ మారబోతున్నాయని ఆయన చెప్పారు. ఇండియా కూటమి అధికారంలోకి వస్తుందన్నారు.

నాలుగో దశ ప్రచారానికి తెర

- 10 రాష్ట్రాలు, యూటీల్లో 96 స్థానాలకు ఎన్నికలు
- 13న జరగనున్న పోలింగ్

న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికల నాలుగో దశలో 10 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లోని 96 స్థానాలకు ప్రచారం శనివారంతో ముగిసింది. అవినీతి, నిరుద్యోగం, పెరిగిన ధరలకు తోడు అదానీ, అంబానీల నుంచి కాంగ్రెస్‌కు టెంపోల కొద్దీ నల్లధనం తరలింపు ఆరోపణలు, దక్షిణాది భారతీయులు ఆఫ్రికన్లలా కనిపిస్తారన్న శ్యామ్ పిట్రోడా జాత్యహంకార వ్యాఖ్యానాలు, అయ్యర్ పాక్ అణుబాంబు మాటలపై బీజేపీ, కాంగ్రెస్ పరస్పర దూషణలు నాలుగోదశ ప్రచారానికి మరింత వేడిని అందించాయి.

బరిలో దిగ్గజాలు..

సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేశ్ యాదవ్(యూపీలోని కనౌజ్), కేంద్ర మంత్రులు గిరిరాజ్‌సింగ్ (బిహార్‌లోని బెగుసరాయ్), నిత్యానంద్ రాయ్(బిహార్‌లోని ఉజియాపూర్), కాంగ్రెస్ నేత అధీర్ రంజన్ చౌదరి(పశ్చిమబెంగాల్‌లోని బహరాంపూర్), బీజేపీ నాయకురాలు పంకజ ముండే(మహారాష్ట్రలోని బీడ్) తదితరులు మే 13న జరిగే నాలుగోదశ పోలింగ్‌లో తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. 2021నాటి లఖీంపూర్‌ఖేరీ రైతుల మరణాల కేసులో నిందితుడైన ఆశిశ్ తండ్రి, కేంద్ర మంత్రి అజయ్ కుమార్ మిశ్రా ఈసారి యూపీలోని ఖేరీ నియోజకవర్గం నుంచి హ్యాట్రిక్ విజయం కోసం చెమటోడుస్తున్నారు.

నాడు 40 చోట్ల ఎన్‌డీఏ విజయం

నగదుకు ప్రశ్నలు ఉదంతంలో పార్లమెంట్ సభ్యత్వం నుంచి బహిష్కరణకు గురైన తృణమూల్ కాంగ్రెస్ నాయకురాలు మహువా మొయిత్రా మరోసారి బెంగాల్‌లోని కృష్ణానగర్ నుంచి పోటీకి నిలబడ్డారు. జమ్మూకశ్మీర్‌లోని శ్రీనగర్ స్థానంలో నేషనల్ కాన్ఫరెన్స్ తరఫున షియా నేత అఘా సయ్యద్ రుహుల్లా మెహ్దీ, పీడీపీ తరఫున వహీద్ పారా, ఆప్ తరఫున అష్రాఫ్ మీర్ పోటీచేస్తున్నారు. ఇండోర్‌లో కాంగ్రెస్ అభ్యర్థి అక్షయ్ బామ్ చివరి నిమిషంలో నామినేషన్ ఉపసంహరించుకోవడంతో బీజేపీ అభ్యర్థి శంకర్ లాల్వానీ గెలుపు దాదాపు ఖాయమైంది. ఇక్కడ 'నోటా'కు ఓటేయాలని కాంగ్రెస్ ప్రచారంచేసింది. నాలుగోదశలో పోలింగ్ జరుగుతున్న ఈ 96 స్థానాల్లో 2019 ఎన్నికల్లో ఎన్‌డీఏ కూటమి 40 చోట్ల విజయం సాధించింది. ఐదో దశ మే 20న, ఆరో దశ మే 25న, ఏడో దశ జూన్ ఒకటిన జరగనున్నాయి. అన్నింటికీ కౌంటింగ్ జూన్ 4వ తేదీన చేపడతారు. ఒడిశాలో లోక్‌సభ ఎన్నికలతోపాటు అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్నాయి. అసెంబ్లీ ఎన్నికలు నాలుగుదశల్లో జరగనున్నాయి. వీటిలో తొలి దశలో 28 స్థానాలకు సంబంధించిన ప్రచారం సైతం శనివారమే ముగిసింది.

ఎలక్షన్ బీట్

చిన్న పిల్లాడిలా ఏడుస్తున్నారు

ప్రధాని మోదీపై ప్రియాంకా గాంధీ వ్యాఖ్యలు

నందుర్బార్: ప్రధాని మోదీ లక్ష్యంగా కాంగ్రెస్ నేత ప్రియాంకా గాంధీ మరోసారి విరుచుకుపడ్డారు. ప్రపంచంలోనే గొప్ప నేతంటూ మోదీని బీజేపీ నేతలు ఆకాశానికి ఎత్తేస్తుండగా ఆయన మాత్రం తనను వేధిస్తున్నారంటూ చిన్నా పిల్లాడిలా ఏడుస్తున్నారన్నారు. మాజీ ప్రధాని ఇందిరా గాంధీ మాదిరిగా ధైర్యసాహసాలను అలవర్చుకోవాలని ప్రియాంక ఉద్బోధించారు. శనివారం ప్రియాంక మహారాష్ట్రలోని నందుర్బార్‌లో జరిగిన ఎన్నికల ప్రచార ర్యాలీలో మాట్లాడారు. 'అవినీతిపై ఒంటరి పోరాటం సాగిస్తున్నట్లు మోదీ చెప్పుకుంటున్నారు. ఆయన వద్దే అధికారం యావత్తు కేంద్రీకృతమై ఉంది. మోదీ అందరి కంటే గొప్పనేత అనీ, ప్రపంచ నేతల మద్దతు ఆయనకు ఉందని బీజేపీ నేతలు ప్రచారం చేసుకుంటున్నారు. కానీ, మోదీ మాత్రం తనను లక్ష్యంగా చేసుకుని ప్రతిపక్షాలు వేధింపులకు పాల్పడుతున్నాయంటూ ఎన్నికల సభల్లో చిన్న పిల్లాడిలా ఏడుస్తున్నారు. ప్రధాని పదవిలో ఉన్న వ్యక్తి ప్రజల కష్టాలను అడిగి తెలుసుకోవాలి. కానీ, ఆయనే స్వయంగా ఇబ్బందులను చెప్పుకుంటున్నారు. ధైర్యంగా ఉండాలి మోదీజీ, ఇది ప్రజా జీవితం. ప్రధాని పదవిని తక్కువ చేయొద్దు' అని హితవు పలికారు. 'దుర్గామాతలా వ్యవహరించిన మాజీ ప్రధాని ఇందిరా గాంధీ నుంచి నేర్చుకోండి. ఆమె పాకిస్తాన్‌ను రెండు ముక్కలు చేశారు. ఆమె మాదిరిగా ధైర్యం, కృతనిశ్చయం కలిగి ఉండండి. కానీ, జాతి వ్యతిరేకి అంటూ ఇందిరను తిట్టిపోసే మీరు, ఆమె నుంచి నేర్చుకునేందుకు ఏముంటుంది?' అని ప్రియాంక అన్నారు. ప్రధాని మోదీ శుక్రవారం నందుర్బార్‌లో జరిగిన ఎన్నికల ర్యాలీలో..తనను సజీవంగా సమాధి చేయాలని ప్రతిపక్షాలు కోరుకుంటున్నాయంటూ వ్యాఖ్యానించడం తెలిసిందే.

బిలియనీర్ల చేతుల్లో కీలుబొమ్మ మోదీ

కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఎద్దేవా

న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీ టెంపో బిలియనీర్ల చేతుల్లోని కీలుబొమ్మ రాజు అని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఎద్దేవా చేశారు. అంబానీ, అదానీ నుంచి కాంగ్రెస్‌కు టెంపోల్లో డబ్బు మూటలు అందుతున్నాయంటూ మోదీ చేసిన ఆరోపణలను తిప్పికొట్టారు. ''నరేంద్ర మోదీ ప్రధానమంత్రి కాదు. ఆయనొక కీలుబొమ్మ రాజు. ఈ కీలుబొమ్మ తీగలు టెంపో బిలియనీర్ల చేతుల్లో ఉన్నాయి'' అంటూ శనివారం 'ఎక్స్'లో రాహుల్ పోస్టు చేశారు. లోక్‌సభ ఎన్నికలపై పార్టీల అగ్రనేతలు ప్రజల సమక్షంలో చర్చించాలని, అభిప్రాయాలు పంచుకోవాలంటూ మాజీ న్యాయమూర్తులు జస్టిస్ మదన్ బి.లోకూర్, జస్టిస్ అజిత్ పి షా, ఎన్.రామ్ చేసిన ప్రతిపాదనను రాహుల్ గాంధీ స్వాగతించారు. ఇది చక్కటి ఆలోచన అని ప్రశంసించారు. ఎన్నికలపై బహిరంగ చర్చకు తాను, తమ పార్టీ అధినేత మల్లికార్జున ఖర్గే సిద్ధంగా ఉన్నామని శనివారం 'ఎక్స్'లో వెల్లడించారు.

ఎన్నికలను అనుకూలంగా మార్చుకుంటోంది

జమ్మూకశ్మీర్ యంత్రాంగంపై మెహబూబా ముఫ్తీ ధ్వజం

శ్రీనగర్: లోక్‌సభ ఎన్నికలను నచ్చినట్లుగా నిర్వహించుకునేందుకు జమ్మూకశ్మీర్ యంత్రాంగం ప్రయత్నిస్తోందని పీడీపీ చీఫ్ మెహబూబా ముఫ్తీ మండిపడ్డారు. ఉద్దేశపూర్వకంగానే తమ పార్టీ కార్యకర్తలు, నాయకులను అరెస్టుల పేరుతో యంత్రాంగం వేధిస్తోందని ఆరోపించారు. శనివారం ఆమె పీడీపీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. సోమవారం పోలింగ్ జరిగే శ్రీనగర్ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోని పుల్వామాలో శనివారం సాయంత్రం 6.30 గంటల నుంచి అధికారులు సెక్షన్-144 కింద నిషేధాజ్ఞలు విధించడంపై ఆమె మండిపడ్డారు. ప్రచారపర్వం ముగిసినప్పటి నుంచి పోలింగ్ ముగిసే వరకు ఆంక్షలను అమలు చేయడం ఎన్నడూ జరగలేదన్నారు.

ప్రతి వీధిలోనూ రామభక్తులున్నారు

అసదుద్దీన్ వ్యాఖ్యలను తిప్పికొట్టిన నవనీత్ కౌర్

న్యూఢిల్లీ: ఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ, బీజేపీ నేత, మహారాష్ట్రలోని అమరావతి నియోజకవర్గ అభ్యర్థి నవనీత్ కౌర్ మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. తన తమ్ముడు అక్బరుద్దీన్ ఒవైసీ ఫిరంగిలాంటి వ్యక్తి, అతడిని చాలా కష్టంగా నియంత్రణలో పెడుతున్నా అంటూ అసదుద్దీన్ ఒవైసీ చేసిన వ్యాఖ్యలపై నవనీత్ కౌర్ శనివారం స్పందించారు. అలాంటి ఫిరంగులను తన ఇంటి ముందు అలంకరణగా ఏర్పాటు చేసుకున్నానని చెప్పారు. రామభక్తులు, మోదీ సింహాలు దేశంలో దేశవ్యాప్తంగా ప్రతి వీధిలో తిరుగుతున్నాయని పేర్కొన్నారు. ''నేను ఒక సైనికుడి బిడ్డను. తన తమ్ముడిని అదుపులో పెట్టుకున్నానని అసదుద్దీన్ ఒవైసీ అంటున్నారు. అది చాలా మంచి పని. ఎందుకంటే రామభక్తులు, మోదీ సింహాలు ప్రతి వీధిలోనూ తిరుగుతున్నాయి.. జాగ్రత్త. నేను త్వరలో హైదరాబాద్‌కు వస్తున్నా'' అని నవనీత్ కౌర్ చెప్పారు.

కేంద్రం ప్రతిపక్షాలను వేధిస్తోంది: కల్పన

మేదినీనగర్(జార్ఖండ్): బీజేపీ సారథ్యంలోని కేంద్ర ప్రభుత్వం ప్రతిపక్ష పార్టీలను వేధించేందుకు అధికార దుర్వినియోగానికి పాల్పడుతోందని జేఎంఎం నేత, జార్ఖండ్ మాజీ సీఎం భార్య కల్పనా సోరెన్ ఆరోపించారు. వేధింపు రాజకీయాలతోనే తన భర్త జైలుపాలయ్యారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. గత పదేళ్లుగా దేశాన్ని తప్పుదోవ పట్టించారంటూ ప్రధాని మోదీపై నిప్పులు చెరిగారు. ఆదివాసీలు, గిరిజనులను అంటరాని వారిగా మోదీ భావిస్తున్నారన్నారు. మోదీ నిజ స్వరూపం తెలిసిందని, ఆయన్ను గద్దెదించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. శనివారం జార్ఖండ్‌లోని పలాములో జరిగిన ఎన్నికల ర్యాలీలో కల్పన మాట్లాడారు.

కాంగ్రెస్‌కు కనీసం 50 సీట్లు కూడా రావు

ప్రతిపక్ష పార్టీ హోదా కూడా దక్కదు

- ఒడిశా, జార్ఖండ్ ఎన్నికల సభల్లో ప్రధాని మోదీ వ్యాఖ్య

ఫుల్‌బాణీ/బోలాంగిర్/బార్‌గఢ్/ఛాత్రా: కాంగ్రెస్ పార్టీ కనీసం 50 చోట్ల కూడా గెలవబోదని ప్రధాని మోదీ జోస్యం చెప్పారు. విజయం కాదుకదా కనీసం ప్రతిపక్ష పార్టీ హోదా కూడా దక్కదని ఆయన వ్యాఖ్యానించారు. శనివారం ఒడిశా, జార్ఖండ్‌లోని ఫుల్‌బాణీ, బోలాంగిర్, బార్‌గఢ్, ఛాత్రాలలో ఎన్నికల ప్రచారసభల్లో మోదీ ప్రసంగించారు. '' లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్ష హోదాకు కావాల్సిన కనీసం 10 శాతం సీట్లు కూడా కాంగ్రెస్ సాధించబోదు. వాళ్లు కనీసం 50 సీట్లు కూడా గెలవలేరు' అని అన్నారు. రాహుల్ గాంధీని పరోక్షంగా ప్రస్తావిస్తూ.. ' గాంధీ యువరాజు 2014 నుంచి అదే స్క్రిప్ట్ చదువుతున్నారు. నా మాటలు రాసిపెట్టుకోండి. ఎన్‌డీఏ అన్ని రికార్డులను బద్దలుకొట్టి 400 సీట్లు సాధిస్తుంది'' అని అన్నారు.



సొంత ప్రజల్నే కాంగ్రెస్ భయపెడుతోంది


మణిశంకర్ అయ్యర్ 'అణుబాంబు' వ్యాఖ్యలను మోదీ ప్రస్తావించారు. ' పాకిస్తాన్ వద్ద అణుబాంబు ఉందని సొంత ప్రజల్నే కాంగ్రెస్ భయపెడుతోంది. వర్చువల్‌గా ఇప్పటికే చనిపోయిన కాంగ్రెస్ నేతలు ప్రజల గుండెల్లో నిండిన దేశస్ఫూర్తిని చంపేస్తున్నారు. సొంత అణుబాంబుల నిర్వహణ బాధ్యతలు కూడా పాక్‌కు చేతకావట్లేదు. అందుకే అణుబాంబులను అమ్మేద్దామని భావిస్తోంది. బాంబులను అమ్ముదామన్నా కొనేవారు లేరు. అవి ఎంత నాసిరకానివో ఇతర దేశాలకు తెలుసు. జమ్మూకశ్మీర్ విషయంలో కాంగ్రెస్ తీసుకున్న బలహీనమైన నిర్ణయాల వల్ల ఆ ప్రాంతం ఆరు దశాబ్దాలు ఉగ్రవాదాన్ని ఎదుర్కొంది. కాంగ్రెస్ హయాంలో భారత్ ఎన్నోసార్లు ఉగ్రదాడుల బారినపడింది. కఠిన నిర్ణయాలకు బదులు చర్చలకు మొగ్గుచూపింది'' అని ధ్వజమెత్తారు.

పాండియన్‌పై విసుర్లు

తమిళనాడుకు చెందిన మాజీ ఉన్నతాధికారి పాండియన్‌పై మోదీ విమర్శలు గుప్పించారు. '' పట్నాయక్ తన ప్రభుత్వ బాధ్యతలను ఔట్‌సోర్సింగ్‌కు ఇచ్చేశారు. బయటివ్యక్తి(ఔట్‌సైడర్) పాండియన్ ఒడిశాను పాలిస్తున్నారు. ముఖ్యమంత్రిని మించి సూపర్ సీఎం పాలిస్తున్నారు. ఒడిశా బిడ్డలు, కూతుళ్లకు సొంత ప్రభుత్వాన్ని నడుపుకునే సత్తా లేదా? రాష్ట్రాన్ని అభివృద్ధి చేసుకునే దమ్ము ఇక్కడి వారికి లేదా?'' అని ప్రశ్నించారు.

నవీన్ పట్నాయక్ జిల్లాల పేర్లు చెప్పగలరా?

''ఒడిశాకు ఇన్నేళ్లు సీఎంగా ఉన్న నవీన్ పట్నాయక్‌కు ఇదే నా సవాల్. ఆయన ఒడిశాలోని అన్ని జిల్లాలు, జిల్లా కేంద్రాల పేర్లను ఏ పేపర్‌లో చూడకుండా, ఎవరి సాయం లేకుండా ఒడియా భాషలో చెప్పగలరా?. పేర్లే చెప్పలేని వ్యక్తి పేదల బాధలెలా తీర్చగలరు? ప్రజా సమస్యలను ఎలా అర్థం చేసుకోగలరు?'' అని మండిపడ్డారు.



శుక్రవారం అర్ధరాత్రి దాటాక లద్దాఖ్‌లో కనువిందు చేసిన కాంతి వలయాలు

వినువీధిలో రంగుల వలయాలు

అబ్బురపరిచిన అరోరా వెలుగులు | ప్రపంచవ్యాప్తంగా కనువిందు చేసిన వైనం

చుట్టూరా తెల్లగా పరుచుకున్న హిమాలయాలు. పైన లేత ఎరుపు రంగు కాంతులు. ఈ వింత వెలుగులు లద్దాఖ్‌లోని హాన్లే వినువీక్షణ కేంద్రం వద్ద శుక్రవారం అర్ధరాత్రి దాటాక ఆకాశ వీధిలో ఇలా కనువిందు చేశాయి. చూపరులను కన్ను తిప్పుకోనివ్వకుండా కట్టిపడేశాయి. భూ అయస్కాంత క్షేత్రం గుండా ప్రసరించే కాంతి సౌర తుఫాన్ల కారణంగా చెదిరిపోవడం వల్ల ఆకాశంలో ఇలాంటి అందమైన కాంతులు ఏర్పడుతుంటాయి. ఆర్కిటిక్, అంటార్కిటిక్‌లోని ఎత్తైన ప్రాంతాల నుంచి అత్యంత స్పష్టతతో కన్పించే ఈ అద్భుత కాంతి వలయాలకు అరోరా అని పేరు. ఇవి ఏర్పడే దిక్కును బట్టి అరోరా బొరియాలిస్ (ఉత్తర కాంతులు), అరోరా ఆస్ట్రలిస్ (దక్షిణ కాంతులు) అని పిలుస్తారు. ఇవి చాలా రంగుల్లో అలరిస్తాయి. అయితే లద్దాఖ్‌లో కనువిందు చేసినవి అత్యంత అరుదైన ఎరుపు రంగు కాంతులు. అత్యంత మనోహరంగా ఉండటమే గాక ఎక్కువసేపు స్థిరంగా కన్పించడం ఈ ఎరుపు కాంతుల ప్రత్యేకత. లద్దాఖ్‌తో పాటు అమెరికా, రష్యా, ఆస్ట్రేలియా, యూరప్‌లో జర్మనీ, డెన్మార్క్, స్విట్జర్లాండ్, పోలండ్ తదితర దేశాల్లో అరోరాలు కనువిందు చేశాయి.

ఐదు తీవ్ర సౌర తుపాన్లు

సూర్యుని ఉపరితలంపై ఏఆర్13664గా పిలిచే చోట గత బుధవారం నుంచి అత్యంత తీవ్రతతో కూడిన ఐదు తుపాన్లు సంభవించాయి. తద్వారా అపార పరిమాణంలో విడుదలైన శక్తి కణాలు ఈ వారాంతం పొడవునా సౌరవ్యవస్థ గుండా ప్రయాణించనున్నాయి. ఆ క్రమంలో భూ అయస్కాంత క్షేత్రంతో ప్రతిచర్య జరిపే క్రమంలో అవి చెదిరిపోతూ ఆకాశంలో ఈ అందాల కాంతి వలయాలను సృష్టించాయి. గత రెండు దశాబ్దాల్లో అత్యంత తీవ్రతతో కూడిన సౌర తుపాన్లు ఇవేనని సైంటిస్టులు చెబుతున్నారు. దీన్ని అసాధారణ పరిణామంగా అమెరికా నేషనల్ ఓషియానిక్ అండ్ అట్మాస్ఫియరిక్ అడ్మినిస్ట్రేషన్ అభివర్ణించింది. 2003లో ఇలాంటి సౌర తుపాన్ల కారణంగా స్వీడన్లో పలు ప్రాంతాల్లో విద్యుదుత్పత్తి, సరఫరాలకు అంతరాయం కలిగింది. దక్షిణాఫ్రికాలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు పాడైపోయాయి. – వాషింగ్టన్

వెళ్లిపోవాల్సిందే

రఫా ప్రజలకు మరోసారి ఇజ్రాయెల్ అల్టిమేటమ్

రఫా(గాజా స్ట్రిప్): గాజా దక్షిణాన ఉన్న చిట్టచివరి పెద్ద పట్టణం రఫాలో లక్షలాది మంది జనం ప్రాణాలు అరచేత పట్టుకుని పారిపోవాల్సిన పరిస్థితి దాపురించింది. రఫాను ఖాళీచేసి వెళ్లాలని జనాలకు ఇజ్రాయెల్ సైనికబలగాలు మరోసారి ఆదేశించాయి. ఉత్తర దిశ నుంచి మొదలెట్టి దక్షిణం దిశగా భూతల దాడులతో ఆక్రమణలు, దాడులను ఇజ్రాయెల్ సైన్యం కొనసాగిస్తోంది. అమెరికా, ఇతర మిత్రదేశాలు దూకుడు తగ్గించాలని మొత్తుకుంటున్నా ఇజ్రాయెల్ తన దాడులను ఆపట్లేదు. హమాస్ సాయుధుల ప్రతిదాడులతో శనివారం రఫా శివారుప్రాంతాలు భీకర రణక్షేత్రాలుగా మారిపోయాయి. రఫా తూర్పున మూడింట ఒక వంతు భూభాగంలో జనాలను ఇజ్రాయెల్ ఇజ్రాయెల్ ఇప్పటికే ఖాళీచేయించింది. రఫా మొత్తాన్ని ఖాళీచేయించే దుస్సాహసానికి దిగితే మానవతా సాయం చాలా కష్టమవుతుందని, అమాయక పౌరుల మరణాలు మరింత పెరుగుతాయని ఐక్యరాజ్యసమితి ఆందోళన వ్యక్తంచేసింది.

రాజ్‌భవన్‌లో అడుగుపెట్టను

పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ

సప్తాగ్రామ్: పశ్చిమ బెంగాల్ గవర్నర్ ఆనంద బోసుపై టీఎంసీ చీఫ్ మమతా బెనర్జీ విరుచుకుపడ్డారు. మహిళలపై లైంగిక వేధింపులకు పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న గవర్నర్ ఇంకా పదవిలో కొనసాగుతున్నారని మండిపడ్డారు. ఆయన ఎందుకు రాజీనామా చేయలేదో చెప్పాలని డిమాండ్ చేశారు. శనివారం సప్తాగ్రామ్‌లో ఎన్నికల ప్రచారం మమతా బెనర్జీ మాట్లాడారు. గవర్నర్ పదవిలో ఆనంద బోసు కొనసాగినంత కాలం తాను రాజ్‌భవన్‌లో అడుగుపెట్టబోనని తేల్చిచెప్పారు. ఒకవేళ గవర్నర్‌ను కలవాలనుకుంటే వీధుల్లోనే కలుస్తానని అన్నారు. మహిళలపై వేధింపులకు గవర్నర్ సమాధానం చెప్పాలన్నారు. గత నెల 24న, ఈ నెల 2న గవర్నర్ ఆనంద బోసు తనపై లైంగిక వేధింపులకు పాల్పడ్డారని రాజ్‌భవన్‌లో పనిచేసే ఓ మహిళా ఉద్యోగి గతవారం కోల్‌కతా పోలీసులకు ఫిర్యాదు చేశారు. తాను తప్పు చేయలేదని గవర్నర్ అన్నారు. పూర్తి వీడియోలను గవర్నర్ బహిర్గతం చేయలేదని మమత ఆరోపించారు.

అఫ్గాన్‌లో ఆకస్మిక వరదలు.. 300 మందికి పైగా మృతి

ఇస్లామాబాద్: అఫ్గానిస్తాన్ ఉత్తరప్రాంతంలో శుక్రవారం రాత్రి ఆకస్మికంగా కురిసిన భారీ వర్షాలు, వరదలతో 300 మందికి పైగా ప్రజలు మృతి చెందినట్లు ఐరాస ఆహారం విభాగం తెలిపింది. వెయ్యి వరకు నివాసాలు ధ్వంసం కాగా వందల సంఖ్యలో ప్రజలు గాయపడ్డారని పేర్కొంది. బాధితులకు ఆహారం అందజేస్తున్నట్లు శనివారం తెలిపింది. బఘ్లాన్, బాదాక్షాన్, ఘోర్, హెరాట్, టఖార్ ప్రావిన్స్‌ల్లో ఎక్కువ నష్టం సంభవించినట్లు తాలిబన్ ప్రభుత్వం తెలిపింది. బఘ్లాన్‌లో 131 మంది, టఖార్‌లో 20 మంది మరణించారని వెల్లడించింది. డజన్ల కొద్దీ గల్లంతయ్యారని కూడా తెలిపింది. బఘ్లాన్‌లో వరదల్లో చిక్కుకుపోయిన వారిని వైమానిక దళం సురక్షిత ప్రాంతాలకు తరలిస్తోందని తెలిపింది. 100 మందికి పైగా క్షతగాత్రులను సైనిక ఆస్పత్రులకు తరలించినట్లు రక్షణ శాఖ వివరించింది.

వైఎస్సార్‌సీపీ అభ్యర్థికి
అల్లు అర్జున్ మద్దతు..



శనివారం నంద్యాల ఎమ్మెల్యే అభ్యర్థి శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డితో కలిసి ప్రజలకు అభివాదం చేస్తున్న సినీహీరో అల్లు అర్జున్

బొమ్మలసత్రం: నంద్యాల వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి శిల్పా రవిచంద్రకిషోర్‌రెడ్డిని మంచి మెజారిటీతో గెలిపించాలని ప్రముఖ సినీ నటుడు అల్లు అర్జున్ పిలుపునిచ్చారు. శిల్పా రవిచంద్రకిషోర్‌రెడ్డికి మద్దతు తెలిపేందుకు అల్లు అర్జున్ తన భార్య స్నేహారెడ్డితో కలిసి శనివారం నంద్యాల వచ్చారు. ఆయనకు పట్టణ శివారులోని ఆటోనగర్ వద్ద అభిమానులు భారీ గజమాలలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం నంద్యాలలోని శిల్పా రవి నివాసానికి చేరుకుని వేలాదిగా తరలివచ్చిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, అభిమానులకు చాలాసేపు అభివాదం చేశారు. ఈ సందర్భంగా శిల్పా రవి నివాసంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో అల్లు అర్జున్ మాట్లాడారు. 'శిల్పా రవి నాకు మంచి మిత్రుడు. ఇలాంటి మంచి మనసున్న వారు రాజకీయాల్లో ఎదిగితే చాలా సంతోషిస్తాను. ఇన్నేళ్ల మా ఇద్దరి స్నేహంలో నన్ను ఎన్నికల ప్రచారం కోసం రావాలని ఏనాడూ రవి కోరలేదు. నేనే శిల్పా రవి కోసం ఏమైనా చేయాలనే ఆలోచనతో ఇక్కడికి వచ్చాను. నంద్యాలకు వస్తానంటే ఇంతదూరం రావొద్దని శిల్పా రవి చెప్పారు. ఇక్కడ అభిమానుల తాకిడి ఎక్కువగా ఉంటుందని చెప్పినా నేను వినలేదు. శిల్పా రవి మంచి మనసు, ఆయన కుటుంబ సభ్యులతో ఉన్న సాన్నిహిత్యమే నన్ను ఇంత దూరం వచ్చేలా చేసింది. నా మనసుకు నచ్చిన స్నేహితులు ఏ ఫీల్డ్‌లో ఉన్నా వారి అభివృద్ధిని కోరుకుంటాను. నాకు పార్టీలతో సంబంధం లేదు. మామూలుగా రాజకీయ నాయకులంటే గెలిచాక ఐదేళ్ల వరకు, మళ్లీ ఎన్నికలు వచ్చేంత వరకు ప్రజలకు కనిపించరు. కానీ శిల్పా రవి అలాకాదు... ఆయన ప్రాణం, మనసు నంద్యాల నియోజకవర్గంపైనే ఉంచారు. ఈ విషయం గత ఐదేళ్లుగా నాకు బాగా అర్థమైంది. నియోజకవర్గ అభివృద్ధి కోసం కష్టపడే శిల్పా రవిని కళ్లారా చూశాను. శిల్పా రవి మంచి మెజారిటీతో గెలవాలని ఆకాంక్షిస్తున్నాను. ప్రతి ఒక్కరూ శిల్పా రవికి ఓటు వేసి మంచి మెజారిటీతో గెలిపించాలని కోరుతున్నాను...' అని అల్లు అర్జున్ పేర్కొన్నారు.

అల్లు అర్జున్ రావడం సంతోషకరం..

అనంతరం శిల్పా రవిచంద్రకిషోర్‌రెడ్డి మాట్లాడుతూ అల్లు అర్జున్ తనకు మంచి మిత్రుడని, ఆయన రాజకీయాల్లో లేకున్నా ప్రజలకు మంచి చేసే వారిని ప్రోత్సహించడం ఆయనకు అలవాటని తెలిపారు. ఎంతో బిజీ షెడ్యూల్ ఉన్నప్పటికీ తనను గుర్తుంచుకుని అల్లు అర్జున్ ఇంతదూరం రావడం సంతోషంగా ఉందని, తనపై ఆయన నమ్మకాన్ని నిలబెట్టుకుని రాజకీయాల్లో మరింత ఉన్నత స్థితికి చేరుకునేలా పనిచేస్తానని శిల్పా రవి చెప్పారు.



యాదాద్రిలో మాజీ గవర్నర్
తమిళిసై పూజలు

యాదగిరిగుట్ట: తెలంగాణ మాజీ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ శనివారం సాయంత్రం యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్నారు. గర్భాలయంలో స్వయంభూ, ప్రతిష్ఠ అలంకారమూర్తులను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ముఖ మండపంలో సువర్ణ పుష్పార్చన పూజలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

కాంగ్రెస్, బీజేపీకి దీటుగా
బీఆర్‌ఎస్ ప్రచారం



16 రోజుల పాటు కేసీఆర్ బస్సు యాత్ర

- స్టార్ క్యాంపెయినర్లుగా కేటీఆర్, హరీశ్‌రావు
- చివరి రోజు సుడిగాలి పర్యటనలు చేసిన ఇద్దరు నేతలు
- జాతీయ పార్టీలు లక్ష్యంగా సాగిన ప్రసంగాలు

సాక్షి, హైదరాబాద్: ఈ పార్లమెంట్ ఎన్నికల్లో జాతీయ పార్టీలైన కాంగ్రెస్, బీజేపీకి దీటుగా భారత రాష్ట్ర సమితి (బీఆర్‌ఎస్) ప్రచార ఘట్టాన్ని ముగించింది. చివరి రోజైన శనివారం పార్టీ అధ్యక్షుడు కె.చంద్రశేఖర్‌రావు తెలంగాణ భవన్‌లో జరిగిన మీడియా సమా వేశంలో పాల్గొన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ స్టార్ ప్రచారకర్తలుగా ఉన్న వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు, మాజీ మంత్రి హరీశ్‌రావు చివరి రోజు ప్రచారంలో సుడిగాలి పర్యటనలు చేశారు. కేటీఆర్ శనివారం ఉదయం హుజూరా బాద్‌లో రోడ్‌షో, చెన్నూరులో జరిగిన బహిరంగ సభలో పాల్గొన్నారు. మధ్యాహ్నం యూసు ఫ్‌గూడ, ముషీరాబాద్‌లలో మైనారిటీలతో నిర్వహించిన సమావేశాలకు హాజరయ్యారు. మరో స్టార్ ప్రచారకర్త హరీశ్‌రావు గజ్వేల్‌లో రోడ్ షోలో పాల్గొన్నారు. తర్వాత సిద్దిపేటలో మీడియాతో మాట్లాడారు. గత నెల 24 నుంచి 16 రోజుల పాటు బస్సు యాత్ర ద్వారా ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న కేసీఆర్ 23 ప్రదేశాల్లో రోడ్ షోలకు హాజరై ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్, బీజేపీని లక్ష్యంగా చేసుకుని కేసీఆర్ ప్రసంగాలు కొనసాగాయి. రాష్ట్ర సాధనలో బీఆర్‌ఎస్ పాత్ర, పదేళ్ల పాటు అధికారంలో ఉండి సాధించిన ఫలితాలను ఆయన ప్రజలకు వివరించారు. అలాగే కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలు, సీఎంగా రేవంత్‌రెడ్డి పనితీరును ప్రశ్నిస్తూ కేసీఆర్ ప్రసంగాలు సాగాయి. ప్రధాని మోదీ వ్యవహారశైలి, కేంద్రంలో బీజేపీ విధానాల పైనా కేసీఆర్ తన ఎన్నికల ప్రచారంలో విరుచుకుపడ్డారు. కేంద్రంలో ఎన్డీయే, ఇండియా కూటమి అధికారంలోకి వచ్చే పరిస్థితి లేదని చెప్తూ.. బీఆర్‌ఎస్‌కు మెజారిటీ స్థానాలు ఇస్తే కేంద్రంలో ప్రాంతీయ పార్టీల కూటమి ఏర్పాటుకు ప్రయత్నిస్తానని వివరించే ప్రయ త్నం చేశారు. మరోవైపు కేటీఆర్ సికింద్రాబాద్, మల్కాజిగిరి, చేవెళ్ల నియోజక వర్గాలపై ఎక్కువగా దృష్టి కేంద్రీకరించి పనిచే శారు. హరీశ్‌రావు మెదక్, జహీరాబాద్ లోక్ సభ నియోజకవర్గాల ప్రచారంపై దృష్టి కేంద్రీకరించారు. ఎన్నికల షెడ్యూలు వెలువ డక ముందు కరీంనగర్, చేవెళ్లలో బహిరంగ సభ లు నిర్వహించిన బీఆర్‌ఎస్, ఆ తర్వాత రోడ్ షోలకు మాత్రమే ప్రాధాన్యాన్ని ఇచ్చింది. వేసవి తీవ్రతను దృష్టిలో పెట్టుకుని కేవలం సాయంత్రం సమయాల్లో మాత్రమే రోడ్ షోలు నిర్వహించారు.

మా తల తెగిపడ్డా.. బీజేపీకి తలవంచం



చెన్నూర్‌లోని బేతాళవాడలోని బీఆర్‌ఎస్ కార్యకర్త ఇంట్లో భోజనం చేస్తున్న కేటీఆర్, మాజీ ఎమ్మెల్యేలు



హుజూరాబాద్ రోడ్‌షోకు హాజరైన బీఆర్‌ఎస్ శ్రేణులు. (ఇన్‌సెట్‌లో) కేటీఆర్, వినోద్, కౌశిక్‌రెడ్డి

▶ మొదటి పేజీ తరువాయి

ఎదుర్కోవడం లేదని చెప్పారు. మైనార్టీలు, పేదల సంక్షేమం కోసం బీఆర్‌ఎస్ నిజాయితీగా పనిచేస్తుందన్నారు. కేసీఆర్‌పాలనలో మతసామరస్యానికి లోటు లేదని, కేసీఆర్ మతం పేరుతో రాజకీయాలు చేయలేదన్నారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు అడ్డదారిలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలను బీజేపీ కొనుగోలు చేసేందుకు ప్రయత్నిస్తే బీజేపీ నాయకులపై కేసులు నమోదు చేసి జైలుకు పంపామని గుర్తు చేశారు.

పదేళ్ల మోదీ పాలన విషం

'పదేళ్ల నిజం కేసీఆర్ పాలన.. పదేళ్ల విషం మోదీ పాలన.. 150 రోజుల అబద్ధాలు కాంగ్రెస్ పాలన.. ఎంపీ బండి సంజయ్ ఐదేళ్లపాటు గాలి తిరుగుళ్లు తిరిగిండు. అతనితోని బుడ్డ పైసా పనికాలే. మోదీ పదేళ్లలో ఒక్క పనీ చేయకుండా గుడి కట్టినం ఓటేయమని అంటుండు. చేనేతలకు జీఎస్టీ వేసిన మొదటి ప్రధాని మోదీ. నేతన్నలు, రైతులకు, దేశానికి ఒక్కరికీ మంచి చేసింది లేదు. మోదీ వచ్చినంక మొత్తం ధరలు పెంచాడు. రేవంత్‌రెడ్డి రైతు భరో సా, రైతు రుణమాఫీ, బోనస్, 2లక్షల ఉద్యోగాలు, తులం బంగారం, స్కూటీలు, మహిళలకు రూ. 2500, పెద్ద మనుషులకు రూ.4వేలు అని చెప్పిండు. చెప్పిందాంట్లో ఒక్కటైనా అమలు చేసిండా? లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు 10–12 సీట్లు ఇస్తే 6 నెలల్లో మళ్లీ కేసీఆర్ రాష్ట్ర రాజకీయాలను శాసిస్తారు. హైదరాబాద్‌ను కేంద్రపాలిత ప్రాంతం చేసే కుట్ర చేస్తున్నారు. అందుకే, పార్లమెంట్‌లో గల్లా పట్టి అడిగే ఎంపీలు ఉండాలె'అని కేటీఆర్ పేర్కొన్నారు.

సింగరేణిని అమ్మేస్తారు..

కాంగ్రెస్, బీజేపీలకు ఓట్లు వేస్తే సింగరేణిని అమ్మేస్తారని, ప్రధాని మోదీ అండతో సీఎం రేవంత్‌రెడ్డి స్విట్జర్లాండ్‌తో ఒప్పందం చేసుకున్నారని కేటీఆర్ ఆరోపించారు. పెట్రోల్‌పై 34 శాతం అదనపు పన్ను వేసి పదేళ్లలో రూ.30 లక్షల కోట్లు దోచుకున్నారని మండిపడ్డారు. అదానీ, అంబానీలకు రూ.15 లక్షల కోట్లు రుణమాఫీ చేశారని, ఇది తప్పని నిరూపిస్తే తాను ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని బీజేపీ నాయకులకు కేటీఆర్ సవాల్ విసిరారు. ఆ రెండు పార్టీలకు ఓట్లు వేస్తే సింగరేణిని అదానీకి ఇచ్చేస్తారని, బీఆర్‌ఎస్ అభ్యర్థులను ఎంపీలుగా గెలిపిస్తే ఢిల్లీ మెడలు వంచి ప్రైవేటీకరణ ఆపుతామని చెప్పారు. కేసీఆర్ ఉన్నప్పుడే బాగుండే అని, కారు గుర్తుకు ఓటేయాలని కోరారు. 'ముఖ్యమంత్రి చిల్లర మాటలు మాట్లాడితే, రోషంతో నా తమ్ముడు సుమన్ చెప్పు తీసి కొడతా అన్నాడు'అని కేటీఆర్ పేర్కొన్నారు. కాగా, చెన్నూర్‌లో ప్రజా ఆశీర్వాద సభకు హాజరైన కేటీఆర్ స్థానిక బేతాళవాడలో పార్టీ దళిత కార్యకర్త ఎనగందుల ప్రశాంత్ ఇంట్లో భోజనం చేశారు. ఆయా కార్యక్రమాల్లో బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థులు టి.పద్మారావు గౌడ్ (సికింద్రాబాద్), వినోద్‌కుమార్ (కరీంనగర్), కొప్పుల ఈశ్వర్ (పెద్దపల్లి) తదితరులు పాల్గొన్నారు.

రేవంత్.. మోదీకి అనుకూలమా?

ఒకవైపు రాహుల్ ప్రధాని మోదీని విమర్శిస్తుంటే సీఎం రేవంత్‌రెడ్డి మాత్రం పెద్దన్న అంటూ పొగుడుతున్నారని కేటీఆర్ చెప్పారు. లిక్కర్ స్కాంలేదు కేజ్రీవాల్‌ను అన్యాయంగా అరెస్టు చేశారని రాహుల్ అంటుండగా, లిక్కర్ స్కాం జరగడం వల్లనే కేసీఆర్ కూతురు కవితను అరెస్టు చేశారని రేవంత్ అంటున్నారని.. అసలు ఆయన రాహుల్‌కు అనుకూలమా, లేక మోదీకి అనుకూలమా ప్రజలకు చెప్పా లని డిమాండ్ చేశారు. బీజేపీ, కాంగ్రెస్ రెండూ ఒకటేనని, ముస్లింలు ఆయా పార్టీలు చెప్పే మాయమాటలను నమ్మొద్దని కేటీఆర్ అన్నారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ మాయమాటలు చెప్పి గద్దెనెక్కిందని, అనంతరం ముస్లింలను మరచిపోయారన్నారు.

ప్రధాని రేసులో ఉంటా!



▶ మొదటి పేజీ తరువాయి

పైరవీల కోసమే కొందరు కాంగ్రెస్‌లోకి వెళ్తున్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కేసీఆర్ ప్రళయ గర్జన చూస్తారు.

ఫోన్ ట్యాపింగ్‌తో సంబంధం లేదు..

ప్రభుత్వంలో వందల మంది అధికారులు ఉంటారు. అందులో ఒకరైన రాధాకిషన్‌రావు ఎవరు? ఫోన్ ట్యాపింగ్‌కు సీఎంకు ఏం సంబంధం? గూఢచార వ్యవస్థ లేని ప్రభుత్వం ఉండదు. నిఘా విభాగం నుంచి ప్రభుత్వం కేవలం సమాచారం మాత్రమే కోరుతుంది. ట్యాపింగ్ పూర్తిగా పోలీసు విభాగం అంతర్గత విషయం. టెలిగ్రాఫ్ యాక్ట్ ప్రకారం.. హోంశాఖ కార్యదర్శి అనుమతితోనే ట్యాపింగ్ జరుగుతుంది.

రేవంత్‌వి చిల్లర రాజకీయాలు

రైతు భరోసా, ఉద్యోగులకు 51 శాతం ఫిట్‌మెంట్, నాలుగు విడతల డీఏ విడుదల వంటివి ఉండగా రైతులకు రూ.40 వేల కోట్ల రుణమాఫీ సాధ్యం కాదు. ప్రజలను భ్రమల్లో పెట్టేందుకు రేవంత్ చేస్తున్న ప్రయత్నం సఫలం కాదు. మేం ఎంతో ఆలోచించి ఏర్పాటు చేసిన జిల్లాలను రద్దు చేస్తే.. ప్రజల నుంచి వ్యతిరేకత తప్పదు. భాష విషయంలో రేవంత్ వ్యాఖ్యలు దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉంది. రేవంత్ ఓటుకు నోటు దొంగ, బ్లాక్ మెయిలర్, భూ కబ్జాకోరు. ఆయన చేతకానితనంతోనే రాష్ట్రానికి రావాల్సిన పెట్టుబడులు ఇతర రాష్ట్రాలకు వెళ్లిపోతున్నాయి. ప్యారగాన్ చెప్పులు లేని కుటుంబం ఎవరిదో ప్రజలకు తెలుసు. రేవంత్‌వి చిల్లర రాజకీయాలు. ఆరు నెలల పాలనలో ఆరోగ్యం, విద్యుత్, వ్యవసాయ, చేనేత తదితర రంగాల్లో కాంగ్రెస్ పూర్తిగా విఫలమైంది. ఇదే లోక్‌సభ ఎన్నికల్లో ఆ పార్టీని ముంచుతుంది..'' అని కేసీఆర్ పేర్కొన్నారు.

యాదాద్రిలో బ్రేక్ దర్శనం టిక్కెట్ల విక్రయం



రూ.300 బ్రేక్ దర్శనం టిక్కెట్ల విక్రయ కౌంటర్

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి వచ్చే భక్తులు బ్రేక్ దర్శనాల టికెట్లను సులువుగా పొందేందుకు తూర్పు మాడవీధిలోని అష్టభుజి ప్రాకార మండపంలో నూతన బ్రేక్ దర్శన టికెట్ విక్రయశాలను అధికారులు ప్రారంభించా రు. గతంలో ఆ స్థలంలో రూ.150 టికెట్లు విక్రయించేవారు. వీఐపీ పార్కింగ్ ఎదురుగా మెయిన్ బుకింగ్ కౌంటర్ ప్రారంభించిన తరువాత బుకింగ్ కౌంటర్ వద్ద, ప్రొటోకాల్ కార్యాలయంలో రూ. 300 బ్రేక్ దర్శనం టికెట్లను భక్తుల కొనుగోలు చేసేవారు. దీనిపై అవగాహన ఉన్న భక్తులు మాత్రమే ఇక్కడికి వచ్చి బ్రేక్ దర్శనం టిక్కెట్లు కొ నుగోలు చేసి, ఉత్తర రాజగోపుర ద్వారం నుంచి ద ర్శనానికి వెళ్లేవారు. కానీ.. భక్తులందరూ ఈ టికెట్ సౌకర్యం పొందాలన్న ఈవో భాస్కర్‌రావు ఆదే శాలతో అష్టభుజి ప్రాకార మండపంలో నూతన రూ.300 టిక్కెట్ కౌంటర్‌ను ప్రారంభించారు.

నేడు రత్యాతండాకు మాజీ సీఎం కేసీఆర్

- రవీంద్రనాయక్ తండ్రి అంత్యక్రియలకు హాజరు

సాక్షి, హైదరాబాద్: దేవరకొండ మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు రమావత్ రవీంద్ర కుమార్ నాయక్ తండ్రి రమావత్ కనీలాల్ నాయక్ మరణం పట్ల బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ సంతాపం ప్రకటించారు. రవీంద్రకుమార్ నాయక్, వారి కుటుంబ సభ్యులకు కేసీఆర్ ప్రగాఢ సానుభూతి తెలిపారు. దివంగత కనీలాల్ నాయక్.. ప్రభుత్వ ఉద్యోగిగా సేవలందించి పదవీ విరమణ పొందారు. అనంతర కాలంలో దేవరకొండ మండలంలోని తమ స్వగ్రామం రత్యాతండా సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం రత్యాతండాలో ఆయన అంత్యక్రియలు జరగనున్నాయి. ఈ సందర్భంగా కేసీఆర్ రత్యాతండాకు వెళ్లి కనీలాల్ పార్థివదేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించనున్నారు.

మంత్రి జూపల్లి అక్రమ కేసులు పెట్టిస్తున్నారు

నాగర్‌కర్నూల్ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్



మాట్లాడుతున్న ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి

సాక్షి, నాగర్‌కర్నూల్: నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గంలో మంత్రి జూపల్లి కృష్ణారావు అధికారాన్ని అడ్డుపెట్టుకుని బీఆర్‌ఎస్ నేతలపై అక్రమ కేసులు పెట్టిస్తున్నారని నాగర్‌కర్నూల్ లోక్‌సభ నియోజకవర్గం బీఆర్‌ఎస్ అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డితో కలసి జిల్లాకేంద్రంలో రోడ్‌షో నిర్వహించారు. నియోజకవర్గంలో అధికారులు, పోలీసులు అధికార పార్టీ నేతలకు వత్తాసు పలుకుతున్నారని ఆరోపించారు. మంత్రి జూపల్లి కృష్ణారావు ఆధ్వర్యంలో ఎన్నికల్లో విచ్చలవిడిగా మద్యం, డబ్బు పంపిణీ చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ఎన్నికల నిబంధనల పేరుతో బీఆర్‌ఎస్ నేతల వాహనాలను పదేపదే తనిఖీ చేస్తున్న పోలీసులు, కాంగ్రెస్ పార్టీ నేతల వాహనాలను మాత్రం తనిఖీ చేయడం లేదని ధ్వజమెత్తారు. ఉమ్మడి జిల్లాలోని వనపర్తి, జోగులాంబ గద్వాల జిల్లాను రద్దు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కుట్రపన్నుతోందని ప్రవీణ్‌కుమార్ ఆరోపించారు. జిల్లాలను రద్దు చేస్తే ప్రజలతో కలసి ఉద్యమాలను చేపడతామని హెచ్చరించారు. మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ.. లోక్‌సభ ఎన్నికల్లో ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను గెలిపించాలని కోరారు.

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి...

రంగంలోకి రానంత వరకూ కథ వేరు. అది పారిశ్రామికమైనా.. రాజకీయమైనా! ఒక సిమెంట్ కంపెనీని పెట్టి, అతి తక్కువ కాలంలో ఉత్పత్తి ఆరంభించి.. ఆరంభించిన ఏడాదిలోనే దాన్నొక అద్భుతమైన బ్రాండ్‌గా తీర్చిదిద్ది.. విదేశీ కంపెనీలు వాటా కోసం పోటీ పడ్డాయంటే.. అదీ చరిత్ర.

'సాక్షి' పత్రికైనా అంతే. ఓ అసాధ్యాన్ని సాధ్యం చేస్తూ జరిగిన ఆరంభమే ఆ రంగంలో పాతుకుపోయిన పోటీ పత్రికల పునాదుల్ని పెకలించేసింది. ఎంతగా అంటే.. అంతా కలిసి అసలు 'సాక్షి'నే లేకుండా చేయాలని పన్నాగం పన్నేంతలా! అదీ చరిత్రంటే.

రాజకీయాల్లోకి జగన్ రావటంతోనే నియమాలూ మారాయి. అప్పటిదాకా మేనిఫెస్టో అంటే ఓ కాగితం. ఎన్నికల్లో గెలవటానికి ఏ అబద్ధమైనా చెప్పొచ్చనేది సహజ సూత్రం. జనాన్ని నమ్మించి అధికారంలోకి వచ్చాక, అదిగేదెవరనేది నాటి నాయకుల ధైర్యం. దాన్ని సంస్కరించటంతో జగన్ ప్రస్థానం మొదలైంది. 2014 ఎన్నికల్లో రైతుల రుణాలన్నీ మాఫీ చేస్తానని చంద్రబాబు నాయుడు హామీ ఇవ్వటంతో.. ఆ హామీని రైతులంతా నమ్ముతున్నారనే విషయం వైఎస్సార్‌సీపీకి అర్థమైంది. మనమూ ఇవ్వాలంటూ జగన్‌పై పార్టీలో ఒత్తిడి పెరిగినా, అది అమలు చేయటం సాధ్యం కాదు కనక హామీ ఇవ్వలేనని నిక్కచ్చిగా చెప్పారాయన. పాపం.. బాబుని నమ్మి ఓట్లేసిన జనానికి ఆ తర్వాత తెలిసింది యథా ప్రకారం తామంతా మోసపోయామని. అందుకే 2019 ఎన్నికల్లో జగన్‌కు బ్రహ్మరథం పట్టారు. ఇచ్చిన ప్రతి హామీనీ నెరవేర్చి, సాధ్యం కాని ఒకటి రెండింటికి కూడా కొంత వరకు పరిష్కారాన్ని కనుగొని.. దాన్ని నిజాయితీగా అంగీకరించిన వ్యక్తిత్వం జగన్‌ది. అందుకే తనకు తాను 99 మార్కులు వేసుకున్నారు.

కుటుంబానికన్నా ఎక్కువగా జనాన్ని ప్రేమించటం.. వారి విద్య, వైద్యం, గృహం వంటి కనీసావసరాలకు పెద్దపీట వేయటం.. ఆఖరి దశలోనూ ఎవరిపైనా ఆధార పడకుండా అవ్వాతాతలకు భరోసా ఇవ్వటం.. మహిళలు సొంత కాళ్లపై నిలబడేలా చేయటం ఇప్పుడు రాష్ట్రం చూస్తున్న కొత్త చరిత్ర. ఇప్పుడాయన ఓ స్వప్నాన్ని ఆవిష్కరిస్తున్నారు. విదేశీ వర్సిటీల్లో ప్రతిష్టాత్మకమైన కోర్సులు పూర్తి చేసిన రాష్ట్ర యువత.. బలమైన గ్రోత్ ఇంజిన్ లాంటి విశాఖ నగరం.. అక్కడ ఐకానిక్ బిల్డింగ్‌లు.. పెద్ద ఎత్తున వచ్చే ఐటీ, ఇతర పరిశ్రమలు.. కోస్తా తీరమంతటా విరాజిల్లే 'బ్లూ' ఎకానమీ. వచ్చే కొన్నేళ్లలో దీన్ని సాకారం చేయబోతున్నారు కూడా!.

విశ్వసనీయత.. మీ ఓటు దేనికి? వంచన..



సీఎం జగన్ వ్యక్తిత్వం



చంద్రబాబు వ్యక్తిత్వం

సీఎం వైఎస్ జగన్ నిజాలే మాట్లాడతారు. అబద్ధాలు చెప్పరు. చేయగలిగిందే చెప్పడం.. ఇచ్చిన మాటకు కట్టుబడటం.. దాన్ని నిలబెట్టుకోవడం కోసం ఎందాకైనా పోరాటం చేయడం.. జనంతో మమేకమవడం సీఎం జగన్ విధానం. మిగిలిన సమయాన్ని కుటుంబంతో గడుపుతారు. ప్రైవేటు జీవితం అంటూ సీఎం జగన్‌కు లేదు. ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడూ.. అధికారంలోకి వచ్చాక కూడా ఇదే విధానం. తన తండ్రి, మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి మరణించాక.. ఆ వార్త విని తాళలేక గుండె పగిలి మరణించిన వారి కుటుంబాలను ఓదార్చేందుకు ఓదార్పు యాత్ర చేపట్టారు. కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ, టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు కుమ్మక్కై అక్రమ కేసులు బనాయించి.. 16 నెలలపాటు జైల్లో అక్రమంగా నిర్బంధించినా ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడం కోసం సీఎం జగన్ వెనక్కి తగ్గలేదు. ప్రజా సమస్యలపై నిత్యం పోరాటాలు చేశారు. ప్రతిపక్ష నేతగా ప్రజలకు వెన్నుదన్నుగా నిలిచారు. ప్రజా సంకల్ప పాదయాత్రలో 14 నెలలపాటు ప్రజల్లోనే గడిపారు. అధికారంలోకి వచ్చాక.. రోజువారీ పరిపాలన.. సమీక్షలు, ప్రజలతో మమేకమవడం.. మిగిలిన సమయం కుటుంబంతో గడపడం సీఎం దినచర్య. కుటుంబ రాజకీయాలకు సీఎం జగన్ వ్యతిరేకం. వీటి వల్ల అనవసరమైన ఆరోపణలు ఎదుర్కోవాల్సి వస్తుందన్నది సీఎం జగన్ నిశ్చితాభిప్రాయం.

నిజాలే మాట్లాడటం సీఎం జగన్ విధానం

- చెప్పిన అబద్ధమే వంద సార్లు చెప్పడం చంద్రబాబు పద్ధతి
- నైతిక విలువలతో రాజకీయాలు చేస్తున్న సీఎం జగన్
- ఫక్తు వ్యాపారంగా మార్చేసిన చంద్రబాబు
- సీఎం జగన్ ఇచ్చిన మాటపై నిలబడే రకం
- నమ్మించి నట్టేట ముంచడం చంద్రబాబు నైజం
- నిజమైన విజనరీ జననేత జగన్..
- ఎల్లో మీడియా చిత్రీకరించిన నకిలీ విజనరీ బాబు
- సంస్కరణలతో సీఎం జగన్ సుపరిపాలన
- చంద్రబాబు పాలన ఆద్యంతం అక్రమార్జన
- పరిపాలన దక్షతతో కరోనా మహమ్మారిపై జగన్ జయభేరి
- చంద్రబాబు ప్రచార పిచ్చితో హుద్‌హుద్ బాధితులకు ఇక్కట్లు.. విభజిత రాష్ట్రాన్ని దోపిడీతో ఆర్థికంగా ఛిద్రం చేసిన చంద్రబాబు
- బాబు తీరుతో గాడి తప్పిన రాష్ట్రాన్ని తిరిగి గాడిలో పెట్టిన ఘనత సీఎం జగన్‌దే
- ఈ ఐదేళ్లలో ఏ రంగం తీసుకున్నా స్పష్టమైన మార్పు

మచ్చుకైనా నిజాన్ని చెప్పకపోవడం.. ఒక అబద్ధాన్ని వంద సార్లు చెప్పడం ద్వారా నిజం చేయవచ్చునన్నది చంద్రబాబు విధానం. సెల్ ఫోన్‌ను నేనే కనిపెట్టా.. కంప్యూటర్‌ను నేనే తెచ్చా.. హైదరాబాద్‌ను నేనే కట్టా.. అంటూ బీరాలు పలకడమే అందుకు నిదర్శనం. ఇచ్చిన మాటకు కట్టుబడకపోవడం.. ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడవడంలో సహకరించిన కుటుంబ సభ్యులు హరికృష్ణ, దగ్గుబాటి వెంకటేశ్వరరావు వంటి వారితో పాటు ఎవరినైనా నమ్మించి నట్టేట ముంచడం చంద్రబాబు నైజం. వారసత్వ రాజకీయాలకు.. కుటుంబ రాజకీయాలకు చంద్రబాబు ఆద్యుడు. సర్పంచుగా కూడా గెలవని తన కుమారుడు నారా లోకేశ్‌ను 2017లో ఏకంగా మంత్రిని చేసి.. నాలుగు కీలక శాఖలను కట్టబెట్టారు. వియ్యంకుడు బాలకృష్ణను హిందూపురం శాసనసభ స్థానం.. లోకేశ్ తోడల్లుడు భరత్‌ను విశాఖపట్నం లోక్‌సభ స్థానం నుంచి బరిలోకి దించారు.

ఎవరు విజనరీ?

సీఎం జగన్

ఓదార్పు యాత్ర నుంచి ప్రజాసంకల్ప పాదయాత్ర వరకు నిత్యం జనంతో మమేకమవుతూ వచ్చిన వైఎస్ జగన్.. ప్రజా సమస్యలను, రాష్ట్ర సమగ్రాభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలను గుర్తించారు. విద్య, వైద్యం కోసం అధిక శాతం కుటుంబాలు ఎక్కువగా ఖర్చు చేయాల్సిన పరిస్థితులు ఉత్పన్నమవడం వల్ల రుణాల ఊబిలో కూరుకుపోతున్నారని పసిగట్టారు. అధికారంలోకి వచ్చాక సమస్యలను పరిష్కరించి మెరుగైన సమాజాన్ని నిర్మించడమే లక్ష్యంగా.. రాష్ట్ర సమగ్రాభివృద్ధే ధ్యేయంగా రూపొందించుకున్న ప్రణాళికలను అమలు చేస్తున్నారు. సంక్షేమ పథకాల ద్వారా డబ్బులను పేదలకు పంచి పెడుతున్నారని పెత్తందార్లు చేస్తున్న విమర్శల్లో అర్థం లేదు. సీఎం జగన్ ప్రారంభించిన ప్రతి పథకానికి ఒక లక్ష్యం ఉంది. ఆర్థిక వేత్తలంతా ఇదే సరైన విధానమని ప్రశంసిస్తున్నారు.

చంద్రబాబు

ఉమ్మడి రాష్ట్రంలో ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచి 1995లో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు.. ఏలేరు భూ కుంభకోణం నుంచి ఐఎంజీ భారత్ కుంభకోణం వరకు అనేక స్కాంలకు పాల్పడ్డారు. వాటి నుంచి ప్రజల దృష్టి మళ్లించడం కోసం చంద్రబాబును ఎల్లో మీడియా విజనరీగా చిత్రీకరిస్తూ వచ్చింది. దాన్ని అందిపుచ్చుకున్న చంద్రబాబు విభజన తర్వాత తానో విజనరీ అంటూ ఊదరగొడుతూ వస్తున్నారు. రామోజీరావుకు చెందిన ఈటీవీకి ఆ మధ్య ఇచ్చిన ఇంటర్వ్యూలో తానో విజనరీనని సెల్ఫ్ సర్టిఫికెట్ ఇచ్చుకున్నారు. అమరావతిలో ఐదు డిగ్రీల ఉష్ణోగ్రత తగ్గించేందుకు సెంట్రల్ కూలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించానని చంద్రబాబు చెప్పడంతో మీడియా ప్రతినిధి నిర్ఘాంతపోయారు.

విశ్వసనీయత

సీఎం జగన్



- 'రాజకీయ నాయకుడు విశ్వసనీయత కోల్పోతే.. రాజకీయాలలో విశ్వసనీయత అన్న పదానికి అర్థం లేకపోతే రాజకీయాలు ఎందుకు చేయడం? ఎవరి కోసం? దేని కోసం?' అంటారు సీఎం జగన్. చనిపోయిన తర్వాత కూడా ప్రతి పేదవాడి ఇంట్లో తన ఫొటో.. ప్రతి పేదవాడి గుండెల్లో తాను బతికి ఉండాలన్నదే సీఎం జగన్ సిద్ధాంతం. అమలు చేయగలిగిన హామీలు మాత్రమే ఇవ్వడం.. ఇచ్చిన మాటకు కట్టుబడటం సీఎం జగన్ నైజం.
- విభజన తర్వాత 2014లో జరిగిన ఎన్నికల్లో వ్యవసాయ రుణాలు మాఫీ చేస్తానని చంద్రబాబు ప్రకటించిన సందర్భంలో.. వైఎస్సార్‌సీపీ నేతలు, శ్రేయోభిలాషులు పలువురు రూ.50 వేల వరకు రుణ మాఫీ ప్రకటించాలని వైఎస్ జగన్‌పై ఒత్తిడి తెచ్చారు. ఆచరణ సాధ్యం కాని హామీని తాను ఇవ్వలేనని అప్పట్లో వైఎస్ జగన్ తేల్చి చెప్పారు. చంద్రబాబు ఇచ్చిన అలవికాని హామీల వల్ల కేవలం ఐదు లక్షల ఓట్ల తేడాతో వైఎస్ జగన్ అప్పట్లో అధికారంలోకి రాలేకపోయారు.
- 2019 ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల్లో 99 శాతం అమలు చేశారు. ఇది సీఎం జగన్ చెప్పాడంటే చేస్తాడంతే అన్న నమ్మకం ప్రజల్లో బలంగా నాటుకుపోవడానికి దారితీసింది. ప్రస్తుత ఎన్నికల్లో కూడా అమలు చేయదగిన హామీలతోనే ఎన్నికల మేనిఫెస్టోను సీఎం జగన్ విడుదల చేశారు.

చంద్రబాబు



- మోసమే ఆస్తిగా.. వెన్నుపోటే పెట్టుబడిగా రాజకీయాల్లో ఎదిగిన నేత చంద్రబాబు. ఎన్నికలప్పుడు అలవికాని హామీలు ఇవ్వడం.. అధికారంలోకి వచ్చాక వాటిని తుంగలో తొక్కి ప్రజలను మోసం చేయడం చంద్రబాబు నైజం. ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచి అధికారంలోకి వచ్చాక 1999 ఎన్నికల్లో కోటి మందికి ఉపాధి, 35 లక్షల ఇళ్లు నిర్మిస్తానని చంద్రబాబు హామీ ఇచ్చారు. వాజ్‌పేయిపై వీచిన సానుభూతి పవనాల్లో అధికారంలోకి వచ్చాక వాటిని అమలు చేయకుండా ప్రజలను మోసం చేశారు.
- విభజన నేపథ్యంలో చంద్రబాబు 2014 ఎన్నికల్లో వ్యవసాయ రుణాలు మాఫీ, డ్వాక్రా రుణాల మాఫీ, ఇంటికో ఉద్యోగం లేదా నెలకు రూ.2 వేల నిరుద్యోగ భృతి వంటి 650 హామీలు ఇచ్చారు. మోదీ ప్రభంజనంలో అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని తుంగలో తొక్కి ప్రజలను మోసం చేసిన ఘనత ఈ పెద్దమనిషిదే. చెప్పిన మాటకు కట్టుబడి ఉండకపోవడం చంద్రబాబు నైజం. చంద్రబాబు అంటే మోసం చేస్తాడనే అభిప్రాయం ప్రజల్లో బలంగా నాటుకుపోయింది.

నైతిక విలువలు

సీఎం జగన్: నైతిక విలువలతో కూడిన రాజకీయాలు చేయాలన్నది సీఎం జగన్ విధానం. మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి మరణించాక.. ఆ మరణవార్త విని గుండెలు పగిలి మరణించిన వారి కుటుంబాలను పరామర్శిస్తానని వైఎస్ జగన్ అప్పట్లో మాట ఇచ్చారు. ఓదార్పు యాత్ర చేపట్టడానికి కాంగ్రెస్ నిరాకరించడంతో ప్రజలకు ఇచ్చిన మాట కోసం, మహానేత వైఎస్ ఆశయ సాధన కోసం కాంగ్రెస్‌ను వీడి వైఎస్సార్‌సీపీని స్థాపించారు. వైఎస్సార్‌సీపీలో చేరాలంటే.. ఎవరైనా ఆ పార్టీ నుంచి సంక్రమించిన ఎమ్మెల్యే, ఎంపీ పదవులకు రాజీనామాలు చేయాలని షరతు విధించారు. అదే విధానానికి కట్టుబడ్డారు.

చంద్రబాబు: ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచి 1995లో చంద్రబాబు అధికారంలోకి వచ్చిందే ఎమ్మెల్యేలను ప్రలోభపెట్టి. ఓటుకు నోటును అలవాటు చేసి రాజకీయాలను ఫక్తు వ్యాపారం చేసిన ఘనత చంద్రబాబుదే. దేశంలో తొలి సారిగా 1996 లోక్‌సభ ఎన్నికల్లో ఓటుకు నోటును ఎరగా వేసి.. ఆ తర్వాత అలవాటు చేసిన చరిత్ర బాబుది. విభజన తర్వాత 2014లో అధికారంలోకి వచ్చి.. వైఎస్సార్‌సీపీని దెబ్బ తీసేందుకు 23 మంది ఎమ్మె ల్యేలను సంతలో పశువుల్లా కొనుగోలు చేయడమే కాకుండా, ఏకంగా ఫిరాయింపు ఎమ్మెల్యేలకు మంత్రివర్గంలో స్థానం కల్పించి రాజ్యాంగాన్ని అపహాస్యం చేశారు. తెలంగాణ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటుకు కోట్లు కేసులో కోట్ల కట్టలు, ఆడియో వీడియో టేపులతో తెలంగాణ ప్రభుత్వానికి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డ చంద్రబాబు.. ఆ కేసు నుంచి తప్పించుకోవడానికి రాత్రికి రాత్రే హైదరాబాద్ నుంచి పారిపోయి వచ్చి ఉండవల్లిలోని కృష్ణా నది కరకట్టపై ఉన్న అక్రమ కట్టడంలో తల దాచుకున్నారు. అంతెందుకు ఆర్నెల్ల క్రితం శాసనసభ్యుల కోటాలో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ ఓటుకు కోట్లను ఎరవేశారు.

నిబద్ధత..

సీఎం జగన్


ఆంధ్ర-ఒడిశా సరిహద్దు ప్రాంతమైన (ఏవోబీ) వై.రామవరం మండలం చాపరాయిలో 2017 జూన్ 30న విష జ్వరాలు ప్రబలి 17 మంది గిరిజనులు మృత్యువాత పడ్డారు. కానీ.. ప్రభుత్వం పట్టించుకోలేదు. అప్పటి ప్రతిపక్ష నేత అయిన వైఎస్ జగన్ 2017 జూలై 1న పోలీసులు వారిస్తున్నా వినకుండా అటవీ ప్రాంతంలో సముద్ర మట్టానికి 1750 మీటర్ల ఎత్తులో ఉన్న చాపరాయికి వెళ్లారు. విష జ్వరాలు ప్రబలి 17 మంది గిరిజనులు కన్ను మూయడానికి దారితీసిన పరిస్థితులను వెలుగులోకి తెచ్చారు. తాను అధికారంలోకి వస్తే.. గిరిజన ప్రాంతాల్లో వైద్య సౌకర్యాలను మెరుగు పరుస్తానని హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చాక గిరిజన ప్రాంతాల్లో ప్రభుత్వ ఆస్పత్రుల్లో మౌలిక సదుపాయాలను మెరుగు పరచడంతోపాటు ఖాళీలను భర్తీ చేశారు. స్పెషలిస్టు డాక్టర్లను నియమించారు. గిరిజన ప్రాంతాల్లో ఐదు సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులు, ఒక మెడికల్ కాలేజీని నిర్మిస్తున్నారు. సీఎం జగన్ నిబద్ధతకు ఇదో తార్కాణం మాత్రమే.

చంద్రబాబు

గోదావరి పుష్కరాల ప్రారంభోత్సవం రోజున అంటే 2015 జూలై 14న రాజమహేంద్రవరంలో అప్పటి సీఎం చంద్రబాబు ప్రచార పిచ్చితో స్నానాలు చేసేందుకు ఒకేసారి భక్తులను వదలడంతో తొక్కిసలాట జరిగి 29 మంది దుర్మరణం పాలయ్యారు. కనీసం ఈ దుర్ఘటనపై చంద్రబాబు పశ్చాత్తాపం కూడా వ్యక్తం చేయలేదు. మీ ప్రచార పిచ్చితో 29 మందిని బలిగొన్నారు కదా.. అని చంద్రబాబును మీడియా ప్రశ్నిస్తే.. కుంభమేళాలో చచ్చిపోవడం లేదా.. గోదావరి పుష్కరాల్లోనే చచ్చిపోయారా? గోరంతలు కొండంతలు చేస్తారా? అంటూ రంకెలేయడం విస్మయానికి గురిచేసింది. ప్రచారపిచ్చితో 2022 డిసెంబర్ 29న కందుకూరులో ఇరుకుసందులో చంద్రబాబు సభ నిర్వహించడం వల్ల తొక్కిసలాటలో 9 మంది మరణించారు. అయినా సరే ఆ సభను నిర్వహించడం ద్వారా ప్రజల పట్ల తనకు ఎంత నిబద్ధత ఉందో చంద్రబాబు చాటి చెప్పుకున్నారు.

ఆర్థికవేత్త

సీఎం జగన్



సీఎం జగన్ అధికారంలోకి వచ్చే నాటికి అంటే 2019 మే 30కి ప్రభుత్వ ఖజానాలో రూ.వంద కోట్లు మాత్రమే మిగిలాయి. చంద్రబాబు దోపిడీతో గాడితప్పిన ఆర్థిక వ్యవస్థను దారిలో పెట్టిన సీఎం వైఎస్ జగన్.. సంక్షేమ, అభివృద్ధి పథకాలను పరుగులు పెట్టించారు. పేదల ఖాతాల్లో సంక్షేమ పథకాల ద్వారా రూ.2.70 లక్షల కోట్లను జమ చేశారు. వాటిని సద్వినియోగం చేసుకున్న పేదలు జీవనోపాధిని మెరుగుపరుచుకోవడంతో పేదరికం తగ్గింది. రాష్ట్రంలో పేదరికం చంద్రబాబు హయాంలో 11.77 శాతం ఉంటే.. ఇప్పుడు 4.19 శాతానికి తగ్గింది. రాష్ట్ర తలసరి ఆదాయం చంద్రబాబు హయాంలో 2018-19లో రూ.1,51,173 ఉంటే.. సీఎం జగన్ హయాంలో 2022-23 నాటికి రూ.2,19,518కి పెరిగింది. కేంద్రం జీడీపీలో రాష్ట్ర వాటా చంద్రబాబు హయాంలో ఐదేళ్లూ సగటున 4.47 శాతం ఉంటే.. సీఎం జగన్ హయాంలో 4.82 శాతానికి పెరిగింది. చంద్రబాబు హయాంలో అప్పుల కాంపౌండెడ్ యాన్యువల్ గ్రోత్ రేట్ 21.87 శాతం ఉంటే.. ఇప్పుడు 12.13 శాతానికి తగ్గింది. సంపద సృష్టించిందీ సీఎం జగనే. చంద్రబాబు హయాం (2014-19)లో మూల ధన వ్యయం ఏటా సగటున రూ.15,227 కోట్లు ఖర్చు చేస్తే.. సీఎం జగన్ గత ఐదేళ్లు ఏటా సగటున రూ.17,757 కోట్లు ఖర్చు చేశారు. కోవిడ్ ఆర్థిక సంక్షోభంలో ప్రజల ఖాతాలకు నగదు జమ చేయడం ద్వారా ఆర్థిక వ్యవస్థతో పాటు ప్రజలు ఆకలితో అలమటించకుండా ఆదుకున్నారు.

చంద్రబాబు

ఆర్థిక శాస్త్రంలో పోస్టు గ్రాడ్యుయేషన్ చదివానని, తానో ఆర్థికవేత్తనని, సంపద సృష్టించానని చంద్రబాబు బీరాలు పలుకుతారు. ఇందులో చదువొక్కటే నిజం.. మిగతావన్నీ అసత్యాలే. ఎడాపెడా అధిక వడ్డీలకు రుణాలు చేయడం.. వాటిని అస్మదీయులతో కలిసి దోచుకోవడం, పంచుకోవడం.. రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టడమే చంద్రబాబు ఆర్థిక విధానం.

పరిపాలన దక్షత

సీఎం జగన్

విభజిత రాష్ట్రాన్ని 2014-19 మధ్య చంద్రబాబు అడ్డగోలుగా దోచేసి చిన్నాభిన్నం చేశారు. కుంగి కుదేలైన రాష్ట్రాన్ని సీఎం జగన్ తన పరిపాలన దక్షతతో అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నిలిపారు. 2020 ఫిబ్రవరి నుంచి 2022 జనవరి వరకు కరోనా మహమ్మారి దాదాపు రెండేళ్ల ప్రపంచాన్ని గజగజ వణికించింది. ఈ మహమ్మారి విజృంభించినప్పుడే.. దానితో సహజీవనం చేయాల్సిందేనని.. ట్రేస్.. టెస్ట్.. ట్రీట్‌మెంట్ మినహా మరో మార్గం లేదని సీఎం జగన్ ప్రకటించారు. దీన్ని చంద్రబాబు సహా ఆయన ఎల్లో గ్యాంగ్ అప్పట్లో అపహాస్యం చేసింది. సీఎం జగన్.. వైద్యారోగ్య శాఖను సమర్థవంతంగా పని చేయించడం ద్వారా కరోనా మహమ్మారిని గట్టిగా ఎదుర్కొన్నారు. కోట్లాది మంది ప్రజల ప్రాణాలను రక్షించారు. ఎరిపాలన దక్షతతో కరోనాను సీఎం జగన్ సమర్థవంతంగా ఎదుర్కొన్నారని ప్రపంచ ఆరోగ్య సంస్థ, నీతి ఆయోగ్ ప్రశంసించాయి.

చంద్రబాబు

హుద్‌హుద్ తుఫాన్ 2014 అక్టోబర్ 12న విశాఖపట్నంతో పాటు ఉత్తరాంధ్ర జిల్లాలను అతలాకుతలం చేసింది. తుఫాన్ తగ్గిన వెంటనే విశాఖపట్నంకు చేరుకున్న అప్పటి సీఎం చంద్రబాబు.. ప్రచార పిచ్చితో రంపం పట్టుకుని చెట్లను తొలగిస్తున్నట్లు ఫొటోలకు ఫోజులు ఇస్తూ.. సహాయక చర్యలు చేపట్టకుండా ఆటంకం కలిగించారు. బాధితులను ఆదుకోకుండానే హుద్‌హుద్ తుఫాన్ ను జయించినట్లు ప్రగల్భాలు పలికారు. ప్రతిపక్షంలోకి మారాక 2020 మార్చిలో తాను అధికారంలో ఉంటే కరోనా మహమ్మారి వచ్చేదా.. అంటూ బీరాలు పలకడంతో ప్రజలు నిర్ఘాంతపోయారు.

సంస్కర్త (రిఫార్మర్)

సీఎం జగన్

విద్య, వైద్య, వ్యవసాయ, పారిశ్రామిక రంగాల్లో విప్లవాత్మక సంస్కరణలతో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నిలిపిన సీఎం జగన్.. పాలనలోనూ విప్లవాత్మక మార్పులు తెచ్చారు. గ్రామ, వార్డు సచివాలయాలు-వలంటీర్ల వ్యవస్థ.. జిల్లాలను పునర్ వ్యవస్థీకరించడం ద్వారా ప్రజల ఇంటి ముంగిటకే ప్రభుత్వ సేవలను అందిస్తున్నారు. సంక్షేమ పథకాల ద్వారా డీబీటీ (నగదు బదిలీ) రూపంలో పేదల ఖాతాల్లో నేరుగా అత్యంత పారదర్శకంగా రూ.2.70 లక్షల కోట్లు జమ చేశారు. మరో అడుగు ముందుకేసి వలంటీర్ల ద్వారా ప్రతి నెలా ఒకటో తేదీన వృద్ధులకు పెన్షన్ పంపిణీ చేస్తున్నారు. పాలనా సంస్కరణల ద్వారా సీఎం జగన్ ఆంధ్రప్రదేశ్‌లో గ్రామ స్వరాజ్యాన్ని ఆవిష్కరించారని నీతి ఆయోగ్ ప్రశంసించింది.

చంద్రబాబు

సంస్కరణ అంటే చంద్రబాబు దృష్టిలో ప్రభుత్వ రంగ సంస్థలను మూసేయడం.. ఉద్యోగులను రోడ్డున పడేయడం.. 1999-2004 మధ్య చంద్రబాబు సీఎంగా ఉన్న కాలంలో నిజాం షుగర్స్, ఆల్విన్, హెచ్‌ఎంటీ వంటి 54 ప్రభుత్వ రంగ సంస్థలను మూసేసి.. వేలాది మంది ఉద్యోగులను రోడ్డున పడేశారు. వాటి ఆస్తులను అస్మదీయులకు కట్టబెట్టి దోచుకున్నారు. 2014-19 మధ్య టెండర్ల వ్యవస్థను నీరుగార్చి.. అస్మదీయ కాంట్రాక్టర్లకు 4.85 శాతం అధిక ధరలకు కట్టబెట్టి ప్రభుత్వ ఖజానాకు రూ.20 వేల కోట్లకుపైగా నష్టం చేసిన చంద్రబాబు.. వాటిని కాంట్రాక్టర్లతో కలిసి దోచుకున్నారు. రూ.16 వేల కోట్లకుపైగా విలువైన పనులను నామినేషన్ పద్ధతిలో అస్మదీయులకు కట్టబెట్టి కమీషన్లు వసూలు చేసుకున్నారు.

గుసగుస

అన్న తెలివైనోడే..!



ప్రజారాజ్యం పార్టీ విలీనం, రాజకీయాల నుంచి నిష్క్రమణ, మళ్లీ సినిమాల్లో బిజీ.. ఇవన్నీ చూశాక నగటు మెగా అభిమానికి చిరంజీవిపైన కాస్త సానుభూతి ఉండేది. తాజాగా సీఎం రమేష్, తన సోదరుడు పవన్‌కల్యాణ్‌ల తరఫున వీడియో సందేశం రిలీజ్ చేసి మళ్లీ కెలుక్కుంటున్నారేమోనన్న భయం మొదలయింది. చివరికి తమ్ముడి కోసం అన్నయ్య పిఠాపురం ప్రచారానికి కూడా వెళ్తారని పొత్తు పార్టీలు సోషల్ మీడియాలో ఊదరగొట్టాయి. చివరికి చిరంజీవి మాత్రం తూచ్ అనేశారు. తాను పవన్ తరఫున పిఠాపురం ప్రచారానికి వెళ్తానని చెప్పలేదని, అదంతా మీడియా ప్రచారమే అని కొట్టిపారేశారు. అయితే తమ్ముడి జాతకం అన్నయ్యకు ముందే తెలిసిపోయిందట. పవన్‌తోపాటు, కూటమి కూడా బంగా ఖాతంలో కలవక తప్పదని తేలిందట. దీంతో ప్రచారానికి వెళ్లి పరువు తీసుకునేకంటే.. ముందు జాగ్రత్తగా వెనక్కి తగ్గడమే బెటరనుకున్నారని అభిమానుల గుసగుస.

తగ్గేదే లే!



పుష్ప అంటే ఫ్లవరనుకుంటివా.. ఫైర్.. నీయవ్వ తగ్గేదేలే.. అంటూ ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ నంద్యాల వైఎస్సార్‌సీపీ అభ్యర్థి శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డికి ఇచ్చిన హైప్‌తో కూటమి నేతలు కుమిలి కుమిలి ఏడుస్తున్నారట. 'ఎమ్మెల్యే శిల్పా రవి వద్దన్నా నా అంతట నేనుగా అభినందించేందుకు నంద్యాలకు వచ్చా.. రవిని మంచి మెజా ర్టీతో గెలిపించాలని ఆకాంక్షిస్తున్నా'.. అంటూ బన్నీ ఇచ్చిన పిలుపు సోషల్ మీడియా లో హోరెత్తుతోంది. వైఎస్సార్‌సీపీ అభ్యర్థి కోసం సతీసమేతంగా విచ్చేసి, తన అభిమతాన్ని బాహాటంగానే చెప్పడంతో వైఎస్సార్‌సీపీ కేడర్, బన్నీ ఫ్యాన్స్ జై జగన్.. జైజై జగన్ నినాదాలతో హోరెత్తించారు. దీంతో చంద్రబాబు, పవన్‌లకు తల ఎక్కడ పెట్టుకోవాలో తెలియని దుస్థితి వచ్చిందట.



డిసైడ్ చేసేది.. ఆమే!

రాష్ట్రంలోని 154 నియోజకవర్గాల్లో మహిళా ఓటర్లే ఎక్కువ

- 70 స్థానాల్లో పురుషులకన్నా 4 వేల నుంచి 10 వేలకు పైగా అధికంగా మహిళా ఓటర్లు
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేసిన పథకాల లబ్ధిదారుల్లోనూ మహిళలే అత్యధికం
- వారందరి మొగ్గు 'ఫ్యాన్'వైపే అంటున్న రాజకీయ విశ్లేషకులు

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి





కామారెడ్డి సభలో మాట్లాడుతున్న ప్రియాంకాగాంధీ. చిత్రంలో దామోదర రాజనర్సింహ, రేవంత్, సురేష్ షెట్కార్, షబ్బీర్ అలీ

మోదీ ఓటమి

తెలంగాణ నుంచే మొదలుకావాలి

▶ మొదటి పేజీ తరువాయి

ధ్వజమెత్తారు. కోటీశ్వరులకే మోదీ హయాంలో వికాసం జరిగిందని, అధికారం తమ చెప్పుచేతల్లో ఉండాలన్నదే బీజేపీ లక్ష్యమని అన్నారు. నోట్ల రద్దుతో రైతులు, చిన్న వ్యాపారులు, సామాన్యుల నడ్డి విరిగిందని, దేశం ఆర్థికంగా వెనుకబడి పోయిందన్నారు. దేశంలోని మీడియా సంస్థలు ఇద్దరి ముగ్గురి చేతుల్లోకి వెళ్లాయని, వాస్తవాలు ప్రజల్లోకి వెళ్లడం లేదని అన్నారు. పదేళ్లలో ఏం చేశారో చెప్పేంత ధైర్యం మోదీ చేయలేదని అన్నారు. కన్నీళ్లు పెట్టుకున్నారే తప్ప, దేశానికి ఏం చేశారో ప్రధాని ఒక్క వేదికపైనా చెప్పలేదని దుయ్యబట్టారు. కాంగ్రెస్ మేనిఫెస్టో గురించి తప్ప తాను ఏం చేశాడో చెప్పడం లేదన్నారు. కాంగ్రెస్ పథకాలకు మోదీ తన ఫొటో పెట్టుకుని ప్రచారం చేసుకుంటున్నారని ధ్వజమెత్తారు.

పాలమూరు-రంగారెడ్డికి జాతీయ హోదా ఏదీ?

చిలుకూరు బాలాజీ ఉన్న పవిత్ర ప్రాంతం అంటే తనకెంతో ప్రేమ అని ప్రియాంక గాంధీ అన్నారు. ఇందిరా గాంధీకి మీరంతా ప్రేమను పంచారని, తన తల్లిని సోనియమ్మ అంటూ ప్రేమతో పిలిచి తల్లి పాత్ర ఇచ్చి తనకు సోదర సమానులయ్యారని వ్యాఖ్యానించారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా అడిగినా బీజేపీ ప్రభుత్వం ఇవ్వలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రారంభించిన కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ బీజేపీ హయాంలో ఆగిపోయిందని చెప్పారు. దేశంలో 70 కోట్ల మంది నిరుద్యోగులున్నారని, 30 లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయనున్నట్లు చెప్పారు. రైతులకు కనీస మద్దతు ధరను చట్ట పరిధిలోకి తెస్తామన్నారు. వ్యవసాయ ఆధారిత వస్తువులపై జీఎస్టీ తొలగిస్తామని, రైతులకు రుణ మాఫీ ప్రణాళిక రూపొందిస్తామని చెప్పారు. ప్రపంచ ప్రసిద్ధి గాంచిన ట్రిపుల్ ఆర్ సినిమా చూశారా అని ప్రజలను అడిగిన ప్రియాంక... మనకు డబుల్ ఆర్ అంటే రేవంత్‌రెడ్డి, మరో ఆర్ అంటే రాహుల్ గాంధీ అని అన్నారు.

కేంద్రం రాష్ట్రానికి గాడిద గుడ్డు ఇచ్చింది: సీఎం రేవంత్‌రెడ్డి

పార్లమెంట్ ఎన్నికలు రావడంతో సంక్రాంతి పండగకు వచ్చే గంగిరెద్దుల్లా బీజేపోళ్లు రాష్ట్రానికి వస్తున్నారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. పదేళ్లలో మోదీ ప్రభుత్వం రాష్ట్రానికి గాడిద గుడ్డు ఇచ్చిందని ఎద్దేవా చేశారు. ఈ ఎన్నికల ఫలితాలు రాష్ట్ర భవిష్యత్తును తీర్చిదిద్దబోతున్నాయని చెప్పారు. వైఎస్సార్ ప్రభుత్వ హయాంలో వికారాబాద్ జిల్లాలో కేవలం కందులే కాదు ఇతర పంటలనూ పండించేలా ప్రోత్సహించారు. నాడు రంగారెడ్డి జిల్లా ప్రజలకు సాగునీటిని అందించేందుకు ప్రాణహిత చేవేళ్ల ప్రాజెక్టును వేల కోట్లు వెచ్చించి నిర్మాణ పనులు చేపట్టారన్నారు. తర్వాత బీఆర్ఎస్, బీజేపీ ప్రభుత్వాలు కుట్ర చేసి రద్దు చేసి గోదావరి జలాలను రాకుండా చేశాయని ధ్వజమెత్తారు. 'మే 9న రైతు భరోసా ద్వారా రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తా అని ఆనాడు హామీ ఇచ్చాను. రైతు భరోసా అందిస్తే అమర వీరుల స్తూపం వద్ద ముక్కు నేలకు రాయాలని కేసీఆర్‌కు సవాల్ విసిరాను. మే 6న రూ.7,500 కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేశా. కేసీఆర్‌ఆర్‌కు ఏ మాత్రం సోయి ఉన్నా ముక్కు నేలకు రాయాలి' అని పేర్కొన్నారు. 'రైతు రుణమాఫీని కాంగ్రెస్ ప్రభుత్వం చేయదని హరీశ్‌రావు అంటున్నారు. తెలంగాణ రైతుల సాక్షిగా, అనంత పద్మనాభస్వామి వారి సాక్షిగా పంద్రాగస్టులోపు రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తానని ఒట్టు వేస్తున్నా. రుణమాఫీ చేసి రైతుల రుణం తీర్చుకుంటా' అని తెలిపారు. మోదీ వెంట ఈడీ, ఐటీ, సీబీఐ, ఢిల్లీ పోలీసులు, అంబానీ, అదానీ ఉంటే.. రాహుల్ వెంట ఇందిరమ్మ, రాజీవ్ గాంధీల త్యాగం, సోనియమ్మ, ప్రియాంక గాంధీ, రేవంత్‌రెడ్డి, కోట్లాది మంది కార్యకర్తలు ఉన్నారని పేర్కొన్నారు. ఈ యుద్ధంలో మోదీ పరివారాన్ని ఓడించి, రాజ్యాంగాన్ని, రిజర్వేషన్లను కాపాడే రాహుల్ నాయకత్వాన్ని బలపర్చాలని కోరారు. ఈ కార్యక్రమాల్లో కాంగ్రెస్ ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, మంత్రి దామోదర రాజనర్సింహ, చేవెళ్ల అభ్యర్థి రంజిత్‌రెడ్డి, జహీరాబాద్ అభ్యర్థి సురేశ్ షెట్కార్ తదితరులు పాల్గొన్నారు.



బీజేపీ మాయలో పడొద్దు..

▶ మొదటి పేజీ తరువాయి

తెస్తారని తాము అనుకున్నామని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టు, పటాన్‌చెరు వరకు మెట్రో పొడిగింపు, బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ, వరంగల్ రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, ఐటీఐఆర్ పరిశ్రమల కోసం నిధులు ఇస్తారని అనుకున్నామని, కానీ బీజేపీ తెలంగాణకు గాడిద గుడ్డు ఇచ్చిందని ఎద్దేవా చేశారు. రాష్ట్రానికి నిధులు రావాలంటే ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ప్రశాంత వాతావరణం, శాంతిభద్రతలు ఉన్నప్పుడే ఏ ప్రాంతమైనా అభివృద్ధి జరుగుతుందని, కులాలు, మతాల పేరుతో కొట్లాడుకుంటే పరిశ్రమలు, ప్రాజెక్టులు రావని అన్నారు.

కుర్చీ మీద కుర్చీ వేస్తారా?

బీఆర్ఎస్ తమ అభ్యర్థిగా వెంకట్రామిరెడ్డిని ప్రకటించడంపై రేవంత్‌రెడ్డి తీవ్ర విమర్శలు చేశారు. వెంకట్రామిరెడ్డికి మల్లన్నసాగర్ నిర్వాసితులను పోలీసుల బూట్లతో తొక్కించిన చరిత్ర ఉందని అన్నారు. కేసీఆర్, హరీశ్‌రావులకు రూ.వంద కోట్లు ఇచ్చినందుకే ప్రస్తుతం ఎమ్మెల్సీగా ఉన్న వెంకట్రామ్‌రెడ్డికి ఎంపీ టికెట్ ఇచ్చారన్నారు. ఎవరైనా కుర్చీ మీద.. కుర్చీ వేస్తారా అని ప్రశ్నించారు. పెగ్గు మీద పెగ్గు వేసినట్లు.. ఎమ్మెల్సీ ఉండగానే వెంకట్రామిరెడ్డికి ఎంపీ టికెట్టు ఇచ్చారని, పెగ్గులు వేసినప్పుడు టికెట్ ఇచ్చారో.. దిగేటప్పుడు ఇచ్చారో తెలియదని ఎద్దేవా చేశారు. వెంకట్రామిరెడ్డి తెల్లాపూర్‌లో వందల ఎకరాల భూములు కబ్జా చేసి, ఆస్తులు కూడగట్టుకున్నారని ఆరోపించారు. ఈ ఎన్నికల్లో వెంకట్రామిరెడ్డి ఓడితే ఆయన అక్రమంగా సంపాదించిన నాలుగైదు వందల కోట్లు పోతాయే తప్ప ఆయనకు వచ్చిన నష్టం ఏమీ లేదన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు దామోదర రాజనర్సింహ, కొండా సురేఖ, కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధు ముదిరాజ్, ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పటాన్‌చెరు రోడ్‌షోకు హాజరైన ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి

'ఇండియా' కూటమిని గెలిపించాలి

రేవంత్ వీడియో సందేశం

సాక్షి, హైదరాబాద్: రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడుకోవడానికి ఇండియా కూటమిని గెలిపించాలని ముఖ్యమంత్రి, టీపీసీసీ అధ్యక్షుడు ఎ.రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆయన శనివారం వీడియో సందేశం పంపించారు. ఇది ప్రజాస్వామ్యాన్ని రక్షించుకోవడానికి, అంబేడ్కర్ రాసిన రాజ్యాంగాన్ని కాపాడుకోవడానికి జరుగుతున్న ఎన్నికలుగా అభివర్ణించారు. అంబేడ్కర్ రిజర్వేషన్లు కల్పించడం వల్లనే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు ఎదిగారని చెప్పారు. రాజ్యాంగాన్ని మార్చాలని బీజేపీ కుట్ర చేస్తోందని ఆరోపించారు. ప్రపంచ దేశాలతో పోటీపడాల్సిన భారత్, బీజేపీ కుట్రలకు బలవుతోందని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ ఎన్నికల్లో ఇండియా కూటమిని గెలిపించాలని కోరారు.

విభజన చట్టం హామీలను అమలు చేయలేదు

పదేళ్లలో కేంద్రంలోని బీజేపీ తెలంగాణకు గాడిద గుడ్డు తప్ప ఏమీ ఇవ్వలేదని కాంగ్రెస్ పార్టీ విమర్శించింది. విభజన హామీల అమలు, కేంద్రం నుంచి తెలంగాణకు రావాల్సిన ఇతర అంశాలపై 'ఎక్స్' వేదికగా తెలంగాణ కాంగ్రెస్ పార్టీ పోస్ట్ చేసింది. పాలమూరు- రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా, బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ, కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ వంటి విభజన చట్టం హామీలను అమలు చేయలేదని కాంగ్రెస్ పేర్కొంది. రాష్ట్ర అభివృద్ధికి దోహదపడే ఐటీఐఆర్ ప్రాజెక్టు, ఇండస్ట్రియల్ పార్కులు రాలేదని విమర్శించింది. 'పదేండ్ల కన్నీళ్లను యాదుంచుకుందాం..ప్రజా ద్రోహుల పాలనను అంతం చేద్దాం' అంటూ కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని రాష్ట్ర ప్రజానీకానికి పిలుపునిచ్చింది.

పదేళ్లు కేసీఆర్ దోపిడీ

- బీఆర్ఎస్ మునిగిపోతున్న ఓడ: మల్లు భట్టివిక్రమార్క
- దేశ సంపదను ప్రధాని అంబానీ, అదానీలకు దోచిపెడుతున్నారు



గద్వాల జిల్లా అయిజ రోడ్‌షోలో మాట్లాడుతున్న మల్లు భట్టివిక్రమార్క. చిత్రంలో మల్లు రవి

అలంపూర్/గద్వాల/వనపర్తి: రాష్ట్రాన్ని పదేళ్లు పాలించిన బీఆర్ఎస్ పార్టీ సంపదను దోపిడీ చేసిందని డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క అన్నారు. శనివారం నాగర్‌కర్నూల్ పార్లమెంట్ పరిధిలో కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి మల్లురవికి మద్దతుగా అయిజ, గద్వాల, పెబ్బేరులో రోడ్‌షో నిర్వహించారు. కార్యక్రమానికి డిప్యూటీ సీఎంతో పాటు ఎంపీ అభ్యర్థి మల్లు రవి, ఏఐసీసీ కార్యదర్శి ఎస్‌ఏ సంపత్‌కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ దేశ సంపద మనకే చెందాలని రాహుల్‌గాంధీ పోరాటం చేస్తుంటే, మరోపక్క ప్రధానమంత్రి నరేంద్రమోదీ దేశ సంపదను అదానీ, అంబానీలకు దోచిపెడుతున్నారని దుయ్యబట్టారు. పేదల కోసం నిరంతరం పోరాటం చేస్తున్న కాంగ్రెస్‌ను గెలిపిస్తారా లేక దేశ సంపదను కార్పొరేట్‌కు ధారాదత్తం చేస్తున్న మోదీకి ఓటు వేస్తారా ప్రజలు ఆలోచించాలన్నారు. పదేళ్లు రాష్ట్రాన్ని దోచుకున్న కేసీఆర్ ఇప్పుడు కర్ర పట్టుకొని బయటికి వచ్చారని, బస్సులో అటూఇటు తిరుగుతూ నాలుగు నెలల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వం సర్వనాశనం చేసిందని మాట్లాడుతున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలతో రాష్ట్ర సంపదను పేదలకు పంచడమే సర్వనాశనమా అని ప్రశ్నించారు. రాష్ట్ర సంపదను పేదలకు పంచుతాం కానీ బీఆర్ఎస్‌లాగా దోపిడీ చేయబోమన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ పనైపోయిందని, ఆ పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలు కాంగ్రెస్‌లో చేరడానికి ఆసక్తి చూపుతున్నారని చెప్పారు. బీఆర్ఎస్ ఒక మునిగిపోయే ఓడ అని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్, బీజేపీకి ఓటు వేస్తే అదానీ, అంబానీ లాంటి వారికి దోచిపెడతారని ఆరోపించారు. బీఆర్ఎస్ రాష్ట్రాన్ని ఆర్థిక సంక్షోభంలో వదిలేస్తే అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ మార్చి 1వ తేదీనే జీతాలు ఇచ్చిందని, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీలు, మధ్యాహ్న భోజన కార్మికులకు పెండింగ్ వేతనాలు, ప్రభుత్వ పాఠశాలలు, కార్యాలయాల్లో పనిచేసే స్వీపర్ల బిల్లులు క్లియర్ చేసిందని చెప్పారు. పదేళ్లలో బీఆర్ఎస్ పంట నష్టపోయిన ఒక్క రైతును కూడా ఆదుకోలేదని, కానీ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత పంట నష్టం అంచనా వేసి రైతులకు సాయం అందించడానికి చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. కాంగ్రెస్ అభ్యర్థి మల్లు రవిని భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

బీజేపీ వస్తే రాచరిక పాలనే: పొంగులేటి



మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పక్కన అభ్యర్థి రఘురాంరెడ్డి

సాక్షి ప్రతినిధి, ఖమ్మం: 'ప్రజాస్వామ్యం ప్రమాదకర పరిస్థితిలో ఉంది. నరేంద్రమోదీ పొరపాటున మరోసారి అధికారంలోకి వస్తే రాజ్యాంగం పూర్తిగా రద్దవుతుంది. ఎన్నికలు నిర్వహించకుండా రాచరిక పాలన తెస్తారు' అని రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖమంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. కాంగ్రెస్ ఖమ్మం అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి, మిత్రపక్ష పార్టీల నాయకులతో కలిసి ఖమ్మంలోని కాంగ్రెస్ కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడారు. బీజేపీని ప్రజలు నమ్మొద్దని, త్యాగాల కుటుంబమైన రాహుల్ గాంధీని ప్రధానిని చేయాలని పిలుపునిచ్చారు. ఖమ్మం, మహబూబాబాద్ పార్లమెంట్ స్థానాలతోపాటు రాష్ట్రవ్యాప్తంగా 14 నుంచి 15 స్థానాలను కాంగ్రెస్ పార్టీ గెలుచుకుంటుందని పొంగులేటి ధీమా వ్యక్తం చేశారు. ఖమ్మంలో రఘురాంరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ మూత పడుతుందని పొంగులేటి జోస్యం చెప్పారు. సమావేశంలో అభ్యర్థి రఘురాంరెడ్డితో పాటు వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్, కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

పదేళ్ల బీజేపీ పాలనలో అన్ని వర్గాలకు అన్యాయం

ఏఐసీసీ ఎక్స్ సర్వీస్‌మెన్ వింగ్, కల్నల్ హరీశ్‌చౌదరి

సాక్షి, హైదరాబాద్: పదేళ్ల బీజేపీ పాలనలో అన్ని వర్గాలకు అన్యాయం జరిగిందని, సంపద అంతా అదానీ, అంబానీలకు దోచి పెట్టారని ఏఐసీసీ ఎక్స్ సర్వీస్‌మెన్ వింగ్, కల్నల్ హరీశ్ చౌదరి విమర్శించారు. శనివారం ఆయన గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి ఓటమి తప్పదని, ప్రజలు ఇంటికి పంపిస్తారని చెప్పారు. దేశాన్ని కంటికి రెప్పలా కాపాడుతున్న సైనికులను మోదీ చిన్నచూపు చూస్తున్నారని, వన్ నేషన్, వన్ పెన్షన్ ఇస్తామని ఆర్మీని మోదీ మోసం చేశారని ఆరోపించారు.

టచ్‌చేసి చూడు పీకలు ఎగిరిపడతాయి

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు మంత్రి పొన్నం హెచ్చరిక



హుస్నాబాద్ (సిద్దిపేట): పసికూనలాంటి ఐదు నెలల కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూలగొడతామని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అంటున్నారని, దమ్ముంటే టచ్‌చేసి చూడు పీకలు ఎగిరిపడతాయని మంత్రి పొన్నం ప్రభాకర్ హెచ్చరించారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ...నియంతృత్వానికి వ్యతిరేకంగా ప్రజల చేత ఎన్నుకోబడిన ప్రభుత్వం తమదన్నారు. బాధ్యతగల ప్రతిపక్షంగా వ్యవహరిస్తాం ...అసెంబ్లీకి వెళ్తాం...చర్చల్లో పాల్గొంటామని కేసీఆర్ అనాలేగానీ, 30 మంది ఎమ్మెల్యేలు టచ్‌లో ఉన్నారని, బీజేపీతో కలిసి కూలగొడతాం అంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ, కేసీఆర్ అదే మాట అంటున్నారని, కోన్ కిస్కా ఎవడొస్తాడో రావాలని సవాల్ విసిరారు.

కాంగ్రెస్‌తోనే అందరికీ న్యాయం: చెన్నయ్య



పంజగుట్ట (హైదరాబాద్): దళితులు అభివృద్ధి కావాలన్నా, అందరికీ సమన్యాయం జరగాలన్నా కాంగ్రెస్‌తోనే సాధ్యమని మాల ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్ జి.చెన్నయ్య అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపుకోసం విస్తృత ప్రచారం నిర్వహించామని, ప్రజలు ఇప్పటికే కాంగ్రెస్‌ను గెలిపించాలని నిర్ణయించుకున్నట్లు చెప్పారు. శనివారం మాల మహానాడు జాతీయ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో చెన్నయ్య జేఏసీ వర్కింగ్ చైర్మన్లు బూర్గుల వెంకటేశ్వర్లు, గోపోజు రమేశ్‌లతో కలిసి మాట్లాడారు. మాలలంతా వారి జాతి భవిష్యత్‌కోసం కాంగ్రెస్‌కు ఓటేయాలని పిలుపునిచ్చారు.

'కాంగ్రెస్‌కే వికలాంగుల మద్దతు'

సాక్షి, హైదరాబాద్: దివ్యాంగులందరూ కాంగ్రెస్‌కే ఓటేయాలని టీపీసీసీ వికలాంగుల విభాగం చైర్మన్ ముత్తినేని వీరయ్య కోరారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన మోసాలు, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని విజ్ఞప్తి చేశారు. ఏప్రిల్ 24న గాంధీభవన్‌లో ప్రస్తుత ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌గౌడ్ చేతుల మీదగా ప్రారంభమైన 'విజయ సంకల్ప యాత్ర' శుక్రవారంతో ముగిసిందని తెలిపారు. గాంధీభవన్‌లో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. విజయ సంకల్ప యాత్రలో వికలాంగులు, వితంతువులు, వృద్ధులు, పించన్‌దా రులు, పెరిక సంఘాల్లోని వారందరూ కాంగ్రెస్ పార్టీకి మద్దతు ప్రకటించారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన 100 రోజుల్లోనే పెరిక కుల స్తులకు కార్పొరేషన్ ఏర్పాటు చేసిందని గుర్తు చేశారు.



రిటైర్మెంట్ ప్రకటించిన జేమ్స్ అండర్సన్

టెస్టు క్రికెట్ ఆల్‌టైమ్ గ్రేట్‌లలో ఒకడిగా గుర్తింపు తెచ్చుకున్న ఇంగ్లండ్ దిగ్గజ ఫాస్ట్ బౌలర్ జేమ్స్ అండర్సన్ తన అంతర్జాతీయ కెరీర్‌ను ముగించబోతున్నాడు. త్వరలో వెస్టిండీస్‌తో లార్డ్స్ మైదానంలో జరిగే తొలి టెస్టు తర్వాత తాను రిటైర్ అవుతున్నట్లు అతను ప్రకటించాడు. 42 ఏళ్ల అండర్సన్ 2003లో లార్డ్స్ గ్రౌండ్‌లోనే జింబాబ్వేతో జరిగిన టెస్టులో అరంగేట్రం చేశాడు. 21 ఏళ్ల కెరీర్‌లో 187 టెస్టులు ఆడిన అండర్సన్ 26.52 సగటుతో 700 వికెట్లు పడగొట్టి అత్యధిక వికెట్లు తీసిన బౌలర్ల జాబితాలో మురళీధరన్ (800), షేన్‌వార్న్ (708) తర్వాత మూడో స్థానంలో ఉన్నాడు. తాను ఫిట్‌గా ఉన్నానని, మరింత కాలం ఆడే సత్తా ఉందని అండర్సన్ చెబుతున్నా... కొత్త ఆటగాళ్లను సిద్ధం చేసేందుకు తప్పుకుంటే మంచిదని కోచ్ మెకల్లమ్ సూచించడంతో అతను ఈ నిర్ణయం తీసుకున్నాడు. కొంత కాలంగా విఫలమవుతున్నా...మొహమాటంతోనే అండర్సన్‌ను కొనసాగిస్తున్నట్లు అన్ని వైపులనుంచి విమర్శలు వచ్చాయి. భారత్‌తో ఇటీవల జరిగిన సిరీస్‌లో ప్రభావం చూపలేకపోయిన అతను...అంతకు ముందు యాషెస్ సిరీస్‌లో కూడా 4 టెస్టుల్లో ఏకంగా 85.40 సగటుతో 5 వికెట్లే తీయగలిగాడు. విండీస్‌తో టెస్టు అతనికి 188వది కానుండగా... సచిన్ టెండూల్కర్ (200) తర్వాత అత్యధిక టెస్టులు ఆటగాడిగా అతని కెరీర్ సమాప్తం కానుంది.

'ప్లేఆఫ్స్'కు కోల్‌కతా

- 18 పరుగులతో ముంబైపై గెలుపు
- రాణించిన వెంకటేశ్, వరుణ్



కోల్‌కతా: ఈ సీజన్ ఐపీఎల్‌లో 'ప్లే ఆఫ్స్' చేరిన తొలి జట్టుగా కోల్‌కతా నైట్‌రైడర్స్ నిలిచింది. శనివారం జరిగిన పోరులో కోల్‌కతా 18 పరుగుల తేడాతో ముంబై ఇండియన్స్‌పై గెలిచింది. భారీ వర్షం వల్ల మ్యాచ్ చాలా ఆలస్యంగా మొదలవడంతో 16 ఓవర్లకు కుదించారు. ముందుగా కోల్‌కతా నైట్‌రైడర్స్ నిర్ణీత 16 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 157 పరుగులు చేసింది. వెంకటేశ్ అయ్యర్ (21 బంతుల్లో 42; 6 ఫోర్లు, 2 సిక్స్‌లు), నితీశ్ రాణా (23 బంతుల్లో 33; 4 ఫోర్లు, 1 సిక్స్) ధాటిగా ఆడారు. అనంతరం ముంబై ఇండియన్ 16 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 139 పరుగులే చేసింది. ఇషాన్ కిషన్ (22 బంతుల్లో 40; 5 ఫోర్లు, 2 సిక్స్‌లు), తిలక్‌వర్మ (17 బంతుల్లో 32; 5 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు.

మెరిపించిన వెంకటేశ్

ఇన్నింగ్స్ తొలిబంతికే సిక్సర్ బాదిన సాల్ట్ (6)ను ఐదో బంతికే తుషార అవుట్ చేయగా, మరో ప్రమాదకర ఓపెనర్ సునీల్ నరైన్ (0) బుమ్రా క్లీన్ బౌల్డ్ చేశాడు. బుమ్రా వేసిన నాలుగో ఓవర్లో వెంకటేశ్ 4, 6, 4 బాదాడు. కానీ మరుసటి ఓవర్లోనే కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (7)ను అన్షుల్ బౌల్డ్ చేసి ముంబై శిబిరాన్ని మురిపించాడు. పవర్‌ప్లే 5 ఓవర్లలో నైట్‌రైడర్స్ 45/3 స్కోరు చేసింది. ఆరో ఓవర్లో జట్టు స్కోరు 50 దాటగా... నితీశ్ రాణా, వెంకటేశ్‌ల దూకుడుతో కోల్‌కతా ఇన్నింగ్స్ పుంజుకుంది. వెంకటేశ్ ధాటికి చావ్లా అడ్డుకట్ట వేయగా, రసెల్ (14 బంతుల్లో 24; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాకతో నైట్‌రైడర్స్ 10.2 ఓవర్లలో వంద పరుగులు దాటింది. అడపాదడపా బౌండరీలతో జట్టు స్కోరును పెంచుతున్న నితీశ్ రాణాను తిలక్ వర్మ చక్కని త్రో రనౌట్ చేయగా, ఓవర్ వ్యవధిలో రసెల్ మెరుపులకు చావ్లా కళ్లెం వేశాడు. తర్వాత ఆఖరి ఓవర్లలో రింకూ సింగ్ (12 బంతుల్లో 20; 2 సిక్స్‌లు), రమణ్‌దీప్ సింగ్ (8 బంతుల్లో 17 నాటౌట్; 1 ఫోర్, 1 సిక్స్)లు కూడా ధాటిని ప్రదర్శించడంతో ప్రత్యర్థి ముందు కష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించింది.

రాణించిన ఇషాన్

ఓపెనర్లు ఇషాన్ కిషన్, రోహిత్ శర్మ (24 బంతుల్లో 19; 1 ఫోర్, 1 సిక్స్) ముంబైకి చక్కని ఆరంభాన్నే ఇచ్చారు. ఓ వైపు రోహిత్ కుదురుగా ఆడుతుంటే మరోవైపు కిషన్ చెలరేగాడు. బౌండరీలు, సిక్సర్లతో స్కోరు వేగాన్ని పెంచాడు. 5 ఓవర్ల పవర్‌ప్లేలో ముంబై 59/0 స్కోరు చేసింది. అయితే ఇంత చక్కని శుభారంభానికి కోల్‌కతా స్పిన్నర్లు తూట్లు పొడిచారు. వరుస ఓవర్లలో నరైన్, ఇషాన్‌ను... రోహిత్‌ను వరుణ్ అవుట్ చేయడంతో ముంబై రూటు మారింది. రసెల్ బంతినందుకొని హిట్టర్లు సూర్యకుమార్ (11), టిమ్ డేవిడ్ (0)లను అవుట్ చేయడంతోనే ముంబై లక్ష్యానికి దూరమైంది.

స్కోరు వివరాలు

కోల్‌కతా నైట్‌రైడర్స్ ఇన్నింగ్స్: సాల్ట్ (సి) అన్షుల్ (బి) తుషార 6; నరైన్ (బి) బుమ్రా 0; వెంకటేశ్ (సి) సూర్యకుమార్ (బి) చావ్లా 42; శ్రేయస్ (బి) అన్షుల్ 7; నితీశ్ రనౌట్ 33; రసెల్ (సి) అన్షుల్ (బి) చావ్లా 24; రింకూ సింగ్ (సి) ఇషాన్ (బి) బుమ్రా 20; రమణ్‌దీప్ నాటౌట్ 17; స్టార్క్ నాటౌట్ 2; ఎక్స్‌ట్రాలు 6; **మొత్తం (16 ఓవర్లలో 7 వికెట్లకు) 157. వికెట్ల పతనం:** 1-6, 2-10, 3-40, 4-77, 5-116, 6-125, 7-148. **బౌలింగ్:** తుషార 3-0-31-1, బుమ్రా 4-0-39-2, అన్షుల్ 3-0-24-1, హార్దిక్ 3-0-32-0, పియూష్ చావ్లా 3-0-28-2. **ముంబై ఇండియన్స్ ఇన్నింగ్స్:** ఇషాన్ కిషన్ (సి) రింకూ (బి) నరైన్ 40; రోహిత్ (సి) నరైన్ (బి) వరుణ్ 19; సూర్యకుమార్ (సి) రమణ్‌దీప్ (బి) రసెల్ 11; తిలక్‌వర్మ (సి) సాల్ట్ (బి) హర్షిత్ 32; హార్దిక్ (సి) వైభవ్ (బి) వరుణ్ 2; డేవిడ్ (సి) శ్రేయస్ (బి) రసెల్ 0; నేహల్ రనౌట్ 3; నమన్ (సి) రింకూ (బి) హర్షిత్ 17; అన్షుల్ నాటౌట్ 2; చావ్లా నాటౌట్ 1; ఎక్స్‌ట్రాలు 12; **మొత్తం (16 ఓవర్లలో 8 వికెట్లకు) 139. వికెట్ల పతనం:** 1-65, 2-67, 3-87, 4-91, 5-92, 6-117, 7-136, 8-137 **బౌలింగ్:** వైభవ్ 2-0-16-0, స్టార్క్ 1-0-11-0, హర్షిత్ 3-0-34-2, నరైన్ 3-0-21-1, వరుణ్ 4-0-17-2, రసెల్ 3-0-34-2.

ఐపీఎల్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే
కోల్‌కతా	12	9	3	18	1.428
రాజస్తాన్	11	8	3	16	0.476
హైదరాబాద్	12	7	5	14	0.406
చెన్నై	12	6	6	12	0.491
ఢిల్లీ	12	6	6	12	-0.316
లక్నో	12	6	6	12	-0.769
బెంగళూరు	12	5	7	10	0.217
గుజరాత్	12	5	7	10	-1.063
ముంబై	13	4	9	8	-0.271
పంజాబ్	12	4	8	8	-0.423

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.రే-నెట్ రన్‌రేట్

ఐపీఎల్‌లో నేడు

చెన్నై × రాజస్తాన్
వేదిక: చెన్నై
మధ్యాహ్నం 3: 30 గంటల నుంచి

బెంగళూరు × ఢిల్లీ
వేదిక: బెంగళూరు
రాత్రి 7: 30 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో సినిమా యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

రిషభ్ పంత్ సస్పెన్షన్

నేడు బెంగళూరుతో మ్యాచ్‌కు దూరం



న్యూఢిల్లీ: ప్లే ఆఫ్స్ రేసులో ఉన్న ఢిల్లీ క్యాపిటల్స్‌కు పెద్ద షాక్! ఢిల్లీ అభిమానులను ఇది నిరాశపరిచే పరిణామం! కెప్టెన్ రిషభ్ పంత్‌పై ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ ఒక మ్యాచ్ సస్పెన్షన్ వేటు వేసింది. ఈ సీజన్‌లో ఢిల్లీ మూడో సారి మందకొడి బౌలింగ్ (స్లో ఓవర్ రేట్)ను పునరావృతం చేయడంతో నియమావళి ప్రకారం చర్యలు తీసుకున్నారు. ఈ నెల 7న రాజస్తాన్‌తో జరిగిన పోరులో క్యాపిటల్స్ 20 పరుగులతో నెగ్గింది. కానీ నిర్ణీత సమయంలో ఓవర్ల కోటాను పూర్తిచేయలేకపోయింది. ఈ సీజన్‌లో ఢిల్లీకి ఇదేం మొదటిసారి కాదు! మార్చి 31న చెన్నైతో, ఏప్రిల్ 3న కోల్‌కతాతో జరిగిన పోటీల్లోనూ క్యాపిటల్స్ 'స్లో ఓవర్ రేట్' నమోదు చేయడంతో ఇప్పుడు కీలక దశలో ఢిల్లీ భారీ మూల్యమే చెల్లించుకుంది. పంత్ మ్యాచ్ ఫీజులో రూ. 30 లక్షల జరిమానాతో పాటు తదుపరి మ్యాచ్ ఆడకుండా సస్పెండ్ చేసింది. రాజస్తాన్‌తో మ్యాచ్‌లో బరిలోకి దిగిన జట్టులోని ఇతర ఆటగాళ్లకు కూడా రూ.12 లక్షల చొప్పున జరిమానా పడింది. మ్యాచ్ ముగిసిన వేసిన ఈ శిక్షపై ఢిల్లీ అప్పీల్ చేయగా...బీసీసీఐ అంబుడ్స్‌మన్ మ్యాచ్ రిఫరీ నిర్ణయాన్ని సమర్థించారు. నేడు ఢిల్లీ కీలకమైన పోరులో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ)తో తలపడాల్సివుండగా... పంత్ బరిలోకి దిగడం లేదు. రిషభ్ పంత్ గైర్హాజరులో అక్షర్ పటేల్ క్యాపిటల్స్‌కు కెప్టెన్‌గా వ్యవహరిస్తాడని కోచ్ రికీ పాంటింగ్ వెల్లడించారు. మరో వైపు శుక్రవారం చెన్నైతో జరిగిన మ్యాచ్‌లో స్లో ఓవర్ రేట్ నమోదు చేసినందుకు గుజరాత్ టైటాన్స్ కెప్టెన్‌పై కూడా రూ. 24 లక్షల జరిమానా పడింది. టైటాన్స్ జట్టులోని ఇతర సభ్యులకు కూడా ఒక్కొక్కరికి రూ. 6 లక్షల చొప్పున జరిమానా విధించారు.

మళ్లీ ఓడిన నాదల్



రోమ్: గాయంనుంచి కోలుకొని మళ్లీ కోర్టులోకి అడుగు పెట్టిన తర్వాత రాణించలేకపోతున్న టెన్నిస్ దిగ్గజం రాఫెల్ నాదల్‌కు మరో పరాజయం ఎదురైంది. గత వారమే మాడ్రిడ్ ఓపెన్‌లో ఓడిన నాదల్ ఇప్పుడు ఇటాలియన్ ఓపెన్ రెండో రౌండ్‌లోనే వెనుదిరిగాడు. ఈ క్లే కోర్టు టోర్నీలో 10 సార్లు చాంపియన్‌గా నిలిచిన నాదల్‌పై 6-1, 6-3 స్కోరుతో వరల్డ్ నంబర్ 9 హ్యూబర్ట్ హుర్కాజ్ (పోలండ్) ఘన విజయం సాధించాడు. గత ఏడాదిన్నర కాలంలో నాదల్ టాప్-10 ర్యాంకుల్లో ఉన్న ఆటగాడితో తలపడటం ఇదే మొదటిసారి. 93 నిమిషాల్లో ముగిసిన ఈ మ్యాచ్‌లో నాదల్ 4 గేమ్‌లే గెలవడం అతని పరిస్థితిని చూపిస్తోంది. తాజా ప్రదర్శన తాను ఫ్రెంచ్ ఓపెన్‌లో ఆడే విషయంపై సందేహాలు లేవనెత్తుతోందని మ్యాచ్ ముగిసిన తర్వాత నాదల్ వ్యాఖ్యానించాడు.

సెయిలింగ్ ప్రపంచ చాంపియన్‌షిప్‌కు మాన్య



సాక్షి, హైదరాబాద్: నగరానికి చెందిన యువ సెయిలర్ మాన్య రెడ్డికి అరుదైన అవకాశం లభించింది. ఇంటర్నేషనల్ లేజర్ క్లాస్ అసోసియేషన్ 4 (లేజర్ 4.7) యూత్ వరల్డ్ చాంపియన్‌షిప్‌లో పాల్గొనేందుకు ఆమె ఎంపికైంది. జూన్ 22నుంచి 30 వరకు పోర్చుగల్‌లోని వియానా డి కాస్టెలో‌లో ఈ టోర్నీ జరుగుతుంది. 15 ఏళ్ల మాన్య గత కొంత కాలంగా సెయిలింగ్ పోటీల్లో నిలకడగా రాణిస్తోంది. హుస్సేన్ సాగర్ జలాల్లో సెయిలింగ్ నేర్చుకున్న ఈ అమ్మాయి తొలి జూనియర్ రెగెట్టాలోనే రజతం సాధించింది. జాతీయ స్థాయిలో జరిగిన పోటీల్లో వరుస విజయాలు సాధించిన ఆమె ఇటీవల షిల్లాంగ్‌లో జరిగిన ర్యాంకింగ్ టోర్నీలో కాంస్యం గెలుచుకుంది. వరల్డ్ చాంపియన్‌షిప్ కోసం భారత్‌నుంచి ఎంపికైన ఇద్దరు సెయిలర్లలో ఒకరిగా మాన్యకు అవకాశం దక్కింది. ఈ టోర్నీ కోసం ప్రస్తుతం మాన్య సిద్ధమవుతోంది. అయితే వరల్డ్ చాంపియన్‌షిప్ స్థాయి టోర్నీలో పాల్గొనడం, ఇతర సన్నాహకాల కోసం పెద్ద మొత్తంలో ఖర్చు చేయాల్సి ఉంటుంది. అందుకే తన ఈవెంట్ కోసం మాన్య స్పాన్సర్ల సహాయాన్ని ఆశిస్తోంది. ప్రయాణ, వసతి, ఎక్విప్‌మెంట్, శిక్షణ కోసం తనకు అండగా నిలవాలని ఆమె కోరుతోంది. ఈ నేపథ్యంలో మాన్యకు స్పాన్సర్‌షిప్ అందించాలని భావించే వారు maanyareddy20@gmail.com ద్వారా సంప్రదించవచ్చు.

పురుషుల రెజ్లింగ్‌లో భారత్‌కు తొలి బెర్త్

ఫైనల్ చేరిన అమన్ సెహ్రావత్



ఇస్తాంబుల్: పారిస్ ఒలింపిక్స్ రెజ్లింగ్‌లో పురుషుల విభాగంలో భారత్‌కు తొలి బెర్త్ లభించింది. క్వాలిఫయింగ్ టోర్నీలో అమన్ సెహ్రావత్ ఫైనల్‌కు చేరడంతో భారత్‌నుంచి ఒక రెజ్లర్ ఒలింపిక్స్‌లో పాల్గొనడం ఖాయమైంది. 57 కేజీల విభాగంలో అమన్ 12-2 స్కోరుతో హాన్ చాంగ్‌సాంగ్ (కొరియా)ను చిత్తు చేశాడు. మరో సెమీఫైనల్లో భారత రెజ్లర్ సుజీత్ (65 కేజీలు) 1-6 తేడాతో తుల్గా తుమూర్ (మంగోలియా) చేతిలో ఓటమిపాలయ్యాడు. అయితే అతని అవకాశాలు పూర్తిగా పోలేదు. నేడు మూడో స్థానంలో కోసం జరిగే ప్లే ఆఫ్ మ్యాచ్‌లో గెలిచినా సుమీత్ భారత్‌కు రెండో బెర్త్ అందిస్తాడు. మరో వైపు బరిలోకి దిగిన మిగిలిన నలుగురు భారత రెజ్లర్లకు మాత్రం చుక్కెదురైంది. వీరందరిలోకి అత్యంత అనుభవజ్ఞుడైన దీపక్ పూనియా తొలి రౌండ్‌లోనే వెనుదిరిగాడు. 86 కేజీల విభాగంలో 4-6 తేడాతో చైనాకు చెందిన జుూషెన్ లిన్ చేతిలో ఓటమిపాలయ్యాడు. జుూషెన్ ఆ తర్వాత క్వార్టర్స్‌లో పరాజయంపాలవడంతో పూనియా 'రెపిచెజ్' ఆశలు కూడా గల్లంతయ్యాయి. 74 కేజీల విభాగంలో జైదీప్ 0-3తో తైమురాజ్ సల్కాజనోవ్ (స్లొవేకియా) చేతిలో క్వార్టర్ ఫైనల్లో ఓడిపోగా...దీపక్ (97 కేజీలు) 1-5తో ఒమర్‌బిబిరోవిచ్ (మాసిడోనియా) చేతిలో, ఆంథోనీ జాన్సన్ (జమైకా) చేతిలో సుమీత్ మాలిక్ (125 కేజీలు) పరాజయంపాలయ్యారు.

సినిమా

వెతుకు... వెతుకు...



కాజల్ అగర్వాల్

వెతుకు... వెతుకు.. అంటూ నేరస్తులను వెతుకున్నారు పోలీసాఫీసర్ సత్యభామ. వారిని పట్టుకోవడానికి ఆమె ఎలాంటి సాహసాలు చేశారు? అనే కథతో రూపొందిన చిత్రం 'సత్యభామ'. పోలీసాఫీసర్ సత్యభామగా కాజల్ అగర్వాల్ చేశారు. నవీన్ చంద్ర అమరేందర్ కీలక పాత్రధారి. దర్శకుడు శశికిరణ్ తిక్క సమర్పకులుగా వ్యవహరించి, స్క్రీన్‌ప్లే అందించిన ఈ చిత్రానికి సుమన్ చిక్కాల దర్శకుడు. బాబీ తిక్క, శ్రీనివాసరావు తక్కలపల్లి నిర్మించిన ఈ చిత్రం త్వరలో రిలీజ్ కానుంది. ఈ చిత్రంలోని మూడో పాట 'వెతుకు వెతుకు..'ని ఈ నెల 15న రిలీజ్ చేయనున్నట్లు ప్రకటించి, ''నేరస్తులను పట్టుకోవడానికి సత్యభామ చేసే అన్వేషణే ఈ పాట నేపథ్యం'' అన్నారు మేకర్స్. ఈ చిత్రానికి శ్రీచరణ్ పాకాల స్వరకర్త.


మురుగడి మాయ...



సుధీర్‌బాబు, సునీల్

సుధీర్ బాబు హీరోగా జ్ఞానసాగర్ ద్వారక దర్శకత్వంలో సుమంత్ జి. నాయుడు నిర్మించిన చిత్రం 'హరోం హర'. శనివారం (మే 11) సుధీర్ బర్త్ డే సందర్భంగా ఈ చిత్రంలోని 'మురుగడి మాయ...' అనే పాటను విడుదల చేసింది చిత్రబృందం. చేతన్ భరద్వాజ్ స్వరపరచిన ఈ పాటకు భరద్వాజ పాత్రుడు కుప్పం యాసలో లిరిక్స్ రాశారు. రఘు కుంచె పాడారు. ''ప్రపంచంలో జరిగే ప్రతి చర్యకు కారణమైన మురుగన్ శక్తిని ఈ పాట నిర్వచిస్తుంది. సినిమాలో సుధీర్‌బాబు, సునీల్ మధ్య స్నేహాన్ని ఈ పాట చూపుతుంది. 1989 సమయంలో చిత్తూరు జిల్లా కుప్పం నేపథ్యంలో రూపొందించిన ఈ చిత్రాన్ని మే 31న విడుదల చేయనున్నాం'' అని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రంలో మాళవికా శర్మ కథానాయిక.

శివం భజే



అశ్విన్ బాబు

అశ్విన్‌బాబు హీరోగా అప్సర్ దర్శకత్వంలో మహేశ్వర్ రెడ్డి మూలి నిర్మించిన చిత్రం 'శివం భజే'. దిగంగనా సూర్యవన్షీ హీరోయిన్‌గా నటించిన ఈ సినిమాలో అర్బాజ్ ఖాన్, మురళీ శర్మ, బ్రహ్మాజీ, కాశీ విశ్వనాథ్ కీలక పాత్రల్లో నటించారు. తాజాగా ఈ సినిమా నుంచి అశ్విన్ బాబు ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు మేకర్స్. ''ఇటీవలే చిత్రీకరణ పూర్తయింది. సరికొత్త కథతో ఈ సినిమాను రూపొందించాం. త్వరలోనే ఈ సినిమా టీజర్, ట్రైలర్, రిలీజ్ డేట్ వివరాలను వెల్లడిస్తాం'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ సినిమాకు వికాస్ బాడిస స్వరకర్త.

చంద్రముఖి చెల్లివైనా...



నందితా శ్వేత

'పూర్వ జన్మ జ్ఞానంతో మళ్లీ జన్మ ఎత్తే అవకాశం ఏ జీవికి కూడా ఉండదు.. దెయ్యాలకు మాత్రమే ఉంటుంది' అనే డైలాగ్‌తో 'ఓఎమ్‌జీ' (ఓ మంచి ఘోస్ట్) చిత్రం టీజర్ ఆరంభమవుతుంది. 'ఒసేయ్ నువ్వు అరుంధతికి అక్కవైనా.. చంద్రముఖి చెల్లివైనా.. కాశ్మోరా లవర్‌వైనా, కాంచన కజిన్‌వైనా..' అంటూ వెన్నెల కిశోర్ చేసే కామెడీ, 'నేను మోహిని పిశాచి మోహం తీర్చా.. కామిని పిశాచి కామం తీర్చా' అంటూ షకలక శంకర్ చేసే కామెడీతో ఈ టీజర్ సాగుతుంది. ఇక ఘోస్ట్ క్యారెక్టర్‌లో నందితా శ్వేతా అందరినీ భయపెట్టేలా కనిపించారు. హారర్, కామెడీ ప్రధానాంశాలుగా రూపొందిన చిత్రం 'ఓఎమ్‌జీ'. వెన్నెల కిశోర్, నందితా శ్వేత, షకలక శంకర్, నవమీ గాయక్, నవీన్ నేని, రజత్ రాఘవ్, రఘుబాబు కీలక పాత్రల్లో శంకర్ మార్తాండ్ దర్శకత్వం వహించారు. డా. అబినికా ఇనాబతుని నిర్మించారు. శనివారం ఈ చిత్రం టీజర్‌ని విడుదల చేశారు. ''త్వరలో 'ఓఎమ్‌జీ' విడుదల తేదీని ప్రకటిస్తాం'' అని చిత్ర యూనిట్ పేర్కొంది.

వందో ఆస్కార్‌కి నాలుగు వేల కోట్లు!



ఆస్కార్ శతాబ్ది ఉత్సవాల (ఆస్కార్ అవార్డుల వందో వేడుక) సన్నాహాలు మొదలయ్యాయి. 2028లో జరగనున్న ఈ వేడుకల కోసం ఆస్కార్ నిర్వాహకులు ఇప్పట్నుంచే ప్రణాళికలు వేస్తుండటం హాలీవుడ్‌లో చర్చనీయాంశంగా మారింది. 'ఆస్కార్ 100' పేరిట ఈ వేడుకలు జరగనున్నట్లుగా రోమ్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో ఆస్కార్ ప్రతినిధులు వెల్లడించారు. ''ఆస్కార్ 100' వేడుకలను ఘనంగా నిర్వహించనున్నాం. ఇందుకోసం 500 మిలియన్ డాలర్ల క్యాంపైన్ (దాదాపు రూ. నాలుగు వేల కోట్లు)ను లక్ష్యంగా పెట్టుకున్నాం. గత ఏడాదిన్నరలో ఇప్పటికే 'ఆస్కార్ 100' కోసం వంద మిలియన్ డాలర్లను సేకరించాం. 'ఆస్కార్ 100' ఈవెంట్‌ను వినూత్నంగా ప్లాన్ చేస్తున్నాం. ఈ వేడుకల సందర్భంలోనే మరో వంద సంవత్సరాల పాటు ఆస్కార్ అవార్డు వేడుకలను ఎలా నిర్వహించాలనే విషయాలను చర్చించుకుని, ఓ అవగాహనకు రావాలనుకుంటున్నాం'' అని ఆస్కార్ కమిటీ ప్రస్తుత సీఈవో బిల్ క్రామెర్ చెప్పుకొచ్చారు. ఇక 97వ ఆస్కార్ అవార్డుల వేడుకలు వచ్చే ఏడాది మార్చి 2న జరగనున్న విషయం తెలిసిందే.

సైంటిపిక్



'కల్కి'లో ప్రభాస్



'డబుల్ ఇస్మార్ట్'లో రామ్

కొన్ని వందల సంవత్సరాల తర్వాత మన దేశం ఎలా ఉంటుంది... సూపర్ పవర్ ఉన్న విలన్‌ని ఓ సామాన్యుడు ఎలా ఢీ కొంటాడు... వేరొకరి మెదడులోని ఆలోచనలను చిప్ సాయంతో ఇంకొకరి మెదడులోకి పెడితే... ఇవన్నీ సాధ్యమేనా అంటే.. సైన్స్‌తో సాధ్యమే. ఈ అంశాలకు సైన్స్ జోడించి, కొన్ని పిక్స్ (సినిమాలు) తెరకెక్కుతున్నాయి. ఆ 'సైంటిపిక్స్' గురించి తెలుసుకుందాం...

ఆరువేల సంవత్సరాల తర్వాత...

కొన్ని వందల సంవత్సరాల తర్వాత భారత దేశం ఎలా ఉండబోతోంది అంటే ఊహించి, చెప్పడం కష్టం. కానీ దర్శకుడు నాగ్ అశ్విన్ ఊహించారు. వందల ఏళ్ల తర్వాత దేశం ఎలా ఉంటుంది? అని ఊహించి, 'కల్కి 2898 ఏడీ'లో చూపించనున్నారు ఈ దర్శకుడు. ప్రభాస్ హీరోగా నాగ్ అశ్విన్ దర్శకత్వంలో రూపొందుతున్న సైన్స్ ఫిక్షన్ అండ్ ఫ్యూచరిస్టిక్ ఫిల్మ్ ఇది. మహాభారతం ముగింపు సమయంలో మొదలయ్యే ఈ సినిమా కథ ఆరువేల సంవత్సరాల టైమ్ లైన్‌తో 2898ఏడీలో ముగుస్తుందట. అలాగే ఈ సినిమా కథలో మైథలాజికల్ టచ్ ఉంటుంది. అందుకే 'కల్కి 2898 ఏడీ' అనే టైటిల్ పెట్టారని తెలిసింది. ఈ చిత్రంలో భైరవ పాత్రలో ప్రభాస్, అశ్వత్థామ పాత్రలో అమితాబ్ బచ్చన్ కనిపిస్తారు. పద్మావతి పాత్రలో దీపికా పదుకోన్, కలి పాత్రలో కమల్‌హాసన్ కనిపిస్తారనే టాక్ వినిపిస్తోంది. హీరోయిన్ దిశా పటానీ మరో లీడ్ రోల్‌లో నటిస్తున్న ఈ సినిమాను అశ్వనీదత్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రం జూన్ 27న విడుదల కానుంది.



'మాయవన్'లో సందీప్ కిషన్

డబుల్ ఇస్మార్ట్

ఓ కిరాయి రౌడీ మెదడులో ఓ సీబీఐ ఆఫీసర్ మెదడులోని ఆలోచనలను ఓ చిప్ సాయంతో ఇన్‌జెక్ట్ చేస్తే ఏమవుతుంది? అనే కథాంశంతో రూపొందిన సైన్స్ ఫిక్షన్ యాక్షన్ ఫిల్మ్ 'ఇస్మార్ట్ శంకర్'. రామ్ హీరోగా పూరి జగన్నాథ్ దర్శకత్వంలో రూపొందిన ఈ సినిమా 2019లో విడుదలై, ఘనవిజయం సాధించింది. ఇప్పుడు రామ్, పూరి కాంబినేషన్‌లోనే 'ఇస్మార్ట్ శంకర్'కు సీక్వెల్‌గా 'డబుల్ ఇస్మార్ట్' చిత్రీకరణ జరుగుతోంది. తన గతాన్ని మెల్లి మెల్లిగా మర్చిపోతున్న శంకర్ (రామ్ పాత్ర) పూర్తిగా సీబీఐ ఆఫీసర్‌గా మారిపోతాడా? ఒకవేళ సైన్స్ ప్రయోగాల ద్వారా శంకర్ తన జ్ఞాపకాలను తిరిగి పొందగలిగే చాన్స్ ఉందా? అనే అంశాలను 'డబుల్ ఇస్మార్ట్'లో చూడొచ్చని టాక్. పూరి జగన్నాథ్, ఛార్మి ఈ సినిమాను నిర్మిస్తున్నారు.

సూపర్ విలన్‌పై పోరాటం

సూపర్ పవర్స్ ఉన్న ఓ సూపర్ విలన్‌పై ఓ సామాన్యుడు చేసే పోరాటం నేపథ్యంలో రూపొందుతున్న సైన్స్ ఫిక్షన్ అడ్వెంచరస్ ఫిల్మ్ 'మాయవన్'. సందీప్ కిషన్ హీరోగా నటిస్తున్న ఈ సినిమాకు సీవీ కుమార్ దర్శకత్వం వహిస్తున్నారు. సందీప్, సీవీ కుమార్‌ల కాంబినేషన్‌లోనే రూపొందిన 'ప్రాజెక్ట్ జెడ్' సినిమాకు సీక్వెల్‌గా 'మాయవన్' చిత్రం తెరకెక్కుతోంది. బ్రెయిన్ ట్రాన్స్‌ప్లాంటేషన్ కూడా ఈ సినిమాలో ఓ ప్రధానాంశం అని టాక్. ఈ సినిమాలో సూపర్ పవర్స్ ఉన్న విలన్ పాత్రలో నీల్ నితిన్ ముఖేష్ నటిస్తున్నారు. అతన్ని ఢీ కొనే సామాన్యుడి పాత్రను సందీప్ కిషన్ చేస్తున్నారు. రామబ్రహ్మం సుంకర నిర్మిస్తున్న ఈ సినిమా చిత్రీకరణ ప్రస్తుతం హైదరాబాద్‌లో జరుగుతోంది.



'మిరాయ్'లో తేజ

సూపర్ యోధ

చరిత్రలో ముఖ్యమైన తొమ్మిది గ్రంథాలు దుష్టుల చేతిలో పడి దుర్వినియోగం కాకుండా ఉండేందుకు తరాలుగా సాగుతున్న ఓ యుద్ధం నేపథ్యంతో రూపొందుతున్న చిత్రం 'మిరాయ్'. జపాన్ భాషలో మిరాయ్ అంటే భవిష్యత్ అని అర్థం. ఇందులో సూపర్ యోధ పాత్రను హీరో తేజ సజ్జా చేస్తున్నారు. ఈ సైన్స్ ఫిక్షన్ ఫిల్మ్ వచ్చే ఏడాది ఏప్రిల్ 18న రిలీజ్ కానుంది. త్రీడీ వెర్షన్ లోనూ రిలీజ్ చేయాలనుకుంటున్నారు. కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో టీజీ విశ్వప్రసాద్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు.



'దర్శిని'లో శాంతి

భవిష్యత్ దర్శిని

ముగ్గురు మిత్రులకు భవిష్యత్‌ను చూపించే ఓ యంత్రం దొరికినప్పుడు వారు చేసిన పనులు ఎలాంటి పరిణామాలకు దారి తీశాయి? అనే అంశంతో తెరకెక్కిన సైన్స్ ఫిక్షన్ ఫిల్మ్ 'దర్శిని'. వికాశ్, శాంతి, సత్యప్రసాద్ లీడ్ రోల్స్‌లో నటించిన ఈ సినిమాకు డా. ప్రదీప్ అల్లు దర్శకుడు. ఎల్‌వీ సూర్యం నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 17న రిలీజ్ కానుంది.

ఈ తరహాలో తెలుగులో మరికొన్ని సైన్స్ ఫిక్షన్ చిత్రాలు ఉన్నాయి.



'ఇంద్రాణి'లో యానియా

సూపర్ గాళ్

యానీయా భరద్వాజ్, కబీర్ దుహాన్ సింగ్, ప్రణీతా జిజిన లీడ్ రోల్స్‌లో నటించిన టైమ్ ట్రావెల్ అండ్ సైన్స్ ఫిక్షన్ ఫిల్మ్ 'ఇంద్రాణి'. స్టీఫెన్ పల్లం ఈ సినిమాను స్వీయ దర్శకత్వంలో నిర్మించారు. గరిమా కౌశల్, షతఫ్ అహ్మద్ కీలక పాత్రల్లో కనిపిస్తారు. దేశం కోసం పోరాడే ఓ సూపర్ ఉమన్ నేపథ్యంలో ఈ సినిమా రూపొందింది అని తెలుస్తోంది. ఈ సినిమా ఈ నెలలోనే విడుదల కానుంది.

మండే ఎండల కంటే వాడివేడిగా

రాష్ట్రంలో హోరెత్తిన లోక్‌సభ ఎన్నికల ప్రచారం

- పట్టు నిలుపుకొనేందుకు కాంగ్రెస్..
- పైచేయి సాధించాలని బీజేపీ.. పునర్వైభవం కోసం బీఆర్‌ఎస్
- మూడు సార్లు వచ్చిన ప్రధాని మోదీ. .. 57 సభల్లో పాల్గొన్న సీఎం రేవంత్
- జాతీయ పార్టీల తరఫున రాహుల్, ప్రియాంక, అమిత్ షా, నడ్డా
- 17 రోజుల బస్సు యాత్రతో ప్రచార బరిలో కదం తొక్కిన బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్
- జాతీయ స్థాయిలో చర్చకు దారి తీసిన రిజర్వేషన్లు, అమిత్ షా ఫేక్ వీడియో అంశాలు
- సీఎంకు నోటీసులు.. ఈసీ ఆదేశాలతో కేసీఆర్ ప్రచారానికి 48 గంటల నిషేధం అమలు
- గాడిద గుడ్డు ఎపిసోడ్‌లో కాంగ్రెస్ వర్సెస్ బీజేపీ
- ఒట్లు, తిట్లు, కౌంటర్లు, కార్నర్ చేసే యత్నాలతో ప్రచారంలో మాస్ అప్పీల్



సాక్షి, హైదరాబాద్: ఒట్లు, తిట్లు, గాడిద గుడ్లు, ఫేక్ వీడియోలు, ఢిల్లీ నుంచి నోటీసులు, విమర్శలు, ప్రతి విమర్శలు, కౌంటర్లు, ఒకరినొకరు కార్నర్ చేసుకునే యత్నాలతో రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికల ప్రచారం హోరెత్తింది. నడి వేసవిలో మండే ఎండలకంటే వాడివేడిగా ప్రచారం పోటెత్తింది. తెలంగాణలోని ప్రధాన రాజకీయ పక్షాలైన కాంగ్రెస్, బీజేపీ, బీఆర్‌ఎస్‌తో పాటునామ మాత్రంగా బరిలో ఉన్న చిన్నా చితకా పార్టీలు, స్వతంత్రులు సైతం ప్రచారంలో సై అంటే సై అనడంతో ఢిల్లీ యుద్ధానికి గల్లీలు వేదికలయ్యాయి. తెలంగాణ ఆవిర్భావం తర్వాత తొలిసారి అధికారం దక్కిన తర్వాత జరుగుతున్న లోక్‌సభ ఎన్నికల్లో పట్టు నిలుపుకొనేందుకు కాంగ్రెస్ పార్టీ, ఈ ఎన్నికల్లో పైచేయి సాధించేందుకు బీజేపీ, పూర్వ వైభవం సాధించేందుకు బీఆర్‌ఎస్ పార్టీల నేతలు, కార్యకర్తలు మండుటెండలను సైతం లెక్కచేయలేదు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మూడు సార్లు రాష్ట్రానికి రాగా, ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో పాటు జాతీయ స్థాయి నేతలు, కేంద్ర మంత్రులు ఆయా పార్టీల అభ్యర్థుల పక్షాన తెలంగాణ క్షేత్రానికి విచ్చేశారు. ఇక బీఆర్‌ఎస్ తరఫున ఆ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి 17 రోజుల బస్సు యాత్రతో లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో కదం తొక్కారు.

రిజర్వేషన్ల... రచ్చ

ఈసారి లోక్‌సభ ఎన్నికల్లో రిజర్వేషన్ల అంశం రచ్చకు దారితీసింది. బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే ఎస్సీ, ఎస్టీల రిజర్వేషన్లను తొలగిస్తుందనే చర్చను టీపీసీసీ ప్రచారంలోకి తెచ్చింది. స్వయంగా సీఎం రేవంత్‌రెడ్డి ఈ అంశంపై ప్రధానంగా దృష్టి పెట్టి ప్రచార గడువు ముగిసే చివరి రోజు వరకు ప్రజల్లో ఉంచే ప్రయత్నం చేశారు. దీన్ని కౌంటర్ చేసేందుకు బీజేపీ కూడా గట్టిగానే ప్రయత్నించింది. ఈ ఆరోపణలను ప్రధాని మోదీతో సహా అమిత్‌షా, రాష్ట్ర పార్టీ నేతలు తిప్పికొట్టే ప్రయత్నం చేశారు. ఇక, రిజర్వేషన్ల విషయంలోనే అమిత్‌షా మాట్లాడారంటూ టీపీసీసీ ఎక్స్ హ్యాండిల్‌లో పెట్టిన వీడియో ఏకంగా జాతీయ స్థాయిలో చర్చనీయాంశమైంది. ఇది ఫేక్‌వీడియో అంటూ కేసు నమోదు చేసిన ఢిల్లీ పోలీసులు తెలంగాణకు వచ్చి పలువురు కాంగ్రెస్ నేతలను అదుపులోకి తీసుకున్నారు. ఈ అంశంలోనే టీపీసీసీ అధ్యక్షుడు హోదాలో ఉన్న సీఎం రేవంత్‌రెడ్డికి సైతం నోటీసులిచ్చారు.

బాగా నలిగిన 'గాడిద గుడ్డు'

ఇక, గత పదేళ్లలో తెలంగాణకు బీజేపీ చేసిందేమీ లేదంటూ కాంగ్రెస్ పార్టీ ప్రారంభించిన గాడిద గుడ్డు ప్రచారం కూడా చర్చనీయాంశమైంది. సీఎం రేవంత్ హాజరైన సభల్లో ఏకంగా గాడిద గుడ్డును ప్రదర్శించి తెలంగాణకు బీజేపీ ఏమీ చేయలేదన్న అంశాన్ని హైలైట్ చేసే ప్రయత్నం చేశారు. దీనికి కౌంటర్‌గా కాంగ్రెస్ ఆరు గ్యారంటీలు.. ఆరు గాడిద గుడ్లు అంటూ బీజేపీ తిప్పికొట్టే ప్రయత్నం చేసింది. రైతు రుణమాఫీ అంశం కూడా ఈసారి లోక్‌సభ ఎన్నికల్లో ప్రధాన ప్రచారాస్త్రంగా మారింది. ఆగస్టు 15లోపు రైతులందరికీ రూ.2లక్షల రుణమాఫీ చేస్తానని సీఎం రేవంత్ ప్రకటించడం, దీనిపై ఆయన దేవుళ్ల మీద ఒట్లు పెట్టడం కూడా చర్చకు తెరలేపింది. దీన్ని కార్నర్ చేసేందుకు బీఆర్‌ఎస్ గట్టిగానే ప్రయత్నించింది. ఈ అంశంలో రాజీనామా సవాళ్లు, ప్రతిసవాళ్లు, గన్‌పార్కు వద్ద నిరసనలు, శుద్ధి చేసే కార్యక్రమాలు, హరీశ్ తెచ్చిన రాజీనామా లేఖ, అది ఉత్తుత్తిదేనంటూ కాంగ్రెస్ కౌంటర్లు... ఇలా వారం రోజుల పాటు రైతు రుణమాఫీ చుట్టూనే లోక్‌సభ ఎన్నికల ప్రచారం తిరిగింది.

కేసీఆర్‌పై నిషేధం

కాంగ్రెస్ పార్టీపై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ ప్రచారంపై 48గంటల పాటు ఈసీ నిషేధం విధించడం, రైతుల ఖాతాల్లో పడిన రైతు భరోసా నిధుల విడుదల ప్రక్రియను ఎన్నికలు ముగిసేంతవరకు నిలిపివేయాలంటూ ఈసీ ఆదేశాలివ్వడం కూడా ఈసారి లోక్‌సభ ఎన్నికల్లో ప్రధానాంశాలుగా చెప్పుకోవచ్చు.

రేవంత్... రాహుల్... ప్రియాంక... ఖర్గే

ఈ ఎన్నికల్లో 14 స్థానాల్లో గెలుపే ధ్యేయంగా అధికార కాంగ్రెస్ పార్టీ సర్వ శక్తులు ఒడ్డింది. టీపీసీసీ అధ్యక్షుడు హోదాలో సీఎం ఎ.రేవంత్‌రెడ్డి రాష్ట్రంలోని 17 లోక్‌సభ స్థానాల పరిధిలో ఏకంగా 57 సభలకు హాజరై తమ అభ్యర్థులను ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. రేవంత్‌కు తోడు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సహా మంత్రులందరూ తమకు ఇంచార్జులుగా బాధ్యతలు అప్పగించిన స్థానాలు, ఇతర లోక్‌సభ స్థానాల పరిధిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఏఐసీసీ పక్షాన రాహుల్‌గాంధీ నర్సాపూర్, సరూర్‌నగర్ స్టేడియంలో జరిగిన జనజాతర సభలకు హాజరు కాగా, ప్రియాంకా గాంధీ కామారెడ్డి, తాండూరు సభలకు హాజరయ్యారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నకిరేకల్‌లో జరిగిన సభలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జి దీపాదాస్‌మున్షీ హైదరాబాద్‌లోనే ఉండి పార్టీలోకి చేరికల కార్యక్రమాలు, సమావేశాలను నిర్వహిస్తూ పార్టీ నేతలను, కేడర్‌ను సమన్వయంతో ముందుకు నడిపించారు. కాగా, భట్టి విక్రమార్క 9 లోక్‌సభ నియోజకవర్గాల్లోని 22 సభల్లో పాల్గొని ప్రచారం చేపట్టారు.

న్యాయవాదుల సంక్షేమానికి
రూ.100 కోట్లు

- త్వరలోనే విడుదల చేస్తామని సీఎం రేవంత్ హామీ



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని న్యాయవాదుల ఆరోగ్య బీమాకు త్వరలోనే రూ.100 కోట్లు విడుదల చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. శనివారం రాష్ట్ర హైకోర్టు బార్ అసోసియేషన్ ప్రతినిధులు సీఎంను కలిశారు. తమకు ఆరోగ్య బీమా పథకానికి అవసరమైన నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే న్యాయవాదుల సంక్షేమానికి సహకారం అందించాలని కోరారు. గతంతో పోలిస్తే న్యాయవాదుల సంఖ్య పెరిగిందని, అందుకు తగినట్లుగా ఆర్థిక సాయం అందించాలని విన్నవించారు. న్యాయవాదుల వృత్తి పట్ల తనకు ఎంతో గౌరవముందని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా పేర్కొన్నారు. న్యాయ వాదుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఆరోగ్య బీమాకు తగినన్ని నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. త్వరలోనే సంక్షేమ సంఘానికి రూ.100 కోట్లు విడుదల చేస్తామని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం అందించే ఈ సహకారం న్యాయవాదులందరికీ మేలు చేస్తుందని రేవంత్ ఆశాభావం వ్యక్తంచేశారు.

మానవాళి సృష్టికి మూలమైన
తల్లి కూడా దైవమే

- మంత్రి కొండా సురేఖ మాతృదినోత్సవ శుభాకాంక్షలు



సాక్షి, హైదరా బాద్: ఈ విశ్వాన్ని సృష్టించిన శక్తిని దైవంగా భావిస్తే, మానవాళి సృష్టికి మూలమైన తల్లి కూడా దైవమేనని అటవీ, దేవాదాయ శాఖమంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. అంతర్జాతీయ మాతృ దినోత్సవం (మే 12) సందర్భంగా సురేఖ మాతృమూర్తులకు శుభాకాంక్షలు తెలిపారు. సాంకేతికంగా మే 12న మాతృ దినోత్సవాన్ని జరుపుకుంటున్నప్పటికీ ప్రతి రోజు మాతృమూర్తుల దినోత్సవమేనని, కుటుంబాన్ని ముందుకు నడిపించడంలో తల్లి పాత్రకున్న విలువ అలాంటిదని కొనియాడారు. సృష్టిలో స్త్రీ పాత్ర వైవిధ్యభరితమైందని, ఒక మహిళ తాను తల్లి అయ్యాక మరో జన్మ ఎత్తి ఈ ప్రపంచానికి కొత్తగా పరిచయమవుతుందని చెప్పారు. కుటుంబాన్ని తీర్చిదిద్దేందుకు ఎన్నో త్యాగాలు చేసే అమ్మ వంటి త్యాగశీలి, సహనశీలి, ప్రేమమూర్తి ఈ విశ్వంలో మరొకరు ఉండరని సురేఖ పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాతృమూర్తుల ఆరోగ్య పరిరక్షణకు, వికాసానికి తెచ్చిన చట్టాలు, చేపట్టిన కార్యక్రమాలు వారి జీవితాల్లో గొప్ప మార్పును తేవడంతో పాటు, తర్వాత కాలంలో ఈ దిశగా సమగ్ర చట్టాలు తెచ్చేందుకు ఆధారంగా నిలిచాయని తెలిపారు.

చలో ఆంధ్ర

ఓట్లేసేందుకు తరలిన నగరవాసులు

- రైళ్లు, బస్సులు, ప్రైవేటు వాహనాలన్నీ కిటకిట



ఈ నెల 13న ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో హైదరాబాద్ శివారులోని వివిధ ప్రాంతాల్లో సెటిలైన ఆంధ్రావాసులు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు శనివారం రాత్రి సొంత ఊళ్ల బాట పట్టారు. ఈ క్రమంలో వెల్లువెత్తిన ప్రైవేటు వాహనాలు, ఆర్టీసీ బస్సులతో పెద్దఅంబర్‌పేట ఔటర్ కూడలి వద్ద ట్రాఫిక్ స్తంభించిపోయింది. ఒకేసారి వందల సంఖ్యలో వాహనాలు జాతీయ రహదారిపైకి రావడంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తాయి. కాగా, విజయవాడ జాతీయ రహదారిపై వెళ్తున్న వాహనాల హడావుడి చూస్తుంటే సిటీ నుంచి ఊళ్లకు సంక్రాంతి పండక్కి తరలివెళ్లేటప్పుడు నెలకొనే వాతావరణం తలపించింది. బస్సుల్లో జనం రద్దీ ఉండటంతో కొంతమంది ట్రాలీ ఆటోలలో సైతం వెళ్లడం కనిపించింది. - అబ్దుల్లాపూర్‌మెట్

సాక్షి, హైదరాబాద్: ఓట్ల పండగ కోసం సిటీ ఓటర్ చలో పల్లెటూర్ అంటూ సొంత ఊరుకు బయలుదేరాడు. సోమవారం పోలింగ్ నేపథ్యంలో గత రెండురోజులుగా నగరవాసులు పెద్ద ఎత్తున సొంతూళ్లకు తరలివెళ్తుండగా, శనివారం ఆ రద్దీ విపరీతమైంది. వాస్తవానికి దశాబ్దాలుగా నగరంలో నివసిస్తున్న వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలకు తమ సొంత ఊళ్లతో పాటు హైదరాబాద్‌లోనూ ఓటు హక్కు ఉంటోంది. కానీ లక్షలాది మంది సిటీలో తమ ఓటు హక్కును వినియోగించుకొనేందుకు విముఖత చూపుతున్నారు. పుట్టి పెరిగిన ఊళ్లో తమ ఉనికిని చాటుకొనేందుకే ఆసక్తి చూపిస్తున్నారు. పుట్టిన ఊళ్లో ఎలాంటి ఆస్తిపాస్తులు లేకపోయినా ఉన్న ఆస్తి ఓటు హక్కు మాత్రమేనని పేర్కొంటూ చాలామంది ఊళ్లకు పయనమయ్యారు.

గ్రేటర్‌లో పోలింగ్ తగ్గితే..

ఇక నగర ఓటర్లు పెద్దసంఖ్యలో ఇక్కడ పోలింగ్‌కు వెళ్లకుండా సొంతూళ్ళల్లో ఓట్లేసేందుకు వెళ్తుండటంతో నగరంలో పోటీ చేస్తున్న అభ్యర్థుల్లో ఆందోళన నెలకొంది. పోలింగ్ శాతం తగ్గి ఫలితంపై ప్రభావం చూపుతుందేమోనని ఎవరికి వారు అప్పుడే లెక్కలు వేసుకుంటున్నారు. గ్రేటర్‌లో ఏ ఎన్నికల్లోనూ పోలింగ్ 50 శాతం దాటకపోవడానికి ప్రధాన కారణం నగరవాసులు ఇలా ఇక్కడ ఓటేయకుండా సొంతూళ్లకు పయనం కావడమే. గత నవంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఇదే పరిస్థితి కనిపించింది. అందుకే సొంత ఊళ్లకు వెళ్లే వాళ్లను ఆపేందుకు ఆయా పార్టీల నేతలు శతవిధాలుగా ప్రయత్నాలు చేస్తున్నారు.

అదనంగా 2వేల ఆర్టీసీ బస్సులు

ప్రయాణికుల రద్దీ కారణంగా శనివారం నగరంలోని సికింద్రాబాద్, నాంపల్లి, కాచిగూడ రైల్వేస్టేషన్‌లు కిటకిటలాడాయి. ఇక నిత్యం రాకపోకలు సాగించే సుమారు 3500 బస్సులకు అదనంగా దాదాపు 2000 బస్సులను నడిపేందుకు ఆర్టీసీ ఇప్పటికే ప్రణాళికలను సిద్ధం చేసింది. మరోవైపు ఏపీలోని విజయవాడ, విశాఖ, అమలాపురం, కాకినాడ, తిరుపతి, చిత్తూరు. కడప, అనంతపురం, తదితర ప్రాంతాలకు వెళ్లే బస్సులన్నీ కిక్కిరిసిపోయాయి.

దక్షిణమధ్య రైల్వే ప్రత్యేక రైళ్లు

అనూహ్యంగా పెరిగిన రద్దీ మేరకు దక్షిణ మధ్య రైల్వే పలు మార్గాల్లో ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేసింది. ఈ నెల 11,12, 13 తేదీల్లో ప్రయాణికులు రాకపోకలు సాగించే విధంగా సికింద్రాబాద్–విశాఖ (07097/070098) సూపర్‌ఫాస్ట్ స్పెషల్ ట్రైన్‌ను అందుబాటులో ఉంచింది. అలాగే సికింద్రాబాద్ నుంచి కాకినాడ, మచిలీపట్నం, నర్సాపూర్, విశాఖ, తిరుపతి, తదితర ప్రాంతాలకు నడుస్తున్న ప్రత్యేక రైళ్లను పొడిగించింది. తిరుపతి–లింగంపల్లి, లింగంపల్లి–ముంబై, తిరుపతి–సికింద్రాబాద్, విశాఖపట్నం–సికింద్రాబాద్, తిరువనంతపురం–సికింద్రాబాద్, మచిలీపట్నం–బీదర్, కాచిగూడ–గుంటూరు, కాచిగూడ–మెదక్,రేపల్లె–వికారాబాద్, సికింద్రాబాద్–భద్రాచలం, గుంటూరు– తిరుపతి, గుంటూరు–విశాఖ, సికింద్రాబాద్–విజయవాడ, నర్సాపూర్–ధర్మవరం.. తదితర మార్గాల్లో రాకపోలు సాగించే 28 ప్రత్యేక రైళ్లలో అదనంగా ఏసీ, నాన్ ఏసీ బోగీలను ఏర్పాటు చేశారు. ఎన్నికలతో పాటు వేసవి సెలవులను దృష్టిలో ఉంచుకుని వివిధ మార్గాల్లో ప్రయాణికుల రద్దీ మేరకు ఈ నెల 18వ తేదీ వరకు ఈ అదనపు బోగీలు వినియోగంలో ఉంటాయి.



సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో పరిస్థితి ఇలా..



ఎన్నికల ప్రచారం ముగిసినందున శనివారం సాయంత్రం నల్లగొండలో బీఆర్‌ఎస్ అభ్యర్థి ప్రచార వాహనం సామగ్రిని తొలగిస్తున్న కార్యకర్తలు

లోక్‌సభ ఎన్నికల్లో వాడనున్న ఈవీఎంలు	
బ్యాలెట్ యూనిట్లు	- 84,577 + 20వేలు రిజర్వ్
కంట్రోల్ యూనిట్లు	- 35,809 + 10వేల రిజర్వ్
వీవీప్యాట్స్	- 35,809 + 15వేలు రిజర్వ్

పోలీసుల బందోబస్తు	
కేంద్ర బలగాలు	-160 కంపెనీలు
పొరుగు రాష్ట్రాల నుంచి హోంగార్డులు, ఇతర బలగాలు- 20వేల మంది	
రాష్ట్ర పోలీసులు	60వేల మంది
ఇతర రాష్ట్ర యూనిఫార్మ్ సర్వీసుల సిబ్బంది- 12 వేల మంది	

ఇక మాటల్లేవ్!

▶ మొదటి పేజీ తరువాయి

చేశారు. ఎన్నికల ప్రచారం కోసం వచ్చిన స్థానికేతరులు తక్షణమే వెళ్లిపోవాలని ఆదేశించారు.

బల్క్ ఎస్‌ఎంఎస్‌లపై నిషేధం

బల్క్ ఎస్‌ఎంఎస్‌లతో పాటు టీవీ చానళ్లు, రేడియో, ఇతర మాధ్యమాల ద్వారా ఎన్నికల ప్రచార కార్యక్రమాల ప్రసారంపై నిషేధం అమల్లోకి వచ్చిందని వికాస్‌రాజ్ తెలిపారు. ఎగ్జిట్ పోల్స్ ఫలితాలను జూన్ 1 సాయంత్రం వరకు వెల్లడించరాదన్నారు. శనివారం ఆయన బీఆర్‌కేఆర్ భవన్‌లోని తన కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి ఎన్నికల ఏర్పాట్లను వెల్లడించారు. సోమవారం జరగాల్సిన పోలింగ్‌కు సర్వం సిద్ధం చేశామన్నారు.

ఎక్కడికక్కడ గట్టి నిఘా

పోలింగ్‌కి ముందురోజు ఆదివారం రాత్రి వేళల్లో ఓటర్లకు డబ్బులు, మద్యం, ఇతర వస్తువులను పంపిణీని అడ్డుకోవడం తమకు కీలకమని, ఇందుకు పకడ్బందీగా ఏర్పాట్లు చేసినట్టు వికాస్‌రాజ్ తెలిపారు. అంతర్రాష్ట్ర చెక్‌పోస్టుల వద్ద నిఘా పెంచామని, అన్ని ట్రాన్స్‌పోర్ట్, కమర్షియల్ వాహనాలను తనిఖీ చేస్తున్నామన్నారు. ఇప్పటి వరకు రూ.320 కోట్లు విలువైన నగదు, మద్యం, మాదకద్రవ్యాలు, ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. సీ–విజిల్ యాప్, ఎన్‌జీఎస్పీ పోర్టల్ ద్వారా వచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందించి 100 నిమిషాల్లోగా చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘన విషయంలో మొత్తం 8600 కేసులు నమోదు చేయగా, అందులో 293 కేసులు నగదుకి సంబంధించినవి, 449 కేసులు ఐపీసీ, 7800 కేసులు మద్యానికి సంబంధించినవి అని వివరించారు.

పోస్టర్ బ్యాలెట్‌లో అభ్యర్థిని చూడాలి..

ఆదిలాబాద్ లోక్‌సభ స్థానం మినహా మిగిలిన 16 లోక్‌సభ స్థానాల పరిధిలో రెండు, లేదా మూడు బ్యాలెట్ యూనిట్లతో ఎన్నికలు జరుగుతాయని, ఓటర్లు గందరగోళానికి గురికావద్దని, పోలింగ్ కేంద్రం బయట ప్రదర్శనకు ఉంచిన పోస్టర్ బ్యాలెట్‌లో తాము ఓటేయాల్సిన అభ్యర్థిని ముందే గుర్తించాలని వికాస్‌రాజ్ సూచించారు. ఇప్పటికే రాష్ట్రంలో 1.88లక్షల మంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటేశారని, వీరిలో 20,163 మంది ఇంటి వద్ద నుంచే ఓటేశారన్నారు. రాష్ట్రంలో తక్కువ పోలింగ్ జరిగే 5వేల పోలింగ్ కేంద్రాలను గుర్తించి, అక్కడి ప్రజలు ఓటేసేలా చైతన్యపరిచేందుకు చర్యలు తీసుకున్నామని తెలిపారు. రాష్ట్రంలో మొత్తం 35,809 పోలింగ్ కేంద్రాలుండగా, అందులో 9900 సమస్యాత్మకమైనవి అని, అక్కడ కేంద్ర బలగాలు, సూక్ష్మ పరిశీలకులు, వెబ్‌కాస్టింగ్ ఏర్పాట్లు చేశామని చెప్పారు.

సోమవారం ఉదయం 5.30 కి మాక్‌పోల్

సోమవారం ఉదయం 5.30 గంటలకు పోలింగ్ కేంద్రంలో మాక్‌పోల్ నిర్వహిస్తారని, అభ్యర్థుల ఏజెంట్లు అందరూ అందుబాటులో ఉండాలని వికాస్‌రాజ్ సూచించారు. మాక్‌పోల్/పోలింగ్ నిర్వహించేటప్పుడు ఈవీఎంలు పనిచేయకపోతే సెక్టోరల్ అధికారులు వచ్చి మారుస్తారని చెప్పారు. ప్రతి అసెంబ్లీ స్థానం పరిధిలో ఇద్దరు, ముగ్గురు ఈసీఐఎల్ ఇంజనీర్లు అందుబాటులో ఉంటారన్నారు. ఈవీఎంలను తరలించే వాహనాలకు పోలీసుల భద్రతతో పాటు వాటి కదలికలను జీపీఎస్ ద్వారా జిల్లా కలెక్టర్లు నిరంతరం సమీక్షిస్తారన్నారు.

కచ్చితమైన పోలింగ్ శాతం తెలిసేది మరుసటి రోజే..

పోలింగ్ ప్రారంభమైన తర్వాత ప్రతి రెండు గంటలకు ఒకసారి అంచనా పోలింగ్ శాతాన్ని అందిస్తామని వికాస్‌రాజ్ తెలిపారు. పోలింగ్ ముగిసాక సాయంత్రం 6 గంటలకు మొత్తం పోలింగ్ శాతంపై తొలి అంచనాను, రాత్రి అయ్యాక సవరించిన అంచనాలను ప్రకటిస్తామన్నారు. మరుసటి రోజు కచ్చితమైన పోలింగ్ శాతం వెల్లడిస్తామన్నారు.

విద్వేష ప్రసంగాలపై దాటవేత ధోరణి..

ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల సందర్భంగా రాష్ట్రంలో ప్రధాని నరేంద్ర మోదీతో సహా ఇతర బీజేపీ నేతలు విద్వేష ప్రసంగాలు చేశారని, ప్రచారంలో చిన్నపిల్లలను వాడుకున్నారని కాంగ్రెస్ పార్టీ చేసిన ఫిర్యాదులపై చర్యలెందుకు తీసుకోవడం లేదని జర్నలిస్టులు అడిగిన ప్రశ్నలకు వికాస్‌రాజ్ సూటిగా సమాధానం చెప్పకుండా దాటవేశారు. ప్రత్యేకంగా ఒక్కో ఫిర్యాదు విషయంలో తీసుకున్న చర్యలకు సంబంధించిన సమాచారం తన వద్ద ఇప్పుడు లేదన్నారు. రాజకీయ పార్టీల నుంచి మొత్తం 92 ఫిర్యాలొచ్చాయని, ఇద్దరు వ్యక్తులపై ఈసీ ఇప్పటికే చర్యలు తీసుకుందని వెల్లడించారు. ఫిర్యాదుల విషయంలో రాజకీయ పార్టీలకు నోటీసులు జారీ చేశామని, వివరణ కోసం వారు మరికొంత సమయం కోరినట్టు తెలిపారు.



ఎన్నికల నేపథ్యంలో శనివారం సాయంత్రం 5 గంటల నుంచి వైన్స్ షాపులు బంద్ అని ప్రకటించిన నేపథ్యంలో మందుబాబుల హడావుడి



బాబూ.. నీ హామీల అమలు ఎలా సాధ్యం?

తొలి ఏడాదే వాటికి రూ. 1.65 లక్షల కోట్లు అవసరం

- ఉద్యోగుల జీతాలు, ప్రభుత్వ తప్పనిసరి వ్యయం రూ.2.10 లక్షల కోట్లు
- అంత డబ్బు సమీకరించడం సాధ్యమా?
- ప్రజలను మోసం చేయడానికే ఈ హామీలిచ్చినట్లు సుస్పష్టం



(సాక్షి, అమరావతి) : మేనిఫెస్టో సహితంగా చంద్రబాబు నాయుడు ఇచ్చిన అలవికాని హామీలకు మొదటి సంవత్సరంలోనే ఎంత ఖర్చు అవుతుందో తెలుసా? అక్షరాలా లక్షా అరవై ఐదువేల కోట్లు. అంటే... రూ.1.65 లక్షల కోట్లు. మరి అంత డబ్బు ఎక్కడి నుంచి తెస్తారు? అసలు రాష్ట్ర ఆదాయం ఎంత? అన్ని లక్షల కోట్లు సమకూరే అవకాశం ఉందా అంటే? ఈ ప్రశ్నలకు ఆర్థిక నిపుణుల నెవరిని సమాధానమడిగినా అలాంటి ఛాన్సే లేదని స్పష్టంగా చెబుతున్నారు. అయినా చంద్రబాబు మాత్రం అధికారమే లక్ష్యంగా నోటికి వచ్చినట్లు వాగ్దానాలు ఇచ్చేశారు. ఎందుకంటే వాటిని అమలు చేసే ఆలోచన లేదు కాబట్టి నోటిమాటగా యథేచ్ఛగా ప్రజలకు మాయ హామీలు ఇచ్చేశారు. ప్రజలను మోసం చేయడం, వంచించడం ఈ వృద్ధ నేతకు వెన్నతో పెట్టిన విద్య కావడంతో ఈ ఎన్నికల్లోనూ అదే లైను ఎంచుకున్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, ఆయన ఇచ్చిన హామీలు, ఇతర ఖర్చులు, ఎంత వరకు అప్పు చేయవచ్చు వంటి విషయాలను పరిశీలించిన నిపుణులు చంద్రబాబు హామీలు అమలు చేయడం అసాధ్యమని కుండబద్దలు కొట్టినట్లు చెబుతున్నారు. ఆ వివరాలు చూస్తే...

చంద్రబాబు కాపీ కొట్టి ప్రకటించిన తల్లికి వందనం, ఆడబిడ్డ నిధి, పింఛన్లు వంటి వివిధ పథకాలకు 2024–2025 సంవత్సరంలో రూ.1.65 లక్షల కోట్లు అవసరమనేది ఆర్థిక నిపుణుల అంచనా. ఇక 2029 సంవత్సరానికి అది రూ.1.76 లక్షల కోట్లకు పెరుగుతుంది. ఇక వీటితో పాటు ప్రభుత్వం తప్పనిసరిగా చేయాల్సిన ఖర్చులు, మూలధన వ్యయం ఎలాగూ ఉండనే ఉంటుంది. అంటే ఉద్యోగులు, పెన్షనర్ల జీత భత్యాలు, ప్రభుత్వం అప్పులపై కట్టాల్సిన వడ్డీలు, కేంద్ర ప్రాయోజిత పథకాలకు చేయాల్సిన ఖర్చు, ఇతర బిల్లులు, చెల్లింపులు వంటివన్నీ కలిపి ఏడాదికి రూ.2 లక్షల కోట్లకుపైనే ఉంటుంది. 2024–2025లో ఇందు కోసం రూ.2.10 లక్షల కోట్లు ఖర్చు చేయాల్సి వస్తే, 2029 నాటికి అది రూ.2.85 లక్షలకు కోట్లకు పెరుగుతుందని నిపుణుల అంచనా. మొత్తంగా ఐదేళ్లలో రూ.12.23 లక్షల కోట్లు ఇందుకోసం అవసరమవుతుంది. మొత్తంగా చంద్రబాబు ప్రకటించిన పథకాలు, ప్రభుత్వ ఖర్చు కలిపి 2024–2025లో రూ.3.75 లక్షల కోట్లు అవసరమని అంచనా. 2028–29 నాటికి అది రూ.4.61 లక్షల కోట్లకు ఎగబాగనుంది. ఇంత ఖర్చును భరించే సామర్థ్యం రాష్ట్రానికి సాధ్యమయ్యే అవకాశమే లేదని ఆర్థిక వేత్తలు స్పష్టం చేస్తున్నారు.

ఖర్చు 3.75 లక్షల కోట్లయితే... ఆదాయం రూ.2.03 లక్షల కోట్లే

ప్రభుత్వానికి పన్నులు, పన్నేతర ఆదాయాలన్నీ కలిపి 2025లో రూ.2.03 లక్షల కోట్లు సమకూరే అవకాశం ఉంది. 2029 నాటికి ఈ ఆదాయం రూ.2.82 లక్షల కోట్లు పెరిగే పరిస్థితి ఉందని చెబుతున్నారు. ఆర్థిక నిపుణులు చెప్పేదేమిటంటే ఆదాయ - వ్యయాల మధ్య తేడా గరిష్ఠంగా 10–12 శాతం వరకూ ఉన్నా పర్వాలేదు. పరిస్థితి గాడి తప్పకుండా ఉంటుంది. పన్నుల వసూళ్లలో సమర్థతను పెంచుకోవటం, వ్యయాన్ని పక్కాగా నియంత్రించుకోవటం వంటి చర్యలతో ఈ మాత్రం వ్యత్యాసాన్ని అధిగమించే అవకాశం ఉంటుంది. అలాకాకుండా ఆదాయ - వ్యయాల మధ్య తేడా మరీ ఎక్కువగా ఉంటే చేతులెత్తేయటం తప్ప ఏ ప్రభుత్వం కూడా ఏమీ చేయలేదు. ఈ లెక్కన చూసుకుంటే చంద్రబాబు హామీలను బట్టి చూసినపుడు ప్రభుత్వ ఆదాయానికి.. పథకాలు, ఇతర ఖర్చులకు మధ్య వ్యత్యాసం 2024–2025 సంవత్సరంలో రూ.1.72 లక్షల కోట్లు ఉంటుంది. 2028–2029 నాటికి అది రూ.1.78 లక్షల కోట్లకు పెరుగుతుంది. ఇంత డబ్బును సమకూర్చుకోవాలంటే అప్పులు దొరికే అవకాశం ఉండదు. ప్రభుత్వ ఆస్తులను అమ్మడం, లేదా ఉద్యోగుల జీతభత్యాలను పూర్తిగా నిలిపేయటం వంటి చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. ఇలాంటి చేయలేని పక్షంలో పథకాలను అమలు చేయటం మానేయాలి. అంటే... అయితే మేనిఫెస్టోను చెత్తబుట్టలో పడేసి జనాన్ని మోసం చెయ్యాలి... లేదంటే ఉద్యోగుల జీతభత్యాలు, పింఛన్ల వంటి తప్పనిసరి వ్యయాలను ఎగ్గొట్టాలి. ఇది అరాచకానికి దారి తీస్తుందనేది నిపుణుల మాట.

ఏడాదికి రూ.1.72 లక్షల కోట్ల అప్పులు తెస్తారా?

తాజా లెక్కల ప్రకారం చంద్రబాబు హామీలు అమలు చేయాలంటే ఏడాదికి రూ.1.72 లక్షల కోట్ల అప్పు తప్పనిసరిగా తేవాల్సి ఉంటుంది. ఈ అప్పులు రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో (జీఎస్‌డీపీ)లో 10.5 శాతాన్ని దాటేస్తాయి. అది కూడా ఆయా సంవత్సరాల్లో రెండంకెల వృద్ధి రేటు సాధిస్తారు అని ఊహిస్తేనే. అలాకాకుండా వృద్ధి రేటు తగ్గితే పరిస్థితి మరింత అధ్వానం. అసలు ఇంత అప్పు తేవడం నిజంగా సాధ్యమా అంటే కానే కాదని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. ఎందుకంటే ఏపీ ప్రభుత్వం ఇంతకుముందు ఎప్పుడూ ఈ స్థాయి అప్పు చేయలేదు.

కాగ్ లెక్కలు, ఆర్‌బీఐ అంచనాలు, రాష్ట్ర బడ్జెట్ పత్రాలన్నింటినీ పరిశీలిస్తే రాష్ట్ర ప్రభుత్వం 2019–2024 మధ్య సగటున రూ.44 వేల కోట్లకు మించి అప్పులు చేయలేదు. జీఎస్‌డీపీలో (రాష్ట్ర స్థూల ఉత్పత్తి) 3 శాతానికి మించి అప్పు చేయడానికి ఏ కేంద్ర ప్రభుత్వమూ అనుమతించదు. ఆ పరిమితిని పూర్తిగా ఉపయోగించుకుని... కేంద్రం అనుమతించిన మేరకు గరిష్ఠంగా అప్పులు తెచ్చినా తొలి ఏడాదే ఇంకా రూ.1.13 లక్షల కోట్లు కావాలి. ఐదేళ్లలో రూ.5.40 లక్షల కోట్లు సమకూరిస్తేనే చంద్రబాబు ఇచ్చిన హామీలు అమలు చేయడం కుదురుతుంది. ఇవికాకుండా అమరావతి నిర్మాణం ఖర్చు మరో రూ.1.09 లక్షల కోట్లు. మొత్తం కలిపి రూ.6.50 లక్షల కోట్లను చంద్రబాబు ఎక్కడి నుంచి తెస్తారు? రాష్ట్ర ప్రజలు ప్రస్తుతం కడుతున్న పన్నుల్ని నాలుగు రెట్లు పెంచి, ప్రభుత్వ ఆస్తులన్నింటినీ గతంలో ఎన్నడూ లేనివిధంగా అయిన కాడికి అమ్మేస్తే కొంత మొత్తాన్ని సమకూర్చుకోవచ్చు. అంటే ప్రజలపై నాలుగు రెట్ల పన్నుల్ని చంద్రబాబు పెంచుతారా? లేకపోతే చంద్రబాబు హామీల అమలు కోసం ఏటా రూ.లక్ష కోట్లకు పైగా ఆస్తుల్ని అమ్మేస్తారా? ఇవేమీ సాధ్యమయ్యే అవకాశమే లేదు. అంటే చంద్రబాబు హామీలు అమలు చేయడానికి ఏమాత్రం ఛాన్సే లేదని నిపుణులు స్పష్టంగా చెబుతున్నారు. గతంలో రుణమాఫీ హామీని అమలు చేయకుండా ఎగ్గొట్టినట్టే ఈ హామీలను తుంగలో తొక్కడం తప్ప బాబుకు వేరే ఆప్షన్ లేదని, ఆయనను నమ్మి ఓటేస్తే జరిగేది అదేనని వారు స్పష్టంగా హెచ్చరిస్తున్నారు. నిజానికి ఈ సంగతులన్నీ జనానికి తెలుసు. ఎలాగంటే... బాబు ట్రాక్ రికార్డు అలాంటిది మరి. అందుకే అలవికాని హామీలిచ్చిన చంద్రబాబును ప్రజలు నమ్మడంలేదు.



మధ్యాహ్నం 12:10 గంటలకు: చిలకలూరిపేటలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల బహిరంగ సభకు హాజరైన అశేష జనవాహిని



మధ్యాహ్నం 2:15 గంటలకు: కైకలూరులో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల బహిరంగ సభకు హాజరైన భారీ జనసందోహంలో ఓ భాగం

ఎవరి వల్ల మంచి జరిగిందో ఆలోచించి ఓటు వేయండి

ప్రజలకు సీఎం వైఎస్ జగన్ విజ్ఞప్తి

సాక్షి, అమరావతి: 'అధికారంలో ఎవరుంటే మీకు మంచి జరిగిందో.. ఎవరుంటే ఈ మంచి కొనసాగుతుందో అనే విషయాన్ని ఆలోచించి.. కుటుంబసభ్యులందరితో కలిసి మాట్లాడుకొని ఓటు వేయండి'అని ప్రజలకు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, సీఎం వైఎస్ జగన్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శనివారం సామాజిక మాధ్యమం ఎక్స్(ట్విట్టర్)లో ఒక వీడియో పోస్టు చేశారు. 'ఓటర్లకు ఒక్కటే ఒకటి అప్పీల్ చేస్తున్నా. గతంలో నాకు ఓటు వేయని వారికి కూడా నేను విజ్ఞప్తి చేస్తున్నాను. నాకు ఓటు వేయకపోవటానికి వారికి రకరకాల కారణాలు ఉండవచ్చు. కులం కావచ్చు.. వాళ్లకున్న పార్టీల అఫిలియేషన్ కావచ్చు. ఏమైనా కారణాలు కావచ్చు. వాళ్లందరికీ కూడా నేను విజ్ఞప్తి చేసేది ఒక్కటే. ఒక్కసారి ఇంటికి వెళ్లి మీ భార్యతో మాట్లాడండి. మీ ఇంట్లో ఉండే అవ్వాతాతలతో మాట్లాడండి. మీ ఇంట్లో ఉన్న పిల్లలతో కూడా మాట్లాడండి. చిన్న పిల్లలు కదా.. ఓటు లేదు కదా.. అని వారిని పక్కన పెట్టొద్దు. వాళ్ల అభిప్రాయం కూడా తెలుసుకోండి. ఇంట్లో ఉన్న ఆడపడుచులతో కూడా మాట్లాడండి. అందరితో మాట్లాడి.. ఎవ్వరి వల్ల మీకు మంచి జరిగింది? ఎవ్వరు ఉంటే ఈ మంచి కొనసాగుతుంది? అనే ఒకే ఒక్క అంశం మీ ఓటును గైడ్ చేసేదిగా ఆలోచన చేసి ఓటు వేయండి'అని సీఎం జగన్ సూచించారు.

ఢిల్లీ అండతో.. అడ్డుకుంటున్నారు

చిలకలూరిపేట, కైకలూరు, పిఠాపురం ఎన్నికల సభల్లో సీఎం జగన్

"లాండ్ టైటిలింగ్ యాక్ట్, రిజిస్ట్రేషన్లపై ఎంత దుష్ప్రచారాలు చేస్తున్నారో మీరే చూస్తున్నారు. చంద్రబాబు వియ్యంకుడు బాలకృష్ణ మొన్ననే విశాఖలోని రుషికొండలో భూములు కొన్నాడు. దత్తపుత్రుడు మంగళగిరిలో భూములు కొన్నాడు. నేను వీళ్లిద్దరినీ అడుగుతున్నా. భూములు కొన్నప్పుడు మీకు ఒరిజినల్ రిజిస్టర్డ్ డీడ్స్ ఇచ్చారా? లేక జిరాక్స్ కాపీలు ఇచ్చారా? రాష్ట్రంలో రిజిస్ట్రేషన్లు చేసుకున్న 9 లక్షల మందికి మనం ఒరిజినల్ రిజిస్టర్డ్ డీడ్స్ ఇస్తే.. జిరాక్స్ కాపీలు ఇస్తున్నారని, వాళ్ల భూములను జగన్ కొట్టేస్తున్నాడంటూ దారుణంగా దుష్ప్రచారాలు చేస్తున్న వీళ్లంతా అసలు మనుషులేనా?"

–చిలకలూరిపేట, పిఠాపురం సభల్లో సీఎం జగన్

- అవ్వాతాతలు, అక్కచెల్లెమ్మలు, రైతన్నలు, పిల్లల ఉసురు పోసుకుంటున్న బాబు కూటమి
- హస్తిన పెద్దలకు దాసోహం అంటూ పథకాలను ఆపుతున్నారు
- పోలింగ్ ముగిసిన మర్నాడు.. 14న ఖాతాల్లోకి డబ్బులు వేస్తామంటున్నారు
- జగన్ బటన్లు నొక్కినా ఖాతాల్లోకి రాకుండా ఆటంకాలు కల్పిస్తున్నారు
- 2014లో వంచించిన బాబుకు దత్తపుత్రుడు మరోసారి కత్తి అందించి వెన్నుపోటు పొడవమంటున్నాడు
- మీ బిడ్డ కోరుకునేది మీ అందరి సంతోషాన్నే.. మీ జగన్‌కు ఓటు.. ఇంటింటి అభివృద్ధి కొనసాగింపు
- ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌పై అడ్డగోలుగా దుష్ప్రచారం
- బాలకృష్ణ, పవన్ కొన్న స్థలాలకు ఒరిజినల్ పత్రాలు ఇవ్వలేదా?
- కొల్లేరు సర్వే దాదాపు పూర్తి.. మిగులు భూములు పేదలకు పంచుతాం

సాక్షి ప్రతినిధి, గుంటూరు/సాక్షి ప్రతినిధి, ఏలూరు/సాక్షి ప్రతినిధి, కాకినాడ: వివిధ పథకాలతో నేరుగా లబ్ధి చేకూరుస్తూ మీ బిడ్డ బటన్లు నొక్కిన డబ్బులు అవ్వాతాతలు, అక్కచెల్లెమ్మలు, రైతన్నలు, విద్యార్థులకు అందకుండా చంద్రబాబు కూటమి ఢిల్లీ పెద్దలతో కుట్రలు చేసి దుర్మార్గంగా అడ్డుకుంటోందని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మండిపడ్డారు. ఈ కూటమి ఢిల్లీ నుంచి ఎన్నికల కమిషన్ దాకా వీళ్లకున్న పలుకుబడిని ఉపయోగించి ప్రజల గొంతు నొక్కేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారంలోకి వచ్చిన మొట్టమొదటి రోజు నుంచి ప్రజలకు మంచి చేసేందుకు మీ బిడ్డ బటన్లు నొక్కుతూనే ఉన్నాడని, ఇప్పటికి 130 సార్లు బటన్లు నొక్కాడని గుర్తు చేశారు. అలాంటి రొటీన్‌గా జరుగుతున్న కార్యక్రమాన్ని 57 నెలలకే అడ్డుకుని గొంతు నొక్కుతున్నారని ధ్వజమెత్తారు. "రెండు నెలల క్రితం వరకు నేరుగా ఇంటివద్దకే వచ్చి అవ్వాతాతలకు పెన్షన్లు ఇచ్చేవారు. ఆ పెన్షన్ వల్ల ఎక్కడ మీ బిడ్డకు మంచి పేరు వస్తుందోనని కుట్రపూరితంగా వలంటీర్లను అవ్వాతాతల ఇంటికి వెళ్లకుండా అడ్డుకుని వారి ఉసురు పోసుకుంటున్నారు. ఏ ప్రభుత్వాన్నైనా 60 నెలల కోసం ఎన్నుకుంటారు. అలాంటిది మన ప్రభుత్వాన్ని 57 నెలలకే గొంతు పట్టుకుని పిసికే కార్యక్రమం చేస్తున్నారు. మీ బిడ్డ బటన్లు నొక్కిన సొమ్ము అందకుండా ఢిల్లీ పెద్దలతో కుట్రలు చేసి అడ్డుకుంటున్నారు. ఈ డబ్బులు ఎన్నికలు అయిపోయాక ఇస్తారట! పోలింగ్ ముగిసిన మర్నాడు 14వ తారీఖున ఇస్తారట! ఇది కుట్ర కాదా? అయినా ఫర్వాలేదు. నాకు కావాల్సింది నా అక్కచెల్లెమ్మల మొహాల్లో సంతోషం. వారి పిల్లల చదువులకు మంచి జరగడం నాకు కావాలి. నాకు కావాల్సింది రైతన్నల మొహాల్లో సంతోషం. నాకు కావాల్సింది ఇదే! వాళ్లు నొక్కుతున్నది మీ బిడ్డ గొంతు కాదు.. నా అవ్వాతాతలు, అక్కచెల్లెమ్మలు, రైతన్నలు, పిల్లల గొంతులనే. జగన్ ఎలాంటివాడో నా అక్కచెల్లెమ్మలు, అవ్వాతాతలు ఐదేళ్లుగా ఏటా చూస్తూనే ఉన్నారు. మీ బిడ్డ తప్పు చేయలేదు. మీ జగన్ మీ కోసం బటన్లు నొక్కాడు. ఇవి ఎన్నికల కోసం నొక్కిన బటన్లు కావు"అని పేర్కొన్నారు. ఈ రోజు రాష్ట్రంలో జరుగుతున్నది కులాల మధ్య యుద్ధం కాదని, రెండు సిద్ధాంతాల మధ్య యుద్ధం జరుగుతోందని స్పష్టం చేశారు. పెత్తందార్లతో జరుగుతున్న ఈ యుద్ధంలో మీ జగన్ పేదల పక్షాన పోరాడుతున్నాడని గుర్తు చేశారు. కొల్లేరు ప్రాంతంలో సర్వే దాదాపుగా పూర్తైందని, మీ బిడ్డ ప్రభుత్వం మళ్లీ రాగానే మిగులు భూములను గుర్తించి పేదలకు పంపిణీ చేస్తామని హామీ ఇచ్చారు. శనివారం పల్నాడు జిల్లా చిలకలూరిపేట కళామందిర్ సెంటర్, ఏలూరు జిల్లా కైకలూరు, కాకినాడ జిల్లా పిఠాపురంలోని ఉప్పాడ సెంటర్‌లో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభల్లో ముఖ్యమంత్రి జగన్ ప్రసంగించారు. రాష్ట్రంలో ప్రతి గడపకూ 59 నెలలుగా అందిన పథకాలు, ఇంటింటి అభివృద్ధిని కొనసాగించేందుకు ఫ్యాన్ గుర్తుకే రెండు ఓట్లు వేయాలని అభ్యర్థించారు.

పైశాచిక ఆనందం..

ఈ మధ్య అత్యంత హేయంగా జరుగుతున్న కుట్రలు చూస్తుంటే వీళ్లు మనుషులేనా అనిపిస్తోంది. ఢిల్లీ నుంచి వాళ్లకున్న రికమండేషన్లు, అధికారంతో మొన్నటి వరకూ అవ్వాతాతలకు ఇంటికొచ్చి ఇచ్చిన పెన్షన్లను దారుణంగా ఆపించారు. ఆ అవ్వాతాతలు రోడ్డున పడి ఎండలో తిరిగి అగచాట్లు పడుతుంటే చంద్రబాబుకు, ఆయన కూటమికి ఎంత శాడిస్టిక్ ప్లెజర్ (పైశాచిక ఆనందం)? ఈ కుట్రలు ఇంకా కొనసాగిస్తూ మీ బిడ్డ 60 నెలల పాలన పూర్తి కాక ముందే 57 నెలలకే గొంతు నొక్కుతున్నారు.

దత్తపుత్రుడికి ఎందుకు ఓటేయకూడదంటే..

పిఠాపురంలో పోటీ చేస్తున్న ఈ దత్తపుత్రుడికి ఎందుకు ఓటు వేయకూడదో కూడా చెబుతా. 2014లో ఇదే చంద్రబాబు, దత్తపుత్రుడు, బీజేపీ కలసి ఉన్నప్పుడు.. గద్దెనెక్కాక బాబు హామీలను నెరవేర్చకుండా ప్రజలకు వెన్నుపోటు పొడిస్తే ఆయనకు ఆ కత్తి అందించిన వీళ్లకు భాగస్వామ్యం లేదా? ఇప్పుడు కూడా సాధ్యం కాని హామీలతో చంద్రబాబు మరోసారి మేనిఫెస్టో ఇచ్చాడు. మీ బిడ్డ ఎంతో కష్టపడితే, గతంలో ఎప్పుడూ జరగని విధంగా పారదర్శకంగా పథకాలను అందిస్తుంటే ఏటా రూ.70 వేల కోట్లు ఖర్చు అవుతోంది. చంద్రబాబు తన మేనిఫెస్టోలో ఏకంగా రూ.1.05 లక్షల కోట్లు ఏటా ఇస్తానని నమ్మబలుకుతున్నాడు. అది సాధ్యం కాదని ఆ కూటమికీ తెలుసు. తెలిసి తెలిసీ అదే చంద్రబాబుకు మళ్లీ కత్తి అందించి రైతన్నలను పొడవండి.. పిల్లలను పొడవండి.. అక్కచెల్లెమ్మలను పొడవండి.. అవ్వాతాతలను పొడవండంటున్నాడంటే ఈ మనిషి రేపొద్దున ఎమ్మెల్యే అయితే ఎవరికి న్యాయం చేస్తాడు? ఎవరికి మేలు చేస్తాడు? ఒక్కసారి అందరూ ఆలోచన చేయండి.

కార్లు మార్చినట్టుగా..

ఐదేళ్లకొకసారి కార్లు మార్చినట్టుగా భార్యలను మార్చే ఈ పెద్దమనిషిని అక్కచెల్లెమ్మలు ఎవరైనా నమ్ముతారా? ఒకసారి జరిగితే పొరపాటు, రెండోసారి జరిగితే గ్రహపాటు, మరి అదే మూడోసారీ, నాలుగోసారీ అంటే అది అలవాటు కాదా? ఇలాంటి వ్యక్తి ఎమ్మెల్యే అయితే ఏ అక్కచెల్లెమ్మయినా కలిసే పరిస్థితి ఉంటుందా? ఇలాంటి మనస్తత్వం ఉన్న వ్యక్తి దగ్గరకు వెళ్లి తమకు సాయం చేయమని అడగగలరా? అసలు ఈ పెద్ద మనిషికి ఓటు వేస్తే పిఠాపురంలో ఉంటాడా? ఆ మధ్య జలుబు చేస్తే అప్పటికప్పుడు హైదరాబాద్ వెళ్లిపోయాడు. ఈ పెద్ద మనిషికి ఇప్పటికే గాజువాక, భీమవరం అయిపోయాయి. ఇప్పుడు పిఠాపురం వంతు. ఇలాంటి వ్యక్తికి ఓటేస్తే మీకు నిజంగా న్యాయం జరుగుతుందా? ఒక్కసారి ఆలోచించండి.

గీతమ్మను గెలిపిస్తే డిప్యూటీ సీఎంను చేస్తా..

నాకు అక్క లాంటి వంగా గీతమ్మను బ్రహ్మాండమైన మెజార్టీతో గెలిపించండి. నా అక్కను డిప్యూటీ సీఎంగా చేసి పిఠాపురానికి పంపిస్తానని మీ బిడ్డ మాటిస్తున్నాడు. కూటమి ప్రలోభాలకు మోసపోవద్దని మీ అందరినీ సవినయంగా కోరుతున్నా.

ప్రలోభాలకు లొంగకండి

- టీడీపీ కూటమి డబ్బులిచ్చినా.. ఓటు మాత్రం మనకే వేయండి
- ప్రతి ఓటూ ముఖ్యమే... రెండు బటన్లూ ఫ్యాన్ గుర్తుపైనే నొక్కండి
- ఓటర్లకు వైఎస్సార్‌సీపీ అధినేత, సీఎం వైఎస్ జగన్ వినతి

సాక్షి, అమరావతి: 'టీడీపీ కూటమి ప్రలోభాలకు లొంగకండి.. మీ బిడ్డ ప్రభుత్వం వల్ల మీ కుటుంబానికి జరిగిన మంచిని కొలమానంగా తీసుకోండి. తెలుగుదేశం కూటమి మిమ్మల్ని రకరకాల ప్రలోభాలకు గురిచేస్తుంది. డబ్బులూ ఇస్తారు. డబ్బులు తీసుకున్నా... ఓటు మాత్రం మీకు మంచి చేసిన మీ వైఎస్సార్ సీపీకే వేసి మీ బిడ్డ ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి. 'ఫ్యాన్'గుర్తుపై రెండు బటన్లు నొక్కి ఓట్లు వేసి వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను అఖండ మెజార్టీతో గెలిపించండి అని ఓటర్లను సీఎం వైఎస్ జగన్ అభ్యర్థించారు. రాష్ట్రంలో 2014–19 మధ్య టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి అధికారంలో ఉన్నప్పుడు చంద్రబాబు ప్రభుత్వం ఖజానా నుంచి దోచేసిన డబ్బులు మనవేనని.. ప్రలోభపెట్టేందుకు ఆ నోట్ల కట్టలిస్తారని చెప్పారు. తీసుకున్నా... ఓటు వేసేటప్పుడు మాత్రం ఆలోచించి.. మంచి చేసిన మీ బిడ్డ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరారు. 'ఫ్యాన్'గుర్తుపై రెండు బటన్లు నొక్కి వైఎస్సార్ సీపీ అభ్యర్థులను అఖండ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు.

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G.,
Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

సాక్షి కరీంనగర్

1

ఆదివారం । 12 । మే । 2024





క్లుప్తంగా

కాంగ్రెస్ పార్టీలో చేరిక



కాంగ్రెస్‌లో చేరుతున్న నాయకులు

కరీంనగర్ కార్పొరేషన్: నగరానికి చెందిన కల్లెపల్లి సంతోష్, బెజ్జంకి దానకిశోర్, గంప నందు, గణేష్, షణ్ముఖలు శనివారం వైద్యుల అంజన్‌కుమార్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. అలాగే నగరంలోని 12,33 డివిజన్‌లకు చెందిన దాదాపు 150 మంది కాంగ్రెస్‌లో చేరారు. సంతోష్, మహ్మద్ ఖదీర్‌లు చేరిన వారిలో ఉన్నారు. బీఆర్ఎస్ నాయకుడు, రజక సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గంగిపల్లి వెంకటేశ్వర్లు శనివారం రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. అలాగే కాంగ్రెస్ పార్టీకి తెలంగాణ క్రిస్టియన్ కౌన్సిల్, క్రిస్టియన్ జేఏసీ మద్దతు ప్రకటిస్తున్నట్లు తెలంగాణ క్రిస్టియన్ కౌన్సిల్ అధ్యక్షుడు ముల్కల ప్రవీణ్, వర్కింగ్ ప్రెసిడెంట్ నన్ని ఎడ్వర్డ్ తెలిపారు.

పీఎంపై కేసు నమోదు చేయాలి



వినతిపత్రం ఇస్తున్న రవీందర్ సింగ్

సప్తగిరికాలనీ(కరీంనగర్): రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పర్యటించిన సందర్భంగా బీజేపీ ఎన్నికల గుర్తును పెట్టుకుని వేములవాడ ఆలయంలో దైవ దర్శనం చేసుకున్నారని, ఇది పూర్తిగా ఎన్నికల నియమావళిని ఉల్లంఘించడమే అవుతుందని మాజీ మేయర్ సర్దార్ రవీందర్‌సింగ్ శనివారం ఎన్నికల అధికారిని కలిసి ఫిర్యాదు చేశారు. పీఎం మీద ఎన్నికల నియమ నిబంధనల ఉల్లంఘన కేసు నమోదు చేయాలని పేర్కొన్నారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు గుంజపడుగు హరిప్రసాద్, మహేష్, తూల భాస్కర్‌రావు, తదితరులు ఉన్నారు.

కాలనీ కార్యవర్గం ఎన్నిక

కొత్తపల్లి: రేకుర్తిలోని శాతవాహన కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యావర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాలనీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా చిలుపూరి రాములు, కోమటిరెడ్డి తిరుపతిరెడ్డి, కోశాధికారిగా వెంకట్ సాయిరెడ్డి, ఉపాధ్యక్షులుగా పురంశెట్టి రామేశ్వరరావు, మానువాడ శంకర్, ననువాల గిరిధర్‌రావు, సంయుక్త కార్యదర్శులుగా సింగిరెడ్డి రాజిరెడ్డి, బందారి గంగాధర్, కార్యవర్గ సభ్యులుగా టి.సంపత్, ఎం.ప్రవీణ్, రమేశ్‌రెడ్డి, విద్యాసాగర్, గడ్డం వెంకటేష్, అజయ్‌కుమార్, సలహాదారులుగా పోశమల్లు యాదవ్, మదన్‌మోహన్, కార్యనిర్వహక కార్యదర్శిగా జి.ప్రకాశ్‌రెడ్డిని ఎన్నుకున్నారు.

కార్పొరేటర్‌లను బర్తరఫ్ చేయాలి

కరీంనగర్ కార్పొరేషన్: పార్టీ మారిన కార్పొరేటర్‌లను బర్తరఫ్ చేయాలని బీఆర్ఎస్‌కు చెందిన 49వ డివిజన్ కార్పొరేటర్ కమల్‌జిత్‌కౌర్ సోహన్‌సింగ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. బీఆర్ఎస్‌పై గెలిచి ఆర్థికంగా లాభపడి, డబ్బుల కోసం, అవినీతి కేసుల నుంచి తప్పించుకునేందుకు కాంగ్రెస్‌లో చేరారని ఆరోపించారు. అలాంటి కార్పొరేటర్‌లను పదవి నుంచి తొలగించాలన్నారు.



సౌందర్యలహరి హోమం నిర్వహిస్తున్న పురాణం మహేశ్వర శర్మ



విశేష అలంకరణలో దుర్గాభవానీ అమ్మవారు

ఘనంగా సౌందర్యలహరి హోమం

విద్యానగర్(కరీంనగర్): కరీంనగర్ మండలం నగునూర్‌లోని శ్రీదుర్గాభవానీ ఆలయ సప్తమ వార్షికోత్సవాల రెండో రోజైన శనివారం ఆలయ ప్రాంగణంలోని సుందరేశ్వర స్వామికి ఆలయ ధర్మాధికారి, వేదపండితులు పురాణం మహేశ్వర శర్మ సంపూర్ణ అభిషేకం, ఫలపంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం అమ్మవారికి విశేష అలంకరణ చేసి ప్రత్యేక హారతులిచ్చారు. ఆలయ యాగశాలలో సౌందర్యలహరి హోమం నిర్వహించారు. షిర్డీ సాయిబాబా భజన మండలి ఆధ్వర్యంలో హనుమాన్ చాలీసా పారాయణం, భక్తి సంగీత విభావరి జరిగింది. ఈ కార్యక్రమాల్లో ఆలయ ఫౌండర్ చైర్మన్ వంగళ లక్ష్మణ్, భక్తులు పాల్గొన్నారు.



హనుమాన్ చాలీసా పారాయణం

పోలింగ్ కేంద్రాలు సిద్ధం

- నేడు అధికారుల రాక



దుబ్బపల్లిలోని పాఠశాలలో పోలింగ్‌కేంద్రాన్ని శుభ్రం చేస్తున్న మహిళలు

కరీంనగర్‌రూరల్: లోక్‌సభ ఎన్నిక పోలింగ్ నిర్వహణకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు. ప్రధానంగా పోలింగ్‌కేంద్రాలకు వచ్చే ఓటర్లకు కనీస సౌకర్యాలు కల్పించాలనే ఎన్నికల సంఘం ఆదేశాలతో అధికారులు చర్యలు చేపట్టారు. ఇప్పటికే ప్రతి కేంద్రంలో దివ్యాంగులు, వృద్ధుల సౌకర్యార్థం ర్యాంపులు నిర్మించారు. విద్యుత్‌సౌకర్యం, లైట్లు,ఫ్యాన్లు ఏర్పాటు చేశారు. ఈనెల 13న పోలింగ్ ఉండటంతో కరీంనగర్ నియోజకవర్గం పరిధిలోని 395 కేంద్రాలను అధికారులు సిద్ధం చేశారు. ఎండల తీవ్రత ఎక్కువగా ఉండటంతో కేంద్రాల్లో నీడ కోసం టెంట్లు, తాగునీటి సౌకర్యం, కుర్చీలు, బల్లలు, టాయిలెట్లను ఏర్పాటు చేస్తున్నారు. శనివారం ఆయా పాఠశాలల్లోని పోలింగ్ కేంద్రాలను మున్సిపల్, పంచాయతీ సిబ్బందితో శుభ్రం చేయించారు. ఆదివారం సాయంత్రం పోలింగ్ సిబ్బంది కేంద్రాలకు వస్తుండటంతో యుద్ధప్రాతిపదికన ఏర్పాట్లు పూర్తి చేశారు. కార్పొరేషన్‌తో పాటు గ్రామాల్లో సైతం వృద్ధులు, దివ్యాంగుల సౌకర్యార్థం ఆటోలను ఏర్పాటు చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఈమేరకు డివిజన్లు, గ్రామాల వారీగా ఎన్ని ఆటోలు అవసరమనే సమాచారాన్ని మెప్మా ఆర్పీల ద్వారా సేకరించారు.

కార్పొరేట్ ప్రయోజనాల కోసమే పనిచేస్తున్న బీజేపీ



మాట్లాడుతున్న కోదండరాం

విద్యానగర్(కరీంనగర్): కార్పొరేట్ ప్రయోజనాల కోసమే బీజేపీ పని చేస్తోందని తెలంగాణ జన సమితి రాష్ట్ర అధ్యక్షుడు, ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. శనివారం కరీంనగర్ ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ జన సమితి పార్టీ ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి మద్దతు తెలుపుతుందన్నారు. బీజేపీ భావోద్వేగాలను రెచ్చగొట్టి ప్రయోజనం పొందాలని చూస్తున్నదని, దేశ స్థాయిలో విపరీతమైన అసమానతలు పెరిగి పోతున్నాయని తెలిపారు. ప్రభుత్వ రంగ సంస్థలను తక్కువ ధరలకే ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించిందని ఆరోపించారు. రాజ్యాంగాన్ని సవరించి కార్పొరేట్ సంస్థలకు మేలు చేయాలని చూస్తుందన్నారు. ఈ సమావేశంలో జన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముక్కెర రాజు, జిల్లా నాయకులు కర్రా సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ క్లస్టర్‌కు స్పెషల్ యాక్షన్ టీం



మాట్లాడుతున్న సీపీ అభిషేక్ మహంతి

కరీంనగర్‌క్రైం: పోలింగ్ కేంద్రాలను క్లస్టర్లుగా విభజించుకుని ప్రతీ క్లస్టర్‌కు స్పెషల్ యాక్షన్ టీంలను కేటాయించామని సీపీ అభిషేక్ మహంతి అన్నారు. శనివారం రాత్రి కరీంనగర్ కమిషనరేట్ కేంద్రంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఎన్నికలకు కేటాయించిన స్పెషల్ యాక్షన్ టీం అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. అన్ని పోలింగ్ లోకేషన్లకు రూట్ ఆఫీసర్లతో పాటు స్ట్రైకింగ్, స్పెషల్ స్ట్రైకింగ్‌ఫోర్స్‌లను కేటాయించామన్నారు. ఏదైన శాంతి భద్రతల సమస్య తలెత్తితే వెంటనే స్పెషల్ యాక్షన్ టీమ్‌లు స్పందించి వీలైనంత త్వరగా సంఘటన స్థలానికి చేరుకొని సమస్య పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ప్రశాంత వాతావరణంలో పోలింగ్ ముగిసేలా చర్యలు చేపట్టాలని సూచించారు.

వాహన తనిఖీల పరిశీలన

ఎన్నికల సందర్భంగా పోలీసులు చేస్తున్న వాహన తనిఖీలను శనివారం రాత్రి సీపీ అభిషేక్ మహంతి పరిశీలించారు. పోలింగ్ ముగిసే వరకు క్షుణ్ణంగా వాహన తనిఖీలు జరపాలని సూచించారు.

వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ



ఆహ్వానపత్రిక ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కమలాకర్

కొత్తపల్లి: కొత్తపల్లి మండలం బద్దిపల్లిలోని స్వయంభూ అలువేలు మంగా పద్మావతి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల ఆహ్వాన శుభ పత్రికను శనివారం కరీంనగర్‌లోని తన నివాసంలో ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ఆవిష్కరించారు. ఆలయ కమిటీ చైర్మన్ ఉప్పు తిరుపతి ఆధ్వర్యంలో ఈనెల 18, 19, 20 తేదీల్లో వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. గ్రామ ప్రజలతో పాటు చుట్టుప్రక్కల గ్రామాల ప్రజలు, భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి స్వామివారి కల్యాణాన్ని కన్నులారా తిలకించాలని ఆలయ చైర్మన్ తిరుపతి కోరారు. మేయర్ వై.సునీల్ రావు, బీఆర్ఎస్ నగర శాఖ అధ్యక్షుడు చల్ల హరిశంకర్, గ్రామస్తులు ఉప్పు రాజశేఖర్, శ్రీనివాస్, రాచకొండ రవి, మిట్ట రాము, కమలాకర్, రాచమల్ల శ్రీధర్, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విధులను పక్కాగా నిర్వహించండి



మాట్లాడుతున్న ప్రఫుల్ దేశాయ్

కరీంనగర్ అర్బన్: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో సెక్టార్ ఆఫీసర్లు నిబంధనలు పాటించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ అన్నారు. శనివారం కలెక్టరేట్ ఆడిటోరియంలో చొప్పదండి నియోజకవర్గానికి సంబంధించిన సెక్టార్ అధికారులతో ఎన్నికల ఏర్పాట్లపై సమీక్షించారు. పోలింగ్ సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు. ఈవీఎంలను డిస్ట్రిబ్యూషన్ కేంద్రం నుంచి జాగ్రత్తగా పోలింగ్ కేంద్రాలకు తీసుకెళ్లాలని అన్నారు. పోలింగ్ ప్రక్రియ సజావుగా సాగేలా ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఎక్కడా ఏ చిన్న సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పోలింగ్ స్టేషన్లల్లో వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, విద్యుత్ సరఫరా సక్రమంగా ఉండేలా చూసుకోవాలన్నారు. సమావేశంలో తహసీల్దార్లు నరేందర్, భాస్కర్ పాల్గొన్నారు

ఓటు వేయడం మన బాధ్యత

విద్యానగర్(కరీంనగర్): ఓటు వేయడం మన బాధ్యత అని ఇంపాక్ట్ క్లబ్ ఇంటర్నేషనల్ కరీంనగర్ వారియర్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అప్పన్నగారి వెంకట్రావు అన్నారు. శనివారం కరీంనగర్ ప్రెస్‌భవన్‌లో నిర్వహించిన ఓటరు అవగాహన సమావేశంలో మాట్లాడారు. ఓటు రాజ్యాంగం మనకు కల్పించిన హక్కు, బాధ్యత అన్నారు. ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఇంపాక్ట్ డైరెక్టర్ తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

కరీంనగర్‌లో క్రికెట్ స్టేడియం



జగన్‌మోహన్‌రావును సత్కరిస్తున్న సంఘం బాధ్యులు

కరీంనగర్‌స్పోర్ట్స్: కరీంనగర్‌లో క్రికెట్‌కు మంచి ఆదరణ ఉందని, 20 నుంచి 25 ఎకరాల వరకు భూమి చూస్తే హెచ్‌సీఏ తరఫున క్రికెట్ స్టేడియం ఏర్పాటు చేస్తామని హైదరాబాద్ క్రికెట్ సంఘం అధ్యక్షుడు ఏ.జగన్‌మోహన్‌రావు పేర్కొన్నారు. కరీంనగర్‌లో పూర్తిస్థాయిలో క్రికెట్ అకడమీ నెలకొల్పేందుకు తన వంతు సహకారం అందిస్తామని తెలిపారు. హెచ్‌సీఏ, కేడీసీఏ ఆధ్వర్యంలో కరీంనగర్‌లో జరుగుతున్న క్రికెట్ శిక్షణ శిబిరాలను అపెక్స్ కమిటీ సందర్శించింది. ఈ సందర్భంగా జగన్‌మోహన్‌రావు మాట్లాడుతూ.. హైదరాబాద్‌కే పరిమితమైన క్రికెట్‌ను అన్నిజిల్లాల్లో అభివృద్ధి పరిచేందుకు తెలంగాణవ్యాప్తంగా శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 29కేంద్రాల్లో మూడువేల మంది చిన్నారులు శిక్షణ పొందుతున్నట్లు తెలిపారు. వచ్చే ఏడాది ఉమ్మడి జిల్లానుంచి కనీసం ఐదుగురు క్రీడాకారులు ఐపీఎల్ స్థాయికి ఎదగాలని సూచించారు. జిల్లా క్రికెట్ సంఘం అధ్యక్షుడు వి.ఆగంరావు మాట్లాడుతూ ఉమ్మడి జిల్లావ్యాప్తంగా మూడుకేంద్రాల్లో 450 మందికి పైగా క్రీడాకారులు శిక్షణ తీసుకుంటున్నారని తెలిపారు. హైదరాబాద్ క్రికెట్ సంఘం ఉపాధ్యక్షుడు దల్జిత్ సింగ్, కార్యదర్శి దేవరాజ్, కోశాధికారి శ్రీనివాస్‌రావు, జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి ఎస్.మురళీధర్‌రావు, ఉపాధ్యక్షుడు మనోహర్‌రావు పాల్గొన్నారు.

మున్నూరు కాపుల మద్దతు బండి సంజయ్‌కే

విద్యానగర్(కరీంనగర్): కరీంనగర్ మున్నూరు కాపు సంఘం బండి సంజయ్‌కి మద్దతు ప్రకటించింది. శనివారం కరీంనగర్ ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కరీంనగర్ మున్నూరు కాపు సంఘ నాయకులు మాట్లాడుతూ కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని మున్నూరు కాపులందరూ బండి సంజయ్‌కి అండగా ఉండి ఆయన గెలుపునకు కృషి చేయాలని కోరారు. సమావేశంలో మున్నూరు కాపు సంఘం జిల్లా అధ్యక్షుడు బొమ్మ రాధాకృష్ణ, సంఘ నాయకులు బొమ్మరాతి రాంచంద్రం, ఆకుల యాదయ్య, తిరుమణి రాజేశం, కల్యాడపు ఆగయ్య,సత్యనారాయణ, సాదవేని శ్రీనివాస్, రమేష్, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

గొల్ల, కురుమల మద్దతు బీఆర్ఎస్‌కే



మాట్లాడుతున్న బడుగుల లింగయ్యయాదవ్

కరీంనగర్: గొల్ల, కురుమ కులబాంధవులు బీఆర్ఎస్ పార్టీకే సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు రాజ్యసభ మాజీ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్, మాజీ టూరిజం శాఖ చైర్మన్ గెల్లు శ్రీనివాస్‌యాదవ్, జెడ్పీ మాజీ చైర్మన్ తుల ఉమా అన్నారు. శనివారం నగరంలోని ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పదేళ్లలో మాజీ సీఎం కేసీఆర్ ముందుచూపుతో వ్యవహరించి గొల్ల, కురుమలకు కోట్లాది రూపాయలు కేటాయింపులు చేసి కులవృత్తులను బలోపేతం చేశారన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా బీఆర్ఎస్ ప్రభుత్వం కోట్లాది రూపాయలతో గొర్రెల పంపిణీ పథకంలో 89 లక్షల గొర్రెలను పంపిణీ చేసినట్లు తెలిపారు. కాంగ్రెస్, బీజేపీలు 60 ఏళ్లుగా ఓట్లు వేసే యంత్రాలుగా బీసీలను వాడుకున్నాయని, ఆ పార్టీలకు బీసీల ఓట్లు అడిగే నైతిక హక్కు లేదన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కరీంనగర్ ఎంపీగా పోటీ చేస్తున్న వినోద్‌కుమార్ విద్యావేత్త, మేధావి అని ఆయన హయాంలోనే రాష్ట్రసాధన, అభివృద్ధిలో భాగస్వామ్యం ఎంతో ఉందన్నారు. అభివృద్ధి కోసం వినోద్‌కుమార్‌ను గెలిపించాలని సూచించారు. ఈ విలేకరుల సమావేశంలో యాదవ సంఘం రాష్ట్ర, జిల్లా నాయకులు బండ నర్సయ్య, గంట రాములు, ఐలేందర్ యాదవ్, ఎస్.సత్యనారాయణ, మేకల మల్లేశం, బండ రవియాదవ్, బీర్ల బీరయ్య, కర్రె పావని, అనిల్‌కుమార్, మంచాల రవీందర్, కాలువ మల్లేశం, పర్శరాములు, రవీందర్, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజ్‌లకు అన్యాయం చేయొద్దు



మాట్లాడుతున్న గుర్రాల మల్లేశం, పోలు లక్ష్మణ్

కరీంనగర్‌టౌన్: స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం ముదిరాజ్ జాతికి అన్యాయం చేయొద్దని ముదిరాజ్ మహాసభ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గుర్రాల మల్లేశం ముదిరాజ్, మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఉమ్మడి జిల్లా మాజీ అధ్యక్షుడు పోలు లక్ష్మణ్ ముదిరాజ్ అన్నారు. శనివారం కరీంనగర్‌లో ముదిరాజ్ మహాసభ ప్రతినిధులతో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడారు. దశాబ్దాలుగా ముదిరాజులను రాజకీయాల కోసం వాడుకుంటున్న కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు జరుగబోయే ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని అన్నారు. ముదిరాజులను కాంగ్రెస్, బీఆర్ఎస్ ఓటు బ్యాంకుగా ఉపయోగించుకున్నారే తప్ప ఎలాంటి న్యాయం చేయలేదన్నారు. కరీంనగర్‌లో పోటీ చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి రాజేందర్‌రావుకు ముదిరాజ్ సమస్యలపై అవగాహన లేదన్నారు. ముదిరాజులకు అండగా నిలిచిన వ్యక్తి బండి సంజయ్ కుమార్ అని తెలిపారు. బీజేపీ మోదీ ప్రభుత్వం పదేళ్లుగా ముదిరాజుల సంక్షేమం అభివృద్ధి కోసం పనిచేస్తుందన్నారు. ఈ సమావేశంలో ముదిరాజ్ మహాసభ ప్రతినిధులు, నగరంలోని వివిధ ప్రాంతాల అధ్యక్షులు నరసయ్య, భానుప్రకాష్, నెల్లి శ్రీనివాస్, నరేందర్, రాజయ్య, రాజారాం, అంజయ్య, మల్లయ్య, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీకి ఓటు వేసేలా ప్రయత్నాలు చేయాలి

కరీంనగర్‌టౌన్: ఒక్కో రిటైర్డ్ ఉద్యోగి ఫోన్ ద్వారా తెలిసిన ప్రతీ ఉద్యోగికి ఫోన్ చేసి వీలైనంత మేర బీజేపీకి ఓటు వేసేలా ప్రయత్నాలు చేయాలని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సీహెచ్.విఠల్ అన్నారు. శనివారం గీతభవన్‌లో నిర్వహించిన రిటైర్డ్ ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడారు. బీజేపీ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్ గెలుపు కోసం రిటైర్డ్ ఉద్యోగులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు గంద్ర నళిని, విశ్రాంత ఉద్యోగులు లాల మురళి, రాగి సత్యనారాయణ, పెంట్యాల కేశవరెడ్డి, లింగయ్య, నరేందర్, రొంటాల కేశవ రెడ్డి, శ్రీహరిరెడ్డి, రవీందర్, జానపట్ల స్వామి, ఎడమ సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మద్యం పట్టివేత



పట్టుకున్న మద్యం బాటిళ్లు

కరీంనగర్‌క్రైం: కరీంనగర్ త్రీటౌన్ పరిధిలో శనివారం రాత్రి నిర్వహించిన తనిఖీల్లో రూ.52,200 విలువ చేసే మద్యం పట్టుబడినట్లు త్రీటౌన్ పోలీసులు తెలిపారు. మానకొండూర్‌కు చెందిన పుట్ట మహేందర్ వద్ద 28.2 లీటర్ల మద్యం, కిసాన్‌నగర్‌కు చెందిన గొట్టిముక్కుల సాయికాంత్, విజయ్‌కుమార్‌ల వద్ద నుంచి రూ.5,400 విలువ చేసే బీర్లను పట్టుకుని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

కేసీఆర్‌పై చర్యలు చేపట్టండి

కరీంనగర్‌టౌన్: ఎన్నికల నియమావళి ఉల్లంఘించిన కేసీఆర్‌పై చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు శనివారం ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేశారు. ఈనెల 9న కరీంనగర్‌లో నిర్వహించిన రోడ్‌షోలో బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ మతపరమైన కల్లోలాలు సృష్టించే విధంగా ప్రచారం చేస్తూ బీజేపీ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్‌ను వ్యక్తిగతంగా దూషణ చేస్తూ అగౌరవ పరచి, ఆయన పరువుకు భంగం వాటిల్లేలా చేసి నియమావళి ఉల్లంఘించినందున చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

'బీజేపీ గెలిస్తే రిజర్వేషన్లను రద్దు చేస్తారు'

కరీంనగర్‌కల్చరల్: బీజేపీ గెలిపిస్తే రాజ్యాంగాన్ని, రిజర్వేషన్లను రద్దుచేసి, దేశంలో నియంతృత్వ పాలనను చట్టబద్ధం చేస్తారని గిరిజన జాక్ ఉమ్మడి జిల్లా చైర్మన్ బీమా సాహెబ్ అన్నారు. శనివారం కరీంనగర్‌లో గిరిజన సంఘాల ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. దేశంలో ప్రజాస్వామ్యం, రాజ్యాంగ రక్షణ కొరకు ఇండియా కూటమిని గెలిపించాల్సిన అవసరం ఉందని అన్నారు. అందుకే కరీంనగర్ నుంచి ఇండియా బ్లాక్ అభ్యర్థి రాజేందర్ రావుని భారీ మెజార్టీతో గెలిపించి. దేశంలో ప్రజాస్వామ్య పునరుద్ధరణ కొరకు కృషి చేయాలని కోరారు.

రాజేందర్‌రావు గెలుపును ఏ శక్తి అడ్డుకోలేదు

సప్తగిరికాలనీ(కరీంనగర్): కరీంనగర్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు గెలుపును ఏ శక్తి అడ్డుకోలేదని సీపీఐ, సీపీఎం, డీవైఎఫ్ఐ నాయకులు అన్నారు. శనివారం నగరంలోని వివిధ ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ అభ్యర్థికి ఓటు వేయాలని కోరారు. సీపీఐ, సీపీఎం, డీవైఎఫ్ఐ నాయకులు పైడిపల్లి రాజు, బత్తిని చంద్రయ్య, మిల్కూరి వాసుదేవరెడ్డి, గుడికందుల సత్యం, తిరుపతి, నవీన్, ప్రకాష్, ఆకాష్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ రక్షణ రాహుల్‌తోనే సాధ్యం

విద్యానగర్(కరీంనగర్): రాజ్యాంగ రక్షణ రాహుల్ గాంధీతోనే సాధ్యమవుతుందని ఎస్సీ, ఎస్టీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సత్యరాజ్ వర్మ అన్నారు. శనివారం కరీంనగర్‌లోని పద్మనాయక కల్యాణ మండపంలో నిర్వహించిన తెలంగాణ ఎస్సీ, ఎస్టీ సంక్షేమ సంఘం, అనుబంధ సంఘాల సమావేశంలో మాట్లాడారు. అంబేడ్కర్ కన్న కలలు రాహుల్ గాంధీ ద్వారానే సాధ్యమవుతాయన్నారు. ఈ సమావేశంలో నాయకులు ఇరుగురాల భూమేశ్వర్, జుంజుపెల్లి వివేక్, ఏగుర్ల మల్లేశ్, మచ్చ డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో హోరెత్తిన ప్రచారం



బైక్‌ర్యాలీ నిర్వహిస్తున్న బీఆర్ఎస్ కార్యకర్తలు

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలంలోని పలు గ్రామాల్లో లోక్‌సభ ఎన్నికల ప్రచారం హోరెత్తింది. శనివారం చివరిరోజు కావడంతో ప్రధాన పార్టీలైన బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు చెందిన కార్యకర్తలు విస్తృతంగా ఇంటింటా ప్రచారం నిర్వహించారు. చెర్లభూత్కూర్‌లో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బి.వినోద్‌కుమార్‌కు మద్దతుగా కార్యకర్తలు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ బుర్ర తిరుపతిగౌడ్, మాజీ సర్పంచ్ దబ్బెట రమణారెడ్డి, నాయకులు కూర శ్యాంసుందర్‌రెడ్డి, చిట్కూరి సతీశ్, జడ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు. ఇరుకుల్లలో కాంగ్రెస్ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావుకు ఓటేసి గెలిపించాలని కోరుతూ కార్యకర్తలు ఇంటింటా ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ ఎం.శంకర్‌గౌడ్, నాయకులు కాశిపాక రమేష్, రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ సిబ్బందికి పోషకాహారం

కరీంనగర్‌రూరల్: వేసవికాలంలో ఎండలు మండిపోతున్న వేళ ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులు, సిబ్బందికి మెనూ మార్చారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పోలింగ్ కేంద్రాలకు ఆదివారం సాయంత్రం 4గంటలకు సిబ్బంది చేరుకోగానే సమోసా, మజ్జిగ, అనంతరం 5గంటలకు మజ్జిగ లేదా నిమ్మరసం అందిస్తారు. సాయంత్రం 7గంటల నుంచి 8గంటల నడుమ భోజనంలో అన్నం, కూర, చపాతి, టమాటా పప్పు, పెరుగు,చట్నీ ఇస్తారు. 13న పోలింగ్‌రోజు ఉదయం 6గంటలకు టీ, రెండు అరటిపండ్లు, 8గంటల నుంచి 9గంటల నడుమ క్యారట్, టమాటతో కూడిన ఉప్మా, పల్లీల చట్నీ, 11గంటలకు మజ్జిగ, మధ్యాహ్నం 12గంటలకు మజ్జిగ అందిస్తారు. మధ్యాహ్నం 1గంట నుంచి 2గంటల నడుమ కోడిగుడ్డుకూరతో అన్నం, కూరగాయల కూర, చట్నీ, సాంబారు, పెరుగు ఇస్తారు. సాయంత్రం 5.30గంటలకు టీ, గుడ్ డే బిస్కెట్లు అందిస్తారు. పోలింగ్ సిబ్బందికి ఆహారాన్ని అందించే బాధ్యతను గ్రామాల్లో గ్రామపంచాయతీలకు, కార్పొరేషన్, మున్సిపాలిటీల్లో అధికారులు నియమించిన ఉద్యోగులు పంపిణీ చేస్తారు.

'బోయినపల్లి'నే గెలిపించండి

కరీంనగర్: కరీంనగర్ ఎంపీగా పోటీ చేస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్‌నే గెలిపించాలని గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ పొన్నం అనిల్, కులదీప్ వర్మ అన్నారు. శనివారం ఎంపీ ఎన్నికల కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. అభివృద్ధి ప్రదాత, స్మార్ట్ సిటీ సాధకుడు బోయినపల్లి గెలుపుతోనే కరీంనగర్ పార్లమెంట్ అభివృద్ధి సాధ్యమన్నారు. కాంగ్రెస్, బీజేపీల మాటలను నమ్మకుండా బీఆర్ఎస్ అభ్యర్థికే పట్టం కట్టాలని కోరారు. సమావేశంలో బీఆర్ఎస్‌వీ అధ్యక్షుడు మోహన్, నియోజకవర్గ యూత్ జనరల్ సెక్రటరీ చందు తదితరులు పాల్గొన్నారు.

నర్సింగ్ డే



కరీంనగర్‌టౌన్: వరల్డ్ నర్సింగ్ డేను పురస్కరించుకొని శనివారం కరీంనగర్‌లోని ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో నర్సింగ్ సిబ్బంది వేడుకలు నిర్వహించారు. కేక్‌కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డీసీహెచ్ఎస్ డాక్టర్ కృష్ణప్రసాద్, ఏవో నజీముల్లాఖాన్, డాక్టర్ వసీం, నర్సింగ్ సూపరింటెండెంట్లు విజయలక్ష్మి, సులో చన, సరళ, అంజమ్మ తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు మదర్స్ డే



సప్తగిరికాలనీ(కరీంనగర్): నగరంలోని భగత్‌నగర్‌లో శనివారం ముందస్తుగా మదర్స్ డే వేడుకలను పలువురు మహిళలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్‌ను కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. వేడుకల్లో చకిలం స్వప్న, లావణ్య, శాలిని, శ్వేత, సంగీత, ప్రవళిక, సాహితీ, లక్ష్మీ, ఉమా, ఝాన్సీ, రాణి, రాధా, తదితరులు పాల్గొన్నారు.

సాక్షి కరీంనగర్

ఆదివారం | 12 | మే | 2024

ప్రతీ ఓటు.. ప్రజాస్వామ్యానికి చోటు

కరీంనగర్ అర్బన్: ప్రతీ ఒక్కరు ఓటుహక్కు వినియోగించుకోవాలని... ప్రజాస్వామ్యానికి ఆయువు పోయాలని టీఎన్జీవోల రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్ కోరారు. శనివారం స్థానిక టీఎన్జీవో భవన్‌లో సంఘం జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి అధ్వర్యంలో ఓటర్లకు, పోలింగ్ స్టాఫ్‌కు సలహాలు, సూచనలు చేశారు. ఓటర్లు తమ ఓటు హక్కును స్వేచ్ఛాయుత వాతావరణంలో వినియోగించుకోవాలని కోరారు. టీఎన్జీవోల సంఘం జిల్లా కార్యదర్శి సంఘం లక్ష్మణరావు, రూరల్ అధ్యక్షుడు మారుపాక రాజేశ్ భరద్వాజ్, జిల్లా నాయకులు సుధీర్‌కుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టీఎన్జీవోల రాష్ట్ర అధ్యక్షుడు జగదీశ్వర్

కాంగ్రెస్, బీఆర్ఎస్‌లను బొంద పెట్టండి





కరీంనగర్: రాంనగర్‌లో మాట్లాడుతున్న బండి సంజయ్, పక్కన రాజాసింగ్, హాజరైన ప్రజలు

- నన్ను ఓడించేందుకు ఏబీసీ (అసద్, బీఆర్ఎస్, కాంగ్రెస్) గ్యాంగ్ ఒక్కటయ్యాయి
- బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ అభ్యర్థి బండి సంజయ్

కరీంనగర్‌టౌన్/జమ్మికుంట: పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్‌ను బొంద పెట్టాలని బీజేపీ జా తీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్‌కు మార్ పిలుపునిచ్చారు. శనివారం కరీంనగర్ లో బండి సంజయ్‌కు మద్దతుగా వేలాది మంది యువత 'మహా బైక్‌ర్యాలీ' నిర్వహించారు. రాంనగర్‌లో బైక్‌ర్యాలీని ఉద్దేశించి గోషామహల్ ఎమ్మెల్యే రాజా సింగ్‌తో కలిసి సంజయ్ మాట్లాడుతూ.. 'ధర్మానికి ఆపదొస్తే, హిందూ సమాజానికి విఘాతం కలిగిస్తే అడ్డుకుని నేను, రాజాసింగ్ పోరాడినం. కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థులు ఎన్నడైనా ప్రజలను కలిశారా? ఎన్నడైనా కరీంనగర్ ప్రజల పక్షాన పోరాటాలు చేశారా'? అని ప్రశ్నించారు. ఉద్యమాలు చేస్తూనే కరీంనగర్ పార్లమెంట్ అభివృద్ధికి రూ.12 వేల కోట్లకుపైగా నిధులు తీసుకొచ్చినట్లు తెలిపారు. కాంగ్రెస్ హామీ ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలుకు కొట్లాడేది తానేనని స్పష్టంచేశారు. హిందూ ఓటు బ్యాంకు ద్వారా పక్కా గెలవబోతున్నట్లు తెలిపారు. ఓడిపోతే రాజకీయ సన్యాసం తీసుకుంటా అని, హిందుత్వం గురించి మాట్లాడనని, కాషాయ జెండాను పట్టుకోనని స్పష్టం చేశారు. కేసీఆర్ ఓడిపోతే బీఆర్ఎస్ పార్టీని మూసేసి ఫాంహౌస్‌కు పారిపోతవా? అంటూ సవాలు విసిరారు. ఏబీసీ గ్యాంగ్ ఒక్కటైంది అని.. ఏ అంటే అసదుద్దీన్, బీ అంటే బీఆర్ఎస్, సీ అంటే కాంగ్రెస్ అనే గ్యాంగ్ తనను ఏం చేయదన్నారు.

కాంగ్రెస్ వస్తే హిందుత్వాన్ని అణచివేస్తది

కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ముస్లింలను ప్రోత్సహిస్తూ.. హిందుత్వంపై ఉక్కుపాదం మోపుతుందని గోషామహల్ బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ అన్నారు. జమ్మికుంటలోని గాంధీ చౌక్ వద్ద బీజేపీ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్‌కు మద్దతుగా కార్నర్ మీటింగ్‌కు హాజరై మాట్లాడారు. వక్ఫ్‌బోర్డు చట్టం కఠినతరంగా ఉంటుందని, కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఆ చట్టం ద్వారా ఎక్కువ ఆస్తులున్న వారందరికీ నోటీసులు ఇస్తారని, కోర్టులకు వెళ్లినా ప్రయోజనం ఉండదన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల నాయకులు డబ్బు సంచులతో ఓట్ల కోసం వస్తారని, కానీ, సంజయ్ వద్ద ధర్మం ఉందని, ధర్మం ముందు డబ్బు పని చేయదని, ప్రజలు ధర్మంవైపు ఉండాలని ఓటర్లకు ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

కరీంనగర్‌లో కాంగ్రెస్ జెండా ఎగరాలి





కరీంనగర్: ఇందిరాచౌక్‌లో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

- నియంతృత్వానికి చరమగీతం పాడుదాం
- మంత్రి పొన్నం ప్రభాకర్
- నగరంలో భారీ ప్రదర్శన

కరీంనగర్ కార్పొరేషన్: కరీంనగర్‌లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరాలని మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. పార్టీ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావుకు మద్దతుగా శనివారం నగరంలో కాంగ్రెస్ భారీ ప్రదర్శన నిర్వహించింది. ఇందిరాచౌక్ నుంచి బస్‌స్టేషన్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఇందిరాచౌక్ వద్ద మంత్రి పొన్నం మాట్లాడుతూ రాష్ట్రం ఇచ్చిన కాంగ్రెస్ పార్టీకి ఎంపీ ఎన్నికల్లో ఓటు వేయాలని అభ్యర్థించారు. ఐదు నెలల పసికూన ప్రభుత్వంపై బీజేపీ, బీఆర్ఎస్ నేతలు దాడి చేస్తున్నారన్నారు. నియోజకవర్గంలో తాము నలుగురం ఎమ్మెల్యేలమున్నామని, ఎంపీ కూడా తోడైతే అభివృద్ధిని పరుగులు పెట్టిస్తామన్నారు. సంజయ్ మతంపేరుతో ఎన్నికల్లో గెలవాలని చూస్తున్నారని, రాముడి పుట్టుక గురించి తాను మాట్లాడినట్లయితే సజీవ దహనానికి కూడా సిద్ధమని చెప్పానన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావును భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. మాజీ ఎమ్మెల్యేలు కోడూరి సత్యనారాయణగౌడ్, ఆరెపల్లి మోహన్, నాయకులు ఆకారపు భాస్కర్ రెడ్డి, వైద్యుల అంజన్‌కుమార్, బొమ్మ శ్రీరాంచక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

నియంతృత్వానికి చరమగీతం పాడుదాం

దేశంలో మోదీ నియంతృత్వానికి చరమగీతం పాడాలని మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. డీసీసీ కార్యాలయంలో మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు కాంగ్రెస్‌కు ఓటు వేయాలన్నారు. ఎన్నికల కోడ్ ముగియగానే కొత్త రేషన్‌కార్డులు, పింఛన్లు ఇస్తామని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న గౌరవెల్లి, మిడ్‌మానేరు తదితర ప్రాజెక్టులను పూర్తి చేస్తామన్నారు. దేశంలో రక్తపాతం రావాలని మోదీ ప్రయత్నిస్తున్నారని ధ్వజమెత్తారు. కేసీఆర్ గోడమీది పిల్లిలా ఉన్నాడన్నారు. రాజ్యాంగం, రిజర్వేషన్‌ల రద్దుపై కేసీఆర్ వైఖరి వెల్లడించాలన్నారు. కాంగ్రెస్ గెలిస్తే విధ్వంసం సృష్టిస్తుందన్న హరీశ్‌రావు వ్యాఖ్యలకు స్పందిస్తూ స్కూల్‌లో విధ్వంసం అంటే అర్థం సరిగా చెప్పనంటున్నారన్నారు. ఇలాగైనా కాంగ్రెస్ గెలుస్తుందని హరీశ్‌రావు ఒప్పుకొన్నారని చెప్పారు. ఈ నియోజకవర్గానికి బండి సంజయ్, వినోద్‌కుమార్ చేసిన కనీసం ఐదు పనులేమిటో చెప్పాలన్నారు. డీసీసీ అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ, కర్ర రాజశేఖర్, సిరాజ్, గందె కల్పన, మర్రి వెంకటస్వామి ఉన్నారు.

బీఆర్ఎస్‌కు అనూహ్య స్పందన





హుజూరాబాద్ కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న వినోద్‌కుమార్, చిత్రంలో కేటీఆర్

- కాంగ్రెస్, బీజేపీ మాటలకు మోసపోవద్దు
- బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్ కుమార్

కరీంనగర్/హుజూరాబాద్: పార్లమెంటు ఎన్నికల ప్రచారంలో బీఆర్ఎస్‌కు అనూహ్య స్పందన వచ్చిందని, బండి సంజయ్‌కి ఓటమి తప్పదని బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్ కుమార్ అన్నారు. శనివారం నగరంలో ఎమ్మెల్యే గంగుల కమలాకర్‌తో కలిసి మాట్లాడుతూ.. కరీంనగర్ ఎంపీ నియోజకవర్గ పరిధిలో జోరుగా ప్రచారం చేశామన్నారు. ఈ సారి కరీంనగర్ ప్రజలు తనను ఎంపీగా ఆశీర్వదించబోతున్నారని వెల్లడించారు. తెలంగాణలో మెజార్టీ స్థానాల్లో జూన్ 4న గులాబీ జెండానే ఎగురుతుందని, ఎంపీగా తాను భారీ మెజారిటీతో గెలుస్తున్నాని వినోద్ ధీమా వ్యక్తం చేశారు. బండి సంజయ్ ఎంపీగా ఐదేళ్లలో ఒక్క అభివృద్ధి పని చేయలేదని, ప్రజా సమస్యలు గాలికొదిలి పార్టీ మీటింగ్‌లకే పరిమితమయ్యారన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని, హైదరాబాద్‌ను కాపాడుకోవాలంటే కరీంనగర్‌లో ఎంపీగా తనను ప్రజలు ఆశీర్వదించి పార్లమెంట్‌కు పంపాలన్నారు. ఎమ్మెల్యే గంగుల కమలాకర్, ఎమ్మెల్సీ భానుప్రసాద్‌రావు, నగర మేయర్ సునీల్‌రావు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ.రామకృష్ణ రావు, సర్దార్ రవీందర్ సింగ్, గెల్లు శ్రీనివాస్ యాదవ్, తుల ఉమ, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్లా హరిశంకర్ పాల్గొన్నారు.

పార్లమెంట్‌లో బీఆర్ఎస్ ఎంపీలు ఉండాలి

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విభజన హామీలను నిర్లక్ష్యం చేసిందని బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ ఆరోపించారు. శనివారం హుజూరాబాద్‌లో నిర్వహించిన రోడ్ షోలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాక ముందు రైతుల ఆత్మహత్యలు, కరెంట్ కోతలు ఉండేవన్నారు. ప్రత్యేక రాష్ట్రం వచ్చాక బీఆర్ఎస్ హయాంలో రైతు ఆత్మహత్యలను నివారించామని, కరెంట్ కోతలను లేకుండా నిరంతర విద్యుత్ అందించామని గుర్తుచేశారు. తెలంగాణకు జరుగుతున్న అన్యాయాలపై పార్లమెంట్‌లో మాట్లాడాలంటే బీఆర్ఎస్ ఎంపీలు ఉండాలన్నారు. ప్రజలందరూ విజ్ఞతతో ఆలోచించి, తనను ఎంపీగా గెలిపించాలని కోరారు. బీజేపీ అధికారంలోకి వస్తే హైదరాబాద్‌ను కేంద్ర పాలిత ప్రాంతంగా మార్చే కుట్రలు చేస్తుందని, దానికి సీఎం రేవంత్‌రెడ్డి వత్తాసు పలుకుతాడని తెలిపారు.

న్యూస్‌రీల్

ఎన్నికలపై డాక్యుమెంటేషన్ పకడ్బందీగా రూపొందించండి



కరీంనగర్ అర్బన్: పార్లమెంటు ఎన్నికల ప్రక్రియపై పకడ్బందీగా డాక్యుమెంటేషన్‌ను రూపొందించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం సంయుక్త సీఈవో సర్ఫరాజ్ అహ్మద్ ఆదేశించారు. శనివారం హైదరాబాద్ నుంచి జిల్లా స్వీప్ నోడల్ అధికారి, డీపీఆర్‌వోలతో ఎన్నికల ప్రక్రియ సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ నెల 12, 13తేదీల్లో జరగనున్న ఎన్నికల ప్రక్రియ మొత్తాన్ని ఫొటోలు, వీడియోలు తీయించాలని సూచించారు. ఎన్నికల సామగ్రి పంపిణీ, మోడల్ పోలింగ్ స్టేషన్ల నిర్వహణ, ట్రాన్స్‌జెండర్లు, వయోవృద్ధులు, దివ్యాంగులు ఓటు వేస్తున్న దృశ్యాలు, పోలింగ్ స్టేషన్లో కల్పిస్తున్న సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. అత్యుత్తమైన వాటిని ఎంపిక చేసి మంచి ఫొటోలు, వీడియోలు తీసి ఎన్నికల సంఘానికి పంపించాలని పేర్కొన్నారు. స్వీప్ నోడల్ ఆఫీసర్ రామానుజాచారి, మెప్మా పీడీ రవీందర్, సమాచార శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ జి.లక్ష్మణ్ కుమార్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇన్ఫర్మేషన్ ఇంజినీర్ కొండయ్య, తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ మార్కెట్‌కు సెలవు

కరీంనగర్ అర్బన్: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో కరీంనగర్ వ్యవసాయ మార్కెట్‌కు రెండు రోజులు సెలవు ప్రకటించినట్లు మార్కెట్ కమిటీ ఉన్నత శ్రేణి కార్యదర్శి పురుషోత్తం తెలిపారు. ఈ నెల 13న పోలింగ్ ఉండగా మార్కెట్‌లో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేశారని, మార్కెట్ కమిటీ ఉద్యోగులకు ఎన్నికల డ్యూటీ ఉందని వివరించారు. అందువల్ల ఆదివారం, సోమవారం మామిడి క్రయ, విక్రయాలు ఉండవని, రైతులు సహకరించాలని కోరారు. 14 నుంచి యథావిధిగా మార్కెట్ కార్యకలపాలు కొనసాగుతాయని వివరించారు.

పోలింగ్‌కు అంతా రెడీ



మాట్లాడుతున్న సీపీ అభిషేక్ మహంతి

- పార్లమెంట్ ఎన్నికలకు సర్వం సిద్ధం
- ఇంటింటికీ ఓటరు స్లిప్పుల పంపిణీ
- ప్రతీ పోలింగ్ బూత్‌లో రెండు బ్యాలెట్ యూనిట్లు
- ముగిసిన ప్రచార పర్వం, 144 సెక్షన్ అమలు
- సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో గట్టి బందోబస్తు
- నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలి
- మీడియా సమావేశంలో కలెక్టర్ పమేలా సత్పతి, సీపీ మహంతి



మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి

సాక్షిప్రతినిధి, కరీంనగర్/కరీంనగర్‌క్రైం:

పార్లమెంటు ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి చేశామని కలెక్టర్, జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారి పమేలా సత్పతి వెల్లడించారు. పోలింగ్ స్వేచ్ఛాయుత, ప్రశాంత వాతావరణంలో జరిగేలా సర్వం సిద్ధం చేశామని పేర్కొన్నారు. శనివారం సాయంత్రం కరీంనగర్ కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో కలెక్టర్ పమేలా సత్ప తి, పోలీస్ కమిషనర్ అభిషేక్ మహంతితో కలిసి ఎన్నికల ఏర్పాట్లపై మీడియాతో మాట్లాడారు. కలెక్టర్ మాట్లాడుతూ కరీంనగర్ పార్లమెంటు పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో 2,194 పోలింగ్‌స్టేషన్లు ఏర్పాటు చేశామని తెలిపా రు. 17లక్షల 97వేల మంది ఓటర్లు ఉన్నారని, పురుషుల కన్నా మహిళలు 40,000మంది అధికంగా ఉన్నారని వివరించారు. 42వేల మంది ది వ్యాంగులు ఉన్నారని, వయోవృద్ధులు 13200 మంది ఉన్నారని, వీరికి ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న ఉద్యోగులు 10,200 మంది ఉండగా, ఇందులో 8,815 మంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకున్నారని వెల్లడించారు. ఎలక్షన్ డ్యూటీ సర్టిఫికెట్ (ఈడీసీ) కింద నమోదు చేసుకున్న 6,800 మంది పోలింగ్ రోజున ఓటు హక్కును వినియోగించుకుంటారని తెలిపారు. ఎన్నికల్లో 28 మంది అభ్యర్థులు పోటీ చేస్తున్నారని, నోటాతో కలుపుకొని ఒకటి అదనంగా ఉంటుందని, ఈ మేరకు ఒక్కో పోలింగ్‌స్టేషన్‌లో రెండు బ్యాలెట్ యూనిట్లు ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. ఎన్నికల నియమావళి ఉల్లంఘన జరగకుండా 21 ఎఫ్ఎస్‌టీ, 14 ఎస్ఎస్‌టీ టీంలను ఏర్పాటు చేశామని చెప్పారు. మొత్తం 215 రూట్లలో 216 మంది సెక్టార్ ఆఫీసర్లను నియమించామని, ఈవీఎంలను తీసుకెళ్లే వెహికల్స్‌కు జీపీఎస్ అనుసంధానం ఉంటుందని తెలిపారు. కోడ్ ఉల్లంఘనపై 16 కేసులు నమోదు చేశామని వివరించారు. దాదాపు రూ.8 కోట్ల 87లక్షల నగదును, రూ.2 కోట్ల 11 లక్షల మద్యం, రూ.4కోట్ల 87 లక్షల గంజాయిని సీజ్ చేశామని పేర్కొన్నారు. ఇంటింటికీ ఓటర్ స్లిప్పులను పంపిణీ చేశామని, దాదాపు 97 శాతం ప్రక్రియ పూర్తయిందన్నారు. శనివారం సాయంత్రం నుంచి ఐదుగురికి మించకుండా ఇంటింటికి ప్రచారం చేసుకునే వెసులుబాటు ఉందని తెలిపారు. 13న ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు ఓటుహక్కు ఓటుహక్కు వినియోగించుకోవచ్చన్నారు. 288 సమస్యాత్మక కేంద్రాల్లో గట్టి బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. కరీంనగర్, చొప్పదండి ఈవీఎంల డిస్ట్రిబ్యూషన్ కరీంనగర్ ఎస్ఆర్ఆర్ కళాశాలలో ఉంటుందని, మానకొండూరుకు సంబంధించి కరీంనగర్‌లోని పాలిటెక్నిక్‌లో ఉంటుందని తెలిపారు.

భారీ బందోబస్తు: సీపీ మహంతి

అవాంఛనీయ ఘటనలు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని పోలీస్ కమిషనర్ అభిషేక్ మహంతి పేర్కొన్నారు. 2,500మంది పోలీసులను వినియోగిస్తున్నామని చెప్పారు. 54 స్పెషల్ క్రిటికల్ పోలింగ్‌స్టేషన్లకు పారా మిలటరీ సిబ్బందిని ఏర్పాటు చేశామన్నారు. 1,106 పోలింగ్ స్టేషన్లల్లో 106 రూట్లలో పోలింగ్ కేంద్రాలకు ఈవీఎంలను తరలించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈవీఎంలు స్ట్రాంగ్‌రూంకు చేరే వరకు పకడ్బందీ చర్యలు తీసుకుంటామని తెలిపారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ తదితరులు పాల్గొన్నారు.

మూడో ర్యాండమైజేషన్ పూర్తి

కరీంనగర్ అర్బన్: కరీంనగర్ కలెక్టరేట్‌లో పోలింగ్ అధికారుల మూడో ర్యాండమైజేషన్ ప్రక్రియ నిర్వహించారు. పార్లమెంట్ నియోజకవర్గ జనరల్ అబ్జర్వర్ అమిత్ కటారియా పర్యవేక్షించారు. ఎన్నికల అధికారి పమేలా సత్పతి మాట్లాడుతూ కరీంనగర్‌కు 395 పోలింగ్ స్టేషన్లకు 1,804 మంది, చొప్పదండికి 327 పోలింగ్ స్టేషన్లకు 1,528 మంది, మానకొండూర్‌కు 316 పోలింగ్ స్టేషన్లకు 1,472 మంది, హుజూరాబాద్‌లో 305 పోలింగ్ స్టేషన్లకు 1,404 మంది పీఓలు, ఏపీవోలు, ఓపీవోలను అలాట్ చేశామని తెలిపారు. సిరిసిల్లకు 287 పోలింగ్ స్టేషన్లకు 1,376 మంది, వేములవాడకు 260 పోలింగ్ స్టేషన్లకు 1,232 మంది సిబ్బందిని వినియోగిస్తున్నట్లు వివరించారు.

ఇక ప్రలోభాల ఎర!

- ముగిసిన ఎన్నికల ప్రచారం.. చెమటోడ్చిన నేతలు
- బలహీనంగా ఉన్నచోట ఓటర్లకు మద్యం, మనీ పంపిణీకి ఏర్పాట్లు
- కుల, యువజన సంఘాల ప్రసన్నం కోసం చివరి ప్రయత్నాలు

కరీంనగర్: పార్లమెంట్ ఎన్నికల పోలింగ్‌కు మరికొన్ని గంటల సమయమే ఉంది. రాజకీయ పార్టీల నాయకులు ఓటర్లను తమవైపు తిప్పుకునేందుకు ప్రలోభాల ఎర వేస్తున్నారు. ఎన్నికల క్రతువులో కీలకంగా భావించే మరికొన్ని గంటల్లో ఫలితాలను తారుమారు చేసేందుకు అభ్యర్థులు తెరవెనుక బేరసారాలు సాగిస్తున్నారు. ఓటరును బుట్టలో వేసేకునేందుకు ఎత్తులకు పైఎత్తులు వేస్తున్నారు. 'డబ్బు, మద్యం ఏదైనా సరే రెడీ.. సింగిల్‌గానైనా.. ఫ్యామిలీ ప్యాకేజీగానైనా ఓకే.. కానీ ఓటు తప్పకుండా మాకే'.. అనేలా సిద్ధమవుతున్నారు. కుల, యువజన సంఘాలతో సమావేశాలు ఏర్పాటు చేసి, ఓట్లశాతాన్ని బట్టి ఇంత మొత్తం అంటూ ధర నిర్ణయించారనే ప్రచారం జరుగుతోంది. గెలిస్తే తమ పార్టీ మేనిఫెస్టోతోపాటు, స్థానిక సమస్యల పరిష్కారం కోసం హామీలు ఇస్తున్నారు. కొంత నగదు ఇచ్చి, విందు ఏర్పాటు చేసుకోవాలని ఆఫర్ ఇస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే ప్రచార పర్వంలో ఖర్చు తడిసి మోపెడైనా.. పోలింగ్‌కు ముందు కీలకమైన ఈ సమయంలో వెచ్చించే డబ్బులే ఫలితాన్ని నిర్ణయిస్తాయని విశ్లేషకులు అంటున్నారు.

నోటుతోపాటు మద్యం..

తమ విజయానికి అభ్యర్థులు విచ్చలవిడిగా ధన, మద్య ప్రవాహానికి సిద్ధమవుతున్నారు. ఓటుకు రూ.200 పంపిణీ చేసేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారన్న ప్రచారం జరుగుతోంది. పార్లమెంట్ విస్తీర్ణం, ఓటర్లు అధికంగా ఉండటంతో అందరికీ ఇవ్వడం సాధ్యం కాదని ప్రధాన పార్టీలు భావిస్తున్నాయి. తమకు అనుకూలంగా లేని ప్రాంతాలను గుర్తిస్తూ, వాటిపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరిస్తున్నారు. బలహీనంగా ఉన్నచోట నోటుతోపాటు మద్యం పంపిణీ చేసేలా ప్రణాళిక సిద్ధం చేసుకుంటున్నట్లు సమాచారం.



పార్టీల అగ్రనేతల రాక..

- లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ మార్చి 16న విడుదలైంది.
- అంతకుముందు నుంచే ఆశావాహులతో ఎన్నికల హడావుడి కొనసాగింది.
- ఎన్నికల కోడ్ నుంచి ప్రచారం వేడెక్కుతూ వచ్చింది.
- ఏప్రిల్ 18 నామినేషన్ల స్వీకరణ వరకు జోరందుకుంది.
- తమ పార్టీల అభ్యర్థులకు మద్దతుగా ప్రధాని నరేంద్రమోదీ, సీఎం రేవంత్‌రెడ్డి, మాజీ సీఎం కేసీఆర్ ప్రచారం చేశారు.
- వీరితోపాటు అసెంబ్లీ ఎన్నికల ఊపు కొనసాగిస్తూ.. పట్టు కోల్పోకుండా మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు ఎండలను సైతం లెక్క చేయకుండా తమ ప్రాంతాల్లో ప్రచార జోరు పెంచారు.

కరీంనగర్ అభివృద్ధే నా ధ్యేయం



ఇంటర్వ్యూ

- పార్లమెంటు పరిధిలో అన్ని వర్గాల అభివృద్ధికి పెద్దపీట
- మౌలిక సదుపాయాల కల్పనకు తొలి ప్రాధాన్యం
- తిరుపతికి రోజూ రైలు, హైదరాబాద్‌కు రైల్వే కనెక్టివిటీ నా బాధ్యత
- బండి సంజయ్ నియోజకవర్గానికి పొలిటికల్ టూరిస్టు
- ఆలస్యంగా వచ్చినా ప్రచారంలో రేసుగుర్రంలా ముందు నిలిచా
- ఐదు గ్యారంటీలు అమలు చేసినం, ఆరోదీ చేసేస్తాం
- 'సాక్షి'తో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు

కరీంనగర్ పార్లమెంటు అభివృద్ధిపై తనకు ప్రత్యేక ప్రణాళిక ఉందని, అన్ని వర్గాల అభివృద్ధికి పెద్దపీట వేసి, సదుపాయాలు కల్పించడమే ధ్యేయంగా పనిచేస్తానని కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు అన్నారు. ప్రతీరోజు తిరుపతికి రైలు, హైదరాబాద్‌కు రైల్వే కనెక్టివిటీ తన బాధ్యత అన్నారు. ఆలస్యంగా వచ్చినా రేసులో దూసుకెళ్లి అందరి కన్నా ముందు నిలిచానని, ఇచ్చిన మాట ప్రకారం.. రాష్ట్రంలో ఐదు గ్యారంటీలు అమలు చేశామని ఎన్నికలవగానే ఆరోదీ పూర్తి చేస్తామని తెలిపారు. ఈ మేరకు శనివారం 'సాక్షి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు అంశాలు వెల్లడించారు.

–సాక్షిప్రతినిధి,కరీంనగర్/కరీంనగర్ కార్పొరేషన్

బండి సంజయ్ మీరు నాన్‌లోకల్ అంటున్నారు?

నేను పుట్టింది కరీంనగర్ మిషన్ హాస్పిటల్‌లో. చదివింది సెయింట్‌జాన్స్ స్కూల్‌లో. 50ఏళ్ల నుంచి కరీంనగర్‌లో మాకిండ్లున్నయి. పక్కాలోకల్ అంటే ఏందో సంజయ్ చెప్పాలే. ఎంపీగా గెలిచి ప్రజలకు అందుబాటులో ఉండకపోవడం, నియోజకవర్గానికి చెందిన వారి ఫోన్లు ఎత్తకపోవడం, 40స్థానిక సంస్థల్లో 600 జనరల్ బాడీ సమావేశాలైతే ఒక్క మీటింగ్‌కూ హాజరుకాకపోవడమే లోకలా? బండి లోకల్ కాదు పొలిటికల్ టూరిస్టని ప్రజలే అంటున్నారు.

కరీంనగర్ అభివృద్ధి-సమస్యలపై మీకున్న వ్యూహాలేంటి?

కరీంనగర్ అభివృద్ధిపై నాకు ప్రత్యేక ప్రణాళిక ఉంది. ప్రభుత్వ పరంగా అభివృద్ధితో పాటు నా సొంత మేనిఫెస్టో కూడా సిద్ధం చేశాను. 'కరీంనగర్ సహాయక' అనే యాప్ రూపొందించి, ప్రజల నుంచి వచ్చే సమస్యలు పరిష్కరిస్తా. టీ హబ్ తరహాలో కే- హబ్ కరీంనగర్ ఇన్నోవేషన్, డెవలప్‌మెంట్, స్టార్టప్, ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్ తీసుకొస్తా. 'యంత్ర చేయూత' పేరుతో సొంతంగా రూ.3 కోట్ల విలువైన యంత్రాలు ప్రజలకు అందుబాటులో ఉంచుతా. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు ఉచితంగా సాయం అందిస్తా. ఐఐటీ, సిరిసిల్లకు హ్యాండ్లూమ్ టెక్స్‌టైల్, నవోదయ తీసుకువస్తా. పొన్నం ప్రభాకర్ తెచ్చిన తిరుపతి రైలును ప్రతీరోజు నడిచేలా చేస్తా. గెలిచిన మూడేళ్లలో సిద్దిపేట-కరీంనగర్ రైల్వేలైన్ కనెక్టివిటీ చేస్తా. లేదంటే పదవికి రాజీనామా చేస్తా. డంప్‌యార్డ్‌ను మూడు నెలల్లో క్లియర్ చేస్తా. జాతీయ రహదారులకు నిధులు తెస్తా. కరీంనగర్‌లో అంతర్జాతీయ క్రికెట్ స్టేడియాన్ని ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తా. 40 మండలాల్లో సొంతంగా 40 అంబులెన్స్‌లు అందుబాటులో ఉంచుతా. డయాగ్నోస్టిక్ సెంటర్లు ఏర్పాటు చేస్తా.

ఆరుగ్యారంటీల అమలులో విఫలమయ్యారనే విమర్శలపై ఏమంటారు?

అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల్లో ఐదు గ్యారంటీలు అమలు చేశాం. మిగతా గ్యారంటీలు కోడ్ ముగియగానే అమలు చేస్తామని సీఎం చెప్పారు. గ్యారంటీల అమలులో విఫలమైతే ప్రజలు నిలదీసే వాళ్లు. మేం ఎక్కడికి వెళ్లినా ప్రజల నుంచి ఆదరణ లభిస్తోంది. 120నెలల కాలంలో హామీలు అమలు చేయని కేసీఆర్, నాలుగు నెలలకే మమ్మల్ని అమలు చేయలేదంటున్నాడు. ప్రతి గ్యారంటీ అమలు చేస్తారనే నమ్మకం ప్రజలకు ఉంది.

కేంద్రం గోదావరి– కావేరి నదుల అనుసంధానం చేస్తే ఉమ్మడి కరీంనగర్ జలవనరులపై ప్రభావం చూపదా, మీ వైఖరి ఏమిటి?

ఇది సాంకేతిక సమస్య. సాంకేతిక నిపుణులు దీనితో ప్రజలకు లబ్ధి ఎంత? నష్టం ఎంత? అనేది బేరీజు వేస్తారు. మన ప్రాంతానికి, ప్రజలకు నష్టం వాటిల్లితే తప్పకుండా వ్యతిరేకిస్తాం. లాభం చేకూరుతుందంటే స్వాగతిస్తాం.

ఆలస్యంగా రావడం వల్ల ప్రచారంపై ఏమైనా ప్రభావం చూపిందా?

మాది టీ-20 బ్యాచ్. ప్రచారంలో మేమే ముందున్నాం. ముందు పరుగెత్తే గుర్రాన్ని వెనుకొచ్చే రేసుగుర్రం వేగంగా దాటినట్లు మేము ప్రత్యర్థులను ప్రచారంలో దాటి వేశాం. క్షేత్రస్థాయిలో ప్రజలను ఎక్కువగా మేమే కలుసుకున్నాం.

బండి సంజయ్ మీకు ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావుకు పరోక్షంగా సంబంధాలు ఆపాదించడంపై ఏమంటారు?

దీంతోనే బండి సంజయ్ మానసికస్థితి ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఆయన చిన్నమెదడు చితికిపోయింది. పోటీయే లేదనుకున్న బండికి కాంగ్రెస్‌కు ప్రజల్లో వస్తున్న విపరీత ఆదరణను చూసి మతిభ్రమించి ఏవేవో మాట్లాడుతున్నాడు. నేను ప్రభాకర్‌రావు అనే వ్యక్తిని ఇప్పటివరకు చూడలేదు. సంజయ్ ఆరోపణలను చూసి ప్రజలు నవ్వుతున్నారు.

మైనార్టీలు కాంగ్రెస్‌కు ఓటు వేయొద్దని కేసీఆర్ చేసిన వ్యాఖ్యలపై ఏమంటారు?

మైనార్టీలు ఎవరికి ఓటు వేయాలో వారు నిర్ణయించుకుంటున్నారు. మైనార్టీల సంక్షేమానికి కృషి చేసే లౌకిక పార్టీ, అభ్యర్థిని చూసి ఓటు వేస్తారు. అవినీతి మచ్చ లేని అభ్యర్థినే వారు ఎన్నుకొంటారు.

మీ విజయావకాశాలు ఎలా ఉన్నాయి?

ప్రజల ఆశీస్సులతో వందశాతం మాకే ఉన్నాయి. పల్లెల నుంచి పట్టణం వరకు ప్రజలంతా కాంగ్రెస్‌కు ఓటేసేందుకు సిద్ధంగా ఉన్నారు. బండి సంజయ్ కన్నా కనీసం 50వేల మెజార్టీ ముందున్నాం. భార్య మంగళసూత్రం అమ్మి ఎన్నికల్లో పోటీ చేశానన్న బండి సంజయ్ ఐదేళ్లలో రూ.వేల కోట్లకు ఎలా చేరాడో ప్రజలు ఆలోచిస్తున్నారు. స్మార్ట్ సిటీలో 30 శాతం కమీషన్‌లో బండి వాటా 15 శాతం. అలాంటి సంజయ్‌కు ఓటు వేసే పరిస్థితి లేదు.

ప్రత్యర్థులుగా తలపడ్డా... చెక్కు చెదరని స్నేహం


ఎన్నికల ప్రచారం అనగానే ప్రత్యర్థులపై, అవతలి పార్టీపై విమర్శలు సహజం. చాలాసార్లు పరిస్థితి వ్యక్తిగతంగా తిట్ల దండకాల దాకా వెళ్తుంది. కానీ ప్రత్యర్థులిద్దరూ మంచి స్నేహితులైతే? 1952 తొలి లోక్‌సభ ఎన్నికల్లో అలాగే జరిగింది. స్నేహితులిద్దరూ ఒకే నియోజకవర్గం నుంచి పోటీ పడ్డారు. ప్రచారం చేసుకున్నారు. అయినా మంచి స్నేహితులుగానే మిగిలారు. వాళ్లే ప్రముఖ కాంగ్రెస్ నేత విష్ణు గాడ్గిల్, పిజెంట్స్ అండ్ వర్కర్స్ పార్టీ లీడర్ కేశవరావ్ జేధే. సోషలిస్ట్ వెటరన్ బాబా అధవ్ ఆ ప్రచారంలో పాల్గొన్నారు. అప్పటికాయనకు 22 ఏళ్లు. నాటి రోజులను గుర్తు చేసుకుంటూ ఆయన భావోద్వేగానికి లోనయ్యారు.

''గాడ్గిల్‌పై తిలక్ ప్రభావం ఎక్కువ. కాంగ్రెస్‌లో బ్రాహ్మణ శ్రేణి ప్రముఖునిగా ఉండేవారు. మరాత్వాడాకు చెందిన జేధే బహుజన ఉద్యమ భాగస్వామి. జ్యోతిరావు పూలే స్థాపించిన సత్యశోధక్ సమాజ్‌తో కలిసి పనిచేశారు. బ్రాహ్మణవాదానికి అతి పెద్ద విమర్శకుడు. 1920ల్లో వారిద్దరూ ప్రత్యర్థులు. స్వాతంత్ర్యోద్యమంలో జైలుపాలయ్యాక మంచి స్నేహితులయ్యారు. దళితుల కోసం పార్వతి ఆలయాన్ని తెరవడానికి 1929లో అంబేడ్కర్ నడిపిన ఉద్యమంలో పాలుపంచుకున్నారు. 1934లో రెండు కేంద్ర అసెంబ్లీ స్థానాలకు కాంగ్రెస్ తరఫున ఎన్నికయ్యారు. గాడ్గిల్ మద్దతుతో జేధే 1938లో మహారాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడయ్యారు. 1947లో కాంగ్రెస్‌ను వీడి పీడబ్ల్యూపీని స్థాపించారు. తొలి సార్వత్రిక ఎన్నికల్లో పుణే సెంట్రల్ నుంచి గాడ్గిల్‌పైనే పోటీ చేయాల్సి వచ్చింది. ప్రత్యర్థులుగా మారినా ప్రచారంలో పరస్పర దూషణల వంటివి అస్సలుండేవి కాదు. ప్రసంగాలూ స్నేహపూర్వకంగానే సాగేవి. ఒక్కోసారి అభ్యర్థులంతా ఒకే వేదిక నుంచి ప్రచారం చేసేవారు. మొదట జేధే, తరువాత గాడ్గిల్, చివరికి సోషలిస్టు పార్టీ అభ్యర్థి ఎస్.ఎమ్.జోషి మాట్లాడేవారు. ఒకరినొకరు నిందించుకోలేదు. పార్టీలను తిట్టుకోలేదు. కులపరంగా ఓట్లడగలేదు. కేవలం హామీలపైనే దృష్టి సారించి ప్రచారం చేశారు. గాడ్గిల్‌కు 102,692 ఓట్లు, జేధేకు 42,200 ఓట్లొచ్చాయి'' అని అధవ్ తెలిపారు.

– సాక్షి, నేషనల్ డెస్క్

కీలక రాష్ట్రాల్లో ఒకటైన పశ్చిమ బెంగాల్లో నాలుగో విడతలో సోమవారం 8 లోక్‌సభ స్థానాలకు పోలింగ్ జరగనుంది. రాష్ట్రంలో 42 లోక్‌సభ స్థానాలకు గాను మూడు విడతల్లో 10 చోట్ల పోలింగ్ ముగిసింది. నాలుగో విడత అభ్యర్థుల్లో పీసీసీ చీఫ్ అధీర్ రంజన్ చౌదరి, తృణమూల్ ఫైర్‌బ్రాండ్ మహువా మొయిత్రా, మాజీ క్రికెటర్ యూసఫ్ పఠాన్ తదితర ప్రముఖులు బరిలో ఉన్నారు...

– సాక్షి, నేషనల్ డెస్క్



నాలుగో విడతలో... బెంగాల్‌లో ముక్కోణాలు

బరిలో పలువురు ప్రముఖులు

కృష్ణానగర్‌లో మహువా వర్సెస్ అమృత
బహ్రాంపూర్‌లో అధీర్, యూసఫ్ పఠాన్
ఎనిమిది లోక్‌సభ స్థానాల్లో 13న పోలింగ్

కృష్ణానగర్



• మహువా మొయిత్రా



• అమృతరాయ్

ఈ లోక్‌సభ ఎన్నికల్లో ఆసక్తికరమైన పోరుకు వేదికైన స్థానాల్లో కృష్ణానగర్ ఒకటి. పార్లమెంటులో మోదీ సర్కారుపై విరుచుకుపడే తృణమూల్ ఫైర్ బ్రాండ్ మహువా మొయిత్రా మళ్లీ బరిలో ఉండటమే అందుకు కారణం. ఆమె 2019లో తొలిసారి తృణమూల్ టికెట్ మీదే ఇక్కడ గెలిచి లోక్‌సభలో అడుగుపెట్టారు. లోక్‌సభలో అదానీ గ్రూప్‌కు వ్యతిరేకంగా ప్రశ్నలడిగేందుకు నగదు, కానుకలు తీసుకున్నారన్న ఆరోపణలపై సభ నుంచి బహిష్కరణకు గురయ్యారు. అయినా ఆమెకే తృణమూల్ అధినేత్రి, సీఎం మమతా బెనర్జీ మళ్లీ అవకాశమిచ్చారు. ఈసారి మరింత మెజారిటీతో నెగ్గి లోక్‌సభలో అడుగు పెడతానని మొయిత్రా ధీమాగా ఉన్నారు. ఆమెపై బీజేపీ నుంచి స్థానిక రాజ కుటుంబం మహారాజా కృష్ణచంద్ర రాయ్ వంశీకురాలు అమృతరాయ్ పోటీలో ఉన్నారు. నియోజకవర్గ ప్రజలకు ఆమె బాగా పరిచయం. ఈ ఏడాదే బీజేపీలో చేరి టికెట్ సాధించారు. ఆమెకు మద్దతుగా ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్‌షా ముమ్మరంగా ప్రచారం చేశారు. ఇక సీపీఎం అభ్యర్థి ఎస్ఎం సాది ముస్లింలతో పాటు ఇతర వర్గాల్లోనూ మంచి పేరున్న నేత. మొయిత్రాకు పడే ముస్లిం ఓట్లను సాది గణనీయంగా చీల్చి ఫలితాన్ని ప్రభావితం చేయవచ్చని భావిస్తున్నారు. గత ఎన్నికల్లో ఇక్కడ బీజేపీ రెండో స్థానంతో సరిపెట్టుకుంది.

రాణాఘాట్



• జగన్నాథ్ సర్కార్



• ముకుత్ మణి అధికారి

బెంగాల్లో ఈ విడతలో ఎక్కువ ఆసక్తి నెలకొన్న స్థానాల్లో ఇదీ ఒకటి. సిట్టింగ్ ఎంపీ జగన్నాథ్ సర్కార్‌నే బీజేపీ మరోసారి పోటీకి నిలిపింది. ఆయన గత ఎన్నికల్లో తృణమూల్ అభ్యర్థి రూపాలి బిశ్వాస్‌పై 2.33 లక్షల ఓట్ల మెజారిటీతో గెలిచారు. 2009, 2014ల్లో ఇక్కడ తృణమూల్‌దే విజయం. నియోజకవర్గాల పునర్విభజన అనంతరం ఏర్పడిన ఈ లోక్‌సభ స్థానం పరిధిలోని ఏడు అసెంబ్లీ స్థానాల్లో ఐదు చోట్ల బీజేపీ చేతిలో, రెండు తృణమూల్ ఖాతాలో ఉన్నాయి. అయితే రానాఘాట్ దక్షిణ్ ఎమ్మెల్యే ముకుత్ మణి అధికారి బీజేపీకి ఝలక్ ఇస్తూ లోక్‌సభ ఎన్నికల ముందు తృణమూల్‌లో చేరారు. ఆయననే పార్టీ అభ్యర్థిగా మమత బరిలోకి దింపారు. దాంతో పోరు ఆసక్తికరంగా మారింది. కానీ ముకుత్‌కు టికెటివ్వడంతో స్థానిక తృణమూల్ నేతలు భగ్గుమన్నారు. ఆయనకు మద్దతుగా ప్రచారానికి ముందుకు రావడం లేదు. బంగ్లాదేశ్ నుంచి వలస వచ్చిన మథువా సామాజికవర్గ ప్రాబల్యం ఇక్కడ ఎక్కువ. సీఏఏ అమలుతో వీరికి భారత పౌరసత్వం రానుంది. ఇది బీజేపీకి బాగా కలిసొస్తుందని భావిస్తున్నారు. సీపీఎం తరఫున అలోకేశ్ దాస్ పోటీలో ఉన్నారు.

బర్ధమాన్ - దుర్గాపూర్



• కీర్తి ఆజాద్

దేశానికి ప్రపంచకప్ తెచ్చిపెట్టిన ఇద్దరు మాజీ క్రికెటర్లు బెంగాల్‌లో ఈ విడత బరిలో ఉండటం విశేషం. వారిలో ఒకరు 2007 టీ20 ప్రపంచ కప్ నెగ్గిన భారత జట్టు సభ్యుడు యూసఫ్ పఠాన్, మరొకరు 1983 వన్డే ప్రపంచ కప్ నెగ్గిన 'కపిల్ డెవిల్స్'లో ఒకరైన కీర్తి ఆజాద్. వీరిద్దరూ తృణమూల్ అభ్యర్థులుగా బీజేపీకి సవాల్ విసురుతున్నారు. కీర్తి ఆజాద్ బీజేపీ మాజీ ఎంపీ. 2015లో సస్పెన్షన్‌కు గురై కాంగ్రెస్‌లో చేరారు. 2021లో తృణమూల్ గూటికి చేరారు. బర్ధమాన్–దుర్గాపూర్ లోక్‌సభ స్థానంలో రాష్ట్ర బీజేపీ మాజీ చీఫ్ దిలీప్ ఘోష్‌తో తలపడుతున్నారు. నియోజకవర్గాల పునర్విభజన అనంతరం ఏర్పడిన ఈ స్థానంలో ఓటర్లు ఏ పార్టీని రెండోసారి దీవించిన చరిత్ర లేదు. 2009లో సీపీఎం నేత సాదుల్ హక్ గెలవగా, 2014లో తృణమూల్ అభ్యర్థి ముంతాజ్ సంఘమిత్ర నెగ్గారు. 2019 ఎన్నికల్లో ముంతాజ్‌పై బీజేపీ నేత ఎస్ఎస్ అహ్లూవాలియా కేవలం 2,400 ఓట్లతో గట్టెక్కారు. ఈ విడత బీజేపీ అభ్యర్థి ఘోష్‌కు అజాద్ గట్టి పోటీ ఇస్తున్నారు. సీపీఎం ఇక్కడ సుకీర్తి ఘోషాల్‌ను నిలబెట్టింది.

బహ్రాంపూర్



• అధీర్ రంజన్ చౌదరి



• యూసఫ్ పఠాన్

పశ్చిమబెంగాల్ రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు అధీర్ రంజన్ చౌదరి 1999 ఎన్నికల నుంచి ఇక్కడ నాన్‌స్టాప్‌గా గెలుస్తున్నారు. ఈసారి తృణమూల్ నుంచి ప్రముఖ క్రికెటర్ యూసఫ్ పఠాన్ ఆయనకు సవాలు విసురుతున్నారు. నిర్మల్ కుమార్ సాహాకు బీజేపీ టికెట్ లభించింది. దాంతో ముక్కోణపు పోటీకి బహ్రాంపూర్ కేంద్రంగా మారింది. 1999కి ముందు వరుసగా మూడుసార్లు ఆర్ఎస్‌పీ నేత ప్రమోతెస్ ముఖర్జీ ఇక్కడ నెగ్గారు. ఈ లోక్‌సభ పరిధిలోని ఏడు అసెంబ్లీ స్థానాల్లో ఆరు తృణమూల్ ఖాతాలోనే ఉన్నాయి. బహ్రాంపూర్‌లో 50 శాతం ముస్లింలే ఉన్నారు. వారంతా కాంగ్రెస్‌కే దన్నుగా నిలుస్తున్నారు. అందుకే ఈసారి అధీర్‌కు ఎలాగైనా చెక్ పెట్టేందుకు ముస్లిం సామాజిక వర్గానికి చెందిన పఠాన్‌ను తృణమూల్ ఎంచుకుంది. అయితే స్థానికేతరుడు కావడం ఆయనకు కాస్త మైనస్‌గా మారింది. ముస్లిం ఓట్లు కాంగ్రెస్, తృణమూల్ మధ్య చీలితే బీజేపీకి కలిసి వచ్చే అవకాశాలూ లేక పోలేదు.

భోల్పూర్



• ప్రియా షా



• అసిత్ కుమార్ మల్

బెంగాల్లోని బీర్భూమ్ జిల్లా పరిధిలో ఉన్న ఈ ఎస్సీ రిజర్వ్‌డ్ స్థానంలో ముక్కోణపు పోటీ నెలకొంది. బోల్పూర్‌తో పాటు బీర్భూమ్ లోక్‌సభ స్థానంలోనూ టీఎంసీ విజయంలో స్థానిక నాయకుడు అనుబ్రత మోండల్‌ది కీలక పాత్ర. పశువుల అక్రమ రవాణా కేసులో ఆయన రెండేళ్లుగా తిహార్ జైల్లో ఉండడం ఆ పార్టీ విజయావకాశాలను దెబ్బతీసేదే. అయినా భోల్పూర్‌లో మోండల్ పేరుతోనే టీఎంసీ ఓట్లడుగుతోంది! దివంగత లోక్‌సభ స్పీకర్ సోమనాథ్ ఛటర్జీ 1985 నుంచి 2009 వరకు ఏడుసార్లు ఇక్కడి ఎంపీగా ఉన్నారు. సిట్టింగ్ ఎంపీ అసిత్ కుమార్ మల్‌పైనే మరోసారి టీఎంసీ ఆశలు పెట్టుకుంది. ఈ లోక్‌సభ స్థానం పరిధిలోని ఏడు అసెంబ్లీ సీట్లూ ఆ పార్టీ ఖాతాలోనే ఉన్నాయి! ఇది తృణమూల్‌కు బాగా కలిసొచ్చే అంశం. బీజేపీ నుంచి ప్రియా షా పోటీ చేస్తున్నారు. 2014తో పోలిస్తే 2019లో బీజేపీకి ఇక్కడ ఓట్లు భారీగా పెరిగాయి. ఈసారి సీఏఏ తదితరాల దన్నుతో గెలిచి తీరతామని బీజేపీ నేతలంటున్నారు. సీపీఎం నుంచి స్థానికంగా బాగా పట్టున్న శ్యామలి ప్రధాన్ పోటీలో ఉన్నారు. భోల్పూర్ లోక్‌సభ స్థానం పరిధిలో సీపీఎంకు ఆదరణ కూడా ఎక్కువే. బీజేపీ, తృణమూల్ ఓట్లలో శ్యామలి వేటిని చీలుస్తారన్నది ఆసక్తికరంగా మారింది.

బీర్భమ్



• శతాబ్దీ రాయ్



• దేబతను భట్టాచార్య

2004 తర్వాత ఎస్సీ నుంచి జనరల్‌కు మారినప్పటి నుంచీ ఇక్కడ తృణమూల్ నేత, నటి శతాబ్దీ రాయ్ చక్రం తిప్పుతున్నారు. 2009 నుంచి ఆమే గెలుస్తూ వస్తున్నారు. అయితే 2014 ఎన్నికల నుంచి ఇక్కడ బీజేపీ బాగా పుంజుకుంది. 2019లో ఏకంగా 5.65 లక్షల ఓట్లతో రెండో స్థానంలో నిలిచింది. మాజీ ఐపీఎస్ అధికారి దేవాశిష్ ధార్‌ను అభ్యర్థిగా బీజేపీ ప్రకటించగా సాంకేతిక కారణాలతో పోటీకి అనర్హుడయ్యారు. దాంతో దేబతను భట్టాచార్య పోటీ చేస్తున్నారు. కాంగ్రెస్ నుంచి మిల్టన్ రషీద్ పోటీలోకి ఉన్నారు. అవినీతి, మహిళలపై నేరాలు, సీఏఏ తదితర అంశాలు ఇక్కడి ఎన్నికలపై ప్రభావం చూపించనున్నాయి. టీఎంసీ నేత అనుబ్రత మోండల్ అందుబాటులో లేకపోవడం బీజేపీకి కలిసొచ్చేదే. అయితే ఈ లోక్‌సభ పరిధిలోని ఏడు స్థానాల్లో ఆరు తృణమూల్ ఖాతాలోనే ఉన్నాయి.

ఆస్తుల్లో అమృతా రాయ్ టాప్

పశ్చిమబెంగాల్లో నాలుగో విడతలో బరిలో ఉన్న 75 మంది అభ్యర్థుల్లో 21 మంది కోటీశ్వరులు. కృష్ణానగర్ బీజేపీ అభ్యర్థి రాయ్ రూ.554 కోట్ల ఆస్తులతో తొలి స్థానంలో ఉన్నారు. తర్వాత అసన్‌సోల్ తృణమూల్ అభ్యర్థి, బాలీవుడ్ నటుడు శతృఘ్నుసిన్హాకు రూ.210 కోట్లు ఉన్నాయి. రాణా ఘాట్ స్వతంత్ర అభ్యర్థి జగన్నాథ్ సర్కార్ తన వద్ద కేవలం రూ.3,586 ఉన్నట్టు చూపారు.



జహనారా ఖాన్. పశ్చిమబెంగాల్‌లోని అసన్‌సోల్ లోక్‌సభ స్థానంలో సీపీఎం అభ్యర్థి. బొగ్గు గని కార్మికుని కూతురు. రాజకీయాల్లో స్వశక్తితో ఎదిగిన సాదాసీదా మహిళ. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండే మట్టి బిడ్డ. జమూరియా అసెంబ్లీ స్థానం నుంచి రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. ఇప్పుడు బాలీవుడ్ నటుడు శత్రుఘ్నసిన్హా, ఎస్ఎస్ అహ్లువాలియా వంటి దిగ్గజాలకు గట్టిపోటీ ఇస్తున్నారు...

– సాక్షి, నేషనల్ డెస్క్

మట్టిమనిషి!

పరిచయం

చిన్న స్థాయి నుంచి...

జహనారా తండ్రి మైనింగ్ కార్మికుడు. సీపీఎం నాయకుడు. ఆమె జమూరియాలోని రాణిగంజ్ మహిళా కాలేజీలో చదువుకున్నారు. 1990లో డిగ్రీ పూర్తి చేశారు. ఇప్పటికీ ఈసీఎల్‌లో ఒక చిన్న పాత ఇంట్లో తోబుట్టువులతో కలసి ఉంటారామె. జహనారా వృత్తి రీత్యా టీచర్. వెనకబడిన కుటుంబాల్లోని చిన్నారులు, యువత జీవితాల్లో వెలుగు నింపేందుకు పాతికేళ్ల కిందే బాల్ బోధన్ శిక్షా నికేతన్ పేరిట హిందీ మీడియం స్కూలు ప్రారంభించారు. జమురియాలోని దక్షిణ పరాసియా మైనింగ్ ప్రాంతంలో ఉందీ స్కూలు. ఇందులో చదువుకున్న వాళ్లే ఇప్పుడు టీచర్లుగా స్వచ్ఛందంగా పని చేస్తుండటం విశేషం. అనంతరం తండ్రి రాజకీయ బాటలో నడిచి తొలుత సీపీఎం యువజన సంఘంలో పని చేశారు. జమూరియా మహిళా సంఘ నాయకురాలిగా ఎదిగారు. జమూరియా పంచాయతీ ప్రధాన్‌గా ప్రత్యక్ష రాజకీయాల్లో అడుగుపెట్టారు. 2008లో జమురియా పంచాయతీ అధ్యక్షురాలయ్యారు. తృణమూల్ హవా సాగుతున్న 2011, 2016ల్లో వరుసగా రెండుసార్లు జమురియా నుంచి ఎమ్మెల్యేగా గెలవడం ఆమెకున్న ఆదరణకు నిదర్శనం. స్థానికంగానూ అత్యంత శక్తిమంతురాలైన నాయకురాలిగా ఎదిగారు. అయితే 2021 అసెంబ్లీ ఎన్నికల్లో జమూరియా నుంచి విద్యార్థి నాయకురాలు అయిషీ ఘోష్‌కు సీపీఎం టికెటిచ్చింది. దాంతో జహనారా పార్టీ కార్యకలాపాలపై, పాఠశాలపై దృష్టి సారించారు. తొలిసారిగా ఇప్పుడు లోక్‌సభ బరిలో దిగుతున్నారామె. కార్మికుల కుటుంబాలు అధికంగా ఉండే అసన్‌సోల్‌లో ఆమె గెలుపు తథ్యమని సీపీఎం భావిస్తోంది.

పోరాడేవారే గెలుస్తారు...

నటులు, గాయకులతో ప్రజల జీవన పరిస్థితుల్లో మార్పు రాదంటారు జహనారా. కార్మికులు, ప్రజల పక్షాన పోరాడే సీపీఎం తప్పక విజయం సాధిస్తుందని ఆమె నమ్ముతున్నారు. ''రాష్ట్రంలో ఆరోగ్య వ్యవస్థ కుప్పకూలుతోంది. మహిళలు సురక్షితంగా లేరు. 2011 పార్క్ స్ట్రీట్ సంఘటన నుంచి, నేటి సందేశ్‌ఖాలీ వరకూ మహిళలు శారీరకంగా, మానసికంగా వేధింపులకు గురవుతున్నారు. బెంగాల్ ఆడపిల్లలను తృణమూల్ ప్రభుత్వం సరుకులుగా మార్చింది. రాష్ట్రమంతటా మహిళలపై జరుగుతున్న అణచివేతపై నిరసన, ప్రతిఘటన అగ్నిజ్వాలగా మారుతోంది. సమస్యల పరిష్కారంలో తృణమూల్, బీజేపీలు విఫలమయ్యాయి'' అని విమర్శిస్తున్నారు. పదేళ్లుగా కోల్పోయిన అసన్‌సోల్ ప్రాభవాన్ని తిరిగి నిలబెట్టడం తన బాధ్యత అని చెబుతున్నారు.



ఇంద్రానగర్ గ్రామంలో తెలంగాణ, మహారాష్ట్ర ఓటరు ఐడీలు చూపిస్తున్న ఓటర్లు

రెండు రాష్ట్రాల్లోనూ ఓటు!

ఆదిలాబాద్, మహారాష్ట్ర సరిహద్దులో విచిత్రం

- 14 గ్రామాల వారికి రెండేసి ఓట్లు
- ఏప్రిల్ 19న మహారాష్ట్రలో ఓటేశారు
- రేపు తెలంగాణలోనూ వేయనున్నారు

ఒకే ఓటరుకు రెండు లోక్‌సభ నియోజకవర్గాల పరిధిలో ఓటు వేసే అవకాశం వస్తే? అవి కూడా రెండు రాష్ట్రాల పరిధిలోని స్థానాలైతే! అదెలా అనుకుంటున్నారా? చట్టబద్ధంగా అయితే అవకాశం లేదు. కానీ ఒకటో రెండో కాదు... ఏకంగా 14 గ్రామాల ప్రజలకు ఇలా రెండు రాష్ట్రాల పరిధిలో ఓటు హక్కుంది. ఒక్కొక్కరికి రెండు ఓటరు గుర్తింపు కార్డులున్నాయి. అంతే కాదు, రెండు రాష్ట్రాల తరఫునా సంక్షేమ పథకాల ప్రయోజనాలు కూడా పొందుతున్నారు. ఈ గమ్మత్తేమిటో తెలుసుకోవాలంటే ఆదిలాబాద్ జిల్లా కెరమెరి, మహారాష్ట్రలోని జీవతి తాలూకాలకు వెళ్లాల్సిందే...

– సాక్షి, నేషనల్ డెస్క్

1956లో ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన సందర్భంగా మహారాష్ట్ర, తెలంగాణ సరిహద్దులో 14 గ్రామాలు ఎవరికి చెందాలన్నది ఎటూ తేలలేదు. ఇవి పరందోలి, అంతాపూర్ గ్రామ పంచాయితీల పరిధిలో 30 కిలోమీటర్లలో విస్తరించి ఉన్నాయి. వాటిలో 6,000 మంది నివసిస్తున్నారు. వారికి రెండు రాష్ట్రాల తరఫున ఓటరు ఐడీ కార్డులు, ఆధార్‌లు, కులం సర్టిఫికెట్లు ఉన్నాయి. ఈ ఊళ్లలో స్కూళ్లు కూడా తెలుగు, మరాఠీ మాధ్యమాల్లో రెండేసి ఉంటాయి! ఈ గ్రామాలు అటు మహారాష్ట్రలోని చంద్రపూర్ లోక్‌సభ స్థానంతో పాటు ఇటు తెలంగాణలోని ఆదిలాబాద్ లోక్‌సభ పరిధిలోకి కూడా వస్తాయి!

సర్పంచ్‌లూ ఇద్దరు

పరందోలి, అంతాపూర్ గ్రామ పంచాయితీలకు ఇద్దరేసి సర్పంచ్‌లు ఉండటం మరో విశేషం. వీరు తెలంగాణ, మహారాష్ట్రలో వేర్వేరు పార్టీలకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఈ 14 గ్రామాల వారికీ రెండు రాష్ట్ర ప్రభుత్వాల నుంచి అభివృద్ధి నిధులు కూడా వస్తుంటాయి. సంక్షేమ పథకాల ప్రయోజనాలూ అందుతున్నాయి.

రెండువైపులా ఓటు

అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో తాము రెండు రాష్ట్రాల్లోనూ ఓటు వేస్తూ వస్తున్నట్టు పరందోలి సర్పంచ్ లీనాబాయ్ బిరాడే మీడియాతో చెప్పడం విశేషం. ఆయనది మహారాష్ట్ర కాంగ్రెస్ పార్టీ. ''రెండు రాష్ట్రాల్లోనూ ఒకే తేదీన పోలింగ్ ఉంటే మాకు వీలైన స్థానంలో ఓటేస్తాం. వేర్వేరు తేదీల్లో ఉంటే మాత్రం రెండు రాష్ట్రాల్లోనూ ఓటేస్తాం. రెండు రాష్ట్రాల నుంచి మాకు సౌకర్యాలు అందుతున్నాయి'' అని లీనాబాయ్ వివరించారు. చంద్రాపూర్ లోక్‌సభ స్థానానికి ఏప్రిల్ 19న తొలి విడతలో పోలింగ్ ముగిసింది. అందులో ఈ 14 గ్రామాల ఓటర్లు పాల్గొన్నారు. ఇప్పుడు సోమవారం నాలుగో విడతలో ఆదిలాబాద్ లోక్‌సభ స్థానానికి కూడా ఓటేయనున్నారు!

ఒకచోట తొలగించండి...!

ఇలా రెండు లోక్‌సభ స్థానాల పరిధిలో రెండుసార్లు ఓటేయడం సరికాదని ఎన్నికల అధికారులు అంటున్నారు. దీనిపై చంద్రాపూర్, ఆదిలాబాద్ జిల్లా అధికారులు ఇటీవలే వారితో సమావేశం కూడా నిర్వహించినట్టు చంద్రాపూర్ కలెక్టర్ వినయ్ గౌడ వెల్లడించారు. రెండుసార్లు ఓటేయడం చట్ట విరుద్ధమని ఆయా గ్రామాల ప్రజలకు చెప్పామన్నారు. స్థానిక నేతలు మాత్రం రెండు చోట్ల ఓటు వేయవద్దని తమకు చెప్పేముందు తమ గ్రామాలు ఏ రాష్ట్రం పరిధిలోకి వస్తాయో తేల్చాలని కోరుతున్నారు. ''మేము రెండుసార్లు ఓటు వేస్తున్నాం. ఇది చట్టవిరుద్ధమైతే సమస్యను పరిష్కరించాల్సిందిగా రెండు రాష్ట్రాలను ఎన్నికల సంఘం కోరాలి. ఒక నియోజకవర్గ పరిధి నుంచి మా ఓట్లను తొలగించమనండి. మాకు సమస్యేమీ లేదు. కాకపోతే మేము మహారాష్ట్రకు చెందుతామా, లేక తెలంగాణకా అన్నది తేల్చాలి'' అని పరందోలి సర్పంచ్, బీఆర్ఎస్ నాయకుడు నింబదాస్ పతంగె అన్నారు.

''ఈ 14 గ్రామాల వారు మహారాష్ట్ర, తెలంగాణల్లో ఏదో ఒక్క చోటే ఓటేయాలి. ఇప్పటికే చంద్రపూర్ లోక్‌సభ స్థానం పరిధిలో ఓటేసిన వారిని మళ్లీ ఓటేయడానికి అనుమతించొద్దు. తెలంగాణ ప్రభుత్వానికి ఈ మేరకు సూచించాలని ఈసీని కోరాం''

– ఎస్.చొక్కలింగం, మహారాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి

అంతా ఓటర్ స్లిప్‌లోనే

దానిపై క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే చాలు...

పోలింగ్ కేంద్రమెక్కడో, ఎలా వెళ్లాలో తెలుసుకోవచ్చు

తమ భవిష్యత్‌ను నిర్ణయించే పాలకులను ఎన్నుకోవడంలో కీలకమైన ఓటు హక్కును వినియోగించుకునే విషయంలో ప్రజల్లో నిర్లిప్తత కనిపిస్తుంటుంది. చాలామంది చిన్న చిన్న ఇబ్బందుల కారణంగా ఓటేసేందుకు ఆసక్తి చూపించరు. ఫలితంగా లోక్‌సభ ఎన్నికల్లో ఇప్పటిదాకా 70 శాతం ఓటింగ్ కూడా నమోదు కాలేదు! పల్లెలతో పోలిస్తే పట్టణాల్లో ఓటింగ్ మరీ తక్కువగా నమోదవుతోంది. ఈ పరిస్థితిని మార్చేందుకు, మరింత మందిని పోలింగ్ కేంద్రాలకు రప్పించేందుకు ఎన్నికల సంఘం పలు చర్యలు తీసుకుంటోంది. వీటికి తోడు ఓటరు స్లిప్‌లపై క్యూఆర్ కోడ్‌లు ముద్రిస్తోంది. పోలింగ్ బూత్ ఎక్కడుంది మొదలుకుని ఓటింగ్‌కు సంబంధించిన సమస్త సమాచారాన్నీ కోడ్ సాయంతో ఇట్టే తెలుసుకోవచ్చు.

స్కాన్ చేస్తే పూర్తి సమాచారం

ఓటర్ స్లిప్‌లపై ఉండే క్యూఆర్ కోడ్‌ను మొబైల్‌తో స్కాన్ చేస్తే చాలు.. ఓటు ఏ పోలింగ్ బూత్‌లో ఉందో చెబుతుంది. అక్కడికెలా వెళ్లాలో కూడా గూగుల్ మ్యాప్ సాయంతో చూపిస్తుంది. ఇటీవలి కర్నాటక అసెంబ్లీ ఎన్నికల్లో బెంగళూరు పరిధిలో క్యూఆర్‌తో కూడిన ఓటర్ స్లిప్‌ల కారణంగా ఓటింగ్ బాగా పెరిగినట్టు రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికార మనోజ్‌కుమార్ మీనా వెల్లడించారు. బెంగళూరు టీచర్స్ కాలనీ అసెంబ్లీ స్థానంలో 2020లో 66 శాతం నమోదైన పోలింగ్ ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో 86 శాతానికి పెరిగిందన్నారు. ''చాలామంది ఓటర్లకు పోలింగ్ బూత్ ఎక్కడ ఉందో తెలియడం లేదు. ముఖ్యంగా పట్టణాల్లో ఈ పరిస్థితి ఉంటుంది. ప్రభుత్వ



Election Commission Of India

భవనాలెక్కడున్నదీ తెలియకపోవడం ఇందుకు ప్రధాన కారణం. క్యూఆర్ కోడ్ దీనికి పరిష్కారం. ఈ లోక్‌సభ ఎన్నికల్లో కర్ణాటకలో 80 శాతానికి పైగా ఓటర్లకు క్యూఆర్ కోడ్ ఆధారిత ఓటర్ స్లిప్‌లు పంపిణీ చేశాం'' అని ఆయన వివరించారు.

డిజిటల్ ఓటర్ స్లిప్

2020 ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఓటర్ స్లిప్‌లను 'ఓటర్ హెల్ప్‌లైన్' యాప్ ద్వారా డిజిటల్‌గా డౌన్‌లోడ్ చేసుకునే అవకాశాన్ని కూడా ఎన్నికల సంఘం కల్పించడం విశేషం. పోలింగ్ కేంద్రంలో సిబ్బంది డెస్క్ వరకు ఫోన్లను తీసుకెళ్లి ఈ డిజిటల్ ఓటర్ స్లిప్‌ను చూపించేందుకు అనుమతించారు. భవిష్యత్‌లో ఎన్నికలు మరింత డిజిటల్‌గా మారనున్నాయనేందుకు ఇది మరో సంకేతం.

ఆకర్షించే ఏర్పాట్లు

ఓటర్లను మరింతగా ఆకర్షించేందుకు ఈ విడత చాలా రాష్ట్రాల్లో థీమ్ ఆధారిత పోలింగ్ బూత్‌లను కూడా ఏర్పాటు చేస్తున్నారు. కేవలం మహిళా సిబ్బందితో కూడిన కేంద్రాలు, 30 ఏళ్లలోపు వయసున్న అధికారులతో యూత్ పోలింగ్ కేంద్రాలు, గిరిజన ప్రాంతాల్లో వారి ఇళ్లను పోలిన పోలింగ్ కేంద్రాలు అందుబాటులోకి తెస్తున్నారు. బెంగళూరు వంటి మెట్రో నగరాల్లో పోలింగ్ కనాకష్టంగా 50 శాతం దాటుతుండటం తెలిసిందే. ఇలా చాలా తక్కువ ఓటింగ్ నమోదవుతున్న ప్రాంతాలపై ఈసీ ప్రత్యేక దృష్టి పెట్టింది. ఆయా ప్రాంతాలకు బృందాలను పంపించి ఓటర్లలో చైతన్యానికి చర్యలు తీసుకుంటోంది. ఈ విషయంలో సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ల సాయం కూడా తీసుకుంటోంది. బూత్ వద్ద చాంతాడంత క్యూలు చూసి అంతసేపు లైన్లో ఉండాలా అని చాలామంది అనుకుంటారు. దీనికి విరుగుడుగా పోలింగ్ బూత్ వద్ద క్యూను ఇంటి నుంచే మొబైల్‌లో తెలుసుకునేలా యాప్‌లను ఈసీ అభివృద్ధి చేసింది. ఆ బూత్‌ల సమీపంలో వాహనాల పార్కింగ్ వసతులున్నాయా, లేదంటే సమీపంలో ఎక్కడ పార్క్ చేసుకోవచ్చు వంటి సమాచారం కూడా వాటిలో అందుబాటులోకి తెచ్చింది. నడవలేని వృద్ధుల కోసం ఈ యాప్‌ల నుంచి వీల్‌చైర్ కూడా బుక్ చేసుకోవచ్చు. పోటీలో ఉన్న అభ్యర్థులు, వారి అర్హతలు, అఫిడవిట్‌లో సమాచారం, వారిపై ఏవైనా క్రిమినల్ కేసులు నమోదయ్యాయా? ఆస్తులు, అప్పులు తదితర పూర్తి సమాచారాన్నీ తెలుసుకోవచ్చు.

– సాక్షి, నేషనల్ డెస్క్



తండ్రి కుమారుని ప్రేమించుచున్నాడు.
గనుక ఆయన చేతికి సమస్తము అప్పగించి యున్నాడు.

– క్రైస్తవ ధర్మం

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు వైశాఖ మాసం, **తిథి:** శు.పంచమి తె.4.17 వరకు (తెల్లవారితే సోమవారం), తదుపరి షష్ఠి, **నక్షత్రం:** ఆరుద్ర ప.12.52 వరకు తదుపరి పునర్వసు, **వర్జ్యం:** రా.1.19 నుండి 2.55 వరకు, **దుర్ముహూర్తం:** సా.4.40 నుండి 5.28 వరకు, **అమృతఘడియలు:** లేవు.

సూర్యోదయం : 5.33
సూర్యాస్తమయం : 6.19
రాహుకాలం : సా.4.30 నుంచి 6.00 వరకు
యమగండం : ప.12.00 నుంచి 1.30 వరకు



రాహుల్ గాంధీ (కాంగ్రెస్ నేత)

రాయని డైరీ

మాధవ్ శింగరాజు

లోపల భయం ఉన్నవాళ్లే బయటికి ధైర్యాన్ని ప్రదర్శిస్తారు. ఒక్కో విడత పోలింగ్ ముగుస్తున్న కొద్దీ మోదీ ఒక్కో విధమైన 'ధైర్యాన్ని' ప్రదర్శిస్తున్నారు. ఆయన ముఖమే కాదు, మాట కూడా విపరీతమైన హావభావాలను ప్రదర్శిస్తోంది!

రేపు నాల్గవ విడత పోలింగ్. మే 20 ఐదవ విడత. మే 25 ఆరవ విడత. జూన్ 1న ఏడవ విడత పోలింగ్. జూన్ 4న కౌంటింగ్.

కౌంటింగ్ రోజు దగ్గర పడుతున్న కొద్దీ మోదీజీలోని భయం ప్రదర్శన స్థాయి నుండి నటన స్థాయికి, నటన స్థాయి నుండి నటనలో జీవించే స్థాయికి చేరుకుంటోంది.

ఓటమి భయంతో ఆయన ఏం మాట్లాడుతున్నారో ఆయనకే అర్థం కావటం లేదు. 'రాహుల్–పాకిస్తాన్' అంటున్నారు! 'ఉద్ధవ్–బాలాసాహెబ్' అంటున్నారు. 'ముర్ము–కాంగ్రెస్' అంటున్నారు.

దేశంలోని నిరుద్యోగం మీద మాట్లాడటానికి మోదీజీకి ముఖం చెల్లటం లేదు. అందుకే పక్క దేశాన్ని తీసుకొచ్చి మాట్లాడుతున్నారు. "రాహుల్‌ను ప్రధానిగా



చూడాలని పాకిస్తాన్ తహతహలాడుతోంది" అంటున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే దేశంలోకి చొరబాట్లు పెరుగుతాయన్న బెదిరింపు అది. నిరుద్యోగం నుంచి దృష్టి మళ్లించటం.

ఓటమి భయం ఉన్నవాళ్లు ప్రజల దృష్టి మళ్లించటానికి వ్యక్తిగత దూషణలకు సైతం దిగజారుతారు. ఉద్ధవ్ ఠాక్రేను పట్టుకుని బాలాసాహెబ్ 'నకిలీ సంతాన్' అన్నారు మోదీజీ! ఒక ప్రధాని అనవలసిన మాటేనా?!

ఆ రోజు షిర్డీ నుంచి ఉద్ధవ్ నాకు ఫోన్ చేసి ఎంతో ఆవేదన చెందారు. "ఏమిటి ఆ మాటకు అర్థం చెప్పండి రాహుల్‌జీ. మోదీజీ ఎవర్ని అవమాన పరుస్తున్నట్లు? నన్నా? నా తల్లితండ్రులనా? అసలు మా నాన్నగారి పేరు పలికే అర్హత మోదీజీకి ఉందా? పలకాలంటే ముందు 'హిందూ హృదయ సమ్రాట్' అని పలకాలి. హిందూ హృదయ సమ్రాట్ అనే మాట పలకటం రాకపోతే మోదీజీకి కోచింగ్ ఇవ్వటానికి మహారాష్ట్ర ప్రజలు సిద్ధంగా ఉన్నారు" అన్నారు ఉద్ధవ్.

ఎన్నికల ర్యాలీలో తీరిక లేకుండా ఉండి కూడా ఉద్ధవ్ నాకు ఫోన్ చేశారంటే ఆయన మనసు ఎంతగా గాయపడి ఉండాలి!!

"మహారాష్ట్రకు రావలసిన ప్రాజెక్టుల్ని గుజరాత్‌కు హైజాక్ చేసి తీసుకెళుతున్నందుకు 'నకిలీ ప్రధాని' అని నేను కదా ఆయన్ని అనాలి..." అన్నారు ఉద్ధవ్.

"ఉద్ధవ్‌జీ! నన్ను సపోర్ట్ చేస్తూ మీరు అన్నారు కదా... మోదీ గెలిస్తే చైనా వాళ్లు పటాసులు పేలుస్తారు. ఎందుకంటే కేంద్రంలో ఒక పిరికి ప్రభుత్వం వారికి కావాలి" అని – అందుకు మోదీజీ మిమ్మల్ని అనటానికి ఏమీ లేదు కనుక బాలాసాహెబ్‌ను సీన్‌లో తెచ్చి ఉంటారు. మోదీజీ సర్జికల్ స్ట్రయిక్‌లన్నీ ఇలాగే ఉంటాయి. ఒకదానికొకటి సంబంధం లేకుండా..." అని నవ్వాను, ఆయన్ని కాస్త తేలికపరుద్దామని.

ఉద్ధవ్ నవ్వలేదు.

"ముర్ము విషయంలో చూడండి ఉద్ధవ్‌జీ... మోదీ ఎంతకు దిగజారి మాట్లాడారో! ఇండియన్‌లు నల్లవారిలా ఉంటారని శామ్ పిట్రోడా ఏదో మాట వరసకు అన్నందుకు... 'అయితే ముర్ము చర్మం రంగును చూసే రాష్ట్రపతి ఎన్నికల్లో ఆవిడను కాంగ్రెస్ వ్యతిరేకించిందా!' అని అన్నారు! చిదంబరంజీ ఆయనకు బాగానే సమాధానం చెప్పారు. 'ముర్మును వ్యతిరేకించటం కాంగ్రెస్ రాజకీయ నిర్ణయం. మరి బీజేపీ ఆవిడను సమర్థించటం రాజకీయ నిర్ణయం కాదా?' అని. ఎలా మాట్లాడేవాళ్లకు అలానే సమాధానం చెప్పాలి ఉద్ధవ్‌జీ..." అన్నాను.

ఉద్ధవ్ మౌనంగా ఉన్నారు.

"ఉద్ధవ్‌జీ! వింటున్నారా?" అన్నాను.

"ఆలోచిస్తున్నాను రాహుల్‌జీ! ఈ నకిలీ సంతాన్ సంతకం 2014లో 2019లో మోదీ తన నామినేషన్ కోసం అడిగి తీసుకున్నప్పుడు ఎలా నకిలీ సంతకం కాకపోయిందా అని ఆలోచిస్తున్నాను..." అన్నారు!

పౌర సమాజమా... పారాహుషార్!

అఖిలాంధ్ర జనులారా! అప్రమత్తంగా ఉండండి! గోముఖ వ్యాఘ్రాలు అంబారావాలు చేస్తున్నాయ్, తప్పుదోవ పట్టిస్తున్నాయ్. తేనె పూసిన కత్తులు కోలాటమాడుతున్నాయ్, కనికట్టు చేస్తున్నాయ్.

జన తటాకపు గట్టు మీద మూడు కొంగలు నిలబడి దొంగజపం చేస్తున్నాయ్. జాగ్తే రహో!

మతోన్మాదులు – కులోన్మాదులు జెండా గుడ్డలతో కొంగులు ముడేసుకొని అడుగులు వేస్తున్నారు, అప్రమత్తంగా ఉండండి.

నాజీలను మించిన కులోన్మాదులు, ఫాసిస్టులను తలదన్నే మతోన్మాదులు ఉమ్మడిగా, కలివిడిగా ఉన్మత్త ప్రచారపు విషవాయువులను ప్రయోగిస్తున్నారు, తస్మాత్ జాగ్రత్త!

విష ప్రచారపు ప్రయోగ వేదికలైన యెల్లో మీడియా కార్ఖానాల్లోంచి రోజుకు లక్ష క్యూబిక్ మీటర్ల పాయిజనస్ గ్యాస్ వెలువడుతున్నది. ఆ గాలి సోకితే జ్ఞానేంద్రియాలు పనిచేయవు, జరభద్రం!

మన జ్ఞానేంద్రియాలు పని చేయకూడదనేదే వారి కోరిక. పని చేస్తే వారి నిజస్వరూపం మనం గుర్తిస్తామన్న భయం.

ఈ మతోన్మాద, కులోన్మాద ఉమ్మడి ముఠాను నడిపించేది అంతా కలిపి పిడికెడు మందే! వారే పెత్తందార్లు. వారే పెట్టుబడిదార్లు. ముఠాలోని మిగిలిన పరివారంలో మతం అనే మత్తుమందుకు బానిసలు కొందరు. కులం అనే దురద రోగపు బాధితులు కొందరు.

ఈ బానిసల్నీ, బాధితుల్నీ వెంటేసుకొని పెత్తందారీ కాలకూట విషకూటమి దండయాత్రకు బయల్దేరింది. ప్రపంచ యుద్ధాల్లో కూడా కొన్ని రకాల కెమికల్ వెపన్స్ వాడకంపై నిషేధాలుంటాయి. కానీ రోగ్ కంట్రీస్ ఖాతరు చేయవు. మన హెజెమోనిక్ రోగ్స్ కూడా అంతే! ప్రచారపు విధి నిషేధాలను ఖాతరు చేయరు, చేయట్లేదు.

మన పెత్తందారీ కూటమి యుద్ధానికి తెగబడింది ఎవరి మీద? ఎవరిని తెగటార్చడానికి భగభగమండే పగతో సెగలుగక్కుతున్నారు?

ఇంకెవరి మీద? పేదసాదల మీద, వారి సాధికారతా స్వప్నాల మీద! బడుగు బలహీన వర్గాల మీద, వారి జీవన వికాసపు ఆకాంక్షల మీద! కోట్ల జతల కనురెప్పల మాటునున్న కలల మీద ఒకేసారి దాడి చేయడం ఎట్లా?

వారికి ఆలంబనగా నిలబడిన వెన్నెముకను విరిచేయాలి. ఆ వెన్ను ఎముకే... వైఎస్ జగన్ ప్రభుత్వం. ఇంకెందుకు ఆలస్యం. బొంబార్డ్ ది హెడ్ క్వార్టర్స్. ప్రజల పక్షాన నిలబడిన ప్రభుత్వాన్ని కూలదోస్తే సరిపోతుంది. ఈ ఎన్నికల్లో కూల్చివేయాలి. పెత్తందారీ కూటమి తలపోత ఇది.

తలపోసినంత మాత్రాన కుదురుతుందా? కోట్లాది మంది జీవితాలను క్రాంతి మార్గానికి మళ్లిస్తున్న సర్కార్‌కు వారు అండగా నిలబడరా? అశేష జనావళి మద్దతున్న జగన్ ప్రభుత్వాన్ని ఎన్నికల్లో ఎలా ఓడించగలరు?

బలరామదేవుడి ముక్కోపానికి విరుగుడు మంత్రం ఉండనే ఉన్నది కదా ముఖస్తుతి అంటాడు 'మాయాబజార్' శకుని మామ. ఆ లెక్కన ప్రజాభిమానానికీ విరుగుడు ఉంటుంది కదా! ప్రజల్లో అపోహలు సృష్టించడం, అనుమాన బీజాలు నాటడం! అసత్య ప్రచారంతో చీలికలు తేవడం వగైరా. కూటమిలోని శకుని మామలు పాచికలు విసరడంలో ఆశ్చర్యమేమున్నది?

ప్రజలను ఆకట్టుకోగల నినాదం ఈ కూటమికి ఒక్కటి కూడా లేదు. ప్రజలకు మేలు చేసే విధానమూ లేదు. అరువు తెచ్చుకున్న అతుకుల బొంత మేనిఫెస్టో మాత్రం ఉన్నది. అందులోని అంశాలు అరచేతిలో వైకుంఠాన్ని చూపే టక్కుటమారం బాపతు. ఈ గారడీ సంగతి ముందే తెలిసిన జనం దాన్ని బొత్తిగా పట్టించుకోలేదు. క్రెడిబిలిటీ టెస్ట్‌లో కూటమి మేనిఫెస్టో డకౌటయింది.

కూటమి నేతలు కూడా మేనిఫెస్టోను నమ్ముకోలేదు. యెల్లో మీడియా నేతృత్వంలో వెలువడే విషవాయు ప్రచారాన్నే ఆయుధంగా ఎక్కుపెట్టారు. జగన్ పరిపాలనలో రాష్ట్రం సర్వనాశనమైపోయిందంటారు. ఎలా అని అడగకూడదు. తర్కానికి తావులేదు. సర్వనాశనం అనే మాటను అష్టోత్తర శతనామంలా ప్రతివాడూ నూటా ఎనిమిది సార్లు జపించాలి. అంతే!

జగన్ హయాంలో అభివృద్ధి శూన్యమంటారు. దాని పైనా చర్చ ఉండదు. ఆధారాలుండవు. గణాంకాల జోలికి వెళ్లొద్దు. ఫీల్డ్ విజిట్ చేయొద్దు. రోజూ ఓపికున్నంత సేపు రామకోటి రాసుకున్నట్టుగా 'అభివృద్ధి లేదు' అనే మాటను రాసుకోవాలి. పంచాక్షరి మంత్రంలా పవిత్రంగా ఉచ్చరించి నెత్తిన నీళ్లు చల్లుకోవాలి.

సర్వనాశనం, అభివృద్ధి శూన్యం అనే రెండు మాటల్ని మన యెల్లో మీడియా, టీడీపీ నేతలు నమలడం మొదలుపెట్టి ఇప్పటికి నాలుగేళ్లు దాటింది. నమలడం, నెమరు వేయడం అనే కార్యక్రమం అప్పటి నుంచి నిరాటంకంగా సాగుతూనే ఉన్నది. చూసేవాళ్లకు రోత పుట్టినా వాళ్లు మాత్రం ఈ పాచిపాటను ఆపలేదు.

ఎన్నికలకు ఆరు నెలల ముందు నుంచీ మరీ ఘోరం. ఆ పత్రికలు చదవాలన్నా, ఆ ఛానెళ్లు చూడాలన్నా అల్ప ప్రాణులకు జడుపు జ్వరం వచ్చే పరిస్థితిలోకి తీసుకెళ్లారు. అభూతకల్పనలు, అభాండాలు, బట్టకాల్చి మీద వేయడం నిత్యకృత్యంగా మారింది.

'ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్' అనే నల్ల చట్టాన్ని జగన్ మోహన్‌రెడ్డి తీసుకొచ్చారట. దాని ఆధారంతో ఆయన అర్ధరాత్రి వేళల్లో గ్రామాలకు కన్నంవేసి కంటికి నచ్చిన భూమినల్లా తవ్వుకొని, మూట కట్టుకొని వెళ్లిపోతారట! ఇదీ వీళ్లు ప్రచారం చేస్తున్న వార్త సారాంశం.

మనిషి జన్మ ఎత్తిన వాడికి కొన్ని లక్షణాలు తప్పనిసరిగా ఉంటాయని ఆశిస్తాము. సిగ్గూ–లజ్జ, మానము–మర్యాద, అభిమానం – గౌరవం వంటివి వాటిలో మచ్చుకు కొన్ని! యెల్లో మీడియా, దేశం కూటమి ఈ తరహా లక్షణాలను పూర్తిగా విసర్జించాయి. విలువల్నీ, వలువల్నీ విప్పేసి అవతలపారేశారు. దిగంబర వీరంగాలతో జుగుప్సాకరంగా తయారయ్యారు. నడివీధుల్లో నగ్నంగా నర్తిస్తున్నారు.



జనతంత్రం

ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ అనేది భూయజమానులకు మేలు చేస్తుందనీ, ఇంతకాలం ఈ చట్టాన్ని తేకపోవడమే పొరపాటనీ ఈ దేశంలోని బుద్ధిజీవులందరూ అభిప్రాయపడుతున్నారు. ప్రపంచంలో సగానికి పైగా దేశాల్లో ఇప్పటికే ఈ చట్టం అమల్లో ఉన్నది.

ఏపీ శాసనసభలో తెలుగుదేశం పార్టీ ఈ చట్టానికి మద్దతు ప్రకటించింది. ఇప్పటికింకా మూడో వంతు గ్రామాల్లోనే భూసర్వే పూర్తయింది. అన్ని గ్రామాల్లో సర్వే పూర్తయితే తప్ప మరో రెండేళ్లకు గానీ ఈ చట్టం అమల్లోకి రాదు.

చట్టం లక్ష్యమే యజమానికి భూమిపై సర్వహక్కులు కల్పించడం. ఆ హక్కులకు ప్రభుత్వం గ్యారంటీ ఇవ్వడం. అందుకు గుర్తుగానే సర్వే పూర్తయిన చోట ఇచ్చే పాస్ పుస్తకాలపై సీఎం బొమ్మను ముద్రిస్తున్నారు. అది ఆ యజమాని హక్కుకు ప్రభుత్వ గ్యారంటీ. దాని మీద జరిగిన వక్రప్రచారం, చంద్రబాబు నోటి వెంట వచ్చిన బూతులు కూటమి దివాళాకోరుతనానికి రుజువు.

అవ్వాతాతల పెన్షన్ల పంపిణీ విషయంలో కూటమి – యెల్లో మీడియా ఎంత అమానవీయంగా ప్రవర్తించాయో రాష్ట్ర ప్రజలు గమనించారు. వలంటీర్ల విషయంలో ఎన్ని పిల్లిమొగ్గలు వేశాయో గమనించారు.

ఆసరా, చేయూత, ఈబీసీ నేస్తం, ఇన్‌పుట్ సబ్సిడీ లబ్ధిదారులకు దక్కకుండా ఈసీపై నెరిపిన ఒత్తిడి రాజకీయం కూటమి వారి దింపుడు కళ్లెం ఆశల దిగజారుడుతనాన్ని ఎత్తిచూపింది.

ఇసుక సరఫరాపై విషం చిమ్ముతూ గత నాలుగేళ్లుగా చందమామ కథలు నెలనెలా ప్రచారం చేయడాన్ని ఎలా మర్చిపోగలం?

మద్యం వ్యాపారుల మాఫియా కోసం మద్య నియంత్రణపై వెళ్లగక్కిన అక్కసు గుర్తు చేసుకోండి. తను అధికారంలోకి వస్తే నాణ్యమైన మద్యాన్ని చంద్రబాబు అందిస్తారట. ప్రాణాలకు హానికరమైన లిక్కర్‌కు నాణ్యతా ప్రమాణాలేమిటి?

విచ్చలవిడి లాభాల కోసం వ్యాపారులు వేలాది బెల్ట్ షాపులు కూడా నడిపి మద్యాన్ని డోర్ డెలివరీ చేసినప్పుడు ప్రజల ఆరోగ్యం అద్భుతంగా ఉండట. మద్యాన్ని అందుబాటులో లేకుండా చేసి, బెల్టుషాపులు ఎత్తివేసి నియంత్రిత వేళల్లో మాత్రమే, లాభాపేక్ష లేని ప్రభుత్వ షాపుల్లోనే అమ్ముతుంటే మాత్రం కాలేయాలు, కిడ్నీలు పాడైపోతున్నాయనే కాకమ్మ కథలను ప్రచారంలో పెట్టిన వైనాన్ని గమనించండి.

పరిశ్రమల విషయంలోనూ ఉన్నది లేనట్టుగా, లేనిది ఉన్నట్టుగా ప్రచారం చేశారు. గ్రామ స్వరాజ్యాన్ని ఆచరణాత్మకం చేస్తే సహించలేకపోయారు. ఏ వివక్ష లేకుండా, పుట్టిన ప్రతిబిడ్డకూ నాణ్యమైన విద్యను ప్రాథమిక హక్కుగా మార్చితే పెత్తందారీ కూటమి భరించలేకపోతున్నది. ప్రభుత్వంపై యుద్ధం ప్రకటించింది.

పేద వర్గాల ప్రజలు, మహిళలు నిటారుగా నిలబడటానికి సాధికారతను సంతరించుకోవడానికి ఉపయోగపడే ఒక విప్లవకర ఎజెండాను జగన్ ప్రభుత్వం అమలుచేసింది. ఈ ఎజెండా కొనసాగవలసిన అవసరం పేదవర్గాలు, బలహీనవర్గాల ప్రజలకున్నది.

ఈ ఎజెండా కొనసాగితే పెత్తందార్లకు ఆకలి తీరదు. అందుకే కట్టుకథలతో ముందుకు వస్తున్నారు. పేదవర్గాల ప్రజలను ఏమార్చాలని చూస్తున్నారు. మభ్యపెట్టాలని చూస్తున్నారు. మరోసారి దారుణంగా మోసం చేయాలని కపట నాటకమాడుతున్నారు.

వారు ప్రజలకు మిత్రులు కారు... శత్రువులు. మానవీయ విలువలు లేశమాత్రం లేనివారు. పేద బిడ్డలు మంచి చదువులు చదివితే ఓర్చుకోలేరు.

మిత్రులారా! ఏదైనా జరగరాని పొరపాటు జరిగి కూటమి గెలిస్తే సర్కారు బడులు మళ్లీ పాడుబడిపోతాయి. పేద బిడ్డలకు ఇంగ్లిష్ మీడియం రద్దవుతుంది. విద్య ప్రైవేట్ పరమవుతుంది.

ఈ లక్ష్యం కోసమే కార్పొరేట్ విద్యా సంస్థల యజమానులు కూటమి గెలుపు కోసం వేలకోట్లు ఖర్చు చేస్తున్నారు. అర్థం చేసుకోండి.

ప్రభుత్వ వైద్యరంగం నిర్వీర్యమవుతుంది. 'ఫ్యామిలీ డాక్టర్' అదృశ్యమవుతాడు. కార్పొరేట్ మాఫియా వైద్యరంగాన్ని మళ్లీ ఆక్రమించుకుంటుంది. 'రైతు భరోసా' ఎగిరిపోతుంది. ఆర్బీకే సెంటర్లు అదృశ్యమవుతాయి.

అధికార వికేంద్రీకరణకు అద్దం పట్టిన గ్రామ సచివాలయాలు మాయమవుతాయి. వలంటీర్ వ్యవస్థను ఎత్తివేస్తారు. ఎందుకంటే అధికార వికేంద్రీకరణ అనేది పేద వర్గాలను బలోపేతం చేస్తుంది. ప్రజాస్వామ్యాన్ని పరిపుష్టం చేస్తుంది. ఈ పరిణామం పెత్తందారీ వర్గాలకు గిట్టదు. అందుకే ఈ కూటమి పలుమార్లు వికేంద్రీకరణపై అవాకులు చెవాకులు పేలిన విషయం మరిచిపోరాదు.


సమస్త వనరుల మీద తమ పెత్తనం కోసం పెత్తందార్లు పరితపిస్తారు. అందుకోసం నిరంతరం వేటాడుతూనే ఉంటారు. బలహీనవర్గాలకు అధికారంలో వాటా పెరిగితే ఈ వేటగాళ్ల ఆటలు సాగవు.

అందుకే జగన్ ప్రభుత్వ విధానాలపై పెత్తందార్లు యుద్ధం ప్రకటించారు. వారి మాయ నాటకాలకు లొంగిపోతే పేదవర్గాల విజయ ప్రస్థానం ఆగిపోతుంది. సామాజిక విప్లవానికి ఎదురుదెబ్బ తగులుతుంది. పేద ప్రజల విచక్షణ మీద, ఆలోచనాశక్తి మీద పెత్తందార్లకు చిన్నచూపు. అందుకే మిమ్మల్ని ప్రలోభపెట్టాలని చూస్తున్నారు. మిత్రులారా! మీ చైతన్య స్థాయిని చాటిచెప్పండి. విప్లవకర ఎజెండాను జెండాగా ఎగరేయండి!

వర్ధెల్లి మురళి

ఆదర్శనీయం... ఆచరణీయం

అభిప్రాయం




వి.వి.ఆర్. కృష్ణంరాజు

'అనుచిత ఉచితాలకు నేడో రేపో భారీ మూల్యం చెల్లించడం ఖాయం' అంటారు అమెరికన్ రచయిత విల్లీమన్. ఎన్నికల సమయంలో ఆ యా రాజకీయ పార్టీలు ఉచితాలతో కూడిన హామీలిస్తున్నాయి. అయితే పేదవారి కనీస అవసరాలు తీర్చే సముచిత ఉచితాలు కొంతకాలం అవసరమే. కానీ కేవలం అధికారంలోకి రావడం కోసం రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెట్టే అనుచిత ఉచితాల పట్ల ప్రజలు ఆకర్షితులైతే ఆర్థిక సంక్షోభ సునామీలో కొట్టుకు పోవడం ఖాయం. జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం సముచిత ఉచితాలతో గరిష్ఠ స్థాయిలో సంక్షేమ పథకాల రూపంలో ఏటా సుమారు రూ. 80 వేల కోట్లు వ్యయం చేసినప్పటికీ... కొందరు కోరుకున్నట్లుగా రాష్ట్రం శ్రీలంక కాలేదు.

అధికార దాహార్తితో అల్లాడుతున్న చంద్రబాబు వచ్చే ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలనే కోరికతో అనేక అనుచిత ఉచితాలు ప్రకటించారు. జగన్ ప్రభుత్వ పథకాలను కొనసాగిస్తూ చంద్రబాబు ఇచ్చిన అనుచిత ఉచితాలను అమలు చేయడానికి యేటా మరో రూ.70 వేల కోట్లు ఖర్చవుతుంది. అంటే వీటివల్ల రాష్ట్ర ఖజానాపై సుమారు రూ. లక్షా 50 వేల కోట్ల భారం పడుతుంది.

నిజానికి రాష్ట్రానికి పన్ను, పన్నేతర ఆదాయాలు, కేంద్ర గ్రాంట్లు అన్నీ కలిపితే ఏడాదికి వస్తోంది సుమారు రెండు లక్షల కోట్ల రూపాయలు. దీనిలో ఉచితాలకు లక్షా 50 వేల కోట్ల రూపాయలు పోతే మిగిలేది రూ. 50 వేల కోట్లు. ఉద్యోగుల వేతనాలు, పెన్షన్‌లకు ఏడాదికి సుమారు రూ.70 వేల కోట్లు అవసరమవుతాయి. ఇవి కాక వ్యవసాయం, ఇరిగేషన్, విద్య, వైద్యం లాంటి 21 శాఖలకు సుమారు లక్షా 30 వేల కోట్లు కేటాయించాలి. ఈ ఏడాది ఫిబ్రవరిలో ప్రవేశపెట్టిన ఓట్ ఆన్ ఎకౌంట్‌లో సుమారు 56 వేల కోట్ల రూపాయల ద్రవ్య లోటు చూపించారు. చంద్రబాబు అనుచిత పథకాలను కూడా అమలు చేయాల్సి వస్తే ఈ లోటు లక్షా 26 వేల కోట్లకు పెరుగుతుంది. ఇదే జరిగితే ఈ లోటు రాష్ట్రాన్ని తీవ్ర ఆర్థిక సంక్షోభంలోకి నెట్టడం ఖాయం.




మేనిఫెస్టోలకు మాతృక 1848లో లండన్‌లో కార్ల్‌మార్క్స్–ఫ్రెడెరిక్ ఏంగెల్స్ ప్రచురించిన కమ్యూనిస్ట్ మేనిఫెస్టో. అట్టడుగు శ్రామిక, పేద వర్గాలకు సంపద పంచడం, ఆర్థిక అసమానతలు తగ్గించడం ఈ మేనిఫెస్టోలోని అంశాల్లో ఒకటి. ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రి జగన్ చేసింది ఇదే. ముందు వారి ఆర్థిక అవసరాలు తీర్చడానికి ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు నాలుగు లక్షల కోట్ల రూపాయలు అందజేశారు. దీనిలో సుమారు రూ. 2.70 లక్షల కోట్లు డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ (డీబీటీ) ద్వారా అందజేశారు. మోదీ ప్రభుత్వం గత ఐదేళ్ళుగా ఈ పద్ధతి ద్వారా దేశ వ్యాప్తంగా సుమారు రూ. 22 లక్షల కోట్లు బదిలీ చేయగా దానిలో పదో వంతు పైనే ఏపీలో పంపిణీ జరగడం విశేషం. ఇలా ఇవ్వడం వల్ల ఈ నాలుగు లక్షల కోట్ల రూపాయలు నేరుగా స్థానికంగా ఖర్చు చేయడంతో వస్తు, సేవలకు గిరాకీ ఏర్పడింది. ఫలితంగా ఉత్పత్తి, ఉపాధి పెరిగింది. ప్రతి లావాదేవీలోనూ కేంద్ర, రాష్ట్రాలకు పన్నుల రూపంలో రాబడి పెరిగింది. ఇదే మొత్తం బడా వ్యాపారులు, కాంట్రాక్టర్లు, రాజకీయ నాయకుల చేతికి వెళితే దానిలో అత్యధికం నల్లధనంగా మారేది. పేదలను ఆర్థికంగా ఆదుకున్న జగన్ తర్వాత వారి సంపదను పెంచారు. సుమారు 31 లక్షల మంది మహిళలకు ఇళ్ళ స్థలాలు, లక్షన్నర గృహాలు ఉచితంగా అందజేశారు. పేదలకు ఇచ్చిన ఒక్కో ఇళ్ళ స్థలం విలువ కనీసం మూడు లక్షలు, ఇంటి విలువ పది లక్షల రూపాయల చొప్పున లెక్కిస్తే వాటి మొత్తం విలువ సుమారు పది లక్షల కోట్ల రూపాయలు. అంటే రాష్ట్ర బడ్జెట్ కన్నా ఇది నాలుగు రెట్లు ఎక్కువ. దేశంలో మరే రాష్ట్రం పేదల కోసం ఇటువంటి ఆలోచన చేయలేదు, ఇంత సంపద సమకూర్చలేదు.

రాష్ట్రంలో అభివృద్ధి లేదు, సంక్షేమం లేదంటూ విపక్షాలు, వారి అనుకూల మీడియా విషప్రచారం చేశాయి. 2023–24లో దేశ జాతీయోత్పత్తి వృద్ధి రేటు సుమారు 8 శాతం కాగా రాష్ట్ర స్థూల జాతీయోత్పత్తి వృద్ధి రేటు 16.5 శాతం. దేశంలో ఎక్కువగా వృద్ధి రేటు నమోదు చేసిన రాష్ట్రాల్లో ఏపీ ఒకటి. 2018–19లో స్థూల జాతీయోత్పత్తి విలువ రూ. 8.73 లక్షల కోట్లు కాగా అది 2023–24 నాటికి రూ. 16 లక్షల కోట్లకు పెరిగింది. తలసరి ఆదాయం రూ. 1,54,031 నుంచి రూ. 2. 60 లక్షలకు పెరిగింది. ఈ ఐదేళ్ళలో 122 భారీ పరిశ్రమలు, 5 లక్షల చిన్న తరహా పరిశ్రమలు వచ్చాయి. క్రెడిట్ రేటింగ్ ఇన్ఫర్మేషన్ సర్వీసెస్ ఇండియా లెక్కల ప్రకారం దేశ వ్యాప్తంగా గత నాలుగేళ్లుగా సుమారు రూ. 75 లక్షల కోట్ల రూపాయల మౌలిక వసతుల పనులు జరుగుతుంటే వాటిలో ఏపీలోనే సుమారు రూ. 6 లక్షల కోట్ల పనులు జరుగుతున్నాయి. దేశ ఎగుమతుల్లో 10.42 శాతం ఏపీ నౌకాశ్రయాల నుంచే జరుగుతున్నాయి. సామాజిక రంగ వ్యయం, ఫుడ్ ప్రాసెసింగ్, కోక్, పొగాకు, మత్స్య ఉత్పత్తులు, పండ్ల తోటల విస్తీర్ణం, పౌల్ట్రీ, ప్రభుత్వ ఆస్పత్రుల సంఖ్య, సినిమా హాళ్ళు, ఇంజనీరింగ్ టాలెంట్ తదితర రంగాల్లో ఏపీ దేశంలోనే అగ్ర స్థానంలో ఉంది.

దేశంలో అతి తక్కువ నిరుద్యోగం (4.2 శాతం) ఉన్న రాష్ట్రాల్లో ఏపీ ఒకటి. కాని రాష్ట్రంలో ఉపాధి అవకాశాలు లేవంటూ ప్రచారం జరిగింది. రాష్ట్రంలో ప్రభుత్వం ఇచ్చిన ఉద్యోగాలు కాకుండా ప్రైవేట్ రంగంలో కూడా నిరుద్యోగులకు పెద్ద ఎత్తున ఉపాధి లభించింది. దానికి ఉదాహరణ రాష్ట్రంలో పెరిగిన ప్రావిడెంట్ ఫండ్ ఖాతాలే. కేంద్ర కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖ నివేదిక ప్రకారం 2019లో రాష్ట్రంలో 44,85,974 పీఎఫ్ ఖాతాలుంటే అవి 2024 నాటికి 60,73,000కు పెరిగాయి. రాష్ట్రంలో గత మూడేళ్ళుగా కొత్తగా 18 లక్షల ఆదాయ పన్ను చెల్లింపుదారులు చేరారు. ఇదో జాతీయ రికార్డు.

దేశంలో అత్యధిక సంఖ్యలో ఏడు వందలకు పైగా పౌర సేవలందిస్తున్న ఏకైక రాష్ట్రం ఆంధ్రప్రదేశ్. ఈ ఐదేళ్ళలో రాష్ట్ర ప్రభుత్వం సుమారు 12 కోట్ల పౌర సేవా అర్జీలను పరిష్కరించి జాతీయ రికార్డు నెలకొల్పింది. నిజానికి ఈ ఐదేళ్ళలో అనేక రంగాల్లో ఆంధ్రప్రదేశ్ దేశానికే ఆదర్శంగా నిలిచింది. జగన్ ప్రభుత్వం మేనిఫెస్టోను పవిత్ర గ్రంథంగా భావించి త్రికరణ శుద్ధిగా అమలు చేసిందనడంలో సందేహం లేదు. గతంలో పసుపు– కుంకుమ వంటి తాయిలాలను తిరస్కరించిన రాష్ట్ర ఓటర్లు వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం– జనసేన కూటమి అనుచిత ఉచితాల వలకు చిక్కే అవకాశం కనిపించడం లేదు.

వ్యాసకర్త ఏ.పి. ఎడిటర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్
మొబైల్: 89859 41411



నేడు మదర్స్ డే



శ్వేతా సాల్వే



నిరాళి మెహతా



మాసుమ్

వైరల్

సూపర్ మామ్‌ఫ్లూయెన్సర్

సోషల్ మీడియా ప్రపంచంలో మామ్‌ఫ్లూయెన్సర్‌లు పవర్‌ఫుల్ ఫోర్స్‌గా మారారు. ఇన్‌స్పిరేషనల్ వైరల్ కంటెంట్‌తో ఎంతోమంది అభిమానులను సంపాదించుకున్నారు. సోషల్ మీడియాలో కొందరు పాపులర్ మామ్ ఫ్లూయెన్సర్‌ల గురించి...

ఫ్యాషన్, బ్యూటీటిప్స్ నుంచి పేరెంటింగ్ అండ్ వర్క్–లైఫ్ బ్యాలెన్స్ వరకు తల్లులకు ఉపయోగపడే ఎన్నో సలహాలు ఇస్తోంది మాసుమ్ మినవాలా మెహతా. ఎన్నో బ్రాండ్‌లు, పబ్లికేషన్‌లతో కలిసి పనిచేస్తోంది.

తన పేరెంటింగ్ జర్నీ విషయాలు, డిఐవై(డూ ఇట్ యువర్‌సెల్ఫ్) ప్రాజెక్ట్స్, హోమ్ డెకార్ ఐడియాలను సోషల్ మీడియాలో షేర్ చేస్తోంది కరిష్మ దొండే. ఇద్దరు పిల్లలకు తల్లి అయిన కరిష్మ కామన్ పేరేంటింగ్ చాలెంజెస్‌కు క్రియేటివ్ సొల్యూషన్స్ అందిస్తోంది. మామ్‌గా తన అనుభవాలను పంచుకోవడంతో పాటు ఇతర తల్లులకు టిప్స్, సలహాలు ఇస్తోంది.

బాలీవుడ్ సినిమాలు, టీవీ షోలు, వెబ్ సిరీస్‌లతో పాపులర్ అయిన శ్వేతా సాల్వే మామ్‌ఫ్లూయెన్సర్‌గా సోషల్ మీడియాలో మంచి పేరు తెచ్చుకుంది. ఫిట్‌నెస్ టిప్స్ నుంచి ఫ్యాషన్ వరకు ఎంతో కంటెంట్‌ను తల్లుల కోసం షేర్ చేస్తోంది. తన ఇన్‌స్టాగ్రామ్ ఎకౌంట్‌లో హెల్తీ మీల్స్, సెల్ఫ్–కేర్ ప్రాక్టీసెస్‌తో పాటు తన పేరెంటింగ్ జర్నీని కూడా షేర్ చేస్తోంది. మదర్‌హుడ్‌ను కెరీర్ అండ్ పర్సనల్ గోల్స్‌తో ఎలా బ్యాలెన్స్ చేయాలో చెబుతోంది.

సోషల్ మీడియాలో మాసివ్ ఫాలోయింగ్ ఉన్న మామ్‌ఫ్లుయెన్సర్‌లలో నిరాళి మెహతా ఒకరు. ఇద్దరు పిల్లలకు తల్లి అయిన మెహతా తన పేరెంటింగ్ జర్నీ, ట్రావెల్ అడ్వెంచర్స్, ఫ్యాషన్ ఇన్‌స్పిరేషన్‌లను షేర్ చేస్తుంటుంది. 'మోర్ ఫన్ అండ్ క్రియేటివ్' అనే కోణంలో పేరెంటింగ్‌కు సంబంధించిన ట్రిక్స్, టిప్స్‌ను తల్లుల కోసం షేర్ చేస్తుంటుంది నివేదిత గౌడ. తన పేరెంటింగ్ జర్నీతోపాటు కుకింగ్ టిప్స్, డిఐవై (డూ ఇట్ యువర్‌సెల్ఫ్) ఐడియాలు సోషల్ మీడియాలో షేర్ చేస్తుంటుంది.

అమ్మ నవ్వితే వెయ్యి ఏనుగుల బలం

అమ్మ పక్కన ఉంటే వేయి ఏనుగుల బలం. అమ్మ గురించి మాట్లాడటం కూడా వేయి ఏనుగుల బలం. అమ్మ నవ్వు కూడా వెయ్యి ఏనుగుల బలం. గ్రాండ్ మాస్టర్ ప్రజ్ఞానంద 'చెస్‌లో నాకు, మా అక్కకు అమ్మ నాగలక్ష్మి స్ఫూర్తి. మాకు



ఎంతో ప్రోత్సాహం ఇచ్చింది. మేము చెస్ టోర్నీల్లో పాల్గొనడానికి ఎక్కడికి వెళ్లినా మాతో అమ్మ వస్తుంది' అంటూ అమ్మ గురించి చెప్పాడు. మదర్స్ డే సందర్భంగా ప్రజ్ఞానంద తల్లితో ఉన్న ఇమేజ్ ఇంటర్‌నెట్‌లో చక్కర్లు కొడుతోంది. ఈ టచింగ్ ఇమేజ్‌లో మాటలకు అందని భావం ఉంది. కొడుకు మాట్లాడుతుంటే తల్లి అపురూపంగా చూడడం. ఆనందబాష్పాలు రాల్చడం ఈ ఇమేజ్‌లో వైరల్ ఎలిమెంట్స్.

మా తుఝే సలామ్

మదర్స్ డే వైరల్ సాంగ్స్‌లో కేరళలోని కన్నూర్‌కు చెందిన సుచేత సతీష్ పాడిన 'మిరాకిల్ కాల్‌డ్ మదర్... మా తుఝే సలామ్' పాట ఒకటి. మదర్స్ డే కార్యక్రమాల్లోనూ ఎక్కువగా వినిపించే పాట ఇది.

పదిహేను సంవత్సరాల వయసులో ఆరు గంటలలో 102 భాషలకు సంబంధించిన పాటలు పాడి రికార్డ్ సృష్టించింది సుచేత. ఈ రికార్డ్ కంటే కూడా సుచేతకు 'మా తుఝే సలామ్' పాట పేరు తెచ్చింది. త్యాగానికి ప్రతీక అయిన అమ్మ ఔన్నత్యాన్ని చాటి చెప్పేలా పాటను అద్భుతంగా తీర్చిదిద్దారు. ఈ పాటకు తమిళ్, మలయాళీ వెర్షన్‌లు కూడా ఉన్నాయి. సుచేత పాడుతున్నప్పుడు వీడియోలో సెలబ్రిటీలు వారి తల్లితో కనిపించే ఫొటోలు కనువిందు చేస్తాయి.



అమ్మా... నా పేరు గుర్తుందా?



తల్లిని కౌగిలించుకొని కూతురు ఏడ్చింది. ఆ తల్లి కూతురిని ఓదారుస్తున్న వీడియో వైరల్ అయింది. దశాబ్దకాలంగా డిమెన్షియాతో బాధ పడుతోంది తల్లి. తన ముందు మరో వ్యక్తి ఉన్నట్లుగానే భావిస్తుంది తప్ప తన కూతురుకు సంబంధించిన విలువైన జ్ఞాపకాలేవీ ఆ తల్లిలో లేవు. అయినప్పటికీ సహజాతమైన తల్లి ప్రేమతో... ఏడుస్తున్న కూతురిని ఓదార్చుతుంది. ఇది ఏ దేశంలో వీడియో అయితేనేం?

అందరూ కనెక్ట్ అయ్యి కన్నీళ్లు తెచ్చుకునే వీడియోగా మారింది.

'దే నెవర్ ఫర్గెట్ లవ్' క్యాప్షన్‌తో ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసిన ఈ వీడియో క్లిప్ వైరల్‌గా మారింది. కామెంట్ సెక్షన్ కన్నీళ్లతో తడిసిపోయింది. ఈ వైరల్ వీడియో క్లిప్ నేపథ్యంలో ప్రపంచవ్యాప్తంగా ఎంతోమంది కూతుళ్లు, కుమారులు అనారోగ్యం బారిన పడిన తమ తల్లిని గుర్తు తెచ్చుకుంటూ బాధపడ్డారు.

'నీ పేరు గుర్తుకు రావడం లేదు అని అమ్మ అన్నప్పుడు ఎంతో బాధగా అనిపించింది' అని ఒక కుమారుడు అల్జిమర్స్ బారిన పడిన తన తల్లి గురించి బాధపడ్డాడు. ఇది చూసి ఒక యూజర్ – 'తల్లిప్రేమ అనేది జ్ఞాపకం కాదు. అది శాశ్వతం' అని కామెంట్ పెట్టాడు.

పదాలతో తల్లికి పాదాభివందనం

మదర్స్ డే సందర్భంగా ముంబైకి చెందిన ఒక యువతి వినూత్నంగా చేసిన వీడియో వైరల్ అయింది. రోడ్డుపై తనకు కనిపించిన కొందరిని 'మీ అమ్మ గురించి ఒక్క ముక్కలో చెప్పండి?' అని అడిగింది. వారు చెప్పిన 'సబ్ కుచ్' 'జిందగి' 'హిమ్మత్' 'జాన్'లాంటి మాటలతో తల్లిపై ఒక కవిత రాసి నెటిజనులను ఆశ్చర్యానందాలలో ముంచెత్తింది. రియా కపూర్ షేర్ చేసిన ఈ వీడియో స్ఫూర్తితో యూజర్‌లు తమకు తోచిన రీతిలో పదాలతో అమ్మకు పాదాభినందాలు చేశారు.





తల్లుల ప్రపంచం

మదర్స్ డే సందర్భంగా సోషల్ మీడియాలో శిఖా ఖన్నా తీసిన ఫొటోలు హల్ చల్ చేస్తున్నాయి. 'మదర్ స్పెషల్' ఫొటోగ్రాఫర్‌గా పేరు తెచ్చుకుంది శిఖా. తన ప్రొఫెషనల్ జర్నీలో ఎన్నో రంగాలకు చెందిన మదర్స్‌తో పనిచేసింది. వివిధ రంగాలు, వివిధ దేశాలకు చెందిన వందమంది తల్లులను ఇంటర్వ్యూ చేసి '100 సెల్ఫ్ పోర్ట్రయిట్, 100 డ్రీమ్స్' పేరుతో తీసుకు వచ్చిన కాఫీ టేబుల్ బుక్ శిఖా ఖన్నాకు అంతర్జాతీయ స్థాయిలో పేరు తీసుకువచ్చింది.

టిక్కా తిన్నాను 50 లక్షలు కక్కండి



ఆ అమ్మాయి ఫుడ్ యాప్ ద్వారా పన్నీర్ టిక్కా తెప్పించుకుని తినింది. ఆ తర్వాత ఆ పన్నీర్ టిక్కా పంపిన హోటల్‌ను 50 లక్షలు అడిగింది. మర్యాదగా కక్కండి అని కేసు వేయబోతోంది. ఇంతకీ ఏంటా గొడవ?

'సారీ... సో సారీ మా మాట వినవా ఒకసారి' అని ఆ రెస్టరెంట్ వాళ్లు ఎంత మొత్తుకున్నా ఆ అమ్మాయి వినడం లేదు. అహమదాబాద్‌కు చెందిన నిరాలి పార్‌మార్ అనే అమ్మాయి మొన్నటి శుక్రవారం ఒక యాప్ ద్వారా పనీర్ టిక్కా ఆర్డర్ ఇచ్చింది. డెలివరీ బాయ్ తెచ్చి ఇచ్చాడు. ఆకలి మీద ఉందేమో కవర్ విప్పి రెండు ముక్కలు కొరికింది. హతవిధీ. అదీ పనీర్ టిక్కా కాదు. చికెన్ టిక్కా. నిరాలి శాకాహారి. చికెన్ టిక్కాను కొద్దిగా కొరికి తినడం వల్ల ఆమె తన శాకాహార వ్రతానికి తీవ్ర భంగం వాటిల్లిందని భావించింది. వెంటనే సోషల్ మీడియాలో దీనిని వైరల్ చేసింది. అహమదాబాద్ హెల్త్ డిపార్ట్‌మెంట్ వారు తక్షణమే స్పందించి రెస్టరెంట్ వారికి 5000 రూపాయల ఫైన్ వేసి ఇంకోసారి ఇలా జరగడానికి వీల్లేదంటూ వార్నింగ్ ఇచ్చారు. అయితే నిరాలి ఇంతటితో సంతృప్తి పడదలుచుకోలేదు. 'నాకు జరిగిన అన్యాయానికి 50 కోట్లు ఇచ్చినా తక్కువే. కాని నేను 50 లక్షల పరిహారం ఆశిస్తున్నాను. వినియోగదారుల కోర్టులో కేసు వేసి అంతకు అంతా రాబడతాను. ఇలా తరచూ ప్యాకెట్లు మార్చి ఇబ్బంది పెడుతున్నారు. చాలామంది పోనీలే అని ఊరుకుంటున్నారు. ఫుడ్ డెలివరీ సిస్టమ్‌లో సీరియస్‌నెస్ రావడానికి ఈ కేసు వేస్తున్నాను' అని చెప్పింది. అయితే నెటిజన్లు దీని మీద భిన్నంగా స్పందిస్తున్నారు. '50 లక్షలు సరిపోతాయా' అని అడుగుతున్నారు. అవేమీ పట్టించుకోని నిరాలి కంప్లయింట్ రాయడానికి బ్లూ ఇంక్ పెన్ను వెతుక్కునే పనిలో పడింది.



హెల్త్

థలసీమియా అంటే..?

ఎర్రరక్తకణాల్లోని హీమోగ్లోబిన్ ప్రోటీన్‌లో ఆల్ఫా, బీటా అనే రెండు రకాల ప్రోటీన్ గొలుసులు ఉంటాయి. ఈ గొలుసుల్లో లోపం వల్ల ఎర్రరక్తకణాలు దెబ్బతిని, నశించి పోతుంటాయి. దాంతో దేహంలోని కణాలకు ఆక్సిజన్ అందడంలో ఇబ్బంది ఏర్పడుతుంది. జన్యులోపాల కారణంగా పిల్లల్లో ఇలా ఎర్రరక్తకణాలు దెబ్బతినే పరిస్థితే 'థలసీమియా'.



థలసీమియా తల్లిదండ్రుల జన్యువుల నుంచి పిల్లలకు వస్తుంది. రక్తానికి సంబంధించిన జన్యువుల్లో ఒకటి తల్లి నుంచీ, మరొకటి తండ్రి నుంచీ వచ్చే క్రమంలో తల్లిదండ్రులిద్దరిలో ఎవరికైనా జన్యువుల్లో లోపం ఉండి, మరొకరిది ఆరోగ్యంగా ఉంటే... థలసీమియా మైనర్ అనే కండిషన్ ఏర్పడుతుంది. ఇందులో సమస్య చాలా స్వల్పంగా ఉండి రక్తహీనత (అనీమియా) ఏర్పడదు. అయితే తల్లిదండ్రులిద్దరి జన్యువుల్లోనూ లోపం ఉండి, ఇద్దరూ లోపం ఉన్న జన్యువుల్ని చిన్నారికి ఇస్తే థలసీమియా మేజర్ అనే కండిషన్ ఏర్పడుతుంది. ఇందులో చిన్నారుల ఎర్రరక్తకణాలు నశించి చాలా తీవ్రమైన రక్తహీనతకు దారితీస్తుంది. వీళ్లకు క్రమం తప్పకుండా రక్తం ఎక్కిస్తూ ఉండకపోతే అది ప్రాణాంతకంగా పరిణమించే అవకాశాలుంటాయి. తీవ్రతను బట్టి సమస్య జటిలమవుతుంది.

లక్షణాలు...

- థలసీమియా సమస్యతో పుట్టిన పిల్లలు మొదట మామూలుగానే ఉంటారు. అయితే మూడు నెలల నుంచి ఆరు నెలల వయసప్పుడు రక్తహీనత ఏర్పడి, అది క్రమంగా పెరుగుతూ పోతుంది. మామూలుగా రక్తహీనతను తగ్గించడానికి ఇచ్చే ఐరన్ టానిక్స్ వాళ్లకు ఉపయోగపడవు. ఫలితంగా చిన్నారి క్రమంగా బలహీనంగా మారి నీరసంగా ఉంటాడు. ఆకలి ఉండదు. ఎత్తు, బరువు పెరగడం సాధారణ స్థాయిలో ఉండదు. ఫలితంగా ఎదుగుదల లోపిస్తుంది.
- ఈ సమస్య ఉన్నవారిలో ప్లీహం (స్ప్లీన్), కాలేయం (లివర్) పరిమాణం పెరుగుతుంది. సమస్య అంతగా లేని పిల్లల్లో లక్షణాలు పెద్దగా కనిపించవు, రక్తహీనత కూడా ఉండదు. కానీ సమస్య ఓ మోస్తరుగా మధ్యస్థంగా ఉన్న పిల్లల్లో ఎదుగుదల అంతగా లేకపోవడంతో వారు త్వరగా యుక్తవయసుకు రాలేరు. ఇక సమస్య తీవ్రంగా ఉన్న పిల్లలలో రక్తహీనత ఎక్కువగా ఉండటం, ఆకలి లేకపోవడం, పాలిపోయినట్లుగా కనిపించడం, ఇంచుమించు అందరిలోనూ కామెర్లతో కళ్లు పచ్చగా మారడం, కాలేయం, గుండె పరిమాణం పెరగడం వంటి లక్షణాలు కనిపిస్తాయి.


నివారణ...

గ్రీస్, సైప్రస్ వంటి దేశాల్లో నివారణ ప్రక్రియలతో థలసీమియా తీవ్రతను దాదాపుగా జీరోస్థాయికి తగ్గించారు. భారత్‌లో ఏడాదికి దాదాపు 15,000కు పైగా కేసులు నమోదవుతున్నాయి. వీటిని ఆదిలోనే అరికట్టాల్సిన అవసరముంది. ఇందుకు 'హెచ్‌బీఏ2' అనే స్క్రీనింగ్ పరీక్ష సమర్థంగా ఉపయోగపడుతుంది. దీన్ని అందరూ యుక్తవయసులోనే చేయించుకోవాలి. పెళ్లికి ముందు, పెళ్లి తర్వాత ప్రెగ్నెన్సీ ప్లానింగ్‌కు ముందు, అర్లీ ప్రెగ్నెన్సీలో ఈ 'హెచ్‌బీఏ2' టెస్ట్ చేయించుకోవాలి. ఒకవేళ దగ్గరి బంధువుల్లో ఎవరైనా తీవ్రమైన థలసీమియాతో బాధపడుతున్న వారుంటే, వాళ్ల తల్లిదండ్రులు, తోబుట్టువులు, కుటుంబసభ్యులు అందరూ ఈ పరీక్ష చేయించుకోవడం తప్పనిసరి. ప్రభుత్వం కూడా ఇటీవలే ఈ పరీక్షను తప్పనిసరి చేసింది.

- మేనరికపు పెళ్లిళ్లు, జన్యుపరంగా చాలా దగ్గరి బంధుత్వంలో పెళ్లిళ్లను నివారించాలి.

అవసరమైన వైద్యపరీక్షలు..

వ్యాధి నిర్ధారణకు సీబీపీ, హెచ్‌పీఎల్‌సీ, జెనెటిక్ అనాలసిస్ వంటి పరీక్షలు చేయించాలి.
- పిల్లల్లోని ఐరన్ మోతాదులు తెలుసుకోవడం కోసం తరచూ సీరమ్ ఫెరిటిన్ లెవెల్స్, లివర్ ఫంక్షన్ టెస్ట్, కామెర్ల ఆచూకీ కోసం హెపటైటిస్ బీ, సీ పరీక్షలు తరచూ చేయిస్తూ ఉండాలి.
- మూత్రపిండాల పనితీరు తెలుసుకోవడం కోసం రీనల్ ఫంక్షన్ పరీక్షలు, క్యాల్షియమ్, ఫాస్ఫరస్ మోతాదుల పరీక్షలు చేయించాలి.
- ఒంట్లో ఐరన్ మోతాదులు పెరగడం గుండె పనితీరును దెబ్బతీయవచ్చు. అందుకే వీళ్లకు గుండె పనితీరును తెలుసుకునే పరీక్షలు తరచూ చేయిస్తూ ఉండాలి.



డా. శిరీషారాణి,
కన్సల్టెంట్ పీడియాట్రిక్ హిమటో ఆంకాలజిస్ట్

చికిత్స...

థలసీమియా బాధిత పిల్లలకు ప్రతి 15 నుంచి 30 రోజులకొకసారి రక్తం ఎక్కిస్తూ ఉండాలి. అలా హీమోగ్లోబిన్ మోతాదు నిత్యం 10గ్రాములు/డెసీలీటర్ ఉండేలా చూడాలి. ఇలా తరచూ రక్తం ఎక్కిస్తుండటం వల్ల, అలాగే దెబ్బతిన్న ఎర్రరక్తకణాల్లోని ఐరన్ అన్నది కాలేయం, స్ప్లీన్‌లలోకి చేరుతుంది. దాంతో ఒంట్లో ఐరన్ మోతాదులు తీవ్రంగా పెరిగిపోతాయి. ఇలా పెరిగిపోయిన ఐరన్ ఓవర్ లోడ్‌ను తొలగించేందుకు 'ఐరన్ కీలేషన్ థెరపీ' చేయాల్సి ఉంటుంది. ఫోలిక్ యాసిడ్ సప్లిమెంట్లు కూడా ఇవ్వాల్సి ఉంటుంది. ● కొందరిలో శాశ్వత చికిత్సగా బోన్‌మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్ బాగా ఉపకరిస్తుంది. దీనివల్ల 90 శాతం మంది పిల్లల ఆరోగ్యం పూర్తిగా బాగుపడే అవకాశముంది.

చీల'మంట'!

కొందరికి మడమ భాగంలో నొప్పి వస్తుంటుంది. 'యాంకిల్ పెయిన్'గా చెప్పే ఈ నొప్పి రెండు రకాలుగా రావచ్చు. మొదటిది ఏదైనా దెబ్బ తగలడం లేదా మడమ బెణకడం వల్ల రావచ్చు. ఇక రెండోరకం నొప్పి లేదా మంట... ఏ దెబ్బా తగలకుండా కూడా వచ్చే అవకాశముంది. దీనికి కారణం కొన్ని రకాల జబ్బులు/రుగ్మతలు. ఇలా వచ్చే చీలమండ నొప్పులకు ఎలాంటి చికిత్సలు లేదా జాగ్రత్తలు తీసుకోవాలో తెలుసుకుందాం.

దెబ్బ / గాయం / బెణుకు కారణంగా...

చీలమండ (యాంకిల్)ను ప్రధానంగా మడమా, కాలూ కలిసే జంక్షన్‌గా చెప్పవచ్చు.
- ఇక్కడ కాలికి సంబంధించిన టిబియా, ఫిబ్యులా అనే ఎముకలతో పాటు మడమకు సంబంధించిన టాలస్ అనే ఎముక కూడా ఉంటుంది. బెణకడం వంటి కారణాలతో ఈ జంక్షన్‌లోని ఎముకలో దేనికైనా గాయమైనా లేదా చిన్నపాటి ఫ్రాక్చర్ ఏర్పడ్డా... చీలమండలో నొప్పి వస్తుంది.
- ఒక్కోసారి బెణుకు వల్ల మడమ ప్రాంతంలోని కార్టిలేజ్ గాయపడటం లేదా కండరాలను, ఎముకని కలిపే టెండన్లు దెబ్బతినడం వల్ల నొప్పి రావచ్చు. ఇలా టెండన్లు గాయపడటం వల్ల ఇన్ఫెక్షన్ వస్తే దాన్ని 'అచిలీస్ టెండనైటిస్' అంటారు.

చికిత్స : ఇంగ్లిష్ అక్షరాలైన 'ఆర్', 'ఐ', 'సీ', 'ఈ'లు ఈ ఉపశమన ప్రక్రియల తాలూకు మొదటి అక్షరాల్ని ఒక వరసలో ఉంచి 'రైస్'గా చెబుతారు. చిన్నపాటి దెబ్బలూ లేదా బెణుకులతో చీలమండ నొప్పి వస్తే 'రైస్' చికిత్సతో అది తగ్గిపోతుంది. అదెలా అంటే...

ఆర్ అంటే 'రెస్ట్' : గాయపడ్డ కాలికి తగిన విశ్రాంతి ఇవ్వడం.

ఐ అంటే 'ఐస్' : గాయపడ్డ చోట ఐస్ పెట్టడం.

సీ అంటే 'కంప్రెషన్' : మడమ దగ్గర క్రేప్ బ్యాండ్‌తో ఒత్తిడి (కంప్రెషన్) పడేలా బిగుతుగా కట్టడం.

ఈ అంటే 'ఎలివేషన్' : విశ్రాంతిగా పడుకుని, వాపు, నొప్పి వచ్చిన చీలమండ భాగాన్ని శరీరం కంటే కాస్త పైకి (ఎలివేటెడ్‌గా) ఉండేలా చీలమండను ఏ తలగడ మీదనో పెట్టి ఉంచడం.

శస్త్రచికిత్స : గాయం తీవ్రమైనా లేదా ఎముకల్లో ఫ్రాక్చర్ వచ్చినా శస్త్రచికిత్స అవసరం కావచ్చు.

ఇతర జాగ్రత్తలు...

- ఊబకాయం ఉన్నవారు బరువు తగ్గించుకోవడం.
- నడిచే సమయంలో మడమ వద్ద బరువు పడకుండా చూసుకోవడం. ● సరైన పాదరక్షలు ధరించడం, సాఫ్ట్ ఫుట్‌వేర్ తొడగడం, హైహీల్స్‌కు దూరంగా ఉండటం.



దెబ్బ తగలకపోయినా ఇతర జబ్బుల కారణంగా...

- **ఆస్టియో ఆర్థరైటిస్ :** నలభై ఏళ్లు పైబడినవారిలో ఈ సమస్య సాధారణం. అన్ని ఎముకల చివర్లలో ఉన్నట్టే మడమ జంక్షన్‌లోని ఎముకల చివర్లలోనూ చిగురు ఎముక అయిన కార్టిలేజ్ అరగడం వల్ల ఎముకల మధ్య రాపిడితో మడమ భాగం లోనూ నొప్పి రావచ్చు.
- **సెప్టిక్ ఆర్థరైటిస్ :** బ్యాక్టీరియల్ ఇన్ఫెక్షన్ వచ్చి, అది చీలమండను ప్రభావితం చేయడం వల్ల వచ్చే నొప్పి ఇది.
- **రుమటాయిడ్ ఆర్థరైటిస్ :** ఇది తమ సొంత వ్యాధినిరోధక వ్యవస్థ తమ చిన్న ఎముకలపై ప్రతికూలంగా పనిచేయడం (ఆటో ఇమ్యూన్) వల్ల వచ్చే సమస్య. ఇందులో ఇతర కీళ్లు... అంటే వేళ్ల ఎముకలు, మణికట్లు, మోకాళ్ల ఎముకల దగ్గర వాపు వచ్చినట్టే చీలమండ దగ్గరి కీళ్లలోనూ నొప్పి, వాపు, మంట (ఇన్‌ఫ్లమేషన్) రావచ్చు.
- **లూపస్ :** ఇది కూడా ఆటో ఇమ్యూన్ సమస్యే. లూపస్ వ్యాధి మిగతా జాయింట్స్‌లో నొప్పిని కలగజేసినట్టే చీలమండ దగ్గరా నొప్పికి కారణం కావచ్చు.
- **సోరియాటిక్ ఆర్థరైటిస్ :** ఇదోరకం చర్మవ్యాధి. ఈ వ్యాధి వచ్చాక సమస్య ఎముకలు, కీళ్లకు సోకే అవకాశం ఎక్కువ. అలా చీలమండలోని ఎముకలకూ నొప్పి వచ్చే అవకాశాలెక్కువ.
- **గౌట్ :** ఈ సమస్య ఉన్నవారికి శరీరంలో యూరిక్ యాసిడ్ మోతాదులు పెరిగి, కీళ్ల మధ్య స్ఫటికాలుగా ఏర్పడతాయి. ఈ స్ఫటికం వల్ల కీళ్ల మధ్య రాపిడి జరగడంతో తీవ్రమైన నొప్పి వస్తుంది. ఇదే స్ఫటికం చీలమండ ఎముకల మధ్య వస్తే, ఇక్కడా నొప్పి రావచ్చు.
- **సూడో గౌట్ :** కొందరిలో కీళ్ల మధ్య యూరిక్ యాసిడ్ స్ఫటికాలకు బదులు క్యాల్షియమ్ పేరుకుపోయి వాపు, నొప్పి రావచ్చు. ఇది గౌట్‌ను పోలి ఉండటంతో దీన్ని సూడో గౌట్ అంటారు.
- **ఫ్లాట్ ఫీట్ :** మనందరిలోనూ పాదంలో ఆర్చిలా పైవైపునకు ఓ ఒంపు ఉంటుంది. నీళ్లలో పాదం తడిపి నేల మీద అనిస్తే... ఈ ఒంపు కారణంగానే పాదం ఒకవైపు నేలకు ఆనక అక్కడ పాదం ముద్ర పడదు. అయితే కొందరికి ఈ ఒంపు ఉండదు. పాదం మొత్తం ఫ్లాట్‌గా నేలకు ఆనుతూ ఉంటుంది. ఇలాంటి కండిషన్ కూడా ఒక్కోసారి చీలమండ నొప్పికి కారణం కావచ్చు. పాదానికి తగిన సపోర్ట్ ఇచ్చే పాదరక్షలు, కొన్ని రకాల ఫిజియో వ్యాయామాలతో ఈ సమస్య తగ్గుతుంది.

చికిత్స : గాయం లేకుండానే చీలమండ నొప్పి వస్తుంటే అందుకు కారణమైన అంశాన్ని తెలుసుకుని, చికిత్స అందించాలి.



డా. సుధీర్ రెడ్డి,
సీనియర్ ఆర్థోపెడిక్ సర్జన్

మెడి టిప్

తరచూ నోరు తడారిపోతోందా..?

కొందరిలో నోట్లో తగినంత లాలాజలం ఊరక పోవడంతో నోరు పొడిబారిపోతూ ఉంటుంది. సాధారణంగా డయాబెటిస్ బాధితుల్లో ఇది చాలా సాధారణం. ఈ కండిషన్‌ను వైద్యపరిభాషలో 'జీరోస్టోమియా' అంటారు. నోటిలో తగినంత లాలాజలం లేకపోవడం వల్ల ఓరల్, ఓరోఫ్యారింజియల్ అనే బ్యాక్టీరియా విపరీతంగా పెరిగిపోతుంది. ఇది చాలాకాలం పాటు కొనసాగితే నోటిలోని మృదుకణజాలం, దంతాలు దెబ్బతినే అవకాశముంది. చిగుర్ల వ్యాధులూ పెరుగుతాయి. నోరు తడారిపోకుండా ఉండాలంటే ఈ సూచనలు పాటించడం మేలు.

- కెఫీన్‌లు ఎక్కువ మోతాదులో ఉండే కాఫీ లేదా సాఫ్ట్‌డ్రింక్స్‌కు సాధ్యమైనంత దూరంగా ఉండాలి, పూర్తిగా మానేస్తే మరీ మంచిది
- తరచూ కొద్దికొద్దిగా నీళ్ల గుటక వేస్తూ ఉండాలి, చిన్న ఐస్‌ముక్కను చప్పరిస్తూ ఉంటే ఉపయోగకరంగా ఉంటుంది
- చక్కెర లేని గమ్స్, చక్కెర లేని మింట్ వంటివి తరచూ నమలాలి.
- ఆల్కహాల్‌ను పూర్తిగా మానేయాలి.